RNI No. APTEL/2003/12253


భావ వీణ

అంతర్జాతీయ తెలుగు సాహిత్య సాంస్కృతిక & భాషాధ్యయన మాసపత్రిక

BHAVA VEENA

International Journal of Telugu Literary, Culture & Language Study

Vol : 14 Issue No. 11 (3) Monthly November 2017 ISSN No. : 2456-4702



చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (సి.పి. బ్రౌన్)

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



BHAVA VEENA (భావ వీణ)

International Journal of Telugu Literary, Culture & Language Study

(అంతర్జాతీయ తెలుగు సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)

Editor : KOLLA SRIKRISHNA RAO

E-mail : parisodhanatelugu@gmail.com

7989781963, 9440033715

Rohini Towers, 2/11 Brodipet, GUNTUR-2.

Vol. 14 - Issue. 11 (3) - November 2017 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

గమనిక: రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - ఎడిటర్.

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963. E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 9703301698.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

సి. పి. బ్రౌన్

ఆంధ్రభాషోద్ధారకుడుగా గుర్తింపు పొందిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ చేశారు. సి.పి. బ్రౌన్ ఆంగ్లేయుడైనా తెలుగు భాష నేర్చుకొని ఆంధ్రీయుడిగా స్థిరపడ్డారు. ఆయన తెలుగు భాష నేర్చుకొనుటకు అనేక ఇబ్బందులు పడ్డా తెలుగు భాషా పరిశోధనకై కృషి చేసి ఆ బాధను మరిచిన మహనీయుడు. ప్రాచీన తెలుగు కావ్యాలను వెలికితీసి అందరికీ అర్థమయ్యేలా పరిష్కరించి ప్రచురించడం అయనకే సాధ్యమయ్యింది. ఎందరో పండితులను ఆదరించి వారిని నెలానెలా జీతాలు ఏర్పాటు చేసి తెలుగు సాహితీ వైభవానికి దశాదిశా చేసిన మహనీయుడు. వికలాంగులను, విద్యార్థులను సమాదరించి వారికి ఆర్థిక చేయూతనివ్వటమే గాక భోజన ఏర్పాటు చేసి చదువు చెప్పించిన మానవతావాది. తన యావత్తు జీవితాన్ని తెలుగు భాషా సేవకై వెచ్చించిన మనీషి. వేమన పద్యాలను వెలికితీసి ప్రచురించటమేగాక వేమన పద్యాలలోని మాధుర్యానికి పరవశుడైన సి.పి. బ్రౌన్ ఆంగ్లానువాదం చేసి తరించారు. తెలుగులో ఎన్నో గ్రంథాలను పరిష్కరించారు. వ్యాకరణాలను, నిఘంటువులను తయారు చేసి ఆంధ్ర భాషామతల్లి మెడలో అలంకరించిన మహా విద్వాంసుడు సి.పి. బ్రౌన్.

బండి గోపాలరెడ్డి (బంగోరె) గారు అన్నట్లు "ప్రపంచంలోని తెలుగు ప్రొఫెసర్లు, పరిశోధకులు, విద్యావేత్తలు, సాహితీ సంస్థలు అన్నీ కలసి తెలుగు భాషకు చేసిన సేవ, బ్రౌన్ ఒక్కడే చేసిన సేవలో ఓ చిన్నభాగం కూడ కాదు" అనటం అక్షరసత్యం. "నిలువ నీడ లేకపోయినా తెలుగు సరస్వతిని ఆహ్వానించి తన బంగళాలో ఒక సాహిత్య పర్ణశాల ఏర్పరచి ఆ వాగ్దేవిని నిండు ముత్తైదువలాగా నడయాడేటట్లు చేయగలిగినవాడు సి.పి. బ్రౌన్" అని బంగోరె గారు సి.పి. బ్రౌన్ గురించి చెప్పిన మాటలు సి.పి. బ్రౌన్ ఔన్నత్యాన్ని, వ్యక్తిత్వాన్ని తెలుగు భాషకు చేసిన సేవ వ్యక్తమవుతాయి. అటువంటి మహనీయునికి తెలుగు వారందరూ ఎంతో ఋణపడి ఉన్నారు. వారికి తెలుగు ప్రజలందరి తరుపున భావవీణ హృదయాంజలి ఘటిస్తుంది.

- సంపాదక వర్గం

Contents (విషయ సూచిక)

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

రాసాని రచనలు - మాండలిక భాష

- పి.రాజేశ్వరి

అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు మరియు తులనాత్మక అధ్యయన శాఖ, ఎస్.కె.యూనివర్శిటీ, అనంతపురము.

ప్రజలు మాట్లాడే అలవాట్లే భాష. భాష అనేది మానవులు తమ తమ అభిప్రాయాలు తెలియజేసుకోవడానికి ఉపయోగించే సాధనం. భాష నాల్గు రకాలు.

1. గ్రాంథిక భాష : గ్రంథ రచనకు ఉపయోగించే భాషను గ్రాంథిక భాష అంటారు.

2. వ్యావహారిక భాష : ప్రజలు మాట్లాడే భాష వ్యావహారిక భాష.

3. ప్రామాణిక భాష : వ్యావహారిక భాషనే ఇంకొంచెం ప్రమాణీకరిస్తే ఏర్పడిందే ప్రామాణిక భాష.

4. మాండలిక భాష : మండలానికి సంబంధించిన భాషయే మాండలిక భాష.

మాండలిక భాష మూడు రకాలు :

1. వైయుక్తిక మాండలికం : ఒక వ్యక్తి మాత్రమే పరిమితమైన లక్షణాలున్న భాషను వైయుక్తిక మాండలికం అంటారు.

2. సామాజిక మాండలికం : సామాజిక వర్గం కారణంగా సమాన లక్షణాలున్న ఒక భాషలోని వ్యవహార భేదాన్ని ఆ భాషకు సంబంధించిన సామాజిక మాండలికం లేదా వర్గమాండలికం అంటారు.

3. ప్రాంతీయ మాండలికం : ప్రాంతం కారణంగా సమాన లక్షణాలున్న ఒక భాషలోని వ్యవహార భేదాన్ని ఆ భాషకు గల ప్రాంతీయ మాండలికం అంటారు.

సాధారణంగా కనిపించే మాండలిక భేదాల ఆధారంగా మూడు ప్రాంతీయ మాండలికాలను గుర్తించవచ్చు.

1. కోస్తా మాండలికం
2. రాయలసీమ మాండలికం
3. తెలంగాణా మాండలికం

రాయలసీమ మాండలికంలో చిత్తూరు మాండలికాన్ని మొట్టమొదటిగా డి.రామకృష్ణ గారు గంజి కేంద్రం, చిరంజీవి కథల్లో ఉపయోగించారు.

కె.సభా గారు పాతాళగంగ కథల్లో చిత్తూరు మాండలికాన్ని ప్రయోగించారు. తర్వాత పులికంటి కృష్ణారెడ్డి గారు నాలుగ్గాళ్ల మండలంలో చిత్తూరు మాండలికాన్ని ఉపయోగించారు. నామిని సుబ్రమణ్యానాయుడు గారు సిన్నబ్బ కతలు, పచ్చనాకు సాక్షి కథలలో మాండలికాలు కనబడుతున్నాయి. తర్వాత 'వి.ఆర్.రాసాని' గారి రచనల్లో కథల సంపుటాలలో, నవలలో, నాటకాలలో విరివిగా చిత్తూరు మాండలికాన్ని ప్రయోగించారు.

'రాసాని' గారి రచనలలో భాష, యాస, గ్రామీణ సంస్కృతి, ప్రజా జీవనం ప్రస్ఫుటంగా దర్శనీయమవుతున్నాయి. పరాయికరించబడుతున్న భాషా సంస్కృతులను గుర్తుచేస్తున్నాయి.

'రాసాని' గారి రచనలలో చిత్తూరు జిల్లాలో పులిచెర్ల, పీలేరు మండలాలలో వినియోగించిన విలక్షణమైన మాండలిక పదాలు - పద సంస్కృతి గురించి చర్చిద్దాం.

చిత్తూరు జిల్లా సరిహద్దు ప్రాంతం తమిళ ప్రభావం కలిగిన కొన్ని తమిళ పదాలు, గురించి చర్చిద్దాం.

మాండలిక పదాలను మూడు రకాలుగా వర్గీకరించాను.

1. వృత్తి పరమైనవి
2. సాంస్కృతిక పరమైనవి
3. విశ్వాసాలకు సంబంధించినవి

1. వృత్తి పరమైనవి : వృత్తిపరమైన మాండలిక పదాలు - పద సంస్కృతి.

అనవరించుకోవడం : కట్టేసుకోవడం

రైతు పశువులను అనవరించుకోవడం చాలా ముఖ్యం. అంటే రైతు పశువులను ఇంటిలోని వారిలో ఒకరిగా చూసుకుంటాడనే సంస్కృతి కనబడుతుంది.

అణికేసుకుంది : మొండికేసింది

కొన్ని ఎద్దులు పని దొంగగా తయారయితే అణికేసుకుంది అంటారు.

అన్నేకారి : దరిద్రపువాడు

రైతు పశువులను ఇతరులు కొట్టే వారిని అన్నేకారి వెధవా అని తిట్టేవారు.

అరగాసు : దేనికి కొరగాని

ఎద్దులు వ్యవసాయానికి పనికి రాకపోతే అరగాసు గొడ్డా అని తిట్టేవారు.

అప్పీలేలే : ఎదురేలేదు.

బంగారట్ల గొడ్లతో పని సులభంగా జరిగితే 'అప్పీలేలే'దంటారు.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

వ్యవసాయానికి మేలైన జాతి పశువులను ఏరికోరి తెచ్చి వాటితో పాడిపంటలు భాగా అభివృద్ధి చేసే సంస్కృతి తెలుస్తుంది.

అబక : కొబ్బరి చిప్పతో చేసిన గరిటె

అంబిలి : నీళ్ల గంజి

పనులకు పోయేవాళ్లు ఉదయాన్నే అంబిలి త్రాగుతారు.

అరకాగిన : పక్వంగా కాగిన

పేడ నుగ్గుల సెగ మీద పాలు ఎఱ్ఱగా అరకాగి మీగడ కట్టాయి.

ఉలపాగ : వృథా

రైతు వ్యవసాయానికి ఉపయోగపడని ఎద్దును ఉలపాగ మేపుకోవాల్సిందే అని బాధపడ్డాడు.

ఎలుపు : మడక పైనుండి భూమిలోకి దిగకపోవడం.

ఎలుగు : గొరైల గుంపు

యచ్చేపలు : దూడలు

కోలకట్టెలు : ముల్లుకర్ర

రైతులు ఎద్దులు ముందుకు నడవకపోతే కోలకట్టేతో పొడుస్తారు.

కుడత : చిన్న పొలం

చిన్న రైతుకు (సన్నకారు రైతు) ఉండే పొలాన్ని కుడత అంటారు.

గిరిగె : పశు వ్యాధి ఉపశమనానికి ఉపయోగించే మట్టిపాత్ర

గుల్లలు : వెదురు బుట్టలు

గోవుల్ని పట్టుకొని మేపుకుంటూ, గోవుల దొడ్లల్లో పడిన పిసికలు, పేడను 'గుల్లలతో' తోసి బతకతా వున్నారు.

పళ్ళగి : జబ్బు

గొడ్డు పళ్లగిలింది. పశువు జబ్బు చేసింది.

వారం : ప్రారంభం

ప్రతి సంవత్సరం రైతులు దుక్కిదున్నేదానికి ముందుగా వారం (ప్రారంభం) జేస్తారు. రైతులు పసుపు, కుంకుమ ఎద్దులకు, వ్యవసాయ పనిముట్లకు పెట్టి పంట బాగా పండాలని దేవుని మ్రొక్కుకొని టెంకాయ కొట్టే ఆచారం ఉంది. గ్రామీణులకు వ్యవసాయం ముఖ్య జీవనాధారం.

తురం : ధాన్యం తోడుకోవడానికి గాదెకి కింద భాగంలో ఏర్పాటు చేసిన రంధ్రం.

2. సాంస్కృతిక పరమైనవి :

అగండ్లం : నిరంతరం వెలిగే జ్యోతి

భారతం ఒక యజ్ఞంగా జరిపించడం లాంటిది. అందుకే ఈ ఉత్సవాలను భారత యజ్ఞాలని పిలుస్తారు. భారత ఉత్సవాలు పూర్తయ్యేటంత వరకు అగండ్లం వెలుగుతూ ఉంటుంది.

ఇలితీర్థం : తిరుమలకు సాంస్కృతిక యాత్ర అందరూ ఎఱ్ఱ దుస్తులు ధరించి, మెడలో రుద్రాక్షమాలలు వేసుకొని, మద్దెల చిటి తాళాలు, చిన్న హార్మోనియం పెట్టే ఎత్తుకొని, చిడతలు, ఎఱ్ఱజండాలు చేతబట్టుకొని, గోవిందలు పెడుతూ యాత్ర మొదలుపెట్టి, పాండురంగ భజన కీర్తన ఆలపిస్తూ భక్తి పారవశ్యంతో నర్తిస్తూ తిరుమలకు చేరుకుంటారు. దీనినే ఇలితీర్థం అంటారు.

ఉప్పళం : ఉధృతం

అందరూ శ్రీరామనవమి కన్నుల పండువుగా జరిపితే, సాయిబులు ఉరుసు ఉత్సవం ఉప్పళంగా జరుపుకుంటారు.

గంగల జరిగేటపుడు కోలాటేసేవాళ్ళు, సెక్కభజనేసే వాళ్ళు ఉప్పళంగా ఎగరతా మన సంస్కృతిని ప్రదర్శిస్తారు.

కీతలు : టెంకాయ పట్టలు

ఆలయం ముందరే పెద్ద పందిరివేసి టెంకాయ కీతుల్తో కప్పేసి, విద్యుదీపాలతో అలంకరిస్తారు. పండుగలు, ఉత్సవాల్లో కీతులు వాడే సంస్కృతి ఉంది.

కొల్పుపెట్టడం : బలవంతంగా దేవతను రప్పించడం.

జాతర జరిగేటప్పుడో, లేకుంటే ఏ దేవర జరిగేటప్పుడో ఓ అంటా పంబలోద్దేమో, పలకలో లేకుంటే తాళాలేస్తా పిల్లంగోయిలో వాయిస్తావుంటారు. ఆసమయంలో కొందురి వొళ్ల మిందికి దేవుడొచ్చి 'ఓలింగన, ఓలింగన' అంటూ ఊగి పోతావుంటారు. దీనినే కొల్పుపెట్టడం అంటారు.

కళ్యాపి : పేడనీళ్లు

అన్నియిండ్లముందర కళ్యాపి చల్లి ముగ్గులు వేసేవారు. దీని ద్వారా తెలుగువారి సంస్కృతి తేటతెల్లమవుతుంది.

గోమయం : ఆవుపేడ

గ్రామ దేవత ముందు ప్రదేశంలో గోమయంతో అలికి పండుగ జరిపేవారు.

తవుస్సుమాను : భారతం జరిగే చోట మధ్యలో ఓ పొడవాటి అశోక వృక్షాన్ని నరుక్కొచ్చి దానికి మూరకొకటి చొప్పున మెటికలు అమర్చి, మూరెడు వెడల్పు, బారెడు పొడవు వున్న దళసరి చెక్కను మధ్యన రంధ్రం చేసి, దాన్ని మాను చివరి కొనకు అమరుస్తారు. ఆ తర్వాత దానికి అర్ధ చంద్రాకారంలో వెదురుదబ్బలు చుట్టి కాషాయపు రంగు బట్టను చుట్టి, మామిడి తోరణం కట్టి మాను నిలబెట్టి, నిలువుగా పాతతారు. అదే తవుస్సుమాను. ఇంద్రకీలాద్రికి ప్రతీకగా దీన్ని వాడుతారు.

భారత మిట్ట జరిగేటప్పుడు అర్జునుడు మెటికకు మెటిక ఒక దరువు పాడుతూ పైకి ఎక్కుతాడు. బిడ్డలు లేని స్త్రీలు తడిబట్టలతో వచ్చి తవుస్సుమాను చుట్టూ వరపడ్తారు. వేలాది జనం తో అదొక తిరుణాల్లు సాగినట్టుగా వుంటుంది. దీని ద్వారా మన సంస్కృతి అవగతమవుతున్నది.

వద్దిక : అభ్యాసం

గురువులు శిష్యులతో వివిధ నాటకాలు వద్దిక జేయించేవారు.

వేరకు : ఇంతవరకు

ప్రహ్లాదనాటకం మాత్రం ఈ వేరకు వెయ్యలేదు.

దోరుగాలం : చెడుకాలం

ప్రతి ఉగాదికీ ఆట ఆడిస్తానే వుంట. వదల్నంటే వదల్ను అంతే. సచ్చి దోరగాలమైన సరే వదల్ను గాక వదల్ను.

పావరం : మోహం

గ్రామీణులకు నాటకాలమీద పావరం ఎక్కువ.

అడమానం : తనఖా (తాకట్టు)

గురువులతోపు అడమానం పెట్టొచ్చు.

3. విశ్వాసాలకు సంబంధించినవి :

కాణిక : కానుక

ఆకు వక్క కాణికా తెస్తే పంచాంగం చెప్పుతారు.

మీరు : ముడుపు

పరమాత్ముడికి నమ్మకంతో మీరు దీసి కడతారు.

వేలుపు : ఎద్దును ఎన్నుకోవటం

దేవరెద్దు అంటే సాక్షాత్తు పరమేశ్వరుడే అనే నమ్మకంతో ఘంటావాళ్ల పల్లెలో దేవరెద్దుల వేలుపు జరుపుతారు. దేవ రెద్దులు అన్నీ కొలువు తీరితే ఆ కొలువులో ఎద్దు దాసరిని ఎన్నుకుంటారు. గురువు ఎద్దును ఎన్నుకుంటారు. అబ్బో అది పెద్ద యేడుక. దీని ద్వారా సంస్కృతి తేటతెల్లమవుతుంది. దేవరెఎద్దు ఎవరింట్లో గంజరం పోస్తుందో వారి ఇంటికి శు భం జరుగుతుందని ప్రజల విశ్వాసం.

దేవరెద్దు తమ ఇంట్లోకి అడుగుపెట్టలేదంటే ఏదో కీడు జరగబోతుందని నమ్ముతారు.

దూము : ప్లేగు వ్యాధి

రెడ్డెమ్మ, పటాలమ్మ, పోచమ్మ అనేక రోగాలకు కారణం భూతురాలై ఆగ్రహించిందంటే దూము తగిలేటట్లు చేస్తుందనే విశ్వాసంతో గ్రామదేవతను ప్రజలు నమ్మి కొలుస్తారు.

టిట్టిభం - తీతువుపిట్ట

గ్రామీణులలో టిట్టిభం అరుస్తే కీడు జరుగుతుందనే నమ్మకం ఉంది.

గంగల : జాతర

కుప్పం రెడ్డమ్మ గంగలం ఆ ప్రాంతానికంతా గొప్ప జాతర.

చిత్తూరు జిల్లా వాయల్పాడు దగ్గర చెర్లోపల్లెలో సంతాన దేవతగా నిలిచిపోయి పూజలందుకుంటున్న గ్రామదేవతని ప్రజలు నమ్మి కొలుస్తారు.

అబ్బిలించి : కౌగిలించి

గంగిరెద్దుల వాల్లు ప్రేమతో పసికోడెను అబ్బిలించి ముద్దాడుతారు. వారి జీవనంలో ఇది ఒక భాగం.

పసికోడె : తెల్లకోడ్డె

పసికోడకు రకరకాల ఆటలు నేర్పిస్తారు.

గంగిరెద్దులను సీతారాములుగా నమ్మి పూజిస్తారు.

దద్దలం : బాటసారులు విశ్రాంతి తీసుకునే చిన్న ధర్మ సత్రం.

నిస్వార్థపరులైన ధాతలు యాత్రికుల సౌకర్యార్థం కట్టించిన సత్రం.

కూతి : హాస్యం

హాస్యాన్ని పండించే వాడిని కూతిగాడు అంటారు. గ్రామీణులు శ్రమను మరచిపోవడానికి హాస్యాన్ని ఇష్టపడ తారు.

కాలుముడి :మూత్రం

కడ్డాయం : తప్పనిసరి

మొగలాయి : మొనగాడు

ముదిగారం: ముచ్చటగా

ముక్కిశం : ముఖ్యం

తిరప్తిలో ఏడుకొండల సామిని నూసే దెంతో ముక్కిశం.

బగిశీనం : అవమానం

బరము : గౌరవం

బో మునాస : బలే యిష్టం

బో కుశాల : చాలా ఆనందం

ఫలస్తరం : పరాయిస్థలం (వలసపోయిన ప్రాంతం)

చిత్తూరు జిల్లా తమిళ సరిహద్దు ప్రాంతాలలో ఉప యోగించే తమిళ పదాలు తెలుగులో చేరాయి. తమిళ ప్రభావం ప్రస్ఫుటముగా కనిపిస్తున్నది.

వీడు : ఇల్లు

వా : రా

తన్నీరు : మంచినీళ్ళు

యారుడా : ఎవర్రా

పుదుస్సు : కొత్త

పైత్తికారి : పిచ్చివాడు

ఎండమూరు : ఏ ఊరు

యారుళ్ళె ? యింగేడా : ఎవరు లోపల ? యిట్లరా ?

అది యెన్నాపేరు : అది ఏమి పేరు

తాయి : తల్లీ

వాయి : నోరు

నేండా : వద్దు

యన్నాడా సమాచారం : ఏమిరా విశేషం

పొన్న : పిల్ల

పసి : ఆకలి

తంగీ : చెల్లీ

ఈ విధంగా 'రాసాని' గారు నిస్వార్థంగా యదార్థ మాండలికంలో రచించి సహజత్వం కోల్పోకుండా, కళ్ళకు కట్టి నట్లు రచన చేశారు. వీరి రచనలు పాఠకుల గ్రామీణ జీవిత మూలాలను తాకుతాయి. తెలుగువారి జీవనంలో అడుగడు గునా వృత్తుల్లోను, పండుగలు, జాతర్లు, పరసలలోను, విశ్వాసాలలోను తెలుగు వెలుగులు, తెలుగు సంస్కృతి, తెలుగు సాహిత్యంలో సుందరంగా ప్రతిబింబిస్తున్నాయి. 'రాసాని' వారి రచనల్లో ఇది ప్రస్ఫుటంగా వ్యక్తమవుతున్నది.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

వేలూరి వారి - తెలంగాణ సుల్తానీ

- దాసరి సుబ్రహ్మణ్యేశ్వరరావు
పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రాచ్యభాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్, గుంటూరు.

శ్రీ వేలూరి శివరామ శాస్త్రి గారు శతావధాని, బహు భాషా కోవిదుడు. శతాధిక గ్రంథకర్త. ప్రాచీన అధునాతన సాహిత్యాలను సమదృష్టితో సమాదరించారు. కావ్య రచన చేసిన కలంతోనే కథలు, నవలలు కూడా వ్రాశారు. శాస్త్రిగారు స్పృశించని సాహిత్య ప్రక్రియ లేదు. శతావధానం చేసిన ప్రజ్ఞాశాలి. ఒక నాటికను వ్రాసారంటే నాటక సాహిత్యంపై వారికున్న అభిమానం ద్యోతకమవుతుంది.

వీరు 9 ఏప్రిల్ 1892న కృష్ణా జిల్లా చిరవాడ గ్రామంలో జన్మించారు. కథలు, నాటకాలు, ఖండకావ్యాలు వంటి విభిన్న సాహిత్య ప్రక్రియల్లోనేగాక విమర్శకులుగానూ ప్రసిద్ధి చెందారు. 18 సంవత్సరాల వయసులోనే 1911 సం॥లో గుంటూరులో సంపూర్ణ శతావధానం చేసిన మహాపండితులు. రష్యన్ సాహిత్యాన్ని తెలుగులోకి తీసుకురావడంలో కృషి చేసిన వారిలో వీరొకరు. టాల్‌స్టాయి, శరత్, రవీంద్రుని రచనలు అనువదించారు. జాతీయ ఉద్యమాన్ని ఇతివృత్తంగా చేసుకుని వచ్చిన తొలి స్వతంత్ర నవల ఓబయ్య (1920) రాశారు. వీరి ఖండ కావ్యాలలో ఏకాదాశి (1940) పేరు పొందింది. గాంధీ మహాత్ముని ఆత్మ కథ రెండు సంపుటాలుగా అనువదించారు. కృతి, వీధిబడి, దత్తు, క్షమాపణ, డిప్రెషన్, చెంబు వంటి కథలు ప్రాచుర్యం పొందాయి. 'కథాషట్కము' కథానిక సంపుటి 1949లో వెలువడింది. రెండవది 'కథా సప్తకము' 1950లో వెలువడింది. 'ప్రాచీన భూగోళము - ప్రాచీన-ఖగోళము' అనే శీర్షికలతో ఎన్నో పరిశోధక వ్యాసాలు రాశారు. మాధవవర్మ (చారిత్రక) నాటకం, ప్రథము పాంధికుడు, వేతసి, గురుదక్షిణ, అరణ్యపర్వ శేషోన్నయం, సుల్తానీ నాటకాలు, నాటికలు రాశారు. 17 మార్చి 1967న మరణించారు.

నిరక్షరాస్యులుగా వుంటూ, ఆర్థిక స్వాతంత్ర్యం లేకుండా తన కాళ్ళ మీద నిలబడలేని దైన్యావస్థలో స్త్రీలు నేటి మన సమాజంలో పడుతున్న కష్టాలను 'సుల్తానీ' నాటికలో హృదయగమంగా చిత్రించారు రచయిత. తెలంగాణా మాండలికంలో వున్న సంభాషణలు ఈ నాటికకు మరింత సహజత్వాన్ని సంతరించి పెట్టాయి. బాధా సర్పదష్టుల బ్రతుకుబాటలో గతుకులకు, అనంతమైన సమస్యల వలయాలకు ఈ విషాద నాటిక ఒక దర్పణం.

కథాంశం :

సుల్తానీ తెలంగాణలోని ఒక అభాగ్యురాలి జీవితాన్ని తెలిపే నాటిక. ఏ సుఖానికి నోచుకోకుండా కష్టాలలో పుట్టి కష్టాలలో పెరిగి కష్టాలతోనే జీవిత పర్యంతము మునిగితేలే దురదృష్ట జాతకులకు ప్రతినిధి సుల్తానీ. ప్రతి వూళ్ళో ప్రతి వీధిలో ఒక సుల్తానీ మన కళ్ళకు కన్పిస్తుంది. సుల్తానీ వంటి స్త్రీలకు కన్నీరు యింకిపోయినా సమస్యలు మాత్రం అపరిష్కృతంగానే వుండిపోతున్నాయి. ఇది మన సాంఘిక వ్యవస్థలోవున్న భయంకర పరిస్థితి. మగవారి దౌష్ట్యానికి బలియైపోయే సుల్తానీలు ఈ సమాజంలో ఉన్నంత కాలం సుల్తానీ నాటిక బతికే ఉంటుంది. అమ్మ, అయ్యల ఆదరణకు నోచుకోక గాలికి పెరిగింది సుల్తానీ.

ఒక దయాత్ముడు ఆమెను పరమానందం కిచ్చి పెళ్ళి చేసి పుణ్యం కట్టుకున్నాడు. గాలెన్న స్నేహ ప్రభావంతో కొత్త చిలకలవెంట పడడం నేర్చుకున్నాడు పరమానందం. చీటికి మాటికి భార్యను గొడ్డును బాదినట్లు చితగొడుతూ వుంటాడు. ఆమెను ఎలాగయినా వొదిలించుకోవడానికి గుడిసె తగలబెట్టిందన్న సాకుతో ఆమెను ఇంట్లో నుంచి వెళ్ళగొడతాడు. సమాజంలో స్త్రీ సమస్య అభద్రత, అనాదరణ కట్టుకున్న వాడి నుండే పుట్టిన సమస్యలయితే ఆ స్త్రీ జీవితం నరకం. స్త్రీ సమస్యలకు మూలకారణం విద్యాహీనురాలు కావడం. ప్రాంతమే వెనక బడినప్పుడు మనుషులు ముందు పడతారు.... స్త్రీలే కాదు పురుషులు విద్యాగంధం లేనివారే - మూర్ఖత్వంతోను, తెలివి తక్కువతోను వ్యసనాలకు బానిసలై జీవితాన్ని చేజేతులా పాడుచేసుకోవడం అంతర్లీనంగా సుల్తానీ సారం.

సుల్తానీ అసలు పేరు కాదు. ఆమె పేరు ఆమెకే తెలియని దుస్థితి. సుల్తాన్ అండతో జీవితం గడుపుతు న్నందున సుల్తానీగా పిలువబడింది. సుల్తాన్ కన్నా ముందు పరమానందం భార్యగా గుర్తింపు. బిచ్చగాడు "నూరేండ్లు నిలిసి బతుకు తల్లీ!" అని దీవిస్తే "ననెవలు బతకనిస్తారు" అని నిర్వేదంగా అంటుంది.

భర్త గాలెన్న సావాసంలో తాగుడు, స్త్రీ వ్యామోహంలో భార్యను నిర్లక్ష్యంగా చెయ్యడమే కాదు, తాళిబొట్టు తెంచుకొని ఇంట్లో నుండి పెండ్లికి ఓలీగా ఇచ్చిన కాసుల పేరుతో తరిమేస్తాడు. దిక్కులేని దానికి సుల్తాన్ దిక్కయ్యాడు. 'సుల్తానీ'గా సుల్తాన్ చే పిలువబడింది. తాగుడు వ్యసనం వదలని సుల్తాన్ చెప్పుడు మాటలు తలకెక్కించుకుని సుల్తానీని శంకిస్తాడు. 'పరమానందంతో మాటలేంది? ఒళ్ళెరుగని కోపంతో కొడతాడు సుల్తాన్. పరమానంద కాసుల పేరు తెచ్చివ్వమని అడుగుతాడు. అది పరమానందానికే చెందాలంటుంది. సుల్తాన్

పరమానంద మీదకు విసిరిన కత్తి పటేల్‌కు తగిలి పటేల్ మండి పడతాడు. ఉగ్రుడై 'సుల్తాన్‌ను పట్టుకోండి!' అని పురమాయిస్తాడు. కర్రతో కొడతాడు. సుల్తానీ ఆ దెబ్బలు తిని సుల్తాన్‌ని కాపాడుతుంది. చివరి కోరికగా కాసుల పేరు పరమానందానికి ఇవ్వమంటుంది. జీవితంలో అలసిపోయి ఊపిరి ఆగిపోతుంది సుల్తానీకి.

తెలంగాణ మాండలికంలో వచ్చిన నాటిక అన్ని చోట్లా విజయవంతంగా ప్రదర్శించబడింది. ఆంధ్ర నాటక కళా పరిషత్(1962)లో ప్రదర్శన, రచనలకు బహుమతి పొందిన ఏకైక తెలంగాణ మాండలిక నాటికగా చెప్పుకోవచ్చు.

కట్టుకున్నవాడికి కట్టుబడింది. కట్టుకున్నవాడు తాగుడుకు కట్టుబడి పర స్త్రీ వ్యామోహంలో తరిమేసినా అధైర్యపడక సుల్తాన్ పంచన చేరి సుల్తానీగా బతికిన ఒక సాహస స్త్రీ గాథ సుల్తానీ నాటిక. తన వ్యక్తిత్వాన్ని నిలుపుకుని కాసులపేరు మాజీ భర్త (పరమానంద)కే చెందాలనే నిర్ణయంతో ప్రాణం వదిలిన మానధనురాలు గాథ సుల్తానీ.......ఈ నాటిక రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలో దాదాపు 300 సార్లు ప్రదర్శించబడిందంటే నాటిక గొప్పతనం తెలుస్తుంది.

ఈ ఘట్టంలో రచయిత రాసిన సంభాషణలు :

పరమానందం : మరినూ జెప్పర గాలెన్న, నీకు తెలియకుండే దేమున్నదే - ఉంటున్నావా? మనవాండ్లెల్లా యేమంటున్నరో! కదల్దు మరీ!

రాంగిరి : పరమానందం, ఎల్లదుండు, ఆ బిడ్డనే మనకే ఏమమ్మా, ఈ దెబ్బలు నేజుడలేను. మీవాండెటున్నరమ్మా నాకు చెప్పవ - నేను దీస్కపోతను.

సుల్తానీ : నాకేవ్వలూ లేరయ్యా నే పుట్టంగనే మా అమ్మయ్యలు జచ్చిపోయిన్రని, మీ బోండ్లయ్యలు బెంచి పెద్ద దాన్ని చేసెన్రని గింత ఓలె బుచ్చుకొని ఈ అయ్యకొప్ప చెప్పన్రని- ఈ దేముడే జెపే యిన్నాను. నాకెవలున్నరనిబోను - ఏడికని బోను?

పరమానందం : ఏడికి బోతావో పో! గెట్లనంట పరమానంద పక్కన, గుడిశెలో కూసుని కుల్కుదమనుకుంటున్న వేమొ! అది కుదర్దు - ముందు మూట ముల్లె గట్టు.

మంగళ సూత్రం తెంపుకొని నిర్దాక్షిణ్యంగా తరిమేస్తాడు ఆ మూర్ఖుడు. సుల్తానీ అనే అతను ఆమెను చేరదీస్తాడు. పశ్చాత్తాపం చెందిన పరమానందం సుల్తానీ దగ్గరకు ఒకసారి రావడంతో పొరుగింటి జోగులక్క దానికి చిలువలు పలవలు అల్లి సుల్తానీ అప్పుడప్పుడే నిలబెట్టుకుంటున్న కాకిగూడులో చిచ్చు పెడుతుంది. చివరకు సుల్తానీ మూలంగానే వేయినామముల వాడిలో ఐక్యమై కష్టాల కడలి నుంచి కడతేరిపోతుంది.

సుల్తానీ జీవితకథలోని మలుపులను సహజంగా, హృదయం ద్రవించేలా ఒక్కొక్క సన్నివేశాన్ని మలిచారు రచయిత. సుల్తాన్ చేతిలో పడరాని పాట్లు పడుతున్న సుల్తానీ పరిస్థితులకు శాంతయ్య అనే ఒక దయామయుడు జాలిపడి ఆమెను సాదరంగా పల్కరిస్తాడు.

ఆ ఘట్టంలో :

సుల్తానీ : (దుఃఖంతో) నాకసల్ పేరేమిటన్నది మా అమ్మ అయ్యలు నా పేరేంబెట్టిన్రో! మా అమ్మ అయ్య లేడనునానరని బోను! లేరయ్యా - శాంతయ్య దొర! లేరయ్య చచ్చిపోయిన్రు - ఓ అమ్మా నా పేరేం జెప్పినావ్ అమ్మా దొరలడుగు తున్నరమ్మ!

శాంతయ్య : ఏడవకు సుల్తానీ ఏడవకు. దిక్కులేని వాళ్ళకు దేవుడే దిక్కు. నీ కథ ఇప్పుడు పూర్తిగా తెలిసింది. నీ పేరేమిటో ఎవరిక్కావాలి? సుల్తానీ గానే పేరు పొందావు. సుల్తానీ అనే పిలుస్తాను....ఇప్పటికైనా ఆ త్రాగుబోతు వెధవ సుల్లాన్ని విడిచిపెట్టు, సుఖపడతావు. ఎన్ని దెబ్బలు తింటావే వాడి చేతుల్లో? వేళకు ఇంత అన్నం తిని 'కృష్ణా రామా' అనుకుంటూ హాయిగా మా ఇంట్లో పడివుండు, నిన్ను మా బిడ్డను చూచుకున్నట్లు చూచుకుంటాం - నా మాట విను తల్లీ.

సుల్తానీ : అమ్మగారు చెప్పిన్రు - తమరు కూడా అదే చెప్తున్రు. మీ దయకు దణ్ణం బెడ్తను (దుఃఖంతో) దొర, యీ ఇల్లు సుల్తాన్ కిచ్చిన్రు. ఆడు దాన్నేల్కుంటడో కోస్కుంటడో-తన్నుకుంటడో వాడి యిట్ట మెట్టుంటె అట్టజేస్కుంటడు- నా యిల్లిడిచి నేనెట్టారాను దొర!

ఇటువంటి కరుణార్ద్ర సన్నివేషాలు నాటిక నిండా చేరి ప్రేక్షకుల కంటనీరు తెప్పిస్తాయి. జీవితాంతం ప్రేక్షకుల స్మృతి పథంలో మెదిలే కళాఖండం 'సుల్తానీ'. సామాజిక జీవితంలోని కఠోర సత్యాలను రసార్ద్రంగా చెప్పగల నాటకాలు మన సాహిత్యంలో ఎడారిలో ఒయాసిస్‌లా ఎక్కడో అరుదుగా తటస్థ పడుతూవుంటాయి.

1962 గుడివాడలో జరిగిన ఆంధ్ర నాటక కళా పరిషత్‌లో 'సుల్తానీ' నాటికకు ప్రథమ బహుమతి లభించింది. ఈ నాటిక ఔత్సాహిక నాటక సమాజాల దృష్టిని ఆకర్షించక పోవడం ఆశ్చర్యం.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

పరిశోధకుల కరదీపిక "తథ్యము సుమతీ"!

- డా॥ అడువాల సుజాత
కరీంనగర్.

తెలుగు సాహిత్యంలో తనకంటూ ప్రత్యేక ఉనికిని కలిగి ఉన్నది శతక ప్రక్రియ. సుమారు 800 ఏండ్ల చరిత్ర కలిగినవి తెలుగు శతకాలు. నాటినుండి నేటిదాకా ప్రజా జీవితాన్ని సామాజిక కోణంలో అద్దంపట్టి చూపించినవి శతకాలే. సమాజంలోని మంచి చెడులను, నీతిని, రాజకీయ చతురతను, ముక్తినీ, హాస్యాన్ని, జీవిత పరమార్థాన్ని సరళ సుందరమైన పద్యాల్లో ఆవిష్కరించారు శతక కర్తలు.

తెలుగు శతకాలు అనగానే ప్రతి ఒక్కరికీ గుర్తుకు వచ్చేవి వేమన, సుమతీ, తెలుగు బాల మొదలగు శతకాలు. ఎందుకంటే ఈ శతకాలలోని పద్యాలు ఒకటి రెండైనా రాని తెలుగు వారుండరేమో? అంటే అతిశయోక్తి కాదు.

సాహిత్య పరిశోధకులు అనేక వ్యయ ప్రయాసలకోర్చి ఆయా శతకకర్తల కాలాల, శతకాల విషయ పరిజ్ఞానం సేకరించి ప్రామాణికమైన ఆధారాలతో ప్రచురిస్తారు. ఈ కోవలో డా॥ మచ్చ హరిదాసు గారి కృషి శ్లాఘించదగినది.

డా॥ మచ్చ హరిదాసుగారు సుమతీ శతకం గురించి చేసిన పరిశోధనా యజ్ఞఫలం 'తథ్యము సుమతీ!'.

1977, 78 కాలంలో శ్రీ మచ్చ హరిదాసు గారికి ఎన్. గోపి గారితో మద్రాసు దగ్గరలోని తంజావూరు వెళ్ళే అవకాశం వచ్చింది. అక్కడి సరస్వతీ మహల్ లైబ్రరీలో అనుకోకుండా సుమతీ పద్యాల తాటాకు ప్రతులు కనిపించాయి. హరిదాసు గారి ప్రాణమిత్రుడైన ఎన్.గోపి గారి సూచనతో ఆ పద్యాలన్ని నోట్‌బుక్‌లోకి ఎక్కించుకున్నారు. ఆ తర్వాత 'సుమతి' గురించిన కొన్ని పరిశోధనాత్మకమైన వ్యాసాలు రాసారు. అవి పాఠకలోకానికి అందించాలనే తపనతో 1984లో వ్యాస సంపుటిని 'తథ్యము సుమతీ!' పేర ప్రచురించారు.

తంజావూరులోని సరస్వతీమహల్ లైబ్రరీలో దొరికిన సుమతీ శతకపద్యాలను గురించి మరింత వివరంగా సహేతుకంగా, ప్రామాణికంగా, లోతుగా పాఠకలోకానికి అందించాలని సంకల్పించారు హరిదాసు గారు.

ముప్పై రెండేళ్ళ తర్వాత ఎన్నో కొత్త విషయాలతో పరిశోధకులను అలరించేలా 2017లో మళ్ళీ ప్రచురింపబడింది. "తథ్యము సుమతీ!" గ్రంథం మొదటి భాగంలో ఆరు, రెండవ భాగంలో ఆరు మొత్తం పన్నెండు అధ్యాయాలతో రెండు అనుబంధాలు జతచేసి ప్రచురించారు.

ఈ వ్యాససంపుటిని గురించి పలువురి అభిప్రాయాలు

"తథ్యము సుమతీ! - పరిశోధన వ్యాససంపుటి. ఇది సామాన్యమైన పుస్తకం కాదు దీనిలో ఎన్నో విలువైన విషయాలను తరచి చూపారు."

- ఆచార్య సి.నారాయణరెడ్డి గారు.

హరిదాసు ఈ పరివర్ధిత ముద్రణలో చర్చలను మరింత యుక్తియుక్తంగా తీర్చిదిద్దాడు. తంజావూరులో సేకరించిన ప్రతులను పరిష్కరించి చేర్చాడు.

- ఆచార్య ఎన్. గోపి.

"చల్లను చిలికి వెన్న తీసినట్లు, సముద్రాన్ని మథించి అమృతం అందించినట్లు అనేక వ్యయప్రయాసలకోర్చి హరిదాసు గారు తంజావూరు ప్రతులను పరిశోధించారు.

- డా॥ నలిమెల భాస్కర్.

"పరిశోధకులకు ఇది ఎంతగానో తోడ్పడుటకెలాంటి సందేహం లేదు. ఇటువంటి రాచబాట వేసిన హరిదాసు గారిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను"

- ఆచార్య కె. గోపాలకృష్ణరావు.

"పరిశోధన చేస్తే ఇట్లా చేయాలె అనే విధంగా ఉన్నది"

- ఆచార్య ఎం. కులశేఖరరావు.

"సుమతీ శతకంపై తెలుగు పరిశోధనారంగంలో వచ్చిన మొదటి వ్యాససంపుటి ఇదే"

- డా॥ పాతూరి రఘురామయ్య.

"ఈనాటి పరిశోధకులకు 'తథ్యము సుమతీ!' ఒక మార్గదర్శకంగా - అదే ఒక గైడ్‌గా ఉపయోగపడుతుంది. ఇది ఉపరిశోధన కాదు. సందేహం లేదు, డా॥ హరిదాసు సుపరిశోధకుడు. సాక్ష్యం 'తథ్యము సుమతీ'.

- డా॥ గంద్ర లక్ష్మణ రావు.

"డా॥ మచ్చ హరిదాసు గారు "పరిణత పరిశోధకుడు" అనడానికి ఎటువంటి సందేహము లేదు. ఈ గ్రంథం ఆ విషయాన్ని ధ్రువపరుస్తూ ఉంది. వారి రచనల్లో ఇది తలమానికమైన రచనగా చెప్పడం కూడా అతిశయోక్తి కాదు"

- జి. గిరిజా మనోహర్ బాబు.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైద్రాబాద్‌వారు చల్లా రాధాకృష్ణశర్మ గారి సంపాదకత్వంలో సుమతీ శతకాన్ని 1973లో అచ్చు వేయించారు. ఇది బ్రౌన్ ప్రతి ఆధారంగా

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

ప్రకటింపబడింది. ఐతే సాహిత్య అకాడమి వారు ఇంతకు ముందే 1966లో ముద్రించిన సుమతీ శతకంలోని పద్యాలకు బ్రౌన్ ప్రతిలోని పద్యాలను పరిశీలిస్తే అనేక పాఠబేధాలు కనిపించాయి హరిదాసు గారికి.

1966లో మొదటి ప్రతి వచ్చింది. దానికంటే ప్రామాణికంగా 1973లో అచ్చయిన ప్రతి ఉన్నందువలన 1973లోని బ్రౌన్ ప్రతి ఆధారం చేసుకొని పాఠబేధాలను వివిధ ప్రతులతో సరిపోల్చి చూపారు హరిదాసు గారు.

ప్రథమభాగంలోని మొదటి అధ్యాయం "సుమతీ కర్తృత్వ చర్చ" దీనిలో సుమతీ శతకం ఎవరి రచన? సుమతీ శతకాన్ని బద్దెన రాశాడా? లేక భీమన రాశాడా అన్న చర్చ ఎంతో విశదంగా కొనసాగించి ముగింపులో ఆ ఇద్దరి కర్తృత్వాలు ఇప్పటికీ సవాలు చేయదగినవే అంటారు. జైన బిక్షువు (జైనా కోమటి) కూడా సుమతి శతకకారుడు అన్న వాదాన్ని రచయిత ప్రస్తావించి అది సరికాదని తోసిపుచ్చినారు.

రెండో అధ్యాయం "సుమతీ రచనా కాలం" ఇది హరిదాసు గారి పరిశోధనా పటిమకు నిదర్శనంగా చెప్పవచ్చు. ఇందులో మానవల్లి రామకృష్ణ కవి, వీరేశలింగం పంతులు, జయంతి రామయ్య పంతులు, చాగంటి శేషయ్య, బండారు తిమ్మయ్య, మల్లంపల్లి సోమశేఖరశర్మ, వంగూరి సుబ్బారావు, ఆరుద్ర మొదలగు సాహిత్య విమర్శకుల అభిప్రాయాలను పరిశీలించి, సుమతీ శతక కర్త 13వ శతాబ్దం కవి అని, 13వ శతాబ్దమే సుమతీ శతక రచనా కాలం అని తేల్చి చెప్పారు.

మూడవ అధ్యాయంలో పద్య ప్రతుల వివరాలు ఇచ్చారు. సుమతి పద్యాలకు సంబంధించి మొట్టమొదటి ప్రతి సి.పి.బ్రౌన్ దొర గారిదే అని నిరూపించారు.

నాల్గవ అధ్యాయంలో సుమతీ పద్య సంఖ్య - కొత్త పద్యాలు అనే అంశంపై సుదీర్ఘమైన, ప్రామాణికమైన చర్చ చేశారు. ఈ అధ్యాయం పరిశోధనలో కలికితురాయి అని చెప్పవచ్చు. తంజావూరు ప్రతులలో మిగిలిన వాటిని (బ్రౌన్+ మద్రాసు ముద్రిత) కొలేట్ చేసి చూస్తే వెలుగుచూడని కొత్త పద్యాలు 26 లభిస్తున్నాయి. ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రిక, కాకినాడ (లక్ష్మీపతి ప్రతి) వారు 22 కొత్త పద్యాలు లభించాయన్నారు. బ్రౌన్ సేకరించినవి 150 పద్యాలయితే తంజావూరు, ఆంధ్ర సాహిత్యపరిషత్ పత్రికలలో కామన్‌గా ఉన్నవి 05 పద్యాలు, అచ్చులో ఉండి ప్రాచీన ప్రతుల్లో దొరకనివి 03 పద్యాలు. మొత్తం పాతవి 150+56 కొత్తవి కలిసి '206'కు సంఖ్య పెరిగింది. ఇప్పుడు సుమతీ శతక పద్యాలెన్ని అంటే 206 అని ఖచ్చితంగా తేల్చి చెప్పారు.

అయిదవ అధ్యాయం పాఠ భేదాలు ఇది హరిదాసు గారి పరిశ్రమలో పరాకాష్ఠగా నిలుస్తుంది. బ్రౌన్ ప్రతిలోని పద్యాలైన 10 పద్యాలను యథాతథంగా ఇవ్వడమే కాక ఈ పద్యాలలోని కొన్ని పదాలు ఇతర ప్రతుల్లో ఎటువంటి పాఠాంతరాలలో కనిపిస్తున్నాయో అధస్సూచికలతో అందించారు. ఇప్పటి పరిశోధకులు ఈ అధస్సూచికలలో ఎంత శ్రమ ఉందో తెలుసుకొని పరిశ్రమించాలి అని సూచనగా చెప్పకనే చెప్పారు.

ఆరవ అధ్యాయం పాఠ నిర్ణయ చర్చ. ఇందులో బ్రౌన్ ప్రతిని, ముద్రిత ప్రతులతో సరిపోల్చి చూసినపుడు ఎన్నో పాఠబేధాలు దర్శనమిస్తాయి. ఈ అధ్యాయంలో హరిదాసుగారి సిన్సియారిటీ నిరూపించబడుతుంది. "ఈ పుస్తకంలో నేను చూపిన 56 కొత్త పద్యాలలో ఏవి ప్రక్షిప్తాలో, ఏవి కావో పండితుల పరిశీలనకోసం వదిలివేయడం జరిగింది" అని అనడంలో ఎంత నిజాయితీ ఉందో తెలుస్తుంది.

'సుమతి కందం - ఛంధ్శిల్పం'లో కందపద్య ప్రాముఖ్యం, వైభవం వివరించారు. కంద పద్య లక్షణాలు సంపూర్ణంగా చర్చించారు. కందం రాసిన ఇతర కవుల గురించి చర్చించారు. జినవల్లభుని 'కురిక్యాల' శాసనంలోని మొట్టమొదటి కంద పద్యంనూ ప్రస్తావించారు. తిక్కన, ఎర్రాప్రెగ్గడ, మడికి సింగన, శ్రీనాథుడు, పోతన, అనంతమాత్యుడు, చౌడప్ప కవి, రఘునాథ రాయలు, కాకుత్థ్సం నరసింహదాసు (నృసింహ కవి), ఫక్కి వెంకట నరసింహ కవి, శ్రీరంగం శ్రీనివాసరావు గారి దాకా కంద పద్యం రాసిన తీరును వారి రచనలను పేర్కొన్నారు. ఇది హరిదాసుగారి సునిశిత పరిశీలనకు గీటురాయి.

సుమతీ నీతి- ప్రామాణికత అనే అంశంలో సామాన్య నీతులు సామెతలు, రాచరికం, స్త్రీలు, రాజుల నిరసన మొదలగు అంశాలతో సాగుతుంది రచన. 13వ శతాబ్దం నాటి కోమట్లు వర్తక సంఘాలుగా యేర్పడి "అష్టాదశ సమయములు" అనే నీతి నియమావళిని ఏర్పరచుకున్నారు. "శ్రేణి" సంఘాలు నిర్మించుకొని రాజులకు బ్యాంకర్లుగా కూడా మారి, వారికి సన్నిహితులుగా ఉండేవారు. "అప్పిచ్చువాడు, వైద్యుడు.... అనే పద్యంలో అప్పిచ్చువాడు, కోమటే" అని సమాజంలోని వ్యాపార వ్యవహార స్థితిగతులను చర్చించారు.

"కొన్ని నీతి శ్లోకాల అనుసరణలు"లో సుమతి శతకానికి మూలాలుగా భావించే కొన్ని సంస్కృత శ్లోకాలు వాటికి అనువాదాలు, కొన్ని పద్యాల వివరణ, ఆ శ్లోకానికి, ఈ పద్యానికి ఉన్న సామ్యం విడమరిచి చెప్పారు.

సుమతీ పద్యాల ప్రభావం (పేరడీ పద్యాలు) అను అధ్యాయంలో తరతరాల నుండి నోళ్ళకెక్కిన సుమతి పద్యాలను తదనంతర కవులు సుమతి పద్యాలకు వ్యాఖ్యానుకరణలను సృష్టించి, ఈ పద్యశిల్పం పట్ల మోజును ఎట్లా తీర్చుకున్నారో ఉదహరించారు. కొన్ని పేరడీలను ఉదహ

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

ప్రకటింపబడింది. ఐతే సాహిత్య అకాడమి వారు ఇంతకు ముందే 1966లో ముద్రించిన సుమతీ శతకంలోని పద్యాలకు బ్రౌన్ ప్రతిలోని పద్యాలను పరిశీలిస్తే అనేక పాఠబేధాలు కనిపించాయి హరిదాసు గారికి.

1966లో మొదటి ప్రతి వచ్చింది. దానికంటే ప్రామాణికంగా 1973లో అచ్చయిన ప్రతి ఉన్నందువలన 1973లోని బ్రౌన్ ప్రతి ఆధారం చేసుకొని పాఠబేధాలను వివిధ ప్రతులతో సరిపోల్చి చూపారు హరిదాసు గారు.

ప్రథమభాగంలోని మొదటి అధ్యాయం "సుమతీ కర్తృత్వ చర్చ" దీనిలో సుమతీ శతకం ఎవరి రచన? సుమతీ శతకాన్ని బద్దెన రాశాడా? లేక భీమన రాశాడా అన్న చర్చ ఎంతో విశదంగా కొనసాగించి ముగింపులో ఆ ఇద్దరి కర్తృత్వాలు ఇప్పటికీ సవాలు చేయదగినవే అంటారు. జైన బిక్షువు (జైనా కోమటి) కూడా సుమతి శతకకారుడు అన్న వాదాన్ని రచయిత ప్రస్తావించి అది సరికాదని తోసిపుచ్చినారు.

రెండో అధ్యాయం "సుమతీ రచనా కాలం" ఇది హరిదాసు గారి పరిశోధనా పటిమకు నిదర్శనంగా చెప్పవచ్చు. ఇందులో మానవల్లి రామకృష్ణ కవి, వీరేశలింగం పంతులు, జయంతి రామయ్య పంతులు, చాగంటి శేషయ్య, బండారు తిమ్మయ్య, మల్లంపల్లి సోమశేఖరశర్మ, వంగూరి సుబ్బారావు, ఆరుద్ర మొదలగు సాహిత్య విమర్శకుల అభిప్రాయాలను పరిశీలించి, సుమతీ శతక కర్త 13వ శతాబ్దం కవి అని, 13వ శతాబ్దమే సుమతీ శతక రచనా కాలం అని తేల్చి చెప్పారు.

మూడవ అధ్యాయంలో పద్య ప్రతుల వివరాలు ఇచ్చారు. సుమతి పద్యాలకు సంబంధించి మొట్టమొదటి ప్రతి సి.పి.బ్రౌన్ దొర గారిదే అని నిరూపించారు.

నాల్గవ అధ్యాయంలో సుమతీ పద్య సంఖ్య - కొత్త పద్యాలు అనే అంశంపై సుదీర్ఘమైన, ప్రామాణికమైన చర్చ చేశారు. ఈ అధ్యాయం పరిశోధనలో కలికితురాయి అని చెప్పవచ్చు. తంజావూరు ప్రతులలో మిగిలిన వాటిని (బ్రౌన్+ మద్రాసు ముద్రిత) కొలేట్ చేసి చూస్తే వెలుగుచూడని కొత్త పద్యాలు 26 లభిస్తున్నాయి. ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రిక, కాకినాడ (లక్ష్మీపతి ప్రతి) వారు 22 కొత్త పద్యాలు లభించాయన్నారు. బ్రౌన్ సేకరించినవి 150 పద్యాలయితే తంజావూరు, ఆంధ్ర సాహిత్యపరిషత్ పత్రికలలో కామన్‌గా ఉన్నవి 05 పద్యాలు, అచ్చులో ఉండి ప్రాచీన ప్రతుల్లో దొరకనివి 03 పద్యాలు. మొత్తం పాతవి 150+56 కొత్తవి కలిసి '206'కు సంఖ్య పెరిగింది. ఇప్పుడు సుమతీ శతక పద్యాలెన్ని అంటే 206 అని ఖచ్చితంగా తేల్చి చెప్పారు.

అయిదవ అధ్యాయం పాఠ భేదాలు ఇది హరిదాసు గారి పరిశ్రమలో పరాకాష్ఠగా నిలుస్తుంది. బ్రౌన్ ప్రతిలోని పద్యాలైన 10 పద్యాలను యధాతథంగా ఇవ్వడమే కాక ఈ పద్యాలలోని కొన్ని పదాలు ఇతర ప్రతుల్లో ఎటువంటి పాఠాంతరాలలో కనిపిస్తున్నాయో అధస్సూచికలతో అందించారు. ఇప్పటి పరిశోధకులు ఈ అధస్సూచికలలో ఎంత శ్రమ ఉందో తెలుసుకొని పరిశ్రమించాలి అని సూచనగా చెప్పకనే చెప్పారు.

ఆరవ అధ్యాయం పాఠ నిర్ణయ చర్చ. ఇందులో బ్రౌన్ ప్రతిని, ముద్రిత ప్రతులతో సరిపోల్చి చూసినపుడు ఎన్నో పాఠబేధాలు దర్శనమిస్తాయి. ఈ అధ్యాయంలో హరిదాసుగారి సిన్సియారిటీ నిరూపించబడుతుంది. "ఈ పుస్తకంలో నేను చూపిన 56 కొత్త పద్యాలలో ఏవి ప్రక్షిప్తాలో, ఏవి కావో పండితుల పరిశీలనకోసం వదిలివేయడం జరిగింది" అని అనడంలో ఎంత నిజాయితీ ఉందో తెలుస్తుంది.

'సుమతి కందం - ఛందశ్శిల్పం'లో కందపద్య ప్రాముఖ్యం, వైభవం వివరించారు. కంద పద్య లక్షణాలు సంపూర్ణంగా చర్చించారు. కందం రాసిన ఇతర కవుల గురించి చర్చించారు. జినవల్లభుని 'కురిక్యాల' శాసనంలోని మొట్టమొదటి కంద పద్యంనూ ప్రస్తావించారు. తిక్కన, ఎఱ్ఱాప్రెగ్గడ, మడికి సింగన, శ్రీనాథుడు, పోతన, అనంతమాత్యుడు, చౌడప్ప కవి, రఘునాథ రాయలు, కాకుత్థ్సం నరసింహదాసు (నృసింహ కవి), ఫక్కి వెంకట నరసింహ కవి, శ్రీరంగం శ్రీనివాసరావు గారి దాకా కంద పద్యం రాసిన తీరును వారి రచనలను పేర్కొన్నారు. ఇది హరిదాసుగారి సునిశిత పరిశీలనకు గీటురాయి.

సుమతీ నీతి- ప్రామాణికత అనే అంశంలో సామాన్య నీతులు సామెతలు, రాచరికం, స్త్రీలు, రాజుల నిరసన మొదలగు అంశాలతో సాగుతుంది రచన. 13వ శతాబ్దం నాటి కోమట్లు వర్తక సంఘాలుగా యేర్పడి "అష్టాదశ సమయములు" అనే నీతి నియమావళిని ఏర్పరచుకున్నారు. "శ్రేణి" సంఘాలు నిర్మించుకొని రాజులకు బ్యాంకర్లుగా కూడా మారి, వారికి సన్నిహితులుగా ఉండేవారు. "అప్పిచ్చువాడు, వైద్యుడు.... అనే పద్యంలో అప్పిచ్చువాడు, కోమటే" అని సమాజంలోని వ్యాపార వ్యవహార స్థితిగతులను చర్చించారు.

"కొన్ని నీతి శ్లోకాల అనుసరణలు"లో సుమతి శతకానికి మూలాలుగా భావించే కొన్ని సంస్కృత శ్లోకాలు వాటికి అనువాదాలు, కొన్ని పద్యాల వివరణ, ఆ శ్లోకానికి, ఈ పద్యానికి ఉన్న సామ్యం విడమరిచి చెప్పారు.

సుమతీ పద్యాల ప్రభావం (పేరడీ పద్యాలు) అను అధ్యాయంలో తరతరాల నుండి నోళ్ళకెక్కిన సుమతి పద్యాలను తదనంతర కవులు సుమతి పద్యాలకు వ్యాఖ్యానుకరణలను సృష్టించి, ఈ పద్యశిల్పం పట్ల మోజును ఎట్లా తీర్చుకున్నారో ఉదహరించారు. కొన్ని పేరడీలను ఉదహ

రించారు. బ్రౌన్ ప్రతి-ఇతర ముద్రిత / అముద్రిత ప్రతుల వివరాలు పేర్కొన్నారు.

హరిదాసుగారు అనుబంధం 1 లో తంజావూరు తాళ పత్ర ప్రతులను, కాగితపు ప్రతులను, నీతి శతకాన్ని సహాయ సామాగ్రిని పొందుపరిచారు. ఇందులోనే సుమతీ శతక పద్యా లను అకారాది పదపట్టికలో వివిధ ప్రతులు వాటి క్రమ సంఖ్య ను పేర్కొనడం చాలా విశేషమైన కృషి ఫలితంగా చెప్పుకోవచ్చు.

అనుబంధం-2లో ప్రముఖుల అభినందనలు అభి ప్రాయాలు, లేఖలు, సమగ్ర సుమతీ శతకంలోని 206 పద్యాలు పేర్కొన్నారు. "116, 154, 185 పద్యాలలో క్రీగీత గీసిన పదాలు ఎంత ప్రయత్నించినా అర్థం కాలేదు. కనుక వాటిని అపరిష్కృతంగా వదిలి పెట్టవలసి వచ్చింది". అని రచయిత అనడం చూస్తే 'తథ్యము సుమతీ' అనే గ్రంథంలో రచయిత నిజాయితీ తథ్యము సుమా! అనిపిస్తుంది.

మొత్తంమీద తరచి చూసినప్పుడు పరిశోధనా ప్రణాళిక ఎత్తుగడలు, అధ్యాయాల విభజన, క్షేత్ర పర్యటన వలన సేకరించిన అనేక అంశాలతో "పరిశోధన అంటే ఇదీ" ఇట్లా పరిశోధించినపుడు అది ప్రామాణికంగా నిలబడుతుంది. అనే సత్యాన్ని పాఠకులు గమనించవచ్చు. ఇది ఉత్తమ పరిశోధనగా పరిశోధకునిగా రచయితను చిరకాలం నిలబెట్టిన రచనగా పలువురి ప్రశంసలు అందుకున్న విషయం లోకవిదితమే కదా! పరిశోధనకు కేవలం సత్య శోధన, సంకల్పం ప్రామాణికమని ఈ గ్రంథం ద్వారా చెప్పుకోవచ్చు. తథ్యము సుమతీ! పరిశోధ కుల కరదీపికగా ఉంటుందనేది నిత్యసత్యం.

డా॥ మచ్చ హరిదాసు గారు పిహెచ్.డి. చేసిన అంశం తెలుగులో యాత్ర చరిత్రలు. ఇవి యాత్రాచరిత్రలపై వచ్చిన మొట్టమొదటి గ్రంథం. ఇది శాతవాహన విశ్వవిద్యాలం తెలుగు విభాగంలో పాఠ్యాంశంగా చేర్చబడ్డ బృహత్ గ్రంథం. ఈ రెండు గ్రంథాలు డా॥ మచ్చ హరిదాసు గారిని ప్రామాణిక మైన పరిశోధకునిగా నిలబట్టే గ్రంథాలు. వీరి కృషికి, నిజా యితీకి నిదర్శనాలు ఇవి. వీరు నిజ జీవితంలో కూడా "మచ్చ"లేని మచ్చ హరిదాసుగారని నిర్మొహమాటంగా చెప్ప వచ్చు.

సంస్కృతి సమ్మాన్, పరిశోధక కళిక

ÏÜF›¯Üo_¥ú_³M°_]›.;[°

ఆధార గ్రంథాలు :

1. తథ్యము సుమతీ - సి.పి. బ్రౌన్ 1973, తెలుగు అకాడమీ-హైదరాబాద్.
2. తథ్యము సుమతీ - 1984 ఇందు ప్రచురణలు - కరీంనగర్.
3. తథ్యము సుమతీ - 2016 ఇందు ప్రచురణలు - కరీంనగర్.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

తాళ్ళపాక అన్నమాచార్యులు - భక్తితత్వం - రచనా విశిష్టత

- మంద విజయ కుమార్
స్నాతకోత్తర విద్యార్థి, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

తాళ్ళపాక వంశములో పండితాగ్రేసరుడు, విష్ణుభక్తుడు అయిన నారాయణ సూరికి, అక్కమాంబకు శ్రీ వేంకటేశ్వర వరప్రసాదము వల్ల జన్మించిన కారణజన్ముడు తాళ్ళపాక అన్న మాచార్యుడు. ఈయన జననం క్రీ.శ. 1408 సంవత్సరంలో విశాఖ నక్షత్రయుక్త వైశాఖ పూర్ణిమ నాడు. శైశవం నుంచీ వేంకటేశ్వరునిపై భక్తితో 'ఆడిన మాటెల్ల నమృత కావ్యముగ, పాడిన పాటెల్ల పరమగానముగ', 'వెన్నుని వరముచే విద్య లన్నియును జిహ్వారంగ సీమతముదామె సొచ్చి నర్తనమాడగా, తన కవిత్వానికి, తన గానానికి సకల ప్రజలు కీర్తింపగా వేంకటపతి మీద వింత వింతలైన సంకీర్తనములు రచించాడు. ఈ బాలభక్తునికి బాల్యంలో తల్లిదండ్రులూ, వదినెలూ, అన్నలూ పొలం పనులు చెప్పి చీకాకు పెట్టగా, తన యొక్క సంకీర్తనములతో, ప్రగాఢమైన భక్తితత్వం కలిగిన వాడై ఆ శ్రీ వేంకటేశ్వరస్వామిని కొలిచిన మహా బాల భక్తుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు.

అయ్యో పోయే బ్రాయము కాలము
ముయ్యంచు మనసున నే మోహమతినైతి ...
చుట్టంబులా తనకు సుతులు, కాంతలు, చెలులు
వట్టి యాసల బెట్టు వారే కాక
నెట్టుకొని వీరు కడు నిజమనుచు హరినాత్మ
బెట్ట నేరక వృథా పిరివీకులైతి ... అయ్యో ...
తగు బంధులా తనకు తల్లులును తండ్రులును
వగల బెట్టుచు తిరుగు వారే గాని
మిగుల వీరల పొందు మేలనుచు హరినాత్మ
తగిలించ లేక చింతా పరుడనైతి ... అయ్యో ...

అనే సంకీర్తనముతో తనకు ప్రియమైన శ్రీ వేంకటపతికి మొరపెట్టుకున్నటువంటి సంధర్భాన్ని చూసినట్లయితే అన్నమా చార్యుల వారి భక్తితత్వం మనకు అర్థమవుతుంది.

అన్నమాచార్యుల వారి తిరుపతి గమనము :

అన్నమాచార్యుని కుటుంభ బంధువులంతా అతనికి పనులు చెప్పడంలో భాగంగా గడ్డి తవ్వడం పశువుల కోసం మోపులు కట్టి పనులతో అన్నమాచార్యుడిని తన బంధువులు విసిగించారు. అప్పుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు తన ఎనిమిదేళ్ళ ప్రాయంలోనే తాళ్ళపాక గ్రామం విడిచి, ఆ శ్రీ వేంకటేశ్వరుని దర్శనాపేక్షతో తిరుపతి బయలుదేరినాడు.

దిగువ తిరుపతి పొలిమేరలో నున్న గ్రామ దేవత గంగమ్మకు నమస్కరించి ప్రయాణాన్ని కొనసాగిస్తాడు. దీనిని బట్టి చూస్తే గ్రామ దేవత గంగమ్మతల్లి పట్ల తనకున్న భక్తితత్వం, నమ్మకం, విశ్వాసాలను మనం గ్రహించగలము.

ఆ విధంగా అన్నమయ్య యాత్రికుల వెనువెంట ఏడు కొండలు ఎక్కనారంభించాడు. మోకాళ్ళ పర్వతం దగ్గరకి వచ్చే సరికి చాలా అలసిపోయి ఆకలితో ఒక రాతిపై శయనింపగా జగదంబ లక్ష్మీదేవి అన్నమయ్యకు స్వప్నంలో కనిపిస్తుంది. "సకల సాలగ్రామమయమైన ఆ కొండను చెప్పులతో ఎక్క రాదు. కనుక, చెప్పులు విడిచి మొక్కితే అలసట లేకుండా అతని మనోభీష్టం ప్రకారం స్వామి దర్శనమవుతుందని చెప్పి", స్వామీ, తానూ ఆరగించిన ప్రసాదాన్నములు అతనికి పెట్టి, సేద తీర్చి దేవి అంతర్థానమవుతుంది. ఈ సందర్భంలో జగ దాంబ లక్ష్మీదేవి, తన భక్తుడైన అన్నమయ్యపై చూపించిన ప్రేమ, ఆప్యాయత, మాతృ ప్రేమ చాలా అద్భుతముగా వర్ణిం చబడింది.

సర్వలోక ప్రజలను తన ప్రేమ, ఆప్యాయతలతో కాపాడే మాతృమూర్తి, వేంకటేశ్వర స్వామి దేవేరి అలమేలు మంగాదేవి పై ఒక శతకం చెప్పి. ఆ మాతృమూర్తి ఋణం తీర్చుకొన్న మహాభక్తుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు.

అన్నమాచార్యుని వ్యక్తిత్వం :

తాళ్ళపాక అన్నమాచార్యుడుని తత్త్వ కవిగా, సమాజ కవిగా, సంకీర్తనాచార్యునిగా, పదకవితా పితామహుడిగా వివిధ రకాలుగా అభివర్ణించడం జరిగింది. అన్నమయ్య సాహిత్యాన్ని పరిశీలిస్తే అన్నమయ్య 'తత్త్వకవుల'లో ఒకడిగా కనిపిస్తాడు.

అన్నమయ్య కవిత్వంలో ఆడంబరాలు కనిపించవు. జీవితానుభవాల్ని సహజమైన భాషలలో సహజమైన రీతిలో వ్యక్తం చేయడం జరిగింది. 'పదహారు కళలకు ఆవాసనం .... అలసిన ఈ జగన గగన సీమలకు చిత్తడి చిరుగంధం నైవేద్యం' అంటూ సరస శృంగార సంకీర్తనలతో కొంత కాలం సంసార జీవితాన్ని గడిపిన అన్నమయ్య అనంతరం వైరాగ్యం వైపు మరలిపోయిన మహా భక్తుడు తాళ్ళపాక అన్నమయ్య.

విజయనగర సామ్రాజ్య పాలన కాలంలోని సమాజం లోని దోపిడిని గుర్తించిన మహానుభావులు, వాస్తవ పరిస్థితిని నిరసిస్తూ కవులు తత్త్వాల రూపంలో గానం చేశారు. అన్న మయ్య సమకాలీన రాచరిక వ్యవస్థలో విజయనగర చివరి రాజులు రాజ్య కాంక్షతో పితృ, భ్రాతృ, పుత్రులనే బేధం లేకుండా చంపుకోవడం అన్నమయ్యను కలచివేసింది.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

దేహమిచ్చిన వాని దివిరి చంపెడువాడు
ద్రోహిగాక నేడు దొరయైనాడే
తోడబుట్టిన వాని దొడరి చంపెడువాడు
చూడు దుష్టుడు గాక సకృతియైనాడు
అని తన బాధను వ్యక్తం చేశాడు.

సాళువ నరసింగరాయుడు, అన్నమయ్య శ్రీ వేంకటేశ్వర స్వామిపై నాదానామ క్రియరాగంలో "ఏమొకొ చిగురుట ధర మున యెడనెడ కస్తూరి నిండెను, భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదు గదా"! అనే కీర్తన గానం చేశాడు. అది విన్న సాళవ నరసింహరాయలు, తనపై ఆ విధమైన పదములు రచించమని అడగగా, నేను నరులపై భక్తి పరమైన రచనలు వ్రాయలేను, తన దైవమైన శ్రీ వేంకటేశ్వరునిపై తన సంకీ ర్తనలు రచించి ఆలపిస్తానని రాజు ఆజ్ఞను నిరాకరించాడు. కురు వృద్ధుడైన రాయలు, అన్నమాచార్యులకు మూరురాయ రగండమనే సంకెళ్ళు వేయించి కారాగృహంలో ఉంచాడు.

ఆ విధంగా నరులపై రచనలు చేయకుండా కేవలం తన ఆరాధ్య దైవమైన శ్రీ వేంకటపతిపై రచనలు చేసి, సంకీ ర్తనలతో తన భక్తితత్వాన్ని చాటిన మహా భక్తుడు తాళ్ళపాక అన్నమయ్య.

విజయ నగర రాజ్య పరిపాలనా కాలంలో సమాజానికి దగ్గర కావడమనేది ఒక విధంగా అభ్యుదయం. అప్పటి పరిస్థితు లకు స్పందించిన మహానుభావుడు అన్నమాచార్యుడు. స్వీయ భక్తి మార్గంలో కులాన్ని తిరస్కరించాడు. ఉన్నత వర్గాల హృదయ పరివర్తననే కోరారు. తాను ఉన్నత కులానికి చెందిన వాడైనప్పటికీ ఈ విధంగా కోరడంలో అంతర్యం 'వర్గ సామ రస్యమని' మనకు స్పష్టమవుతుంది. అన్నమాచార్యుని మనస్సు లోని కాంక్ష ఆనాటి సమాజంలో కుల నిర్మూలన ఆత్మగౌరవం సాధించుకొనడంలో ప్రధాన భూమికను పోషించింది. మన ఆలోచనలలోనూ, ఆచరణలోను తత్త్వకవి, వాగ్గేయకారుడు వ్యక్తం చేసిన సిద్ధాంతాలను వాస్తవిక జీవితంలో ఆచరించి నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుంది. సమాజాన్ని మరొక అడుగు ముందుకు నడిపించిన వారమౌతాం. తాళ్ళపాక అన్న మాచార్యుని సాహిత్యానికి, భక్తితత్వానికి సార్థకత చేకూరు తుంది.

అన్నమాచార్యుని రచనా వైదుశ్యం-ఆధ్యాత్మికత :

అన్నమాచార్యుల ఆధ్యాత్మిక సంకీర్తనములు, శృంగార సంకీర్తనములు రాగతాళ సంయుతమైనవి. 32,000 మొత్తం కలవని ఆయన మనుమడు చిన్నన్న తన 'అన్నమాచార్య చరిత్రం'లో వ్రాశాడు. అవి కాక ద్విపద ప్రబంధంగా నవ్యరీతిని రామాయణము, సంస్కృతంలో వేంకటాద్రి మహాత్మ్యం, తెలుగులో శృంగార మంజరి 12 శతకాలు, ఇంకా వివిధ రకాల భాషలలో అనేక ప్రబంధాలు సంస్కృతంలో సంకీర్తన లక్షణమూ రచించాడు అన్నమాచార్యుడు.

దేవుని నిత్య భోగాలకు, పవ్వళింపులకు, మేల్కొలు పులకు, అర్చనలకు, కళ్యాణములకు, గరుడోత్సవం, రథో త్సవం, తెప్ప తిరునాళ్ళు, బ్రహ్మోత్సవం, మొదలైన పండుగలకు నిత్యకృత్యములుగా భక్తి పరవశమైన సంకీర్తనలు వేలకు వేలు రచించి భక్తలోకాన్ని, పండిత పామర జనాన్ని సమ్మోహన పరిచిన ఆంధ్రదేశ వాగ్గేయకారుడు తాళ్ళపాక అన్నమా చార్యుడు. అతని యొక్క ఆధ్యాత్మిక కీర్తనలు, శృంగార కీర్త నలు. ఆత్మ ప్రబోధకాలుగా, ఆత్మానుభవ వ్యంజకాలుగా లోకో ద్బోధకాలుగా అయ్యే రీతిగా వేలకు వేలుగా రచించి పాడుతూ తన భక్తి తత్వాన్ని నిజాయితిగా చాటుకున్నాడు మహాభక్తుడు అన్నమయ్య.

తెలుగులో తొలి సారిగా వాడుక భాషలో, తెలుగు నుడికారంతో, జానపద బాణీలలో పాటలు వ్రాసి, తెలుగు భాష పట్ల, జానపద సాహిత్యం పట్ల తనకున్న అభిమానాన్ని అన్నమయ్య చాటుకున్నాడు.

అన్నమాచార్యులు ఆధ్యాత్మిక సంకీర్తనలలో కూడా, తరచుగా కామ పురుషార్థానికి తన మనస్సు తరచు లోబడి పోతున్నదనీ, ఆర్థికములూ, సంసారిక బంధాల నుండి, బాదల నుండి, ఇంద్రియాల తిరుగుబాటు నుండి తనను ఉద్ధరించ మని, విముక్తి కలిగించమని తన దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామిని వేడుకున్నాడు. స్వానుభవ వైరాగ్యానికి సంబంధించిన కీర్తనలు వ్రాసిన భక్తుడు అన్నమయ్య.

ఈ స్వానుభవ వైరాగ్యానికి ఉదాహరణలు :

1) బౌళి:

చీ చీ వో బదుకా సిగ్గులేని బదుకా
వాచవికి బతిమాలి వడబడ్డ బదుకా.
భోగించ వేళ కద్దు, పొద్దు వొడవు, గుంకును, ॥ చీ ॥
మది శ్రీ వెంకటేశ్వరుడు మమ్ము నిట్టే కాచె గాని
వదరి నా నేరములు పాపమరి లేదు ... ॥ చీ ॥

2. కొండమలహరి :

ఎన్నడు దేవుని గనే యెన్నడు బుద్ధెరిగేము
తన్నుదానే హరి మమ్ము దయజూచే గాక ...
మాటాడు టొక్కటే కాని మాకును పసులకు
చాటున పంచేంద్రియాలు సర్వసమమే

3) బౌళి :

"ఎక్కడి మానుష జన్మం బెత్తిన ఫలమే మున్నది
నిక్కము నిన్నే నమ్మితి నీ చిత్తం బికను ...

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

మరువను ఆహారంబును, మరువను, సంసార సుఖము
మరువను ఇంద్రియ భోగము, మాధవ నీ మాయ...

ఈ మూడు పాటలలోను ఇంద్రియాల పటత్వానికి తరచుగా లొంగిపోయి పొందే పశ్చాత్తాపం కనబడుతుంది.

శృంగారంలో తరితీపులు పొందిన అనుభవాన్ని స్ఫురింపజేసే రచనలు చేసిన వాగ్గేయకారుడు అన్నమయ్య.

అవి :

అలుగక కూటమి చవి గాదనుచు పలికేవు - నీ
వలుగగ ప్రాణము లేమౌనో మామీదటి మేలెవరికిరా...

పాడి :

ఆడువారు కడు కోపులగుట నీవెరగవా...
సేడు కొత్తలుగా భూమి నేర్చుక వచ్చారా ...
గునిసి సవతులపై కోపాన పతి నంటేను
విని నవ్వకుండే వాడు విభుడా వాడు ...
ఈ యెడ శ్రీ వేంకటేశ యింతి నిట్టె కూడితివి
చాయకు రాకుండువాడు సరసుడా వాడు...
హోమ వేదాంత సారములైన సంకీర్తనములు:

సామంతం :

ఇందిరాధిపుని సేవ యేమరకుండుట గాక
బొందితోడి జీవులకు బుద్ధులేటి బుద్ధులు
రేయెల్లా మింగి మింగి రేపే వెళ్ళనుమియు
బాయట నిద్రాదేవి పలుమారును
చాయలకు నిచ్చునిచ్చ.
చచ్చి చచ్చి పొడమేటి మాయజీవులకు నెల్ల మనికేటి మనికి...

మేలుకొలుపులు :

భూపాళం:

"విన్నపాలు వినవలె వింత వింతలు
పన్నగపు దోమతెర పైకెత్త వేలయ్యా ... "

తందాన పదం :

బౌళి :

"తందనాన ఆహి, తందనాన పురె తందనాన
బ్రహ్మ మొకటె పరబ్రహ్మ మొకటె, పరబ్రహ్మ మొకటె"

అనే వేదాంతపరమైన కీర్తనలు రచించి, ఆ శ్రీ వేంకటపతిని పరిపూర్ణమైన భక్తితో కీర్తించిన మహాభక్తుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు.

బాలకృష్ణుని లీలలు :

దేశాక్షి:

అనరాదు వినరాదు అతని మాయలు నేడు
దిన దిన కొత్తలాయ దృష్ట మదె మాకు ...
ఆడెడి బాలుర హరి అంగిలి చూపుమని
తోడనే వాండ్ల నోర దుమ్ములు చల్లీ ...

కాంబోది :

మొత్తకురే అమ్మలాల ముద్దులాడు వీడే
ముత్తెము వలె నున్నాడు ముద్దులాడు
చక్కని యశోద తన్ను సలిగతో మొత్తరాదా
మొక్కబోయీ కాళ్ళకు ముద్దులాడు ...

లాలి :

జో అచ్చుతానంద జోజో ముకుందా
రావె పరమానంద రామ గోవింద
నందు నింటను జేరి నయము మీరంగ ...

శంకరాభరణం :

"గురుతెరిగిన దొంగ, కూగూగు వీడె
గురిలోనె దాగీని, కూగూగు ....
నెలతల దోచీని నీళ్ళాడగానె
బులువైన ఉట్ల పాలారగించీని
కొలది మీరిన దొంగ, కూగూను ... "

సౌరాష్ట్ర :

"చందమామ రావో జాబిల్లి రావో
కుందనపు పైడికోర వెన్నపాలు తేవో... "

అని బాలకృష్ణుని భక్తితో స్మరిస్తూ, అన్నమాచార్యులు ఎంతో భక్తితో ఆ మాధవుడిని తన సంకీర్తనలతో కీర్తించిన తీరు, ప్రతీ సాహితీ పాఠకుని భక్తిపరవశునిగా చేస్తుందనడంతో అతిశయోక్తి లేదు.

పండితులకు మాత్రమే పరిమితమైన పద్య కవిత్వాన్నే గాక, వాడుక జనపదాలనుపయోగించి కీర్తనలు, సంకీర్తనల రూపంలో సామాన్య జనంలోకి తీసుకుపోయిన 'ఆధ్యాత్మిక విప్లవ కారుడు' అన్నమయ్య

అన్నమాచార్యుడు అద్వితీయ ప్రతిభాశాలీ, ఋషి కల్పుడూ పదం యొక్క అనంత రూపాలను తన రచనలలో ప్రదర్శించిన వాగ్గేయకారుడు అన్నమాచార్యులు. అదే విధంగా సంవాద గీతాలు అన్నమయ్య కీర్తనలలో కనిపించడం అన్నమయ్య కవిత్వానికి అద్దం పడుతుంది. గోపికకూ కృష్ణునికీ సంవాదం, యశోదమ్మకూ గోపికలకూ, బావా మరదళ్ళ పరియాచక సంవాదాలు, అత్తా కోడళ్ల ఎత్తిపొడుపుల సంవాదం మొదలైన ఘట్టాలు అన్నమాచార్యుని సంకీర్తనలలో నర్తిస్తుంటాయి. తన తర్వాతి పదకర్తలకు, కీర్తన కర్తలకు మార్గదర్శి అయ్యాడు వాగ్గేయకారుడు అన్నమయ్య.

జాజరలు, చందమామలు, కోవెల, చిలుక, తుమ్మెద పదములు, లాలి, సువ్వి, గొబ్బి, ఉయ్యాల, జోల, జోజో, జేజే, జయ జయ విజయీభవ, శోభన, మంగళ, వైభోగములు, మేల్కొలుపులు, నలుగులు, దంపుళ్లు మొదలగు మధుర కవిత

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

రచనా విశేషాలన్నింటి ఉపయోగించి సంకీర్తనలు రచించి ఆంధ్ర దేశంలోని ప్రజల మనస్సుల్లో తనదైన శైలిలో ఆధ్యాత్మిక ముద్రను వేసిన ఆంధ్ర వాగ్గేయకారుడు అన్నమాచార్యుడు.

ముగింపు :

ఆంధ్ర వాగ్గేయకారుడు అన్నమయ్య సంకీర్తనలల్లో ప్రధానంగా తన ఆరాధ్యదైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి పట్ల అతడు చూపిన భక్తితత్వం కన్పిస్తుంది. అదేవిధంగా తన జీవిత కాలంలో ఈ లోకంలోని నరులపై ఎలాంటి పదములు వ్రాయ నని, కేవలం అతడు ఆరాధించే శ్రీ వేంకటపతి పైనే తన నలు చేస్తూ, సంకీర్తనలను లోకానికి వివరించిన మహా డిగా నిలిచిపోయాడు. విజయనగర సామ్రాజ్య కాలం ఆనాటి సమాజంలో చెలరేగుతున్నటు వంటి అసాంఘిక క్రమాలను చూసి కలతచెందాడు. 'వర్గ సామరస్య సాధ తనదైన పాత్రను పోషిస్తూ, రచనలు చేసిన తత్త్వ కవిగా పాక అన్నమయ్య భావితరాలకు మార్గదర్శకుడుగా ని పోయాడు.

ఆధార గ్రంథాలు:

1) ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము - బాలాంత్రపు రజనీకాంతరావు
2) వ్యాస రాజిక - డా॥ ఆర్. రాజేశ్వరమ్మ

❀❀❀

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

వచనకవితోద్యమం - కుందుర్తి

- డా॥ జి. స్వర్ణలత
ప్రభుత్వ మహిళా కళాశాల,

"సంప్రదాయాన్ని మన్నించడమంటే
సమస్తం అనుకరించడం కాదు
అవసరం లేని అనేక బంధాలను
కావాలని కనికరించడం కాదు
క్రొత్తను కొందరు ద్వేషించడం కద్దు
అయినా పాత మా పునాది
నన్నయ నుండి నాదాకా తెలుగు కవిత అంతా నాది"

అన్న కుందుర్తి మాటల్లో పరిమితులు లేని ఒక విశాలమైన దృక్పథం కనిపిస్తుంది. వచన కవిత ప్రయోగ వికాస వ్యాప్తులకు కుందుర్తి చిరునామా. తెలుగు పద్యానికి తిరుపతి వేంకట కవులు ఆటువేగాన్ని కల్పించి ప్రజలనాల్కల మీదకు ఎలా మళ్ళించారో కుందుర్తి వచన కవితను సంభాషణా సరళిలో సామాన్యుల సమీపానికి అలా ప్రవహింపచేశాడు. తిరుపతి వేంకట కవుల కవితను విని ఆబాలగోపాలం పద్యాలల్లడం అలవోకగా అలవరచుకున్నట్లు కుందుర్తి వచనకవితలోని సారళ్యంతో ఆకర్షితులై అసంఖ్యాకంగా యువత వచనకవితలు రాయడం ప్రారంభించారు.

ఫ్రీవర్స్ ఫ్రంట్ ఉద్యమనాయకుడిగా చక్కని స్ఫూర్తిని ప్రదర్శించి వచనకవితా పితామహుడిగా సాహిత్య చరిత్రలో చెరగని గౌరవాన్ని పొందారు. అభ్యుదయ కవితా ప్రస్థానంలో శ్రీశ్రీదొక బాణీ అయితే కుందుర్తిది మరోవాణి. అభ్యుదయ దృక్పథాన్ని వచన కవితతో విభిన్న ప్రక్రియల ద్వారా విశిష్ట కళారూపాలుగా మలిచి ప్రజలకు అందించడం కుందుర్తి విశిష్టత. విశ్వనాథ సత్యనారాయణ, జాషువాల ప్రత్యక్ష శిష్యుడైనప్పటికీ, పద్యవిద్య నేర్పినప్పటికీ వచన కవిత్వాన్నే తన సమగ్రతాభివ్యక్తికి ఉపకరణంగా గ్రహించి సమగ్రతను సాధించాడు కుందుర్తి.

అభ్యుదయ కవులలో రూపాన్ని గురించి, ప్రయోగించే ప్రక్రియల గురించి స్పష్టమైన అవగాహన ఉన్న కవులలో కుందుర్తి మొదటగా పేర్కొనదగినవాడు. "నేటి వరకూ వచన గేయం కవితా ఖండికల రూపంలోనే కాలం గడుపుతున్నది. సంపూర్ణ కావ్య దృష్టి అలవరచుకోలేదు. శ్రవ్య కావ్యం సమగ్రంగా ఉండాలంటే జీవితంలోని వివిధ సంఘటనల చిత్రణ, పాత్రల స్వభావ పరిశీలన ఉండాలి. అంటే నాటకీయత వుండాలి. సామాన్య ప్రజల కథావస్తువులను ఆలంబనగా తీసుకుంటే వచన గేయం చేయలేని పని అంటూ ఉండదు. పూర్వ ఛందస్సులను త్రోసిరాజన్నందుకు ప్రతిఫలంగా మహాకావ్యాలు సృష్టించవచ్చును. జీవితంలోని అనేక అనుభూతులను రమణీయంగా ప్రతిపాదించడానికి వచనగేయం సిద్ధంగా వుంది. దానిని ఉపయోగించడం మన బాధ్యత" - అని ఎలుగెత్తి చాటాడు. ప్రభోదించడమే కాకుండా కుందుర్తి ప్రయోగాలు చేశాడు. వాటి విలువలను ప్రకటించాడు. "తెలంగాణ" పరిపూర్ణ కావ్యమని కుందుర్తి ప్రకటించుకున్నాడు.

"బహుశా యిదే మొదలనుకుంటాను
గేయాలు తెచ్చిన కొత్త వెలుగు / తెలుగు
ఆధునిక యుగంలో ఒక పూర్ణకావ్యంగా
బ్రతుకును వర్ణించడం" అంటారు. నిజానికి తెలంగాణా విముక్తి పోరాట వస్తువుతో వెలువడిన కావ్యాలన్నింటిలో కుందుర్తి "తెలంగాణ" క్లాసిక్. సప్రయత్నంగానే ఈ ప్రయోగాన్ని చేసినట్లు ఆయన మాటలే ఋజువు చేస్తున్నాయి.

"గతం చూసి గర్వించడం మంచిదే
కాని, ప్రస్తుతం పఠించటం మరీ మంచిది
గతం విస్మరించడం తప్పే
కాని, పట్టుకు వేలాడ్డం మరీ తప్పు
వాల్మీకి రామాయణం, వ్యాసుడు భారతం రాసినట్లు
వర్తమాన కథావస్తువును వర్ణించడం నామతం"....
"నా సమకాలీకులకు ఇదంటే ప్రీతి
దీనిలో పెద్దకావ్యం రాయడం ఒక రకంగా గొప్ప
ఇంత వరకు ఋజువు లేదు, నేను రాసిన తెలంగాణా
తప్ప"

అంటూ మహాకావ్యం వైపు మహాప్రస్థానం సాగించాడు కుందుర్తి ప్రజా ఉద్యమాల చరిత్రలో సరికొత్త చారిత్రక కావ్యాన్ని రచించాడు.

"తెలంగాణా" నిజాం వ్యతిరేకోద్యమ గాథ. నిజాంను, జమీందార్లను వ్యతిరేకిస్తూ తెలంగాణా ప్రజలు నిర్వహించిన ఉద్యమమే ఈ కథావస్తువు. ఈ కావ్యంలో చారిత్రక వ్యక్తులుంటారు. కరుణ వీరభయానకాది రసాలుండి దీనికి కావ్యత్వం సిద్ధించింది. భారతంలోని 18 పర్వాలను తలపిస్తూ 18 ఖండాలుగా దీన్ని విభజించడం మరో ప్రత్యేకత.

1. ప్రస్తావన	5. ప్రజోద్యమ
2. సింహాసన	6. రాయబార
3. బీజోత్పన్న	7. బహిష్కార
4. సంయోదయ	8. అజ్ఞాత

9. మానభంగ	10. గ్రహదహన
11. ప్రతిఘటన	12. దిగ్విజయ
13. భూమిదాన	14. న్యాయదాన
15. రజాకార	16. దురాగత
17. దండయాత్ర	18. ఉపసంహార

అనేవి 18 ఖండాలు

"గతించిన బహుశతాబ్దాల కాలం పొంగులు
వేటికవే మన గుండెల కెక్కిడిన ఫిరంగులు
చేలో ఏమూల చూసినా చిక్కని కలుపు
బ్రతుకు పూలు తొడిగిన రేకుల్లో
ఒకటే రంగు - అది నలుపు" అంటూ - రాజులు, సంస్థానాలు, విదేశీయుల పాలనలో సామాన్యుడి బ్రతుకు పొలంలో చేదు పోటాపోటీగా పండిన విధాన్ని ప్రస్తావించడంతో మొదలు పెట్టి

"క్రమ క్రమాగత చైతన్య
ధనుష్పాణులు ప్రజలు నేడు
సమాజ సమిష్టి ప్రయోజన
నిశిత బాణులు ప్రజలు నేడు
ఈనేల ఎవరిది ? కోటి ప్రజల సొత్తు కదా
కొందరు వద్దంటే ఒప్పుకోని చరిత్రా
ముందుకు పదా!" అంటూ తెలంగాణా ప్రజలు చూపించిన చైతన్య స్ఫూర్తితో ఉపసంహారమిస్తారు. 1946లో జరిగిన ప్రజాపోరాటం, ప్రజల ప్రతిఘటనకు నాయకత్వం వహించిన నరసాని నారాయణ సైనిక కాల్పుల్లో వీరమరణం పొందటం, సూర్యాపేటలోని బావేముల గ్రామంలో ప్రజలను అణచాలని రిజర్వ్ పోలీసులదాడి, స్త్రీలపై జరిపిన అత్యాచారాలు గెరిల్లా దళాల ప్రతిఘటన మొదలైన వాస్తవికాంశాలు కళ్ళకు కట్టినట్టు రచించారు కుందుర్తి. ఆద్యంతాలలో ధ్వని రూపంగా ఫ్యూడల్ ప్రభువుల అరాచకాలపై ప్రతిఘటించి విజయం సాధించడం కథావస్తువైంది. కథాకథనం, విశేషా అభివ్యక్తి, ధ్వని ముప్పేటలా అల్లుకుపోయిన ఉద్యమచారిత్రక కావ్యమిది.

భవిష్యత్తు మీద కుందుర్తికున్న విశ్వాసాన్ని వ్యక్తీకరించేది "ఆశ" అనే రూపకం. "మానవజాతి భవిష్యత్తు స్వయంగా శ్రమించి నిర్మించుకోవలసిన మహాసౌధం. అందులో ఆశ మన ఉపాసనా దేవత. కాలం రాచబాట. చరిత్ర చరచరా పరువెత్తిపోతున్న రథం. సామాన్య మానవుడు రథికుడు, కవి సారధి. జాతి జీవన పురోగమన నవ చైతన్యం ప్రథమ సోపానం. సమస్త మానవాభ్యుదయ సాధన మన చరమగమ్యం" అంటూ మానవ సౌభాగ్యం పట్ల ఆశను ప్రకటిస్తారు.

"వేలకొలది అభాగ్యుల జీవితాల్లో
చెట్టులా పెరిగిన మురికిని మొదటంట నరికి
ఆనందాల అమర శిఖరం మీద
చిరునవ్వుల బావుటాలు
ఎత్తాలనే నా కోరిక
నీకు కలం వుంది, ప్రజలకు బలం ఉంది
నీకు హృదయం ఉంది, ప్రజలకు ఉదయం ఉంది
నిరాశ పాశవిక యుగాన్ని నిర్మిస్తుంది
దారిలో అడ్డొస్తున్న ముండ్లకంపలు తొలగించు, ఇది సమరం"

అంటూ ఈ రూపకంలో కవి కలాన్ని జాతిని చైతన్య పరచడానికి ఉపయోగించమనే సందేశాన్ని ఇస్తారు కుందుర్తి.

"యుగే యుగే" వచన కవితా సంపుటికూడా విశిష్టమైనది ఈ సంపుటిలోని కవితా ఖండికలు చాలా విలక్షణంగా ఉంటాయి.

"ఇది నా కవిత్వం - గీత; వినేవాడు నరుడు
చదువూ సంధ్యలు రాని రోడ్డు మీద పామరుడు
లేమి తల్లి యెడిలో నిరంతర గాఢ నిద్రాపరుడు" - అంటూ తన కవితా వస్తువేమిటో స్పష్టంగా చెప్తాడు

<u>జగజ్జాతకం</u> అనే కవితలో భవిష్యత్తును అందంగా ఊహిస్తారు

"భూగోళ పటంలో
జాతి జాతికి మధ్య గీచిన
గీతలన్నీ చెరుగుతాయి
మన మేధస్సుల కవధులు పెరుగుతాయి" - అంటారు. గురజాడ "మతములన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును" అన్న మాటలను జ్ఞప్తికి తెస్తారు కుందుర్తి.

<u>"నగరంలో వాన"</u>- కుందుర్తికి చిరకీర్తిని తెచ్చిపెట్టింది. నాగరిక జీవితాల్లోని నలుపు తెలుపులను చూపించిన కావ్యం నగరంలో వాన. హైదరాబాద్ నగరంలోని వానను వర్ణిస్తూ, మధ్య తరగతి మనుషుల మనస్తత్వాల్నీ ఎక్కడా మర్చిపోనీయడు కుందుర్తి.

నగరంలో కురిసే వానకు తెలుసు
గొడుగు జీతపు రూకల్లో మిగిల్చి
కొనగలననటం వట్టిమాట
గోనెసంచీ కప్పుకోవడం నాగరికులకు మోటనీ
నగరంలో కురిసే వానకు తెలుసు అంటాడు. ఈ కావ్యంఉత్తమ ఆధునిక వచన కావ్యాల్లో ఒకటిగా నేటికీ నిలిచివుంది. వర్ణన, కథనాలలో కుందుర్తి చూపిన నవ్యత విమర్శకుల ప్రశంసలు పొందింది.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

నాలోని నాదాలు

1967లో ప్రచురితమైన నాలోని నాదాలు పీఠికలో కుందుర్తి "మనిషి మనసు వేయి రంగుల విశ్వరూప చిత్రం ఈ అన్ని రంగులను బయటపెడితే నాగరికలోకం చూసి సహించలేదు. అందులో కొన్ని మాత్రమే చూడడానికి యోగ్యం గా ఉంటాయి. ఈ దృష్టితో చూస్తే కళాకారుడికి నిజమైన స్వేచ్ఛలేనట్టే. కవి మనసులోని ఊహలు అనేక పరిమితులకు లోబడి బయటకు రావాలి. అందుకే నా మనస్సులోని రకరకాల వేదనలకు 'నాలోని నాదాలు' ఒక శతాంశం అంటారు.

"ఆత్మలోనే ఆనందం వుంది
అది విపంచి
తాకితే పలికే ధ్వనులు తలచి తలపంకించి
నాలోని నాదాలకు ఉలికి పడతాను". అంటూ ప్రారంభించి 34 నాదాలు నినాదాలుగా మోగ్రించాడు. కాలం, కవిత్వం, భూమి, మృత్యువు, ఆకలి, చరిత్ర, ప్రకృతి మొ॥ అంశాలన్నిటి మీద కుందుర్తి రచన సాగింది.

కుందుర్తి తెలంగాణతోపాటు 'దండియాత్ర'ను కూడా వ్రాశాడు. అంటే మార్క్సిస్టు భావజాలం కలవాడైనా అన్ని రకాల ఉద్యమాలనూ కుందుర్తి గౌరవించాడు.

"సాధారణంగా నేనెన్నుకొనే వస్తువులు చైతన్యవంత మైన ప్రజోద్యమాలకు సంబంధించినట్టివిగా ఉంటాయి. రాజకీయ నాయకుల సిద్ధాంత విభేదాలతో నాకు నిమిత్తం లేదు. గాంధీజీ తన అహింసా దృష్టితో చూసి కాదన్న మాత్రాన అల్లూరి సీతారామరాజు మహావీరుడు కాకుండా పోడు. అదేవిధంగా కమ్యూనిస్టు సిద్ధాంతవేత్తలు కాదన్న మాత్రాన గాంధీజీ తన ఉద్యమాల ద్వారా ప్రజలలో తెచ్చిన చైతన్యానికి చరిత్రలో స్థానం లేకుండా పోదు. ఈ దృష్టితో చూసినప్పుడు ఎన్ని లోపాలు వున్నా ప్రజలలో ఉవ్వెత్తుగా పొంగిన చైతన్య మహా సముద్ర తరంగాలన్నీ నాకు కావలసిన ఘట్టాలే" అని కుందుర్తి ప్రకటించినపుడు అతని సమన్వయదృష్టి గోచరిస్తుంది.

బక్కచిక్కిన ఒక్క నరుడు ఒంటరిగా వనంలోకి వచ్చి
వన్య మృగాల మనస్సులను వశం చేసుకుని
మంచిగా చెప్పి మచ్చిక చేసుకుని
సింహం మీద దండెత్తడానికి
సిద్ధపడమని బోధించాడు.
వనం మనది
వన్య వస్తు సంచయం మీద
సర్వాధికారం మనదన్నాడు
వన దేవత కరుణించి వర్షాలు పుష్కలంగా కురిస్తే
గ్రామ సీమల్లో కళకళలాడే
పంట కుప్పల సంపదంతా ప్రజలకే చెందాలన్నాడు
- - - - - - - -
సింహాన్ని వదలి సముద్రం మీదికి
చిత్రంగా వుంది దండయాత్ర!

దాని పేరే దండియాత్ర! అంటారు కుందుర్తి. ధ్వనితో పాటు సారళ్యతనూ ఏకకాలంలో సాధించడం కుందుర్తి విశిష్టత.

కుందుర్తి ప్రారంభించిన వచన కవిత నేడు మరెన్నో విశిష్టలక్షణాలను ఆపాదించుకుని గొప్ప భావవాహికగా రూపొందింది. అత్యున్నతమైన కళాభివ్యక్తిని వచన కవిత సాధించింది. అయితే ఆద్యుడిగా, ప్రయోగశీలిగా కుందుర్తి చిరస్మరణీయుడు.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

దళిత ప్రజా జీవనంలో భీమన్న

- బాలు నిర్మల
స్నాతకోత్తర విద్యార్థి, తెలుగు విభాగం.

అర్థ శతాబ్దం పాటు రచనలు చేసి అటు కవిగా ఇటు విప్లవకారునిగా దళితుల చైతన్యం కోసం అవిరాళ కృషి చేసిన రచయిత డా॥ బోయిబీమన్న. ఉపాధ్యాయ వృత్తి నుండి అంచె లంచెలుగా ఎదిగి తెలుగు సాహిత్యాన్ని సమగ్రపరచడంలో గొప్ప రచనలు చేశారు. భీమన్నను దళిత కవి, శ్రామికుల కవి అనడంలో ఎంతో అర్థం వుంది. అంటరాని తనం వంటి అనేక ఇబ్బందులను ఎదుర్కొని వాటి అనుభవాల ద్వారా అంబేద్కర్ వ్రాసిన "కుల నిర్మూలన" అనే పుస్తకాన్ని తెలుగు లోకి అనువదించారు. ఇలాంటి సమాజ అవమాన భరిత విషయాలను నిరశిస్తూ 70 పుస్తకాలు రచించారు. 1911 సెప్టెం బరులో తూర్పు గోదావరి జిల్లా మామిడి కుదురు గ్రామంలో నాగమ, పుల్లయ్య అనే దంపతులకు డా॥ బోయి భీమన్న జన్మించారు. 1935 బి.ఎ. 1937 బి.ఇడి పూర్తి చేసారు. విద్యా భ్యాసం అనంతరం చరిత్రను బోధించే ఉపాధ్యాయునిగా బోర్డు హైస్కూల్‌లో పనిచేశారు. ఉపాధ్యాయ వృత్తిని కొన సాగిస్తూ పద్య, గేయ, వచన, రచనాలతో పాటు అనేక నాట కాలను కూడా వ్రాశారు. వీటితో పాటు అంబేద్కర్ జీవితాన్ని కీర్తించాడు. ఆదర్శంగా తీసుకున్నాడు.

ఈయన వ్రాసిన "జయ జయ జయ అంబేద్కర్" నేడు దళితులకు జాతీయ గేయమై నేటికి ప్రార్థనా గీతంగా కొన సాగుతుంది. ఈ కోవలోనే అనేక కవితలు రాశారు. ముఖ్యమై నవి గుడిసెలు - కాలిపోతున్నాయి, (కవితా సంపుటి) (1975) దీనికి కేంద్ర సాహిత్యం అకాడమి లభించింది. భీమన్న ఉగా దులు, భీమన్న కావ్య కుసుమాలు, మోక్షం నాజన్మ హక్కు, కులీ శతకం, కవితలతో పాటు అనేక నాటకాలు రాశారు. పాలేరు నాటకం (1938), కూలిరాజు, వేదవ్యాసుడు, చండాలిక (ఠాగూర్ రచించిన చండాలిక నాటికకు అనువాదం). మన దేశంలో ఐక్యమత్యం భావనను అనుసరిస్తూ భీమన్న రచనలు వున్నాయి. కులమతాల కంటే మానవత్వం ఆశించిన జాతీయత వాది అంబేద్కర్ వాదన భీమన్న ఆలోచన ఒకటే... భీమన్న గారు సమగ్ర సాహిత్యం పేరుతో 300 పైగా పాటలు సంపుటి తెలుగు విశ్వవిద్యాలయం వారు ప్రచురించారు. అందులో 118 అంబేద్కర్ వ్యక్తిత్వ భావజాలాన్ని వర్ణించిన పాటలు వున్నాయి.

"దళితజనుల కంబేత్కరు
ధర్మమే మతమన్నాడు...
బౌద్ధ ధర్మ మొకటేరా
భారతీయమన్నాడు"

అంటూ ఒక చోట దళితులను ఉద్దేశించి "ధర్మ కుంటి దంటూ" ఒక పాట దళిత పదాన్ని శీర్షికలోనే పెట్టిమరీ మరొక చోట రాశారు. దీనిలో భాగంగా కుల నిర్మూలనకు తీవ్రంగా వ్యతిరేకించిన నాటకం "పాలేరు" (1988) నేటికి ఈనాటకానికి 50 ఏళ్ళైందని మన రచయితలే చెప్తుంటారు.

భీమన్న రాసిన పాలేరు నాటకంలో వెంకన్న వనబాల ప్రేమకథను కులాంతర వివాహాల పేరుతో కుల నిర్మూలనను చర్చించారు. ఒక పాలేరు అగ్రకుల అమ్మాయిని పెళ్ళి చేసు కోవాలంటే ఎన్ని బాధలకు గురి కావాల్సివస్తుందో యజమాని కుబేరయ్య నుండి వెంకన్న ఎదుర్కొంటాడు. చివరికి ఉపకారి మాస్టార్ సహాయంతో చదువుకొని వెంకటేశ్వర్రావుగా గౌరవం పొంది డిప్యూటి కలెక్టర్‌గా ఉన్నతోద్యోగం సాధిస్తాడు. ఉద్యో గిగా తన గ్రామానికి వచ్చి భూస్వామ్య బద్ధంగా దళితులు తమ హక్కుల్ని సాధించుకోవాలనే అంబేద్కర్ ఆశయాన్ని దీని ద్వారా ప్రేరేపించాడు రచయిత.

సమాజంలో చెడ్డవాళ్ళతో పాటు మంచివాళ్ళూ ఉన్నా రని భీమన్న తన రచనల ద్వారా ఒక విశిష్టత తీసుకొచ్చారు. వెంకన్న తండ్రి తాము తరతరాలుగా పాలేరు జీవితం గడపడం కోసమే పుట్టామని తన కొడుకుకి చెప్పి పాలేరుగా పంపిస్తాడు. దళితుల మనోగతాలను కడా పాలేరు నాటకం ద్వారా తెలియ పరిచారు.

నిజ జీవితంలో అటు అంబేద్కర్ ఇటు భీమన్న ఇరు వురి జీవితాలను స్మరించేది పాలేరు. యాధృచ్ఛికంగా పాలేరు వెంకన్న అంబేద్కర్ ఒకే కోవలో వున్నారు. ఇరువురు కులాంతర వివాహాలు చేసుకుని తాము చెప్పిన దానిని నిజజీవితంలో ఆచరించి ఆదర్శ మూర్తులయ్యారు.

ఇప్పటికే భీమన్న సాహిత్యంపై అనేక పరిశోధనలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ సదస్సులు జరుగుతున్నాయి. ఈ కోవలోనే హైమవతిగారు వ్రాసిన "పాలేరు నుండి పద్మశ్రీ వరకు బోయి భీమన్న" అనే గ్రంథం సాహిత్య దృక్పథాన్ని తెలుపుతుంది.

"నేను సూర్యుణ్ణి కాదు చంద్రుణ్ణి"
"నాకున్నది ఎండకాదు గుండె"

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

అంటూ బోయి భీమన్న శాంతి విప్లవాన్ని వ్యక్తం చేశారు. ఈయన ఒక ఆత్మకథను రాసుకున్నారు. "పాలేరు నుండి పద్మశ్రీ వరకు".

తన కవితలలో అతి ప్రధానమైనవి "గుడిసెలు కాలి పోతున్నాయి" (1973) ఏడాదికి ఒకసారి దళితుల గుడిసెలు కాలిపోతూనే వున్నాయి. మరళా క్రొత్త గుడిసెలు వస్తున్నాయి. ఇవన్నీ ఓట్ల కోసమేగా అని నిలదీయాలని దళితులు అనుకునే లోపే ఈ గుడిసెలు కాలిపోతున్నాయి. దీనిలో చీమలను శ్రామికులుగా, పాములను దోపిడి కారులుగా మలచాడు కవి. బహుజనులంతా రాజ్యాధికార దిశగా పయనించడానికి సూచనలు చేశారు. వాల్మీకి, ధర్మవ్యాసుడు మొద లగువారు దళితులేనని వారిస్తూ, భారత రామాయణ గాథలు తమవేనని భీమన్న వ్యాఖ్యానించారు. ఈ విధానాలను చాటి చెప్పడం కోసం భీమన్న చూపిన సహనం నేటి తరానికి కూడా మార్గదర్శ కత్వం.

భీమన్న నిజమైన కవి, ఆర్తి ఆయన కవిత్వానికి ప్రాణం, వ్యంగ్యం జీవకళ అని ఎన్.గోపి గారు వ్యాస నవమిలో పేర్కొన్నారు.

"నీ మనసే నీదైవం - నీ ప్రజ్ఞే నీ ప్రగతి"
నీవే నీజాతి నిర్మాతవు - నీవే నీ సుఖశాంతుల కర్తవు"

అంటూ తన మనోనిశ్చలత్వాన్ని చాటారు.

దళితులందరూ శ్రామికులేనని వారిని భీమన్న వారిం చారు. కమ్యూనిస్టు పార్టీలో పనిచేసి కులం, వర్గం వేరని వాధిం చిన కోడా సూర్య ప్రకాశరావుకి తన "పాలేరు" నాటకాన్ని అంకితం చేశారు. అంబేద్కర్ భావజాలానికి భీమన్న సాహిత్యం ముఖ్యం అని గుర్తించాల్సిన అవసరం ఎంతైన వుంది.

జనవాణి, ఆంధ్రప్రభ పత్రికలలో కూడా ఈయన పనిచేశారు. ఈయన రచనలు అత్యున్నత స్థాయిలో పురస్కా రాలు గ్రహించబడ్డాయి. ఆంధ్ర విశ్వకళా పరిషత్ వారిచేత "కళాప్రపూర్ణ" 1971 లో, పద్మభూషన్ (2000), తెలుగు విశ్వవిద్యాలయం విశిష్ట పురస్కారం, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహించారు. డా॥ సింగిరెడ్డి నారాయణ రెడ్డిగారు 2014 సంవ త్సరంలో డా॥ బోయి భీమన్న జీవన సాఫల్య పురస్కారం పొందారు. భీమన్న రచనలను, ఆయన ఆలోచనలను ముందుకు తీసుకెళ్ళడం అత్యంత ముఖ్యం సాహితీవేత్తలు భీమన్న ఆలోచనలకు భవిష్యత్ తరాలకు మార్గదర్శకాలుగా మార్చాలి.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

సి.పి. బ్రౌన్ - తెలుగు సాహిత్య సేవ

- ఒగ్గు ప్రవీణ్ కుమార్
స్నాతకోత్తర విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

తెలుగు సాహిత్యానికి అపారమైన కృషి చేసిన ఆంగ్లేయుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (సి.పి.బ్రౌన్) 1798 నవంబర్ 10న కలకత్తాలో జన్మించాడు. ఇతని తండ్రి డేవిడ్ బ్రౌన్ క్రైస్తవ మత బోధకుడు. బ్రౌన్ తన తండ్రి మరణించిన తరువాత తన కుటుంబంతో కలిసి ఇంగ్లాండ్ వెళ్ళారు. బ్రౌన్ అక్కడ హిందూస్థానీ భాష నేర్చుకున్నాడు. 1817 ఆగష్టు 4న మద్రాసులో ఈస్ట్ ఇండియా కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. ఉద్యోగంలో ఉంటూనే మద్రాసులో కోదండరామ పంతులు వద్ద తెలుగులో భాషా జ్ఞానాన్ని నేర్చుకోవడం జరిగింది. 1820 ఆగష్టులో కడపలో డిప్యూటి కలెక్టర్‌గా పనిచేసాడు. ఉద్యోగ రీత్యా తాను పనిచేస్తున్న ప్రదేశాలలో తెలుగు అవసరం కాబట్టి మాట్లాడటం తప్పనిసరి అని తెలుసుకొని తెలుగు భాష నేర్చుకోవడానికి ముందుకు సాగాడు. అయితే ఆ రోజుల్లో తెలుగు నేర్చుకోవడానికి సులభంగా, శాస్త్రీయమైన పద్ధతి లేకపోవడం వలన, పండితులు తెలుగు భాషను తమ తమ ఇష్టారీతిలో చెప్తూ ఉండేవారు. తెలుగురాని వారు తెలుగు నేర్చుకోవాలంటే చాలా కష్టంగా ఉండేది. భాష నేర్చుకోవడంలోని లోపాలు, కష్టతరం, ఇబ్బంది వంటివి బ్రౌన్‌కు తెలుగు భాషా పరిశోధనకు పునాది వేయడం జరిగింది.

బ్రౌన్ ప్రాచీన తెలుగు కావ్యాలను ఒక దగ్గరికి చేర్చి ప్రజలందరికి అర్థమయ్యేలా వాటిని పరిష్కరించి ప్రచురించడం, భాషకు ఒక వ్యాకరణం, ఒక నిఘంటువును తీసుకు రావడానికి దారి తీసింది. అప్పటి కడప కలెక్టర్‌గా పనిచేస్తున్న హన్‌బరీ అతను తెలుగులోనే మాట్లాడేవారు. బ్రౌన్ ఇతనిని ఆదర్శంగా తీసుకున్నాడు. మచిలీపట్నం, గుంటూరు, చిత్తూరు తిరునల్వేరి మొదలైన చోట్ల పనిచేసి కడపలో తను స్థిరంగా ఉండటానికి నివాసం ఏర్పరుచుకున్నాడు. సొంత డబ్బుతో పండితులను నియమించుకొని వారితో తెలుగు భాషను నేర్చుకోవడం మొదలు పెట్టాడు. బ్రౌన్ కడప, మచిలీపట్నంలో పాఠశాలలు స్థాపించి ఉచితంగా చదువు చెప్పించాడు. విద్యార్థులకు ఉచితంగా భోజన వసతి కల్పించి తెలుగు భాషకు విస్తృతమైన కృషి చేసాడు. ప్రచురణలు వాటికి అయ్యే ఖర్చుల కారణంగా బ్రౌన్ ఇబ్బందులు ఎదుర్కొని, అప్పులు చేయడం జరిగింది. 1834లో ఉద్యోగం నుండి తీసివేయడంతో ఇంగ్లాండ్‌కు వెళ్ళిపోయి, తిరిగి 1837లో కంపెనీలో పర్షియన్ భాషకు అనువాదం చేయడానికి ఇండియాకి రావడం జరిగింది. 1932-33లో గుంటూరులో వచ్చిన కరువు ఆ సమయంలో ఏర్పడిన కరువుకు డొక్కల కరువు లేదా సంజన కరువు అనే పేర్లు కలవు. బ్రౌన్ ఆ కరువు సమయంలో ప్రజలకు చేసిన సేవలు వారి మన్ననలను పొందాడు. ఎందుకంటే బ్రౌన్‌పై అధికారులు అక్కడ ఉన్నటువంటి కరువును కరువుగాక వేరేలా రాయాలని చెప్పినా బ్రౌన్ రాయలేదు. పై అధికారుల ఆగ్రహానికి గురయ్యాడు. పదవీ విరమణ పొందిన తరువాత 1854లో లండన్‌లో స్థిరపడి, 1865 లండన్ యూనివర్సిటీలో తెలుగు ప్రొఫెసర్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించాడు. బ్రౌన్ 1884 డిసెంబరు 12న తన ఇంటిలోనే 22 కిల్బారు గార్డెన్స్, వెస్ట్ బార్న్ గ్రోవ్, లండన్‌లో బ్రహ్మచారిగానే మరణించాడు. ఈయన సమాధి కిన్సెల్ గ్రీన్ స్మశానంలో ఉంది. తెలుగు భాషను అమితమైనటువంటి ప్రేమతో ఆదరించి, సేవలందిచిన వ్యక్తి సి.పి. బ్రౌన్.

బ్రౌన్ కొలువులో నేలటూరు వేంకటాచలం తొలి తెలుగు కథకుడు. ఇతను చెప్పిన కథలను సి.పి. బ్రౌన్ విని అందులో వున్న 24 కథలను, దానితోపాటు శ్రీకృష్ణమాచారి చెప్పిన రెండు కథలను కలిపి 1855లో పుస్తకంగా ప్రచురించారు. అదే సంవత్సరంలో ఆంగ్లానువాదం "పాపులర్ తెలుగు టేల్స్" అనే పేరుతో ప్రచురించారు. 1916లో తాతాచారి కథలు గిడుగు వెంకట అప్పారావు సంపాదకత్వంలో రెండవ ముద్రణ పొందాయి. 1951లో వావిలాల వాసుదేవ శాస్త్రి మూడవ ముద్రణ, 1974లో బండి గోపాలరెడ్డి సంపాదకుడిగా నాలుగవ ముద్రణ పొందాయి. తాతాచార్యులు గారికి కావ్యముల యందు, వ్యాకరణములో మంచి ప్రావీణ్యత ఉంది. తాతాచారి కథలు సమాజంలో ఉన్నటువంటి నీతిని బోధించేవి అయినా ఆనాటి సామాజిక స్థితిని ప్రతిబింబించేలా ఉన్నాయి. అందులోని శైలి మంచి వ్యవహార భాషకు దగ్గరి సంబంధం ఉండటం వలన బ్రౌన్ దీనిని అభినందించడం జరిగింది. తాతాచారి కథల్లో గ్రామ శక్తికి పొంగలి పెట్టిన కథ, దేవర మాకుల కథ, వెట్టి వాండ్ల పట్టీ కథ, వాలాజీపేట రాయాజి మసీదు కథ, హలీం ఖాన్ మోసపోయిన కథ, మనిషికి సంబంధించిన సద్గతి దుర్గతి తెలిపే కథ, పొగచుట్ట కథ - ఇలాంటి కథలు వున్నాయి.

సి.పి. బ్రౌన్ కొలువులో మరొక పండితుడు తెలుగు తొలి యాత్రా చరిత్రకారుడు ఏనుగుల వీరాస్వామయ్య బ్రౌన్‌కు వీరాస్వామయ్యకు తెలుగు భాషలో మంచి సాన్నిహిత్యం ఉండేది. వీరాస్వామయ్య బ్రౌన్‌కు రాసినటువంటి

లేఖలో తాను సంపాదించిన అరుదైన స్కాందం అనే గ్రంథం, దానికి గల తెలుగు అనువాదం గురించిన వివరాలు ప్రచురించగలరేమో పరిశీలించమన్నారు. తాను వ్రాసిన యాత్రాచరిత్ర అయినటువంటి కాశీయాత్ర చరిత్రను మీరు ప్రచురించగలరేమో దీనిని అనువాదం చేయగలరని బ్రౌన్‌ను కోరారు.

వేమన పద్యాలను ఆంగ్లంలోకి అనువదించాడు. దాదాపు 2 వేల వేమన పద్యాలను సేకరించి వాటిలో 693 పద్యాలను "The Versus of Vemana" అన్న పేరుతో 1829లో 693 పద్యాలు, 1839లో 1164 పద్యాలు అనువదించడం జరిగింది. నల చరిత్ర 1841, ఆంధ్రమహాభారతము, శ్రీమద్భాగవతము, హరిశ్చంద్రుని కష్టాలు (వ్యాఖ్యానం) 1842, వసు చరిత్ర 1844, మనుచరిత్ర 1851 (వ్యాఖ్యానాలు జూలూరి అప్పయ్యశాస్త్రి చేత వ్రాయించాడు), పలనాటి వీరచరిత్ర 1852 ప్రచురించాడు.

సి.పి. బ్రౌన్ నిఘంటువు తెలుగు పండితుల మెప్పును, ఆదరణ పొంది, తెలుగు వారికి నిఘంటు రచనారీతిని నేర్పాడు.

తెలుగు భాషకు, తెలుగు సాహిత్యానికి చేసిన కృషి సి.పి. బ్రౌన్‌కు ఎంతో ఉంది. ఈనాడు మనం అనువాదాలు కాని నిఘంటువులు కాని సమగ్రంగా నేర్చుకుంటున్నామంటే అది సి.పి. బ్రౌన్ గారి చలవే అని చెప్పాలి. సమాజంలో సేవ తెలుగు భాషపై మక్కువ ఇంతా అంతా కాదు. సాహిత్యంలో అనువాదాలు, రచనలు తెలుగు పండితులకు సమానంగా చేస్తూ వచ్చాడు.

బ్రౌన్ రచనలు

ఆంధ్ర గీర్వాణ చందము, తెలుగు బైబిల్, తెలుగు వ్యాకరణము (1940) రాజుల యుద్ధములు, తెలుగు-ఇంగ్లీషు నిఘంటువు 185, ఇంగ్లీషు-తెలుగు నిఘంటువు 1854, మిశ్ర భాషా నిఘంటువు, లిటిల్ లెక్సికన్ (తెలుగు వాచకాలకు అనుబంధమైన నిఘంటువు), వేమన పద్యాలకు ఇంగ్ల అనువాదం. బ్రౌన్ ఇలాంటి గ్రంథాలను పరిష్కరించి వెలుగులోకి తేవడం జరిగింది.

తెలుగు ప్రాంతానికి ఉద్యోగిగా వచ్చి మాతృభాష కన్న తెలుగును మిగా ప్రేమించి, తెలుగు భాషా సాహిత్యాలకు విశిష్టమైన సేవ చేసిన మహనీయుడు సి.పి. బ్రౌన్.

పందొమ్మిదవ శతాబ్దంలో అటుకల మీద నిద్రపోతున్న తాటాకు ప్రతులను బూజు దులిపి, వాటికి ముద్రణా భాగ్యము కల్పించిన ఆంగ్లేయ పండితుడు సి.పి. బ్రౌన్ వేమనను తెలుగు వారికే కాక ప్రపంచానికి పరిచయం చేసి దాదాపు 2 వేల వేమన పద్యాలను సేకరించి, వాటిలో 693 పద్యాలను "The Versus of Vemana" అన్న పేరుతో ఆంగ్లంలోకి అనువాదం చేసి అచ్చు వేయించిన మహాఘనుడు సి.పి. బ్రౌన్. ఈ విధంగా వేమన పద్యాలలోని నీతి, క్రమశిక్షణ, మానవ సంబంధాలను ప్రపంచానికి అందించాడు.

"దేశమునందు నొక్కడు విదేశజనుండు విశాల భావ నోద్దేశములందు జీవిత నిధిన్ మన తెల్గుకు ధారవోసెనం..." అని సి.పి. బ్రౌన్ గారిని సన్నిధానం నరసింహశర్మ ప్రశంసించాడు.

పాశ్చాత్యులు తెలుగు నేర్చుకోవడానికి సి.పి. బ్రౌన్ సరళమైన భాషల్లో 'తెలుగు వ్యాకరణము' రాశాడు.

బ్రౌన్ పండితులను, వ్యాసగాండ్రను గ్రంథ సేకరణకు ప్రేరేపించాడు వారు గ్రామాలలో తిరుగుతూ సేకరించిన గ్రంథాలను పండితుల పరిష్కరణకు అప్పగించాడు. ఒక్కొక్క కావ్యానికి ఒకటికి మించిన ప్రతులను, కొన్నింటికి పది పన్నెండు వరకు సేకరించిన మహానుభావుడు సి.పి. బ్రౌన్. అప్పటి కాలంలో ప్రజల్లో మూఢ విశ్వాసాలు గట్టిగా ఉండినందున, వారు తమ వద్ద ఉన్నటువంటి తాళపత్ర గ్రంథాల సేకరణలో ఏర్పడిన కష్టాలను అధిగమిస్తూ వాటిని సేకరించడంలో సి.పి. బ్రౌన్ తనదైన శైలిలో కృషి చేశాడు.

గ్రంథ పరిష్కరణ క్రమంలో పండితులకు సైతం స్పష్టమైన సూచనలిచ్చేవాడు బ్రౌన్. పాఠ నిర్ణయానికి "తీర్పు", "న్యాయం" అను మాటలను వాడుకలోకి తెచ్చినవాడు సి.పి. బ్రౌన్. విభిన్న తాళపత్రాలను పరిష్కరించి శుద్ధప్రామాణిక ప్రతులను సిద్ధపరిచిన ఆద్యుడు బ్రౌన్. అందువల్ల "ఆంధ్ర భాషా పునర్‌నిర్మాణ మధుమాస వసంతుడు"గా సి.పి. బ్రౌన్ ప్రసిద్ధిగాంచాడు.

వసు చరిత్ర, మను చరిత్ర విభిన్న ప్రతులను సేకరించి స్వీయ పర్యవేక్షణలో పరిష్కరణ చేయించాడు ములుపాక బుచ్చయ్య శాస్త్రికి తన కడప బంగళాలో కొలువు ఏర్పాటు చేసి 1929-30లో వసుచరిత్రకు వ్యాఖ్య సి.పి. బ్రౌన్ వ్రాయించాడు.

"నూరార్లు లెక్కసేయక
పేరొందిన విబుధ వరుల బిలిపించుక వే
మార్లర్థమిచ్చు వితరణి
చార్లెస్ ఫిలిప్పు బ్రౌన్ సాయెబు కరుణన్"

వసు చరిత్రకు వ్రాసిన వ్యాఖ్యకు పీఠికలో వ్రాసిన పద్యాలలో సుప్రసిద్ధమైనది ఈ పద్యం.

జూలూరు అప్పయ్య పండితునిచే మను చరిత్రకు వ్యాఖ్యానం వ్రాయించి 1851లో అచ్చు వేయించాడు సి.పి. బ్రౌన్. తెలుగు ప్రాచీన సాహిత్యంలో 36 పురాణేతిహాసాలను సేకరించి, కాశీఖండము, పద్మపురాణము, భారతము, భాగవతము, భాస్కరరామాయణము, విష్ణు పురాణము, శ్రీకాళహస్తి మహాత్యములకు పాఠ్య నిర్ణయం చేయించి, శుద్ధ ప్రతులను సి.పి. బ్రౌన్ వ్రాయించాడు.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

మద్రాసు విశ్వ విద్యాలయంలో ద్వితీయ పండితుడుగా పనిచేస్తూ ఉండిన పురాణం హయగ్రీవశాస్త్రి గారి విన్నపం మేరకు బ్రౌన్ తాను పరిష్కరింపజేసిన ఆంధ్ర మహాభాగవతాన్ని ఇచ్చాడు. దీనిని హయగ్రీవశాస్త్రి గారు తన వివేకదర్శ ముద్రణాలయంలో 1848లో ముద్రణ చేయించాడు.

తులనాత్మక అధ్యయనానికి ఒరవడి పెట్టడంలో భాగంగా పురాణేతిహాసాల పరిష్కరణలో ఆంధ్ర కవులను, గ్రీక్, ల్యాటిన్, ఇంగ్లీష్ కవులతో పోల్చినవాడు సి.పి. బ్రౌన్. ధూర్జటి కవి శ్రీకాళహస్తి మహాత్యానికి బ్రౌన్ ఇంగ్లీష్‌లో కథా సంగ్రహం వ్రాశాడు. పురాణాలను సులభ శైలిలో పరిష్కరింపచేసి సాహిత్యాన్ని సామాన్య ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. పంచ వింశతి, హంస వింశతులకు పాదసూచికలు వ్రాయించాడు.

గౌరవ హరిశ్చంద్రోపాఖ్యానాన్ని 1842 లోనూ, 1849లో వైజయంతి విలాస వ్యాఖ్యానాన్ని అచ్చు వేయించాడు. పాతికేళ్ళలో దాదాపు పాతిక ప్రబంధాలను పరిష్కరింపజేసాడు. ఆంధ్రుల సామాజిక జీవితాన్ని వర్ణించే 'పల్నాటి వీరచరిత్ర' విభిన్న ప్రతులను సేకరించి పండితులచే పరిష్కరింప జేశాడు. బసవ పురాణము, ప్రభు లింగలీల మొదలైన శైవ పురాణాలను పరిష్కరింపజేశాడు. చాటు పద్యాలు, జానపద గీతాలు, సామెతలు, పలుకు బళ్ళు మొదలైన జానపద సాహిత్యంలోని అంశాలను సేకరించి, సాహితీ లోకానికి అందించినవాడు సి.పి. బ్రౌన్. ఆ కాలంనాటి పత్రికలలో వెలువడిన వ్యాసాలు, సంపాదకీయాలు, వార్తలు, లేఖలు, మొదలైన వాటిని మంచి కాగితాలపై వ్రాయించి ముందు తరాల వారికి సి.పి. బ్రౌన్ పరిచయం చేశాడు.

కాలగర్భంలో కలిసిపోకుండా మెకంజీ సేకరించిన కైఫియత్తులను (స్థానిక చరిత్రలను) దళసరి కాగితాలపై వ్రాయించి భద్రపరిచాడు. ఆ సంపుటాలన్నీ నేటికీ మద్రాసు ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథ భాండాగారంలో ఉన్నాయి. మంత్ర, తంత్ర శాస్త్రాలకు సంబంధించిన ఆనంద తంత్రం, కులార్ణవం మొదలగు సంస్కృత గ్రంథాలను సేకరించి, ఋగ్వేదానికి భాష్యం వ్రాయించి సంస్కృత సాహిత్యం పట్ల తనకు వున్న ఆసక్తిని చాటాడు సి.పి. బ్రౌన్.

చరిత్రపట్ల తనకు ఉన్న అభిరుచి వల్ల బ్రౌన్ హిందూ ముస్లిమ్ క్రొనాలజీ, వార్స్ ఆఫ్ ది రాజాస్ అనే హంపీ అనంతపురం చరిత్ర, తాతాచారి కథలు, హిందూ శిల్పం మొదలైన రచనలు చేసి తెలుగు సాహితీ ప్రపంచంలో స్థిరమైన స్థానాన్ని సంపాదించాడు. అదే విధంగా ప్రబంధ కావ్యాలను, ద్విపద కావ్యాలనే 84 శతకాలను సేకరించి కొన్ని శతకాలకు వ్యాఖ్యతో పాటు ముద్రణ భాగ్యం కల్పించి, ఆ శతకాలలోని సామాజిక, నైతిక విలువలను, మానవ సంబంధాలను సందేశం రూపంలో సమాజానికి అందించిన సంఘ సంస్కర్త సి.పి. బ్రౌన్.

ముద్రణ

1832 సంవత్సరం కాలంలో ముద్రణాలయాన్ని ప్రారంభించి, తన స్వీయానుభవంతో ముద్రణలోని కొన్ని తెలుగు అక్షరాలల్లో మార్పులు చేశాడు. ఆ కాలంలో "రావత్తు" అక్షరం క్రింద కప్పు రూపంలో 'ఖ' గా ఉండేది. దీనిని తొలగించి "(", " "లను ప్రవేశ పెట్టాడు. ఈ (( ) స్వరూపం తెలుగు శాసనాలల్లో కనిపిస్తుంది. బ్రౌన్ రకారంగా 'రావత్తు' (, (ప్రసిద్ధి గాంచింది. అదేవిధంగా 1860-70 నాటికి పేజీ నెంబర్లు, పద విభాగాలు, పద విభాగాలు, విరామ చిహ్నాలు, ప్రకరణ విభజనలు మొదలైనవి. ఈ విధంగా ముద్రణ కళా వికాసానికి రాచబాటలు వేసినవాడు సి.పి. బ్రౌన్.

నిఘంటువులు

బ్రౌన్‌కు ఆజరామరమైన కీర్తిని సంపాదించి పెట్టినది ఆయన రచించిన నిఘంటువులు. సి.పి. బ్రౌన్‌కు ముందు కాంబెల్, మారిస్, మామిడి వెంకయ్య మొదలగువారు తెలుగు నిఘంటువులను సమకూర్చి సాహితీ ప్రపంచానికి పుస్తక పఠనంలో సహాయకారిగా నిలిచాయి. కానీ ఎన్ని నిఘంటువులు వచ్చినా నాటి నుండి నేటి వరకు పండితులకే కాక సామాన్యులకు కూడా అత్యంత ఉపయుక్తంగా వుండే నిఘంటు నిర్మాణంలో అగ్రస్థానం సి.పి. బ్రౌన్‌కే దక్కింది.

ప్రాచీన గ్రంథాలు, శతక కావ్యాలు మొదలైన వాటిలో లభించే పదాలతోపాటు సమకాలీన పత్రికలు, ఆఫీసు రికార్డులు, జన సామాన్యం వాడుకలో గల పదాలు ఈ నిఘంటువులో చేర్చబడినాయి. సాహితీ ప్రపంచంలో అనువాదకులకు, బ్రౌన్ నిఘంటువులు కల్పవృక్షం లాంటివని చెప్పవచ్చు. ఈ నిఘంటువులో ప్రధానంగా సామెతలు, జాతీయాలు, ఆంగ్ల సమానార్ధకాలు మొదలైనవి చేర్చబడినాయి.

బ్రౌన్ ఇంగ్లీష్-తెలుగు నిఘంటువు, తెలుగు-ఇంగ్లీష్ నిఘంటువు, జిల్లా నిఘంటువు, మిశ్ర భాషా నిఘంటువులే కాక, 'లిటిల్ లెక్సికన్' అనే నిఘంటువును సమకూర్చి సాహితీ అనువాదకుల హృదయాల్లో చిరకాలం నిలిచిపోయిన వాడు సి.పి. బ్రౌన్. తెలుగు నేర్చుకునే పాశ్చాత్యుల కోసం బ్రౌ[n] స్వయంగా వ్యాకరణం రచించి 1840లో ముద్రించి, వ్యావహారిక భాషకే ప్రాధాన్యమిచ్చాడు సి.పి. బ్రౌన్.

తెలుగు వాఙ్మయంలో లేఖాసాహిత్యానికి ప్రత్యే[క] స్థానాన్ని బ్రౌన్ కల్పించాడు. బ్రౌన్‌కు ఇతరులు వ్రాసిన లేఖ[లు] - బ్రౌన్ ఇతరులకు వ్రాసిన లేఖలు 20 సంపుటాల[లో] మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలో వున్నాయి.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

సాహిత్య వ్యాసాంగంలో తీరిక దొరికినప్పుడల్లా హిందు వుల ఆచార వ్యవహారాల మీద, సమకాలీన విద్యా విధానం మీద, పంచాంగం గురించి, వీరశైవుల ఆచారాల గురించి వ్యాసాలు రచించి సాహితీ ప్రపంచానికి అందించిన మహా పురుషుడు సి.పి. బ్రౌన్.

ఆధార గ్రంథాలు :

1) సి.పి. బ్రౌన్ సాహిత్య సేవ (వ్యా.జానుమద్ది హనుమచ్ఛాస్త్రి.

2) బ్రౌన్ లేఖలు.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

మరుపూరు కోదండరామిరెడ్డి విమర్శనాత్మక రచనలు

- దొలిశెట్టి పుష్పిణి
పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్, గచ్చిబౌలి, హైదరాబాద్.

తెలుగు సాహిత్యంలో ప్రముఖ రచయితలలో మరుపూరు కోదండ రామిరెడ్డి ఒకరు. అయితే, ఒక్కొక్కసారి కొంత మందికి వచ్చినంత కీర్తి ప్రతిష్టలు మరికొంతమందికి లభించవు. అటువంటి వారిలో మరుపూరు కోదండరామిరెడ్డి ఒకరు. ఆధునిక యుగంలో నెల్లూరు జిల్లా రచయితలై ఆశేషాంధ్ర ప్రజానీకానికి సుపరిచితులై ఈ ప్రసిద్ధి పొందిన వారు ముగ్గురు. వారిలో మొదటి వారు కళాప్రపూర? వేదం వేంకటరాయశాస్త్రి. రెండవవారు యావత్ ఆంధ్ర ప్రజానీకం గర్వించదగ్గ కవికోకిల కొవ్వూరి రామిరెడ్డి. తరువాతి కాలం నుంచి ఆంధ్రరాష్ట్రంలో దాదాపు ప్రజలందరికీ తెలియాల్సినవారు నెల్లూరుకి చెందిన ప్రముఖ రచయిత, విమర్శకుడు మరుపూరు కోదండరామిరెడ్డి. ఈయన సృజనాత్మక రచనలు, విమర్శనాత్మక రచనలు, భాషకు సంబంధించిన రచనలు, అనువాద కథలు, అనుకరణ రచనలు వంటివెన్నో చేశారు. ఈయన రాసిన వేమన, తిక్కన భారతములో కర్ణ పర్వం, తిక్కన సారస్వత మూర్తి వంటి విమర్శనాత్మక రచనల్లోని విమర్శనా పూర్వక అంశాలను ఈ వ్యాసంలో తెలియజేయటం ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.

జననం - విద్యాభ్యాసం

మరుపూరు కోదండ రామరెడ్డి 1902 అక్టోబరు 3 వ తేదిన నెల్లూరు జిల్లా పొట్లపూడి గ్రామంలో మేనమామ అక్క ఇంట జన్మించారు. మదన గోపాల గోత్రం. తండ్రి కొండారెడ్డి వేదాంతి. జ్యోతిష్యం, వాస్తుశాస్త్రం ఆయనకు ప్రాప్తవిద్యలు. తల్లి కామమ్మ మినగల్లు గ్రామంలో పొణకా మల్లారెడ్డి కుమార్తె. అన్ని విధాల కొండారెడ్డికి తగిన ఇల్లాలు. వీరికి కోదండ రామిరెడ్డితో పాటు కనకమ్మ అనే కూతురు ఉంది. నెల్లూరు వెంకటగిరి రాజా (వి.ఆర్)హైస్కూలులో కోదండ రామరెడ్డి ఇంగ్లీషు చదువు సాగింది. 1910లో పొట్లపూడి జాతీయోద్యమం ప్రారంభం అయ్యేనాటికి ఆయన బాల్యదశలో ఉన్నా బాగా ఊహ తెలిసిన స్థితి. అక్కడకు వచ్చిన పెద్దల ఉపన్యాసాలు వినటం వల్ల మంచి జాతీయతాభావం అలవరచుకున్నాడు. తెలుగు సాహిత్యం విని విని అందులో మంచి అభిరుచి ఏర్పడింది. మహాభారతం, భాగవతం మీద మిక్కిలి గురి కుదిరింది. 1920లో గాంధీగారి సహాయనిరాకరణోద్యమం చేత ఆకర్షితులై ఎస్.ఎస్.ఎల్.సి క్లాసులో ఇంగ్లీషు చదువుకు స్వస్తి చెప్పి బందరు ఆంధ్ర జాతీయ కళాశాలలో చేరినా ఇంగ్లిషును మాత్రం వదలలేదు. ఈ కళాశాలలో కోదండరామరెడ్డికి బెజవాడ గోపాలరెడ్డి, మద్దె సుదర్శనం, మోటూరు సత్యనారాయణ, కౌతా రామమోహన శాస్త్రి సహాధ్యాయులు. నేలటూరి పార్థసారథి అయ్యంగారు (ఆమ్నాయ కళానిధి పేరిట ఆంధ్ర భారతానికి వ్యాఖ్యానం రాశారు), కంభంపాటి రామమూర్తి శాస్త్రి గారు తెలుగు ఉపాధ్యాయులుగా ఉండి తెలుగు పాఠకునికి కావలసిన సంస్కృత సమాసాది సంప్రదాయాన్ని బోధించారు.

కోదండ రామిరెడ్డి రచనలు -పరిచయం

అనువాద రచనలు :

మంజీర గాథ వేమన పాశ్చాత్య, వచన కంబరామాయణం, ప్రపంచ పరిణామము, హిందూపదపాదుషాహి, బీదల పాట్లు, అస్సామీ సాహిత్య చరిత్ర; షిర్డీసాయిభగవాన్ మొదలైన అనువాద రచనలు చేశాడు.

విమర్శనాత్మక రచనలు - వేమన, తిక్కన భారతము కర్ణపర్వము, తిక్కన సారస్వత మూర్తి, కళాపూర్ణోదయానికి పీఠిక, త్యాగరాజు భక్తిసుధార్ణవము, బహుముఖ ప్రజ్ఞనిధి (కట్టమంచి రామలింగారెడ్డిపై) అనే విమర్శా గ్రంథాల్ని కూడా రచించారు.

అనుకరణ కథలు - ఈసబు నీతి కథలు, శాపగ్రస్తమైన ఇల్లు, నల్లపిల్లి అనే కథలు

భాషా రచనలు :

మాండలిక పదకోశం, సామెతలు(సంపాదకీయం), ఆంధ్ర క్రియా స్వరూప మణి దీపికటసంపాదక వర్గం) అనే భాష సంబంధ రచనలును రచించారు. పైన పేర్కన్నవే కాక ఇంకా వాగర్తన జరిగిన సంఘటన(కథ), ఆంధ్ర వ్మాయం(వావిళ్ల సంస్థ), మాలపల్లి (ఉన్నవ రచనకు సంక్షేపణము), బండ్ల మాహాత్మ్యము, పత్రికా వ్యాసాలు మొదలైన అనేక గ్రంథాలు, కథలును రచించారు.ఈ వ్యాసంలో కోదండరామిరెడ్డి విమర్శనాత్మక రచనలుగా లభ్యమవుతున్న వేమన, తిక్కన భారతము కర్ణపర్వము, తిక్కన సారస్వత మూర్తి అనే గ్రంథాలలోని విమర్శనాత్మక అంశాలను తెలియచేస్తున్నాను.

వేమన :

ఈ పుస్తకాన్ని మరుపూరు కోదండరామిరెడ్డి విమర్శనాత్మకంగా రచించారు. తెలుగు విశ్వ విద్యాలయం1989లో నాగభైరవ కోటేశ్వరరావు సంపాదకత్వంలో ప్రచురించింది. ఈ గ్రంధానికి ఆచార్య సి. నారాయణ రెడ్డి భూమిక అనే పేరుతో ముందుమాట సాంఘిక దురాచారాలను తుత్తునియలు చేయడానికి పద్యాన్ని వజ్రాయుధంగా ప్రయోగించి, తెలుగు కవి

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

మరుపూరు కోదండరామిరెడ్డి విమర్శనాత్మక రచనలు

- దొలిశెట్టి ధృష్టిశ్రీ
పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్, గచ్చిబౌలి, హైదరాబాద్.

తెలుగు సాహిత్యంలో ప్రముఖ రచయితలలో మరుపూరు కోదండ రామిరెడ్డి ఒకరు. అయితే, ఒక్కొక్కసారి కొంత మందికి వచ్చినంత కీర్తి ప్రతిష్టలు మరికొంతమందికి లభించవు. అటువంటి వారిలో మరుపూరు కోదండరామిరెడ్డి ఒకరు. ఆధునిక యుగంలో నెల్లూరు జిల్లా రచయితలై అశేషాంధ్ర ప్రజానీకానికి సుపరిచితులైౖ ఈ ప్రసిద్ధి పొందిన వారు ముగ్గురు. వారిలో మొదటి వారు కళాప్రపూర? వేదం వేంకటరాయశాస్త్రి. రెండవవారు యావత్ ఆంధ్ర ప్రజానీకం గర్వించదగ్గ కవికోకిల కొవ్వూరి రామిరెడ్డి. తరువాతి కాలం నుంచి ఆంధ్రరాష్ట్రంలో దాదాపు ప్రజలందరికీ తెలియాల్సినవారు నెల్లూరుకి చెందిన ప్రముఖ రచయిత, విమర్శకుడు మరుపూరు కోదండరామిరెడ్డి. ఈయన సృజనాత్మక రచనలు, విమర్శనాత్మక రచనలు, భాషకు సంబంధించిన రచనలు, అనువాద కథలు, అనుకరణ రచనలు వంటివెన్నో చేశారు. ఈయన రాసిన వేమన, తిక్కన భారతములో కర్ణ పర్వం, తిక్కన సారస్వత మూర్తి వంటి విమర్శనాత్మక రచనల్లోని విమర్శనా పూర్వక అంశాలను ఈ వ్యాసంలో తెలియజేయటం ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.

జననం - విద్యాభ్యాసం

మరుపూరు కోదండ రామరెడ్డి 1902 అక్టోబరు 3 వ తేదిన నెల్లూరు జిల్లా పొట్లపూడి గ్రామంలో మేనమామ అక్క ఇంట జన్మించారు. మదన గోపాల గోత్రం. తండ్రి కొండారెడ్డి వేదాంతి. జ్యోతిష్యం, వాస్తుశాస్త్రం ఆయనకు ప్రాప్తవిద్యలు. తల్లి కామమ్మ మినగల్లు గ్రామంలో పాణకా మల్లారెడ్డి కుమార్తె. అన్ని విధాల కొండారెడ్డికి తగిన ఇల్లాలు. వీరికి కోదండ రామిరెడ్డితో పాటు కనకమ్మ అనే కూతురు ఉంది. నెల్లూరు వెంకటగిరి రాజా (వి.ఆర్)హైస్కూలులో కోదండ రామరెడ్డి ఇంగ్లీషు చదువు సాగింది. 1910లో పొట్లపూడి జాతీయోద్యమం ప్రారంభం అయ్యేనాటికి ఆయన బాల్యదశలో ఉన్నా బాగా ఊహ తెలిసిన స్థితి. అక్కడకు వచ్చిన పెద్దల ఉపన్యాసాలు వినటం వల్ల మంచి జాతీయతాభావం అలవరచుకున్నాడు. తెలుగు సాహిత్యం విని విని అందులో మంచి అభిరుచి ఏర్పడింది. మహాభారతం, భాగవతం మీద మిక్కిలి గురి కుదిరింది. 1920లో గాంధీగారి సహాయనిరాకరణోద్యమం చేత ఆకర్షితులై ఎస్.ఎస్.ఎల్.సి క్లాసులో ఇంగ్లీషు చదువుకు స్వస్తి చెప్పి బందరు ఆంధ్ర జాతీయ కళాశాలలో చేరినా ఇంగ్లీషును మాత్రం వదలలేదు. ఈ కళాశాలలో కోదండరామరెడ్డికి బెజవాడ గోపాలరెడ్డి, మద్దె సుదర్శనం, మోటూరు సత్యనారాయణ, కొత్తా రామమోహన శాస్త్రి సహాధ్యాయులు. నేలటూరి పార్థసారథి అయ్యంగారు (ఆమ్నాయ కళానిధి పేరిట ఆంధ్ర భారతానికి వ్యాఖ్యానం రాశారు), కంభంపాటి రామమూర్తి శాస్త్రి గారు తెలుగు ఉపాధ్యాయులుగా ఉండి తెలుగు పాఠకునికి కావలసిన సంస్కృత సమాసాది సంప్రదాయాన్ని బోధించారు.

కోదండ రామిరెడ్డి రచనలు -పరిచయం

అనువాద రచనలు :

మంజీర గాథ వేమన పాశ్చాత్య, వచన కంబరామాయణం, ప్రపంచ పరిణామము, హిందూపదపాదుషాహి, బీదల పాట్లు, అస్సామీ సాహిత్య చరిత్ర; షిర్డీసాయిభగవాన్ మొదలైన అనువాద రచనలు చేశాడు.

విమర్శనాత్మక రచనలు - వేమన, తిక్కన భారతము కర్ణపర్వము, తిక్కన సారస్వత మూర్తి, కళాపూర్ణోదయానికి పీఠిక, త్యాగరాజు భక్తిసుధార్ణవము, బహుముఖ ప్రజ్ఞనిధి (కట్టమంచి రామలింగారెడ్డిపై) అనే విమర్శా గ్రంథాల్ని కూడా రచించారు.

అనుకరణ కథలు - ఈసబు నీతి కథలు, శాపగ్రస్తమైన ఇల్లు, నల్లపిల్లి అనే కథలు

భాషా రచనలు :

మాండలిక పదకోశం, సామెతలు(సంపాదకీయం), ఆంధ్ర క్రియా స్వరూప మణి దీపికటసంపాదక వర్గం) అనే భాష సంబంధ రచనలును రచించారు. పైన పేర్కొన్నవే కాక ఇంకా వాగర్థన జరిగిన సంఘటన(కథ), ఆంధ్ర వ్యాయం(వావిళ్ల సంస్థ), మాలపల్లి (ఉన్నవ రచనకు సంక్షేపణము), బండ్ల మాహాత్మ్యము, పత్రికా వ్యాసాలు మొదలైన అనేక గ్రంథాలు, కథలును రచించారు.ఈ వ్యాసంలో కోదండరామిరెడ్డి విమర్శనాత్మక రచనలుగా లభ్యమవుతున్న వేమన, తిక్కన భారతము కర్ణపర్వము, తిక్కన సారస్వత మూర్తి అనే గ్రంథాలలోని విమర్శనాత్మక అంశాలను తెలియచేస్తున్నాను.

వేమన :

ఈ పుస్తకాన్ని మరుపూరు కోదండరామిరెడ్డి విమర్శనాత్మకంగా రచించారు. తెలుగు విశ్వ విద్యాలయం1989లో నాగభైరవ కోటేశ్వరరావు సంపాదకత్వంలో ప్రచురించింది. ఈ గ్రంథానికి ఆచార్య సి. నారాయణ రెడ్డి భూమిక అనే పేరుతో ముందుమాట సాంఘిక దురాచారాలను తుత్తునియలు చేయడానికి పద్యాన్ని వజ్రాయుధంగా ప్రయోగించి, తెలుగు కవి

తను జానపదుల నాల్కలపై నర్తింప చేసిన నిక్కమైన ప్రజాకవి వేమన అని పేర్కొన్నాడు. వేమనను మొదట వెలుగులోనికి తెచ్చింది పాశ్చాత్యులు. వీరిలో మొదటివాడు ఫాదర్ లెగాక్ 1731. అంటే బ్రౌన్ కంటే 100 సంవత్సరాల ముందే వేమన పద్యాలను సేకరించాడని తరువాత అబేదుబాయ్, హెనరీ బ్యాంఛాంప్ 1897, విలియం హెూవర్డ్ క్యాంబెల్ 1910, మొదలైనవారు చేసిన కృషిని మరుపూరు వారు వివరించారు.

అలాగే, సి. పి. బ్రౌన్ చేసిన కృషిని చెప్పారు. వేమన వంశం, ఊరు, కులం గురించి ఉన్న వాదాలను ఇలా చర్చించారు. కొండవీటి రెడ్డి రాజులుకు గాని, గండికోట దుర్గాధిపతులకుగాని - లోకకవి, యోగ అయిన వేమనకు ఎట్టి సంబంధం లేదు. కడప మండలంలో (రేనాడు సీమ) ఒకానొక పల్లెటూరులో, సామాన్యమైన రైతులైన కాపు కుటుంబంలో వేమన పుట్టాడు. నెల్లూరు - రాయలసీమలో కాపులనే రెడ్లు అంటారు. రెడ్డి అనేది ఈ కాపు కులానికి బిరుదము. రట్టడు - రడ్డి - రెడ్డి అని ఈ రూప పరిణామం. రెడ్డి పదానికి డు అని అర్థం. కాబట్టి వేమన రెడ్డి కులం వాడని, అలాగే వేమన కడప జిల్లాలోని మూగ చింతలపల్లి గ్రామం వాడని నిర్ధారించారు. ఈ వివాదాలున్నట్లే వేమన అనే పేరు గల వ్యక్తులు చాలా మంది ఉండటం వల్ల మరొక వాదన మొదలైంది. వేమన పేరుతొ ఉన్న వ్యక్తులు బెల్దేవి వేమన, అచల వేమన, కటారుపల్లి వేమన వీళ్ళలో అసలు వేమన వేరు అని వీళ్ళంతా వేరని పేర్కొన్నారు.

అంతేగాక మకుటం విషయంలో కూడా చాలా వివాదాలున్నాయి. విశ్వదాభిరామ వినురవేమ అనే మకుటానికి అర్థం చెప్పడంలో వ్రైకి వేయి తలలు అన్నట్లు విమర్శలున్నాయి అవి.

1. అభిరామయ్య అనే ఒక స్వర్ణకారుని వేమన మోసం చేశాడని, యోగి అయిన తరువాత, ఆ పాప పరిహారం కోసం అభిరామయ్యని స్మరించాడు అని
2. విశ్వద - సర్వము ఇచ్చుట వల్ల అభిరాముడు ఓప్పినవాడు, ఇంపైనవడు అని
3. విశ్వత - సర్వమూ తానై యుండుట వల్ల ఒప్పిన వాడు.
4. ద- ఖండించువాడు, ప్రపంచాన్నంతా లయింపచేయు వాడు.
5. మరొకరు విశ్వద - వేమనకు ప్రియమైన ఒక వేశ్య పేరని ఆమెపై మక్కువతో ఇట్లా పేర్కొన్నాడని అభిప్రాయపడ్డారు.
6. ఇంకొకరు విశ్వత - సార్వ లౌకికతకు ప్రియమైన వాడు.
7. బ్రౌను - dear to loard of aశ్రీశ్రీ అని అనువదించి, విశ్వత తట్టుకే ఓటు వేశాడు. ఇలా వివిధ రకాల విమర్శలన్నింటినీ ఒక చోట చేర్చి ఈ గ్రంథాన్ని ఒక వెలుగుగా తీసుకొచ్చి వేమనపై ఉన్న విమర్శలన్నింటికి దారి చూపాడు.

తిక్కన తిక్కన భారతము కర్ణ పర్వము - ఇది కర్ణ పర్వముపై వచ్చిన విమర్శనా పీఠిక. ఇందులో భారత గ్రంథము, భరత వంశము, భారత గ్రంథ కాలము, కరు?ని జననం - జీవితంలో ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నాడు వాటిపై ఉన్న వివిధ రకాల విమర్శలను ఈ గ్రంథంలో చర్చించారు.

1. భారతాన్ని ఆంధ్రీకరించడంలో నన్నయ సౌతి మహా భారతాన్ని, తిక్కన వైశంపాయన భారతాన్ని అనువదించారని మరుపూరు కోదండ రామిరెడ్డి చెప్పారు.అయితే వ్యాస భారతమే నన్నయ, తిక్కనలకు వ్యాస భారతమే మూలం అని కదాప్రసిద్ధి.
2. భారతం కథను చెప్పిన కాలము కూడ సందేహాస్పదము. అది భారత యుద్ధము ముగిసిన తరువాత అర్జునుని మనవడు పరిక్షిత్తు 60 సంవత్సరాలు బ్రతికాడు. ఆయన కొడుకు జనమేజయుడు తన 50 వ ఏట సర్ప యాగము చేసి వైశంపాయనుని వలన భారతము వినెను. అంటే యుద్ధానంతరము 110 -120 సంవత్సరాలకు భారత కథ రూపొందిందని పేర్కొన్నాడు.
3. అలాగే 18 సంఖ్య వెనుక ఉన్న వివరణను ఇలా చెప్పాడు. భారతమును ఒక తియ్యటి చెరకుగడగా పోల్చి, పద్దెనిమిది కణుపులు - పర్వములుగా వేరు చేశారు. వైదిక పరంగా 12 నెలలను 18 గా విభాగించారు. దీనికి ముందు అనగా ద్వాదశాదిత్యులకు ముందు 8 -10 ఆదిత్యులు ఉన్నారు. అంత వరకూ ఉన్న బలి వితర్ధులు 11 కి బదులు 18 అయ్యాయి. ఈ తిన్నెలు 10 మూరలు పొడవు, 8 మూరలు వెడల్పుగా చేయపడ్డాయి. దీనిని అనుసరించే భారతము 18 పర్వాలుగా వేరు చేశారని చెప్పాడు.
4. దాని తర్వాత 18 సంఖ్యను వివిధ రకాలుగా చెప్పుకున్నారు. భారత యుద్ధం 18 రోజులు, సైన్యం 18 అక్షౌహిణులు, సేనాపతులు 18 మంది, జయ అను మాటకు సంఖ్య 18 అని వివిధ రకాల అభిప్రాయాలు వెలిబుచ్చారు.
5. అంతే కాకుండా విదురుడు, ధృతరాష్టుడు, గాంధారి, కుంతి యుద్ధానంతరం 18 సంవత్సరాలు బ్రతికినారని, ఆ తరువాత పురాణములు 18, ఉప పురాణములు 18, భగవద్గీత 18 అధ్యాయాలు (పుట 9) గానే నిర్మించారని పేర్కొన్నారు.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భాసుడు భారత కథల ఆధారంగా రాసిన నాటకాలకు, భారతానికి ఉన్న వ్యత్యాసాలను ఇలా వివరించాడు. భాసుడు కౌరవులను గాని, కర్ణుని కించపరచకుండుటే గాక వారిని ఘన పరచి, ఇప్పటి భారతము పాండవులకు ప్రాధాన్యమిచ్చినట్లే కౌరవులను ఉచిత స్థానమున ప్రతిష్టించినాడు. ఒక నాటక మును కర? భారము అని. ఆయనను, ఆయన దాన గుణ మును మహిమ పరచినాడు. కవచ కుండలములను ఇచ్చి వేయుటను, వెనుక ఎప్పుడో అరణ్య పర్వములో బెట్టక, యుద్ధమునకు బయలుదేరినప్పుడే ఇమిడ్చినాడు. ఇంకొక నాటకము ఊరు ఇంకొక నాటకము ఊరుభంగము. ఈ పేరులోనే దుర్యోధనుని పట్ల సానుభూతి, భీముడు చేసిన పని సముచిత రణనీతికి భంగమని తోపింపచేశాడు19 అని పేర్కొన్నాడు. భాసుడు అభిమన్యుని గోగ్రహణ యుద్ధము నందే ప్రవేశపెట్టినాడు. ఆ తరువాత అభిమన్యుని పిల్లవాడిగా మార్చిన తరువాత, ఈ అంశాన్ని భారతం నుంచి తీసేసి ఉం డవచ్చు అని అభిప్రాయపడ్డారు.

భారత వీరుల వయస్సుల మీద కూడా భిన్నాభిప్రా యాలు ఉండగా వాటిని ఇలా వివరించే ప్రయత్నం చేశారు. నకుల సహదేవులు యువకులుగా, అభిమన్యుడు యవన స్థుడుగా ద్రౌపదేయులు పిన్న పాపలుగా వర్ణించి కరుణ రస మును గార్చుట మన పౌరాణికుల పాత పాచిమాట. కాని తెలుగు భారతం ప్రకారం 70 వ ఏట భీముడు కురుక్షేత్ర యుద్ధమునకు దిగినట్లన్నది.(ఈ విషయాన్ని మరుపూరు కోదండ రామిరెడ్డి తన సొంత ప్రభాత ప్రెస్సును నడిపేట ప్పుడు, మిత్రుడు వేమూరు సుందర రామ శర్మ రాసిన ధనం జయ విజయము అనే నాటకానికి పీఠికలో చర్చించారు.)

1. శతశృంగము నుండి పాండు రాజు మరణానంతరం పాండవులు హస్తినపురము, చేరునాటికి షోడశ పంచదశ చతుర్దశ త్రయోదశ వర్ష సంజాతులు - (ఆది. 6: 142). అంటే ధర్మజునికి 16, భీమునికి 15, అర్జునునికి 14. నకుల సహదేవులకు 13 సంవత్సరాలు.
2. హస్తిపురమున అస్త్ర విద్యలు నేర్చుకొనుచు వీరు 13 సంవత్సరములు ఉందురు. - ఆది. (6: 142). కవలల వయస్సు 13ం13ొ26.
3. వారణావతరణమున ఒక్క ఏడాది ఉండును %-%(ఆది. 3: 15). కవలల వయస్సు 26ంొ27. భీమునికి 29 ఏండ్లు.
4. పాండవులు తిరిగి హస్తిపురము వచ్చి 5 సంవత్స రములు కౌరవుల ప్రాపున ఉందురు.(ఆది. 8: 64.) యమజుల ప్రాయము 27ంొ32.ఇప్పటికే అభి మన్యుడు పుట్టి అన్ని విద్యలు నేర్చియున్నాడు. ఇప్పటి ఆయన వయస్సు 12 ఏండ్లు అయినా ఉండదా? మాద్రేయులకు ఈయనకు 20 ఏండ్లు అంతరము.
5. ఇంద్ర ప్రస్థమున పాండవులు 23 ఏండ్లు రాజ్యపాలన మును నెరపి, ద్యూతమయిన పరాజితులగుదురు- (సభా 2: 31)1. అమడలకు 32ం23ొ55, అభిమన్యు నికి 35, ఉప పాండవులు బా పుట్టి ఎదిగి ఉన్నారు. పెద్దవాని మధ్య అభిమన్యుని మధ్య 15 ఏండ్లు ఉన్నను 20 సంవత్లరముల కోడె ప్రాయపు వాడై యుండ వలెను.
6. అరణ్య అజ్ఞాత వాసములు 13 ఏండ్లు. 55ం13ొ68 సంవత్సరములు మాద్రేయులకు, అర్జునుడు 69, భీముడు 70, యుధిష్ఠిరుడు 71సంవత్సరములవారు. అభిమన్యునికి 48,ఉపపాండవులలోమొదటి వానికి 33. వీరు మహారథులు.(పుట 21)

భీముడు పుట్టిన నాటికి నూరు మంది కౌరవులు పుట్టి ఉన్నారు. భీముడు దుర్యోధనుడు సమ వయస్కులు. క అర్జున దర్యోధనులకు తిక్కన నెరసిన వెంట్రుకలనే వర్ణించాడు కాబట్టి కర్ణుడు ధర్మజునికంటే అధమము పదేండ్లు పెద్ద అయిన ఉండవలెనని పేర్కొన్నాడు.

తిక్కన సారస్వత మూర్తి :

ఇందులో తిక్కన సాహిత్య సామ్రాజ్య వైజయం సూచనా ప్రాయంగా చెప్పి తిక్కన కవితాశిల్పానికి ప్రాణా అనదగిన 5 విషయాలను మరుపూరు కోదండరామిరెడ్డి ఇ చెప్పాడు. 1. కళా పూర్ణోదయమైన కథన చాతురిలో వీర్యవ మైన రీతి, 2.పాత్ర చిత్రీకరణలో సర్వశాస్త్ర పరిజ్ఞాన మానసిక తత్త్వ నిరూపణము, 3. మంత్రిగా కవిగా కృషికు నేర్చిన లోకానుభవం ఒన గూర్చిన సంఘటనల వర్ణనల జీవకళ, 4. శ్రీనాథ కవి సార్వభౌముడు అన్నట్లు రసాభ్యు బంధ రచనలో నవరస పోషకములైన సహజ సంభా ములు, వాటి బిగువు 5. వీటన్నింటిని కలిపి ఒకటిగా పాత్రలను పాఠకుల శ్రోతల కట్టెదుట ప్రాణాలతో నిల ఆడింపచేయగలిగిన నాటకీయత అని వివరించాడు.

కవి వ్యక్తిత్వమే కవిత స్వరూపం అని కదా మాట. పాత్ర చిత్రీకరణ తిక్కన ప్రత్యేక లక్షణం. నాటకీయత ప్రాణం. అని దానికి ఉదాహరణగా ద్రౌప వులలో నడచి నడచి అలసి విరాటనగరం చేరుతున్ యంలో తిక్కన రాసిన దప్పిజనించే, వ్రేళుల పుటం పొక్కదొడంగె.......(పుట 3) అనే ఈ పద్యాన్ని వివరించ

తిక్కన తెలుగు నుడికారాన్ని ఇలా వరి?ంచాడు వళి మోదం తెనుగులో చెపితేనే కదా కలుగుతుం పట్టులు ఎరిగిన లోకజ్ఞానం ఈయనిది. ఆ ప్రతిభ చ

సంస్కానుభవం వల్ల సానలుదీరింది. అప్పుడు గ్రామాలలో వాడుకలో ఉన్న మాటలను తీసుకుని కొత్త వాటిని సంస్కృతానికి సమానంగా సృష్టించాడు. అందువల్లనే ఎక్కువ పదాలు ఇప్పటికీ నెల్లూరు పల్లెలో పెద్దవరుస వారి నాలుకలపై నానుతున్నవి. మాండలిక పదప్రయోగమే ఆనాటి కవుల లక్ష్యం (పుట 12).

కోదండరామిరెడ్డి తిక్కనని చిన్న విషయాలు కూడ వదలని సహజాతగా గుర్తించి ఇలా పేర్కొన్నాడు. పైకి చిన్నవిగా కనిపించేవి, తిక్కన కథక చాతురికి రసవత్తర గుళికలు - వాటిని వదలడు మచ్చుకు కొన్ని...

- జన సమ్మర్ద మందీక ృత గమనుడై ..... క ృష్ణుడు దృతరాష్ట్ర మందిరం ప్రవేశించేటప్పుడు.
- నిలిపి గుర్రాల మెడకు అప్పళించి........... అని రౌతు చేష్టను చెప్పెను. చదివిన వాళ్ళకు పులకలెత్తించే వర్ణన ఇది.
- ద్రౌపది ఓదార్చటాన్ని , కొప్పుముడి సరిచేయటాన్ని, కృషు?డు దాసీ జనాన్ని నియోగించే విధానాలలో

ఎంతటి రాచరికపు బెట్టు ఇట్లా ప్రతి విషయం స్వల్పాలను వదలక చెప్పిన తీరుకు రాణింపు చేస్తాడని చెప్పాడు.

మరుపూరి కోదండరామిరెడ్డిని తెలుగు సాహితీ ప్ర విస్మరించారనిపిస్తుంది. నిజానికి ఈయన పత్రికలలో వ్యాసాలు, ఆకాశవాణి ప్రసంగాలు చాలా మంది సాహితీ ప్రభావితం చేస్తున్నాయి. అయితే అటువంటి రచన బయటపెట్టాల్సిన అవసరం ఉందనుకుంటున్నాను. వంటి మరుపూరి కోదండరామిరెడ్డి రచనలను సాహితీవే పరిశీలించవలసిన అవసరం ఉంది. 1879 లోఆంధ్రా వర్సిటీ వారు సాహిత్యంలో ఈయన చేసిన క ృషిని గు కళాప్రపూర? అనే బిరుదు ఇచ్చారు. ఈయన ఆంధ్ర సాహిత్య అకాడమీకి 12 సంవత్సరాలు సభ్యుడుగానూ, అకాడమీ రాష్ట్ర సభ్యుడిగానూ పనిచేశాడు. స ృజన రచయితగా, భాషావేత్తగా, విమర్శకుడిగా, అనువాదకు తెలుగు సాహిత్యానికి కోదండరామిరెడ్డి కృషి చేసాడు. ఈయన రచనలను వెలికితీసే బాధ్యత ప్రతి తెలుగు తీవేత్తకూ ఉందనుకుంటున్నాను.

❀❀❀

షట్కర్మయుక్త - చంద్రమతి

- సత్యగాయత్రి జనమంచి
పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

హరిశ్చంద్రో పాఖ్యానము కృతికర్త గౌరన. గౌరన క్రీ.శ. 1380-1450 కాలంవాడు. ఇతనికి చతురర సాహిత్య లక్షణ చక్రవర్తి, ప్రతివాది-మదగజ పంచాననుడు అనే బిరుదులు ఉన్నాయి. గౌరన హరిశ్చంద్రోపాఖ్యానంతో పాటుగ నవనాథ చరిత్ర, లక్షణదీపిక అనే గ్రంథాల్ని కూడ రాశాడు. హరిశ్చంద్ర కథను కావ్యవస్తువుగా గ్రహించిన తెలుగు కవులలో మొట్ట మొదటివాడు గౌరన. గౌరన హరిశ్చంద్రుని కథను స్కాంద పురాణం నుండి గ్రహించాడు.

తెలుగు సాహిత్యంలో గౌరన హరిశ్చంద్రోపాఖ్యానానికి విశిష్టమైన ప్రాముఖ్యత ఉంది. ఈ కావ్యంలో హరిశ్చంద్రుని పాత్రని కవి ఎంతో గొప్పగా వర్ణించాడు. హరిశ్చంద్రుడు తను నమ్మిన ధర్మాన్ని, ఇచ్చిన మాటని నిలుపుకోవడానికి పడిన కష్టాలు, చేసిన త్యాగాలు వర్ణనాతీతం. హరిశ్చంద్రుడు ఎన్ని కష్టాలు పడిన ధర్మాన్ని ఎప్పుడూ వీడలేదు.

హరిశ్చంద్రుడు ధర్మాన్ని పాటించడంలో ఎల్లప్పుడూ అతని భార్య చంద్రమతి తోడుగా నిలిచింది. చంద్రమతి సుగుణాల్ని గౌరన తన కావ్యంలో ఎంతో గొప్పగా పొందు పరిచాడు. చంద్రమతికి గల ముందుచూపు, ధైర్యం, ఓర్పు, క్షమా గుణాలు తన భర్తను ధర్మవరునిగా నిలబెట్టాయి.

విశ్వామిత్రుడి ఆశ్రమ సమీపంలో విశ్రమిస్తున్న హరి శ్చంద్రుడు రాజ్యం కోల్పోయినట్టు కల కంటాడు. హరి శ్చంద్రుడు తనకు వచ్చిన దుస్వప్నానికి కలత చెందుతున్న సమయంలో చంద్రమతి హరిశ్చంద్రుడికి అతడి పరాక్రమాన్ని గుర్తు చేసి ఒక స్నేహితురాలిలా ధైర్యాన్ని చెప్పి హరిశ్చంద్రుని కర్తవ్య నిర్వహణకు పూనుకొనేలా చేస్తుంది.

విశ్వామిత్రుడు తనకు రావలసిన ధనాన్ని రాబట్టు కోవడానికి తన శిష్యులతో అతి క్రూరుడైన నక్షత్రకుడిని హరిశ్చంద్రుడి వెంట పంపిస్తాడు. చంద్రమతి, హరిశ్చంద్రులను నక్షత్రకుడు అడవిలో అనేక కష్టాలు పెడతాడు. నక్షత్రకుడు హరిశ్చంద్రుని వెంట అరణ్యంలో నడవలేక సొమ్మసిల్లిపోతాడు. చంద్రమతి నక్షత్రకుడి అవస్థ చూసి నీరు తెచ్చి తాగించి నక్షత్రకుడికి ఉపశాంతి కలిగించమని హరిశ్చంద్రుడితో చెబు తుంది. నక్షత్రకుడు వంటి శత్రువుకి సహాయం చేయమని చెప్పి ధర్మాన్ని నిలబెట్టడంలో చంద్రమతి హరిశ్చంద్రునికి తోడ్పాటుని అందిస్తుంది.

అరణ్యంలో ఘోరమైన కష్టాలు అనుభవిస్తున్న చంద్ర మతి హరిశ్చంద్రుల దగ్గరికి విశ్వామిత్రుడు మాయా వశిష్టుని రూపంలో వచ్చి నేనొక మంత్రాన్ని ఉపదేశిస్తాను. అది లక్షసార్లు జపిస్తే విశ్వామిత్రుడి ఋణం తీరిపోతుందని చెబుతాడు. అప్పుడు చంద్రమతి హరిశ్చంద్రునితో పలికిన పలుకులివి.

"కపటనాటకు డైనకౌశికు డాత్మ
గృపమాలి మనల నంకిలి వుట్ట నిట్లు
చెలుగి పుత్తేర వసిష్ఠుని రూపు
నెలమి గైకొని యితం డెవ్వుడో యొక్క
మాయకాు డేతెంచి మనలను గల్ల
సేయుచున్నా డెడ సేయక వీని
తెగటార్చు........................"

(పుట 120-121 హరిశ్చంద్రోపాఖ్యానము 1849-1855)

వసిష్ఠుడి రూపంలో వచ్చిన మాయగాడిని సంహరించ మని దుష్టశిక్షణ చేసి ధర్మాన్ని కాపాడమని సూచిస్తుంది.

విశ్వామిత్రుడు, చంద్రమతి హరిశ్చంద్రులకు మరిన్ని కష్టాలు కలుగజేయడానికి వారు ఉంటున్న అరణ్యంలో దావా లనం సృష్టిస్తాడు. హరిశ్చంద్రుడు ముందుగా ప్రాణత్యాగాన్ని చేయడానికి సిద్ధపడగా చంద్రమతి అతనిని వారిస్తుంది. హరిశ్చంద్రుడు మరణిస్తే విశ్వామిత్రుడి ఋణం తీరకుండానే మిగిలిపోతుందని, చంద్రమతే ముందుగా వెళ్ళి అగ్నికి ఆహుతి అవ్వడానికి నిర్ణయించుకుంటుంది.

"నిగుడు కీలలు మాని నివుఋ పై గప్పి
పొగులుట లుడిగి నిప్పుకలు సల్లారె
నా విధంబునను దావాగ్ని సల్లారి
పోవుటయును మహాద్భుతముగా మెఱసి
తలపువ్వు వాడక తరుణీలలామ"

(పుట. 145, హరిశ్చంద్రోపాఖ్యానము 2283-2287)

చంద్రమతి పాతివ్రత్య మహిమ చేత అగ్ని చల్లారి పోతుంది. దేవతలు పుష్పవాన కురిపిస్తారు. చంద్రమతి తన పతిభక్తి వలన తన భర్తని, నక్షత్రకుడిని రక్షించింది.

నక్షత్రకుడు లోహితుడిని రాజుగా చేస్తానని హరిశ్చం ద్రుని వదలి తనతో రమ్మన్నప్పుడు చంద్రమతి తన పతి ఎక్కడ ఉంటే తానూ అక్కడే ఉంటానంటుంది. విశ్వామిత్రుడికి ధనం చెల్లించవలసిన గడువు సమీపిస్తున్నందువల్ల నక్షత్రకుడు ధనం కోసం హరిశ్చంద్రుడిని వేధిస్తాడు. భర్తని ఋణ విముక్తుడిని

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

చెయ్యడానికి చంద్రమతి పిసినారి అయిన కాలకౌశికుడికి అమ్ముడుపోతుంది. కాలకౌశికుడి భార్య కలహకంఠి చంద్రమతిని అనేక కష్టాలు పడుతుంది.

విశ్వామిత్రుడు చంద్రమతి, హరిశ్చంద్రులను విడదీయుటమే కాకుండ వారి కుమారుడైన లోహితుడిని వధించమని తక్షకుడనే సర్పాన్ని పంపిస్తాడు. కాలకౌశికుడు లోహితుని దర్భలు తెమ్మని అడవికి పంపిస్తాడు. కుమారుడు అడవికి వెళ్ళేటప్పుడు చంద్రమతి రక్ష కడుతుంది. అడవికి వెళ్ళిన లోహితుడు పాము కాటు వలన మరణిస్తాడు. చంద్రమతి కట్టిన రక్షవల్ల తక్షకుడు వంటి విషసర్పం కాటేసినా లోహితుడు భస్మీపటలం కాలేదని మునిపుత్రులు అనుకుంటారు.

కలహకంఠి మరణించిన పుత్రుడిని చూడడానికి చంద్రమతిని వెంటనే వెళ్ళనివ్వదు. పనిపూర్తి చేసి చీకటి పడ్డాక కుమారుడిని చూడటానికి వెళ్ళమంటుంది. చంద్రమతి కారు చీకటిల్లో అడవిలో విగతజీవుడై కుమారుడిని చూసి కన్నీరు మున్నీరై విలపిస్తుంది. కుమారుడిని దహన సంస్కారాల కోసం శ్మశానికి తీసుకువెళ్తుంది. అక్కడ కాటికాపరిగా ఉన్న భర్తను చూసి విస్మయానికి గురౌతుంది. లోహితుడిని దహనం చేయాలంటే ధనం కావాలని కాటికాపరిగా ఉన్న హరిశ్చంద్రుడు చెబుతాడు. ధనం తేవడానికి వెళ్ళిన చంద్రమతి మీద హత్యా నేరం మోపుతాడు విశ్వామిత్రుడు. చంద్రమతిని వధించమని కాశీరాజు ఆజ్ఞను జారీ చేస్తాడు. శిక్షను అమలు జరపవలసిందిగా హరిశ్చంద్రుడిని ఆజ్ఞాపిస్తాడు.

చంద్రమతి తన భర్త చేతిలో మరణించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తుంది. చంద్రమతి శిరస్సు ఖండించడానికి ఎత్తిన ఖడ్గం పువ్వుల హారంలా మారిపోతుంది. చంద్రమతి, హరిశ్చంద్రులు ధర్మనిష్ఠకు పార్వతీపరమేశ్వరులు ప్రత్యక్షమౌతారు. పార్వతీదేవీ చంద్రమతితో -

"రా చంద్రమతి పతివ్రత వౌదువీవు
నీ చరిత్రంబు వర్ణింప నచ్చెరువు
సుదతి నీ మంగళ సూత్రంబు గాదె
పదివేల బాములు బాపె నీ పతికి"

(పుట. 310, హరిశ్చంద్రోపాఖ్యానము, 2714-2717)

నీ పాతివ్రత్యం మహిమ వల్లనే హరిశ్చంద్రుడి అనేక పాపాలు హరింపబడ్డాయని చెబుతుంది.

ఈ విధంగా చంద్రమతి తన భర్తకు దూరం అయినా, కుమారుడు మరణించినా, మహారాణి అయిన తను ఎన్నో అవమానాలు భరించినా భర్తను పల్లెత్తుమాట అనదు. భర్త క్షేమమే తన క్షేమంగా భావించి భర్త కోసం భర్త చేతిలో మరణించడానికి కూడ సిద్ధపడుతుంది.

హరిశ్చంద్రుడు విశ్వామిత్రుడికి యిచ్చిన మాటను నిలబెట్టుకొని సత్య హరిశ్చంద్రుడిగా పేరు తెచ్చుకోవడానికి కారణం చంద్రమతి. చంద్రమతి తన భర్త కోసం సీతలా అగ్ని ప్రవేశం చేసింది. అనసూయలా పార్వతీ పరమేశ్వరులను మెప్పించింది.

"అహల్య, ద్రౌపది, కుంతి, తార, మండోదరి తథా
పంచకన్య స్మరేన్ నిత్యం మహాపాతక నాశనమ్"

అహల్య, ద్రౌపది వంటి పతివ్రతల పక్కన కూర్చోగల అర్హత గలది చంద్రమతి -

"కార్యేషు దాసీ కరణేషు మంత్రీ, రూపేచ లక్ష్మీ క్షమయా ధరిత్రీ
స్నేహేచ మాతా శయనేషు వేశ్యా, షట్కర్మయుక్తా కులధర్మపత్నీ"

(పుట. 163, సూక్తి ముక్తావళి)

హరిశ్చంద్రుడికి మంత్రిగా సలహా యిచ్చి తల్లిలా రక్షించి కష్టాలలో ఓర్పు వహించి హరిశ్చంద్రుడు తన ధర్మాన్ని నెరవేర్చడానికి చంద్రమతి పూనికగా నిలబడి కులధర్మపత్ని అయ్యింది.

ఆధార గ్రంథాలు :

1. పెరుమాళ్ళయ్య, తేవ లఘుటీకా హరిశ్చంద్రో పాఖ్యానము, 1911, ఆనందముద్రా యంత్రాలయము, ప్రథమ, ద్వితీయ భాగములు.
2. ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్యం, 2002, తెలుగు అకాడమి, హైదరాబాదు.
3. నాగయ్య జి. తెలుగు సాహిత్య సమీక్ష, 2004, నవోదయ బుక్‌హౌస్, హైదరాబాదు.
4. జగన్మోహనరావు, మహీధర, సూక్తిముక్తావళి, 2006, ప్రాచి పబ్లికేషన్సు, హైదరాబాదు.

❀❀❀

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

అయిదు సెంట్ల భూమికోసం తమ్ముడు సదాశివం, స్నేహితుడు చలమయ్యలు తగాదా పడుతుంటే "మీకు పౌరుషం ఉంటే, ధైర్య సాహసాలుంటే, శక్తి సామర్థ్యాలుంటే కన్నతల్లి జన్మభూమి శృంఖలాలు తెంచండి. నరహంతకుల్ని తరిమికొట్టండి భరత భూమిని కాపాడండి" అని బ్రహ్మయ్య పెద్ద కుమారుడు కృష్ణమూర్తి హితోపదేశం చేస్తాడు. పది సంవత్సరాల వయసులో రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయంలో మిలటరీ డ్రస్సుని చూసి ఇష్టపడి మిలటరీలో చేరే గొప్ప ఆదర్శ యువకుడిగా కృష్ణమూర్తిని ఇనాక్ గారు ఈనాటి యువకుల్ని దేశసేవ పట్ల గౌరవాన్ని, బాధ్యతని తెలియజేశారు. ఇంకా చైనా వాళ్ళు ఎప్పుడు భారత్‌వైపు చొచ్చుకువస్తారో తెలియని 'నీఫా' బోర్డరులో మనసైన్యం రాత్రిపగలు కంటిమీద కునుకు లేకుండా నిద్రాహారాలు మాని చలిలో, కొండల్లో సరిహద్దులు రక్షించాలి అని మాతృదేశ సేవలో కష్టపడే పాత్రలు దాదాపుగా 'జైహింద్' నాటకంలో కనిపిస్తాయి. ఇనాక్ గారు ఈ నాటకంలో తన గొప్ప దేశభక్తిని చాటుకున్నారు. భారత్, చైనా యుద్ధాన్ని "దుర్మార్గ చైనా కౌరవులకు, సన్మార్గ భారతీయ పాండవులకు" జరిగిన కురుక్షేత్ర యుద్ధాన్ని వ్యాసునిలా మనముందు సాక్షాత్కరింపచేసారు. 'జైహింద్' నాటకం 1965లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పురస్కారాన్ని కూడా పొందింది.

'మునివాహనుడు' (1983) పౌరాణిక నాటకం. దళితుడైన తిరుప్పాణాళ్వార్ అనే వైష్ణవ భక్తుడిని లోకసారంగముని అనే పూజారి శ్రీరంగనాథస్వామి ఆలయంలోకి భుజాలపై ఎత్తుకొని గర్భగుడిలోనికి తీసుకెళ్ళటం ఇతి వృత్తం. లోకసారంగముని వాహనంగా కలిగినవాడు కనుక తిరుప్పాణ్ మునివాహనుడు అయ్యాడు. ఈ నాటకం ఏ.పి.సాహిత్య అకాడమి (తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్-1988) అవార్డు పొందిన రచన.

"వృశ్చికే రోహిణీ జాతం శ్రీ పాణం నిచుళాపురే
శ్రీవత్సాం కం గాయ కేంద్రం మునివాహన మాశ్రయే"
- (గురు పరంపర)

శ్రీ రంగమునకు సమీపమున నిచుళాపురమను నామాంతరము గల ఉరయూరను దివ్యక్షేత్రమున శ్రీహరి ఆజ్ఞచే శ్రీవత్సాంశమున శ్రీప్రాణయోగి క్రీ.శ. 841 సంవత్సరమున వృశ్చికమాసమున రోహిణీ నక్షత్రమున అవతరించెను. వీరినే తిరుప్పాణాళ్వారు అంటారు. వీరు అయోనిజులు వరియెన్నునందు జన్మించిన వీరిని వరికోతలు కోసే వారైన పంచమ దంపతులు భగవత్ప్రసాదంగా భావించి పెంచుకున్నారు. వీరి పెంపుడు తండ్రి భజనలు చేయు పంచముడైన దాసరి. అతనిచే పెంచబడిన ఆళ్వారు, వీణనెత్తుకొని శ్రీరంగనాథుని సన్నిధిలో పాడవలయునని తలచి, అంతిమ కులజుడైన తాను ఆ భాగమునకు నోచుకోనందుకు వగచి, స్వామి సన్నిధికెదురుగా, కావేరి నది దక్షిణ తీరమున నిలిచి స్వామినుద్దేశించి పాడుచుండెను.

ఉభయకావేరీ మధ్యస్థమయిన శ్రీరంగము పరమపావనం, సప్తప్రాకార వేష్టితమగు శ్రీరంగదేవాలయమున విరాజిల్లియున శ్రీ రంగనాథుని తన జ్ఞాన దృష్టితో వీక్షించి, శేష తల్పశాయియగు శ్రీ రంగనాథుని తన్మయ చిత్తముతో ధ్యానించుచు శ్రీ పాణియాళ్వారు ఆనందించుచుండెను. అతడు నారదునివలె సుస్వరముతో, తాళబద్ధమున లయశుద్ధముగ అనేక రాగములతో పాటలు పాడుచుండగా శ్రీ రంగనాథుడు పరవశించి రంగనాయకితో కలిసి ఆనందమున వినుచుండెను.

ఆ సమయంలోనే లోకసారంగుడను భక్తుడు శ్రీ రంగనాథుని సేవించుచుండేవాడు. ఆయన ప్రతిరోజు కావేరి నుండి సువర్ణ కలశముతో పుణ్యజలము తెచ్చి శ్రీ రంగనాథుని అర్ఘ్య, పాద్యాదులతో అర్పించేవాడు. ఒకనాడాయన కావేరి నదికి నీరు తెచ్చుటకు వెళ్ళగా, తిరుప్పాణాళ్వారు తమ గానామృతముచే రంగనాథుని కీర్తిస్తూ... భక్తి పరవశముచే కనిపించారు. అప్పుడు ముని "అంత్యజా దూరముగ పొమ్ము... నీకిచ్చట పనియేమి" అనిరి. ధ్యాన మగ్నుడగుటచే తిరుప్పాణులకు ఆ మాటలు వినిపించలేదు. దాంతో కోపించిన లోకసారంగముని ఆయనపై ఒకరాయి విసిరెను. అయినను ప్రాణయోగి చలింపలేదు. మునితో వచ్చిన ఇతర బ్రాహ్మణులు మరింత కోపించి రాళ్ళతో ఆళ్వారును కొట్టారు. ముఖము, కాళ్ళు, చేతులు గాయాలతో నెత్తురు చిమ్ముచున్నాను ఆళ్వారుకు బాహ్యస్మృతి రాలేదు.

విసిగిపోయిన అర్చకులు ఆలయంలోకి వెళ్ళిపోయారు. తనగానము పూర్తయిన పిదప తిరుపాణాళ్వారుకు తన బడలు తెలిసెను. శరీరమంతా గాయపడి రక్తము ధారలు కట్టుతున్నా దానికి కారణము శ్రీరంగనాథార్చకులని తెలుసుకొని కూడా ఆయన మనసు కలత చెందలేదు. వారి శరీరానికి ఆ బాధే తెలీలేదు. భక్త పరాధీనుడగు రంగనాథుడు బాధను తానే తీసుకొని అనుభవించదలచెను. ఫలితం స్వామి శరీరంపై రక్తము, గాయాలు. అది గమనించి అర్చకులు భయంతో విషయం ఆదేశ రాజైన ధర్మవర్ధనునికి తెలిపారు.

ఒకరోజు శ్రీరంగనాథుడు లోకసారంగముని కలలో కన్పించి "కావేరీ తీరమున పాటలు పాడేవాడు 'పాణన్' కాదు. నాకు ప్రాణము. అతడు దూరముగా తొలగిపోలేదని రాళ్ళతో కొట్టారు కదా! మీరు అభిషేకము చేసే ఈ చోట నిలుచొని అతడు పాడాలి" అని రంగనాథుడు లోకసారంగమునిని ఆజ్ఞాపించగా ముని - "స్వామీ అతడు రాకున్నచో ఏమి చేయాలని" అడిగాడు. రాకపోయినచో భుజములపై ఎక్కించుకొని రావాలని ఆజ్ఞాపించాడు.

లోకసారంగముని శ్రీ ప్రాణయోగి సమీపమునకు చేరి సాష్టాంగ దండ ప్రణామమాచరించి, క్షమాపణలు కోరి, శ్రీ రంగనాథుని ఆనతిని విన్నవించాడు. ఎన్నో అవమానాలెదుర్కొన్న తిరుప్పాణ్ లోక సారంగముని పిలుపులోని ఆప్యాయతకు పరవశించాడు. అతని స్పర్శకు పులకరించాడు.

"అంటరాని నన్ను అంటి మీరు మలిన దేహులు కారాదు మునీంద్ర" అంటూ అతని ఆహ్వానాన్ని తిరస్కరిస్తాడు. "మలిన మనస్కుల భావనయే మలిన దేహము! నీది పరిశుద్ధ తేజము తిరుప్పాణ్!" అంటూ అతనిని ఒప్పింప ప్రయత్నిస్తాడు. ఇచట పరిశుద్ధాత్మునిగా మారిన లోకసారంగముని మనకు దర్శనమిస్తారు.

మిలిన దేహముతో పవిత్రమైన ఆలయాన్ని అపవిత్రం చేయలేనని రాలేనని నిక్కుచ్చిగా చెబుతాడు. కానీ పట్టు విడవని లోకసారంగముని అతనిని తన భుజాలపై ఎక్కించుకొని ఆలయంలోనికి ప్రవేశిస్తాడు. లోకసారంగముని భుజములపై మోసుకొని పోయినందున తిరుప్పాణాళ్వారుకు మునివాహనులనే పేరు కలిగింది. మునినే వాహనముగా కలిగిన వాడని అర్థం. అల్పాక్షరాల్లో అనల్పభావాన్ని చొప్పించి మృదునుధురంగా ఇందులోని పాటలను లలిత శ్రవ్యంగా రచించారు ఇనాక్ గారు.

'నాగార్జున' నాటకం (అముద్రితం) నాగార్జున జీవిత విశేషాల్ని ఆయన ప్రతిపాదించిన 'సూన్య సిద్ధాంతాన్ని' ప్రపంచానికి చాటాలనే ఉద్దేశ్యంతో రచించబడినది. ఈ నాటకంలో ఐదు రంగాలు ఉన్నాయి. ప్రథమ రంగంలో గౌతమీపుత్రశాతకర్ణికి మంజుశ్రీ నాగమల్లికకు వివాహం నిశ్చయిస్తారు. శాతవాహన రాజవంశస్తుడైన గౌతమీపుత్ర శాతకర్ణి బాల్యంలో ప్రముఖ విద్యావేత్త అయిన నాగార్జున శిష్యుడు. బౌద్ధ సన్యాసైన నాగార్జునుడు అందరి మన్ననలు పొందినా, శాతవాహనుల సైన్యాధిపతి అయిన సింహభద్రుడికి నచ్చడు. ఒకసారి రాజధానికి వచ్చిన నాగార్జునుని సింహభద్రుడు బంధించి, విశ్వవిద్యాలయ నిర్మాణ నిధుల కోసం ధనాగారాన్ని కొల్లగొట్టటానికి వచ్చాడని నింద మోపుతాడు. శాతవాహన రాజు శివస్వాతికి నాగార్జునడంటే అభిమానం ఉన్నా ఏమి చేయలేక మరణ దండన విధిస్తాడు. అది తెలిసిన గౌతమీపుత్ర శాతకర్ణి రాజశాసనాన్ని వెనుక్కు తీసుకొని, సింహబద్రుని కుట్రను గ్రహించి అతన్ని చెరసాలలో బందించమని తండ్రిని కోరుతాడు. ఈ విధంగా ఈ రంగంలో గౌతమీపుత్ర శాతకర్ణి గురువును శిక్ష నుండి విముక్తుడ్ని చేసి గురువు రుణం ఈ రూపంలో తీర్చుకుంటాడు.

ద్వితీయ రంగంలో బౌద్ధుడైన నాగార్జునుడు ఈశ్వరాలయ నిర్మాణం చేపట్టడం నాగార్జున శిష్యుడు ఆర్యదేవునికి వింతగా కనిపిస్తుంది. ఒకనాడు గౌతమీపుత్ర శాతకర్ణి మంజుశ్రీలు ఆలయ నిర్మాణంలోకి వస్తారు. ఆలయ శిల్ప సౌందర్యాన్ని చూసి మంజుశ్రీ పరవశంలో మునుగుతుంది. సింహబద్రుడు వచ్చి ఆమెను తనతో రమ్మని బలవంతపెడతాడు. ఆర్యదేవుడు ఈ విషయాన్ని గౌతమిపుత్రశాతకర్ణికి చెప్తాడు. కోపంతో శాతకర్ణి అతన్ని బందించడానికి వెళతాడు. మంజుశ్రీ, నాగార్జునులు ఒకరికొకరు ఎదురు పడతారు. రస దృష్టితో వారిద్దరు తన్మయులయ్యారు. సింహబద్రుడు పారిపోతాడు. అక్కడకు వచ్చిన గౌతమిపుత్రశాతకర్ణి, ఆర్యదేవుడు ఎంతో ప్రయత్నం చేసిన తర్వాత మంజుశ్రీ నాగార్జునులు బాహ్యలోకంలోకి వస్తారు.

తృతీయ రంగంలో నాగార్జుని శూన్యవాదం శిష్యుడైన ఆర్యదేవునికి నచ్చదు. అదే విషయాన్ని గురువు వద్ద చెప్పి, వేరే గురువు వద్ద విద్య నేర్చుకుంటానని అంటాడు. నాగార్జునుడు సమ్మతిస్తాడు. మంజుశ్రీ నాగార్జునుని విగ్రహాన్ని అపురూపంగా తీర్చిదిద్దుతుంది. అది చూసిన గౌతమీపుత్రుడు గురువు నాగార్జునుని మీద అనుమానంతో పాటు అసూయ కూడా పుడుతుంది. ఒక నాడు నాగార్జునుని చంపడానికి వచ్చిన సింహబద్రుని విష్ణుప్రియ బంధించి చంపబోతుంది. అందుకు నాగార్జునుడు మనిషిని చంపడం మానవత్వం కాదని విష్ణుప్రియకు బోధిస్తాడు.

చతుర్థరంగంలో గౌతమీపుత్ర మంజుశ్రీ దంపతులయ్యారు. వివాహానంతరం శాతకర్ణి భోగలాలనలోపడి రాజ్యాన్ని పట్టించుకోడు. మంజుశ్రీ కోరికమేరకు నాగార్జునుడు అక్కడికి వస్తాడు. నాగార్జునుడు రాకను గౌతమిపుత్రశాతకర్ణి విమర్శిస్తాడు. నాగార్జునుడు గౌతమీపుత్రశాతకర్ణిని అపోహను పోగొడతాడు. రాజ్యంలో అశాంతి చెలరేగి, యుద్ధం తప్పదంటాడు శాతకర్ణి. నాగార్జునుడు వద్దని వారించినా వినిపించుకోడు. శాతకర్ణి జైత్రయాత్ర నుంచి తిరిగి వచ్చేసరికి రోగపీడితుడవుతాడు. అతని రోగాన్ని నయంచేయమని మంజుశ్రీ నాగార్జునున్ని వేడుకుంటుంది. యుద్ధం చేయననే నిబంధనతో నాగార్జునుడు శాతకర్ణిని ఆరోగ్యంగా చేస్తాడు.

పంచమ రంగంలో మంజుశ్రీ శాతకర్ణి బౌద్ధాన్ని స్వీకరిస్తారు. సింహబద్రుడు కూడా పశ్చాత్తాపపడి నాగార్జుని పాదాల వద్ద మోకరిల్లి బౌద్ధ దీక్ష ప్రసాదించమని కోరుకుంటాడు. ఆర్యాదేవుడు నలంద విశ్వవిద్యాలయంలో శాస్త్రవాదంలో "శూన్యవాదం" గురించి వాదించానని సంతోషంగా చెప్తాడు.

ఇంకా ప్రజాదరణ పొందిన ఇనాక్ గారి నాటకాలలో కీ (1968), సాక్షి (1988), మనలాంటి మనిషి (2010), ఇదుగో ఏసుక్రీస్తు (2012), నీడ (2012), ఓట్లాట (2012) ఉన్నాయి. ఇందులో 'ఓట్లాట' ను ఇనాక్ గారే ఆంగ్లంలోకింష్త్రవ ఖీఅట్ష్త్ర వర్ఘ్వ అని అనువదించారు. నాటకాలే కాక నాటికలనూ దృష్టి, అభ్యుదయం అనే సంపుటాలుగా వెలువరించారు. త్యాగి,

జ్యోతి, దృష్టి నాటికల సమాహారం 'దృష్టి'; దిక్కులేనోడు, నిర్భయం, సమానత్వం, న్యాయం, దర్శనం, కూలీ నాటికల సమాహారం 'అభ్యుదయం'గా వెలువడ్డాయి.

'దిక్కులేనోడు' నాటికలో గ్రామంలో వివక్షతకు, అన్యాయానికి గురయ్యే ప్రజలను మేల్కొలిపే ఉద్దేశంతో వ్యవహరిస్తుంటాడు కోటేశు. ఆ విషయాలను జీర్ణించుకోలేని జమీందారు తన బంగారు కోడిపెట్టను దొంగిలించాడనే నింద మోపి, ఆ కోడి ఏడు వందలని కోటేశు ఇంటిని, ఆస్థిని దస్త్రంపై రాయించుకుంటాడు. తన మార్గంలోకి రాని కోటేశును జమీందారు ఊళ్ళోని ఆచారి కూతురితో సంబంధం అంటగట్టడం, కోటేశును పెట్రోలుతో నిప్పు అంటించి చంపాలని మొదలగునవి జమీందారు పెత్తనానికి, అన్యాయానికి ప్రతీక ఈ దిక్కులేనోడు.

'నిర్భయం' నాటికలో ఒక కళాశాలలో దళితుడైన రాజారావు తనని గొడ్డును కోస్తానని హేళన చేసే వారికి కత్తితో బుద్ధి చెప్పాలనుకుంటాడు. అందుకు లెక్చరర్ కత్తి పట్టుకొని భయాన్ని చంపేవాడు పిరికి వాడని, నిర్భయం చావడానికి కాదు, బ్రతకడానికి కావాలని చెపితే రాజారావులో మార్పు కలుగుతుంది.

'సమానత్వం' అనే నాటికలో ఉన్నత కుటుంబీకుడైన మాధవయ్య, చదువు సంధ్యలేని దళితుడైన కృష్ణయ్య పాత్రలు ప్రధానం. పీల్చేగాలి, తాగే నీరు, శరీరంలోని రక్తం ఒక్కటే అయినప్పుడు అంటరానితనం ఎక్కడి నుంచి వచ్చిందని కృష్ణయ్య మాధవయ్యను ప్రశ్నిస్తాడు. మాధవయ్య డబ్బు సంపాదించమని, రాజకీయాలలో ఎదగమని కృష్ణయ్యకు హితువు పలుకుతాడు. అలాగే డబ్బు, రాజకీయాలను అధిగమనించినా తనను అంటరానివాడిగానే చూస్తున్నారని వాపోతాడు.

'న్యాయం' అనే నాటికలో రామయ్య బాకీ చేసినందుకు జమీందారైన నాంచారయ్య దగ్గర వెట్టి చాకిరీ చేస్తుంటాడు. కొడుకు సుందర్రావు చదువుకొని ఉద్యోగస్థుడవడంతో తండ్రిని ఆ వెట్టి చాకిరీ నుంచి విముక్తుడ్ని చేస్తాడు. అయితే తండ్రి పని లేకుండా కూర్చొని తిని విశ్రాంతి తీసుకోవడం నచ్చలేదు. నేను ముసలివాణ్ణి కాలేదని, ఏదో ఒక పని చేస్తానని కొడుకును అడుగుతాడు. స్వతంత్ర్యంగా బ్రతకాలనే తండ్రి కోసం జమీందారు దగ్గర ఉన్న గొర్రెల్ని కొనిస్తాడు. తాను బ్రతికున్నన్ని రోజులు కష్టపడుతూ న్యాయంగా బ్రతకాలని రామయ్య తపన పడుతుంటాడు.

'దర్శనం' నాటికలో రాజన్న పదో తరగతి పాసైతే వేణుగోపాలస్వామి ఆలయంలో కొబ్బరికాయ కొడతానని మొక్కుకున్న అతని కోరికకు అడ్డుగా నిలుస్తాడు అగ్రవర్ణ ప్రజల సంస్కారానికి ప్రతినిధిగా పూజారి. ఉన్నత వర్గానికి చెందిన ప్రెసిడెంటు కూడా ద్వంద్వ నీతిని పాటించే రాజకీయ నాయకుడిగా కనిపిస్తాడు. రాజనన్నను తల్లి, తమ్ముడు ఆలయ ప్రవేశం వద్దని వారించినా పూజారిని ప్రక్కకు నెట్టి దేవాలయంలోకి ప్రవేశించి తన కోరికను నిరవేర్చుకుంటాడు. దళితుడు ఆలయ ప్రవేశం చేసినంత మాత్రాన ఆలయంలో దేవుడు రాయిగానూ, రాయి మనిషిగానూ మారడు. అలాగే ఆలయ ప్రవేశం చేసినంత మాత్రాన దళితుల తలరాతలు తరతరాలుగా మారనూ లేవనే సత్యాన్ని ఈ నాటిక తెలుపుతుంది.

'కూలి' నాటికలో రెక్కాడితేగానీ డొక్కాడని కూలి జీవితం రంగడిది. రోజంతా గొడ్డులా కష్టపడతాడు. కూలి అడగడానికి మొహమాటం, భయం. తెల్లవారితే తినడానికి తిండి ఉండదు. అంతరాత్మ దాటికి తట్టుకోలేక దొర ఇంటికి కూలి అడగడానికి వెళ్ళి, నంగినంగి మాటలతో అడుగుతాడు. చివరికి నిన్నటి కూలీ తీసుకోవడానికి ఈ రోజుకూలి పోగొట్టుకున్నానని ధైర్యంగా రంగడి చేత దొరను ప్రశ్నించేటట్లు చేస్తుంది అంతరాత్మ. మనిషిలోని సహనం, ఓర్పు నశిస్తే ప్రశ్నించడం, తిరుగుబాటు చేయడం మానవ సహజ లక్షణం అదే ఇక్కడ రంగడుతో చేయించాడు రచయిత. అన్యాయం, అక్రమం, అధర్మం ఎదురైతే తిరుగుబాటు, పోరాటం, ఉద్యమం, దానంతట అవే పుట్టుకొస్తాయనే ఇనాక్ గారు ఇక్కడ సూచించారు.

ఇంకా 'దృష్టి' నాటికకు కేంద్ర ప్రభుత్వ ఆకాశవాణి పురస్కారం (1958) లభించింది. ఇవేకాక రేడియో నాటికలు, టీవీ నాటికలు ఉన్నాయి. కొలకలూరి ఇనాక్ గారి నాటికలు, నాటికలలో ఎన్నో ముందుచూపు ఆలోచనా భావనలు, అసమానత, అన్యాయ దోరణలను ఎత్తి చూపడం, దిగువ తరగతి ప్రజల, దళితుల మేల్కొలిపే ఉద్దేశ్యాలు, సంఘటిత పరిచే సంఘటనలు మరెన్నో మనకు కనిపిస్తాయి.

సి.నా.రె. గారి సినిమా పాటలు - వస్తువైవిధ్యం

- పి.శాలిని

పరిశోధక విద్యార్థిని, తెలుగు అధ్యయనశాఖ, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

డా.సింగిరెడ్డి నారాయణగారు ఒక సాహిత్య విమర్శ కుడిగా, సిద్ధాంతకర్తగా, గేయకర్తగా, స్థానంలో నిల్చారు. సాహిత్య బోధకుడిగా, సుప్రసిద్ధ కవిగా, కర్తగా, వచన కవితా సమగ్రకావ్య కావ్యకర్తగా పేరొందిన భారతీయ జ్ఞానపీఠ పుర స్కార గ్రహీతగా, చలనచిత్ర రంగంలో ప్రపంచ దృష్టిలో అత్యంత పేరుపొంది ప్రఖ్యాతలను సంపాదించి ప్రముఖ స్థానంలో నిల్చారు.

సి.నా.రె స్వయంగా కవిత్వం రాశారు. ఎన్నో సృజనాత్మక రచనలు చేశారు. కళ, అభ్యుదయం, మానవత గురించి విస్తృతంగానే రాశారు. నిర్ధిష్టమైన సాహిత్య సిద్ధాంత రూపకల్పన చేశారు. వీరి గేయాలు వినేవారు, చూసేవారు, చదివేవారు అనేక మంది ప్రేక్షక పాఠకుల హృదయాలలో చోటు దక్కించు కున్నారు.

పాటలలో వస్తు - శిల్పాలకున్న సంబంధం, ప్రపంచం లో ప్రతి దానికి ఏదో ఒక రూపం వుంది. పదార్థాల్లో సారాంశం వస్తువే అయినా అది రూపంతోనే అస్తిత్వంలో వుంటుంది. రూపాన్ని ఆశ్రయించుకొని వస్తువు వ్యక్తం అవుతుంది. సమాజ జీవితంలో కవి ఊహలలో వచ్చే ప్రతి చిన్న మార్పు వస్తువులో మార్పు కన్పిస్తుంది. సాధారణంగా అభివృద్ధి క్రమంలో వస్తువే రూపాన్ని నిర్ణయిస్తుంది. వస్తువు గౌరవం పొందితే అది సత్యం. వస్తువు సందేశం అయితే అది సుందరం. సి.నా.రె పాటలలో రూపం వస్తువు సిద్ధింపజేసేలా ఉంటాయి.

గేయాలలో వస్తు - శిల్పాలు :

ఆ వస్తువు ఏ రూపంలో అభివ్యక్తం అవుతుందో ఆ రూపాన్ని శిల్పం అంటారు. వస్తుశిల్పాల్లో - వస్తువు నిర్ణయాత్మక మైన పాత్ర నిర్వహిస్తుంది. కాబట్టి వస్తువే ప్రధానమైన అంశం. సి.నా.రె పాటలు సినిమా కథా నేపథ్యంలో పుట్టినవి. ప్రకృతిలో సమాజంలో ఆవేశంతో కూడిన సంబంధాల ఫలితమే సి.నా.రె సినీ గేయ సాహిత్యం. అంటే గేయసాహిత్యం మానవీయమైన ఒక చైతన్యరూపం కాబట్టి గేయాల్ని సమదృష్టిలో పరిశీలించ వలసిన ఆవశ్యకత వుంది. వస్తు విశ్లేషణ చేస్తే ఏ విషయాన్ని ప్రతిబింబిస్తోంది అనేది తెలుసుకోనవచ్చును.

కథా వస్తువులో పస వుండి పాత్రలలో పదునుండి వాటిని నేపథ్యంగా చేసుకొని చిత్ర దర్శకుడు పాటలు సన్ని వేశాలను కల్పించడం వలన సి.నా.రె గళం నుండి పదికాలాల పాటు జీవించే పాటలు వచ్చాయి. వాటిల్లో కొన్ని ఈ కింద పొందుపరచడం జరిగింది.

ప్రణయ గీతాలు :

ప్రణయ శబ్దమును కవులు, లాక్షణీకులు, స్త్రీ, పురుషుల మధ్యగల శృంగారంలోనే కాక సాధారణ స్నేహమును అర్థంలోనూ వాడారు. వీరి ప్రేమ గీతాలు చాలా గొప్పవి. వీరు స్త్రీని చైతన్య స్వరూపిణిగా దర్శించారు.

ఈ కింది పాటను గమనించినట్లైతే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిల్చిపోయేలా సి.నా.రె గారు రచించారు అనడంలో సందేహం లేదు.

పల్లవి : తోటలో నా రాజు
తొంగి చూసెను నాడు
నీటిలో ఆ రాజు
నీడనవ్వెను నేడు

చరణం : నవ్వులా అవి కావు నవపారి జాతాలు
రవ్వంత సడిలేని రసరమ్యగీతాలు
ఆ రాజు ఈ రోజు అరుదెంచునా
అపరంజి కలలన్ని చివురించునా

చరణం : చాటుగా పొదరింటి మాటుగా ఉన్నాను
పాటలాధర రాగ భావనలు కన్నాను
ఎలనాగ నయనాల కమలాలలో దాగి
ఎదలోన కదలె తుమ్మెద పాట విన్నాను
ఆ పాట నాలో తీయగమ్రోగనీ
అనురాగ మధుధారయైసాగనీ

అపురూప మూర్తి అయిన ప్రియుని నవ్వులను రమ్యంగా రాగాలుగా భావిస్తున్నా ప్రియురాలికుసుమ కోమల భావాల వల్లరి. ఇది ఎలనాగ గుండెల్లోని అలజడి.

ఈ విధంగా వర్ణించడం జరిగింది. ఈ అద్భుతమైన వర్ణన ఎంతబాగా చేసారో ఆ పాటలను ఆశ్వాదించే వారికి మాత్రమే తెలుస్తుంది.

దేశభక్తి :

కర్మభూమి మన భారతదేశం. దేశభక్తికి మూలసత్త్వం కర్మాచరణమే అని మన పూర్వులు భావించారు. తాను జన్మించిన దేశం మీద అపారమైన అభిమానం తన జాతి శ్రేయస్సు కొరకు పాటుపడాలనే తపన సి.నా.రె. లో పుష్కలంగా ఉన్నాయి. అందుకోసమే ఇటువంటి పాటలు రచించారు. అందులో ఒకటి...

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

నదులు నేపథ్యాలుగా తెలుగు నేల సముజ్జ్వల గత వైభవాన్ని అత్యంత సహజ మోహనంగా భావపరంగా వైవిధ్య భరితంగా చిత్రించిన గీతమిది.

పల్లవి : ఆడవే ఆడవే
జలకంబులాడవే
హంసలాగ - జలకన్యలాగ

చరణం : ఆది కవి నన్నయ అవతరించిన నేల
తెలుగు భారతి అందియలు పల్కె ఈ నేల
ఆంధ్ర సంస్కృతికి తీయని క్షీరధారలై
జీవ కళలొల్కు గోదావరి తరంగాల

చరణం : నాగార్జునుని బోధనలు ఫలించిన చోట
బౌద్ధమత వృక్షమ్ము పల్లవించిన చోట
కృష్ణవేణి తరంగిణి జాలిగుండెయే
సాగరమ్మె రూపు సవరించుకొను నీట

చరణం : కత్తులును గంటములు కదను త్రొక్కినవిచట
అంగళ్ళరతనాల అమ్మనారట యిచట
నాటి రాయల పేరు నేటికిని తలపోయు
తుంగభద్రానది తోయ మాలికలందు.

తరతరాల తెలుగు సంస్కృతిని చాటాడు. అక్షరజ్ఞానం లేని వాళ్ళకు కూడా తెలుగు సంస్కృతి చరిత్రలను అద్దం పట్టడం కమ్మని సంగీతంలో కలగలిపి తెలపడం ఇందులో వస్తువు.

అభ్యుదయం :

మనిషి హక్కులను, మనిషి శ్రమ - అస్తిత్వాలను, దోపిడిని, సమతను, కాపాడే, గుర్తించే, నిరసించే, ఆకాంక్షను, వ్యక్తం చేసేదే అభ్యుదయం గేయాలు. అభ్యుదయ కవిత్వంలో అపారమైర పరిచయమున్న సి.నా.రె. ఈ క్రింది గీతాన్ని గమనిస్తే అర్థమవుతుంది.

పాడవోయి బారతీయుడా - పాడవోయి భారతీయుడా!

అనుపల్లవి : భారతావని వృక్షమని - ప్రాంతాలే కొమ్మలనీ
సమభావం మూలమనీ -పాడవోయి భారతీయుడా
సమైక్య భారతదేశానికి గీసిన సమగ్ర చిత్రమిది
చరణంలో
ఎవరు హిందు వెవరు ముస్లింయెవరురా క్రైస్తవుడు.

భిన్న మతాలను ప్రస్తావించి ఎవరిది తెలుగెవరిదాంధ్ల మెవరిది హిందుస్థానీ అంటూ వివిధ భాషలనుల్లేఖించి, రచించారు.

భక్తి:

భక్తి అనే పదం 'భజ్' అనే ధాతువు నుంచి పుట్టింది. 'భజ్' అంటే సేవించడం. ఈ సేవాభావంతోనే అర్చనం, వందనం, స్మరణం మొదలైన విధులన్నీ చేరుతాయి. భక్తికి జీవలక్షణం అహంకార రహితమైన భగవత్పరమైన పారవశ్యం.

మధురభక్తి :

పల్లవి : నీ చరణ కమలాల నీడయే చాలు
ఎందుకోయి స్వామి బృందావనాలు
నీనయన కమలాలు - నేనున్న చాలు
ఎందుకే ఓ దేవి! నందనవనాలు

చరణం : నునుమోవి చివురుపై నను మురళిగా మలచి
పలికించరా - మధువులొలికించరా
మోవిపై కనరాని - మురళిలో వినలేని
రాగాలు పలికింతునే - మధురాను
రాగాలు చిలికింతునే

ఈ విధంగా అత్యద్భుతంగా సి.నా.రె రచించారు

సందేశం :

డా.సి.నా.రె కవియే కాదు. ఉత్తమాధ్యాపకుడు అందు వల్లనే కళ్యాణ కాంక్షతో ఎన్నో రచనలు చేశారు. మానవ సంఘం యొక్క శక్తివంతమైన ఐక్యతా రైపమే జాతి. జాతి యొక్క భావం జాతీయత. భారతదేశమంతా ఒకే జాతి కాని విశాలదేశం కావడం వల్ల ప్రాంతీయంగా జాతి జీవనం ఐక్యతను భంగం వాటిల్లని విధంగా తెలుగు కావ్యాలు ప్రబోధించాయి. అలాగే ఆయన రచన కూడా చేశారు.

స్త్రీ రాగమయి అనురాగమయి త్యాగమయి జ్యోతి ర్మయి, స్త్రీ క్షేత్రం రూపిణి బీజధాత్రి, బీజానికి జీవమిచ్చేది క్షేత్రమే, ప్రతి ప్రసవం స్త్రీ కో జన్మలాంటిది కింది పాటను గమనించినట్లైతే మనకే తెలుస్తుంది. సి.నా.రె గారికి ఎంత గొప్ప ఆలోచనా శక్తి కల్గివున్నారో.

'మానవ జాతి మనుగడకే - ప్రాణంపోసింది మగువ
త్యాగంలో అనురాగంలో - తరగని పెన్నిధి మగువ

చెల్లిగా, ప్రేయసిగా, తల్లిగా, అన్నింటిని మించి సమస్త విశ్వరక్షకురాలిగా మగువను వర్ణిస్తూ.....

ఒక అన్నకు ముద్దుల చెల్లి - ఒక ప్రియునికి వలపుల మల్లి
ఒక రామయ్యకే కన్న తల్లి - సకలావనికే కల్పవల్లి'

ఈ విధంగా మంచి మంచి సందేశాలతో అనేక గేయాలను రచించారు.

జానపదం :

పల్లవి : గోగుల పూచే గోగులు పూచే - ఓ లచ్చి గుమ్మడి
గోగులు దులిపే వారెవరమ్మ - ఓ లచ్చి గుమ్మడి
పొద్దుపొడిచే పొద్దుపొడిచే - ఓ లచ్చి గుమ్మడి
పుత్తడి వెలుగులు కొత్తగ మెరిసె-ఓ లచ్చ గుమ్మడి
ముంగిట వేసిన ముగ్గులు చూడు - ఓ లచ్చ

గుమ్మడి
ముత్యాల ముగ్గులు చూడు - ఓ లచ్చ గుమ్మడి

విధంగా తెలుగింటి ముంగిట రంగవల్లులల్లి తెలుగు గేయాల పల్లవితోనే పాటల పూలను తలపించారు సి.నా.రె గారు.

ముగింపు :

డా.సి. నారాయణ రెడ్డిగారు రకరకాల మాత్రా ఛందో గతుల్లో వివిధ కవితా రీతుల్లో, వస్తువైవిధ్యమున్న ఎన్నో కావ్యాలు రాసినా కవితారంగంలో వీరు పాటకు పెద్దపీట వేశారు. 'పాటలోనే నాదు ప్రాణాలున్నాయి' అనడం వలన 'పల్లెనాకు పాటనిచ్చింది పట్నం నాకు మాట నిచ్చింది' అనే వాక్యాలను బట్టి వారు సినీ పాటల రచయితగా ఎలా రూపు దిద్దుకున్నారో మనకు అర్థమవుతుంది.

ప్రస్తుతం వారు మన మధ్య లేకున్నా తెలుగు ప్రేక్షకాభి మానులు ఉన్నంత కాలం ఆయన పాటలు వారి గుండెల్లో చిరస్థాయిగా నిల్చిపోతాయి.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

రాళ్ళపల్లి వారి సాహిత్య పీఠికా పరిమళం

– బడిగె ఉమేశ్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

తెలుగు సాహిత్యంలో బ్రౌను దొర కాలం నుండి పీఠికా రచన ఉన్నట్లు తెలుస్తుంది. ఈ పీఠికా రచనను ఒక విమర్శక కళగా భావించవచ్చు. ఎందుకంటే పీఠికలు రాయగల తెలుగు సాహితీవేత్తలు చాలా కొద్దిమంది మాత్రమే కనిపిస్తుంటారు. వారిలో కట్టమంచి రామలింగ రెడ్డి, వేటూరి ప్రభాకర శాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగార్లను ప్రత్యేకించి చెప్పుకోవచ్చు. వీరి పీఠికా రచన ఒక్కొక్కరి లో ఒక్కో విలక్షణమైన పద్ధతి కనిపిస్తుంటుంది. ప్రత్యేకించి రాళ్ళపల్లి వారు రచించిన పీఠికల్లో కావ్య గతమైన గుణదోషాలను చూపించటమే కాక రచయితను ప్రోత్సహించటం శర్మగారి ప్రత్యేకత. వీరి పీఠికల్లో సమకాలీన సామాజిక అంశాల చిత్రీకరణతో పాటు నాటి రాజకీయ చారిత్రక పరిణామాలు కూడా చోటు చేసుకోవడం మరో ప్రత్యేకత. రాళ్ళపల్లి వారు తనకు నచ్చితేనే పీఠికలు రాసేవారు. ఇందులో ఒకటీ అరా కూడా ముఖస్తుతి రాతలు కనిపించవు. రచన ఆస్వాదనీయంగా ఉంటే మహాకావ్యమైనా, ఖండకావ్యమైనా ఆయన పీఠిక రాయడానికి అంగీకారమే. ఆయన రాసిన ఏ పీఠికను చూసినా సంకుచితత్వానికి తావీయని సహృదయత కనిపిస్తుంది. ప్రధానంగా సూటి దనం, అభివ్యక్తి లాంటి లక్షణాలు అడుగడుగునా కనిపిస్తాయి.

“చెప్పేదానికి ఒక విషయముండాలి. అది చెప్పదగినదై ఉండాలి. స్పష్టంగా చెప్పే శక్తి నీకుండాలి..” అని రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు అంటుండేవారట. ఈ విషయాన్ని తన కుమారుడు ఆర్.ఏ. జయంతగారు ఒకసారి మాటల సందర్భంలో చెప్పారు. రాళ్ళపల్లివారి వ్యాసాల్ని చదివినవారికెవరికైనా ఆ మాటల్లో నిజం ఉందనిపిస్తుంది. ఎందుకంటే రాళ్ళపల్లి వారు సంగీత, సాహిత్య రచనల్లో అనుసరించిన తీరు అంత స్పష్టంగా కనిపిస్తుంది. అంతేకాదు, రాళ్ళపల్లి వారి పాండిత్యానికి చాలామంది మంత్ర ముగ్ధులయ్యారు. విమర్శ రంగంలో ఆయన మంచి పేరు ప్రఖ్యాతులు పొందారు. అందువల్ల కొంతమంది సమకాలికులు ఆయన చేత తమ పుస్తకాలకు ముందుమాటలు రాయించుకున్నారు. 1917-1978 మధ్య కాలంలో దాదాపు నూట ఇరవై గ్రంథాలకు ఆయన పీఠికలు రాశారు. ఈ పీఠికలను రాళ్ళపల్లి అభినందన సమితి సభ్యులైన ఘట్టమరాజు అశ్వత్థనారాయణ, ఆర్వీయస్ సుందరం, శివలెంక శ్రీరామచంద్రమూర్తి గార్లు కలిసి ‘రాళ్ళపల్లి పీఠికలు’ పేరుతో 1979లో ఒక సంకలన గ్రంథంగా తీసుకొచ్చారు. ఇందులో రాళ్ళపల్లి పీఠికల్ని ప్రాచీన, ఆధునిక, నవల-వ్యాసాలు, నాటకాలు, ఇతర గ్రంథాలకు రాసిన పీఠికలని ఆరు భాగాలుగా విభజించారు. రాళ్ళపల్లి వారు వివిధ రచనలకు రాసిన పీఠికలను ఒక సంకలన గ్రంథంగా తీసుకురావడం వల్ల ఆయన విమర్శ దృక్పథం, ఆయన పాండిత్యం ప్రజలకు స్పష్టంగా గోచరించే అవకాశం లభించిందని భావించవచ్చు.

సంగీత, సాహిత్య రంగాల్లో గుర్తింపు పొందిన రాళ్ళపల్లి వారు విమర్శను ఒక కళగా భావించారు. ఛందోబద్ధ రచనలాగా గుర్తించుకోదగిన మంచి సుందరమైన వచనం రాయడం ఆయనకే సాధ్యమనిపిస్తుంది. వివిధ గ్రంథాలకు ఆయన రాసిన పీఠికలు అలవోకగానో, అనాలోచితంగానో ముఖ ప్రీతి కోసమో రాసిన పీఠికలు కావు. ప్రతి పీఠికా ఒక చిన్న పరిశోధన వ్యాసంలాగో, ఒక కొత్త విషయాన్నేదొకదాన్ని ప్రతిపాదించేదో, కొత్త సమన్వయాన్ని అందించేదో అయ్యుంటుంది. ప్రతి పీఠికా మూల రచనను చదివించేలా ప్రేరణనిస్తుంది. మూల రచనను చదవడానికి కొత్త ద్వారాల్ని చూపిస్తుందన్నట్లు ఉంటాయి వారి పీఠికలు. దీనితోపాటు “కొండ అందమందు కొంచమై ఉండదా అన్న వేమన సూక్తిలాగా చిన్న మున్నుడిలో కూడ రాళ్ళపల్లి వారి వ్యక్తిత్వం ప్రసూటమవుతుందని ప్రముఖ పరిశోధకుడు జి.యన్. రెడ్డిగారు ప్రశంసించారు. రాళ్ళపల్లి వారి పీఠికల్లో ముఖ్యంగా వీరి సహృదయత నిశిత పరిశీలనా దృష్టి, పాండిత్యం, భాషా శిల్పం ప్రతిబింబిస్తూ ఉంటాయి.

పీఠిక రచన పూర్వం అవతారికల రూపంలో ఉండి, రచన గురించిన స్థూల పరిచయం కనిపించేది. అంటే ఆ రచనను ఎవరు రాశారు? ఎవరికి అంకితం ఇచ్చారు? అనే అంశాలతో పాటు ఆ రచనలోని విషయాలను సంక్షిప్తంగా తెలియపరిచేదే పీఠికగా నిర్వచించుకోవచ్చు. ఒక ఇల్లుకు పునాది, ఒక నాటకానికి నాంది ఎంత అవసరమో, ఒక పుస్తకానికి పీఠిక కూడా అంతే అవసరమని చెప్పవచ్చు. ఈ పీఠికను ఆధునిక కాలంలో వివిధ పేర్లతో పిలుస్తున్నారు. అవి ముందుమాట, ప్రస్తావన, పరిచయం, ఉపోద్ఘాతం ఇంకా అనేక కొత్త, కొత్త పేర్లను రచయితలు రచనను బట్టి, వారి వెసులుబాటును అనుసరించి సృజనాత్మకంగా ఆ పేర్లను పెడుతుంటారు. అయితే రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు రాసిన పీఠికలకు పీఠిక, ఉపోద్ఘాతం, ఆముఖం, ప్రస్తావన, అభినందనము, అభిప్రాయము, ఆశీస్సు, తొలి నోము, తొలిపలుకు, మంగళా శాసనము, పరిచయము, మున్నుడి, భూమిక, తిలకం, విన్నపము, సందేశం మొదలైన పేర్లు పెట్టారు. కొన్ని మూడు వాక్యాలలాంటి వాటిని కూడా పీఠికలుగా రాశారు.

లభించిన ఆధారాలను బట్టి రాళ్ళపల్లి వారు రాసిన పీఠికలు ప్రాచీన కవిత్వానికి సంబంధించి 16, ఆధునిక కవిత్వానికి సంబంధించి 33, నాటకాలకు సంబంధించి 3 , నవల, కథలకు సంబంధించి 3, వ్యాసాలు, విమర్శలు, పరిశోధనలకు సంబంధించి 14 పీఠికలు లభ్యమవుతున్నాయి. రాళ్ళపల్లి వారు మొత్తం 76 గ్రంథాలకు పీఠికలు రాసినట్లు తెలుస్తుంది. ఇవే కాక మరీ 42 గ్రంథాలకు పీఠికలు రాసి ఉండవచ్చునని రాళ్ళపల్లి వారి గురించి పరిశోధించిన వాళ్ళు అంటున్నారు. కానీ ఆ పీఠికలు సేకరించాల్సిన అవసరం ఉంది. మొత్తం మీద రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు సుమారు 120 గ్రంథాలకు పీఠికలు వెలువరించి ఉండవచ్చునని పరిశోధకుల అభిప్రాయం. .

రాళ్లపల్లి వారి పీఠికల్లో గుర్తింపు పొందిన పీఠికలు కొన్ని ఉన్నాయి. అన్నమయ్య ఆధ్యాత్మిక సంకీర్తనల (పరిష్కృత పీఠికలు), పాండురంగమాహాత్మ్యము, శివభారతము (గడియారం వెంకటశాస్త్రీ), నాగార్జునసాగరం (సినారె), పెన్నేటి పాట (విద్వాన్ విశ్వం), ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము (బాలాంత్రపు రజనీకాంత రావు), ద్రోణ ప్రశస్తి (దీపాల పిచ్చయ్య శాస్త్రి), పగడాలు కథ (ఆచంట శారదాదేవి), వదరబోతు (పప్పురి రామాచార్యులు), ప్రబంధ నాయికలు (పుట్టపర్తి నారాయణాచార్యులు), సాహిత్య తత్త్వము- శివభారత దర్శనము (సర్దేశాయి తిరుమలరావు), జానపద కళా సంపద (తూమాటి దొణప్ప), క్షేత్రయ్య పద సాహిత్యం (ఎస్.గంగప్ప), నృత్తరత్నావళి (జాయప సేనాపతి). వీటితో పాటు మిగతా పీఠికలు కూడా చెప్పుకోదగినవి చాలా ఉన్నాయి. వీరి పీఠికల్లో కొన్ని ప్రత్యేకతల్ని గుర్తించవచ్చు. రచయితలతో గల పరిచయం, రచనల అంతరంగ ప్రవేశం, లలితమైన విమర్శ, కొన్ని సూచనలైన మాటలు, ప్రోత్సాహకరమైన మాటలు కలగలిపి మొత్తం రచనకు సంబంధించిన విషయాలు సంక్షిప్తంగా ఉంటాయి..

"రాళ్ళపల్లి పీఠికలు" సంకలనానికి ముందుమాట రాసినా ప్రముఖ పరిశోధకులు, భాషావేత్త ఆచార్యజి.యన్.రెడ్డి ఇలా అన్నారు. "శతాధికములైన రాళ్ళపల్లి పీఠికలు రమణీయములు, కమనీయములు, ఆలోచనామృతాలు" అంటూ... "అవి విషయ ప్రధానములు, విమర్శ తత్త్వ సమన్వితములు, సమీక్షా ప్రాయములు, వైయక్తిక వచన రచన శిల్ప విలక్షణములు. ఎవరో ఒక రచయిత కోరికను మన్నించి మర్యాద కోసమో, మోహమాటనికో నాలుగు మాటల్లో తన అభిప్రాయాన్ని రాసినా అందులోనూ ఒక మెలుకువో, ఒక మరిపమో, ఒక చిన్నమెరుపో ప్రతిబింబమై ఉంటుంది. పెద్ద పీఠికల్లో విషయౌన్నత్యం అభిప్రాయ గాంభీర్యం, పటుత్వం తప్పని సరస వాక్కు, శైలి సంపన్నత ప్రధాన లక్షణాలు. నిజానికి రాళ్ళపల్లి వారి పీఠికలు ఒక నిర్మితికల్గి సుందరంగా, శిల్పశోభితంగా రూపొంది ఉంటాయ"ని రాళ్ళపల్లి వారి పీఠిక కళా స్వరూపాన్ని ఆవిష్కరించారు.

జానుమద్ది హనుమచాశాస్త్రిగారు "రాళ్ళపల్లి పీఠికలు" సంకలన గ్రంథంపై భారతి మాసపత్రికలో సమీక్ష రాస్తూ ఈ విధంగా వ్యాఖ్యానించారు. "పాశ్చాత్య సమీక్షా సిద్ధాంతములను ఆకళించుకున్న శర్మగారి సాహిత్య సమాలోచనా రీతీ విశిష్టమైనది. వారి దృష్టి సత్య నిష్టమైనది. రచనలోని దోషములను నిష్పక్ష పాతముగా వెలువరించటం వారి ప్రత్యేకత. వీరు తెలిసిన విషయాలు నిరోయముగా ప్రపంచమునకు బోధించు ధైర్యము, దానికి నిబంధనమై ఇరు ప్రక్కలయందు మగులేని మంచి పదును గల చురకత్తివంటి 'రచనాశక్తి', దానికి మెగిచ్చునట్టి సూక్ష్మ దృష్టి గాయపు మందు కత్తికే పూసి కొట్టినట్లు, తిట్టుచునే నవ్వించు హాస్య కుశలత రాళ్ళపల్లి వారి సాహిత్య విమర్శనం మూల సూత్రాలు. ఈ సూత్రాలు పీఠికా రచనలో అనుస్యూతములై చోటు చేసుకొన్న తీరు విలక్షణమైనది. కప్పుకున్న వైష్ణవం, ముఖనింద, పటిష్టహరణం, మైల పలుకులు, ముద్రాక్షర శోధనము, చిప్ప గుర్తులు, పగులు మొగ్గలు, బిత్తలి కవిత్వం, అంగడి కవులు, ఆకాశవాణి లాంటి పదబంధాలను ఉపయోగించడం" రాళ్ళపల్లి వారి ప్రత్యేక భాషా పాండిత్యానికి చిహ్నంగా అభివర్ణించవచ్చు.

రాళ్ళపల్లి వారు పీఠిక రాయడానికి కలిగిన సందర్భాలను, ఆయా రచయితలతో ఉన్న సాన్నిహిత్యాన్ని చెప్తూ, గ్రంథంలోని గుణదోషాలను క్షుణ్ణంగా తెలిపి, రచయితలను మరో రచన చేయడానికి గొప్ప ప్రోత్సాహన్నిచ్చిన మాటలు ఎక్కువ పీఠికల్లో కనబడతాయి.

ఈవిధంగా రాళ్ళపల్లి వారి పీఠికలు ఒక విధమైన వైలక్షణ్యాన్ని కలిగి ఉన్నాయని చెప్పవచ్చు. తెలుగు సాహిత్య చరిత్రలోనూ, సాహిత్య విమర్శ, రంగంలోనూ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి పీఠికలు ఒక విశిష్టతను సాధిస్తూనే, మరెంతోమందికి మార్గ దర్శనాన్ని కల్గస్తాయని భావించవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. అశ్వత్థనారాయణ, ఘట్టమరాజు. సుందరం, ఆర్వీయస్, రాళ్ళపల్లి పీఠికలు. బెంగళూరు: రాళ్ళపల్లి అభినందన సమితి,1977.
2. ఉమేశ్. బడిగె, రాళ్లపల్లి పీఠికలు పరిశీలన. (ఎం.ఫిల్., అముద్రిత సిద్ధాంత లఘు వ్యాసం), హైదరాబాద్: కేంద్రీయ విశ్వవిద్యాలయం, 2014.
3. చంద్రశేఖరరెడ్డి, డి, తెలుగు పీఠిక. హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్తు, 1990.
4. మోహన్. మేడసాని, శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ శత జయంతి సంచిక. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు తిరుపతి, 1993.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

ముదిగంటి సుజాతారెడ్డి సాహిత్యం - మహిళా జీవిత చిత్రణ

- డా॥ ఏటూరు జ్యోతి
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయము, వరంగల్.

ముదిగంటి సుజాతారెడ్డి నల్లగొండ జిల్లా ఆకారం గ్రామంలో జన్మించి, కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావం వల్ల ఆంధ్ర ప్రాంతాలకి వలసవెళ్ళి నరసరావుపేటలో స్థిరపడ్డారు. తెలంగాణా విమోచనోద్యమం జరిగి, కమ్యూనిస్టు పోరాట ఉధృతి తగ్గాక నల్గొండ వచ్చి స్థిరపడి అక్కడే చదువులు పూర్తి చేసుకున్నారు. హైదరాబాద్‌లో ఉద్యోగ రీత్యా ఉంటూ సాహితీ వ్యాసాంగం ప్రారంభించింది. కథ, నవల, యాత్రా కథ, సాహిత్య విమర్శ, సాహిత్య చరిత్ర గ్రంథాలు వ్రాసిన బహు ముఖ ప్రజ్ఞాశాలి. తెలంగాణా తెలుగు సాహిత్య చరిత్రను రాసిన మొదటి రచయిత్రి ఈమె నవలలు, కథలు, హిందీ, ఇంగ్లీష్ భాషలలోకి అనువదించబడ్డాయి. వీరు తమ రచనలలో తెలం గాణా భాషలో తెలంగాణా జీవితాన్ని, రైతుల సామాన్యుల జీవితాలను చిత్రించారు. సాఫ్ట్‌వేర్ రంగ జీవితాలను, సన్నగిల్లు తున్న మానవ సంబంధాలను, కుటుంబ వ్యవస్థలను, ప్రపంచీ కరణ, మార్కెటీకరణలను కళ్ళకు కట్టేట్లు తన కథలలో వర్ణిం చారు. విసుర్రాయి కథా సంకలనం, మింగుతున్నపట్నం కథా సంకలనం, తొలినాటి కథలకు సంపాదకత్వం చేశారు. బాణుని కాదంబరీ పరిశీలనం, ఆంధ్రుల సంస్కృతి సాహిత్య చరిత్ర, రసచర్చ ఆధునికతలు వీరి సాహిత్య రచనలు.

తెలంగాణ రచయిత్రుల్లో ముదిగంటి సుజాతరెడ్డి గారిది ప్రత్యేకమైన స్థానం. నల్లగొండ జిల్లాలోని స్త్రీ పరిశోధకుల్లో ప్రథమ పరిశోధకురాలు డా॥ రావి భారతి గారైతే, డా॥ ముది గంటి సుజాతరెడ్డి గారు ద్వితీయులు.

వీరు పరిశోధనా రంగంతోపాటు విమర్శ, కథ, నవల, చరిత్ర వంటి అనేక రంగాల్లో బహుముఖ ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శించారు.

"మను వసు చరిత్రల తులనాత్మక పరిశీలన" అనే సిద్ధాంత గ్రంథాన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమ ర్పించి పిహెచ్‌డి పట్టా పొందారు. "శ్రీనాథుని కవితా సౌందర్యం" గ్రంథం సుజాతరెడ్డి గారి సాహితీ వైదుష్యానికి ప్రతీక, ఈ గ్రంథం 'నెల్లూరి వారి కవిత్రయ సాహితీ పురస్కా రాన్ని' పొందింది. వేమన సాహిత్యంలోని నాథ సంప్రదాయాన్ని ఆవిష్కరించిన నిశిత పరిశీలనాదక్షురాలు. వీరి "ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి" గ్రంథాన్ని తెలుగు అకాడమీ వారు ప్రచురిం చారు.

సమగ్రమైన తెలుగు సాహిత్య చరిత్రనూ, వివిధ సంప్ర దాయాలనూ, ప్రక్రియలను, వివేచించి వివరించిన విశిష్ట గ్రంథం "చారిత్రక, సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర" వీరు రాసినదే.

అనేక నూతన అంశాలను ప్రతిపాదించిన ఈ గ్రంథానికి "జీవియస్ సాహితీ పురస్కారం లభించింది. ఈ పురస్కారం అందుకున్న తొలి మహిళ ముదిగంటి సుజాతరెడ్డి గారే. సాహిత్య చరిత్ర రచనలో ఆధునిక చైతన్యాన్ని ప్రస్ఫుటం చేశారని జీవియస్ గారు అభిప్రాయపడ్డారు. ఇది స్త్రీ రచించిన మొట్టమొదటి సాహిత్య చరిత్ర.

నవలా సాహిత్యాన్ని విశ్లేషిస్తూ రచించిన "నవలాను శీలనం" పుస్తకానికి తెలుగు విశ్వవిద్యాలయం వారి "ఉత్తమ రచయిత్రి" పురస్కారాన్ని అందుకున్నారు.

నవలకూ, రస సిద్ధాంతానికి సమన్వయం సాధించి వ్యాసాలు రచించి విమర్శకుల మన్ననలను అందుకున్న రసజ్ఞు రాలు. ప్రాంతీయ, అస్తిత్వవాదానికి సంబంధించిన సాహిత్య విమర్శ గ్రంథం "ముద్దెర" ఆమె విస్తృత అధ్యయనానికి సుని శిత విమర్శనా దృష్టికి తార్కాణం. తన భర్త ప్రొఫెసర్ గోపాల్ రెడ్డి గారితో కలిసి తెలుగులో "సంస్కృత సాహిత్య చరిత్ర"ను రచించారు. ఈ గ్రంథం అనేకసార్లు పునర్ముద్రణ పొందింది.

వీరి పదిహేనవ ఏటనే రచించిన "జీవన్మృతులు" కథ గోల్కొండ పత్రికలో ముద్రించబడినది. తర్వాత వివిధ పత్రికల్లో ముద్రించబడింది. తర్వాత వివిధ పత్రికల్లో ప్రచురితమైన కథలు మూడు సంపుటాలుగా వచ్చాయి.

తెలంగాణా మాండలికంలో వాస్తవ జీవిత చిత్రాలను కథల్లో చిత్రించడం వల్ల వీరి కథలకు అనేక పురస్కారాలు లభించాయి.

స్త్రీల సమస్యలను, వ్యథలను నిజజీవితంలో ఎదు రయ్యే యదార్థ సంఘటనలను "విసుర్రాయి" కథా సంపుటిలో చిత్రించారు. ఈ కథా సంపుటికి చాసో, విశాల సాహితీ పురస్కా రాలు లభించాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో నగర దౌర్జన్యా లకూ, దుర్మార్గాలకూ బలవుతున్న పల్లె ప్రజల ఆవేదనలను "మింగుతున్నపట్నం" కథా సంపుటిలో ప్రదర్శించారు. ఆధు నిక యుగంలో అతివేగంగా విజృంభిస్తున్న విషమయ వ్యాపార సంస్కృతిని "వ్యాపార మృగం" కథా సంపుటిలో చూపెట్టారు. ముస్లీం జీవితాల్లోని స్త్రీ వెతలను ఆర్ద్రంగా చిత్రించిన కథ 'జహంగీరుబీ'. దీనికి రంగవల్లి స్మారక విశిష్ట కథానిక పురస్కారం వచ్చింది. "నిశ్శబ్దం-నిశ్శబ్దం" కథ ఆంగ్ల సాహితీ క్షేత్రంలోకి అడుగిడింది.

సామాజిక చైతన్యాన్ని అభిలషిస్తూ అనేక కథలను రచించిన వీరు మరుగునపడిన "తొలితరం తెలంగాణ కథలను సేకరించి రెండు సంపుటాలుగా ప్రచురించారు. తెలంగాణ కథల సేకరణలో వీరి కృషి ప్రశంసనీయమైనది. ఈ పుస్తకానికి తెలంగాణా కథా సాహిత్య స్వరూప, స్వభావాల పైన పీఠికను రాసి తన పరిశోధనాసక్తిని ఋజువు చేసారు. తెలంగాణ కథా సాహిత్య విశిష్టతను లోకానికి చాటారు.

కథకురాలి గానే కాకుండా, నవలాకారిణిగా ప్రసిద్ధి పొందిన సుజాతారెడ్డి స్త్రీ, పురుషుల సామరస్యాన్ని కాంక్షిస్తూ "ఆకాశానికి విభజన రేఖల్లేవు" అనే నవల రాశారు.

తెలంగాణ పోరాట ఉద్యమ చరిత్ర నేపథ్యంగా "మలుపు తిరిగిన రథచక్రాలు" నవల రచించారు. వెనుక బడిన వర్గాల వారి చైతన్యాన్ని కోరుతూ "సంకెళ్ళు తెగాయి" నవల రాసారు. "వ్యాపార సంస్కృతిలో స్త్రీ చైతన్యం", "నైలు నదీ నాగరికత" అనే యాత్రా చారిత్రక గ్రంథం వీరి వస్తు రచనా వైవిధ్యానికి నిదర్శనం.

వీరి 'ముసురు' ఆత్మ కథలో ఆత్మస్తుతి తక్కువగా ఉంటుంది. ఆత్మకథకంటే వీరి ఆలోచనలూ, అభిప్రాయాలూ, చారిత్రక అంశాలే ఎక్కువగా కనిపిస్తాయి. 1940-50లలో తెలంగాణా ప్రజల సాంఘీకజీవితం గురించి 1960లలో జర్మనీ గురించి తెలుసుకోవడానికి ఆత్మకథ ఉపయోగపడుతుంది.

నిరంతర అధ్యయన శీలి, సృజనశీలి, పరిశోధకురాలు అయిన సుజాతారెడ్డి గారు వివిధ సాహితీ ప్రక్రియల్లో తన శేముషీ వైభవాన్ని ప్రదర్శించి తెలంగాణలోనే కాక, యావదాంధ్ర సాహిత్యంలోనే విశిష్ట స్థానం పొందారు.

"వ్యాపార మృగం" కథల సంపుటి

ప్రపంచీకరణ పరిణామాల ఫలితంగా వస్తున్న రాజకీయ, ఆర్థిక విధానాలు, మానవ జీవితాన్ని మరింత దుర్భరం చేస్తున్నాయి. గ్లోబలైజేషన్ మన ప్రపంచాల్నే ధ్వంసం చేస్తుంది. అసలు మనకంటూ ప్రత్యేక ప్రపంచం లేకుండా, ప్రత్యేక జీవితాల్లేకుండా, ప్రత్యేకమైన ఆలోచనలు లేకుండా చేస్తుంది. గ్లోబలైజేషన్, మనకు తెలియకుండానే జీవిత నమూనాలు ఏర్పడుతున్నాయి. మన జీవితాల్లో వున్న విధ్వంసం, హింస, సంఘర్షణ, సంక్లిష్టతలకీ ప్రపంచీకరణకి విడదీయరాని సంబంధం వుంది. ప్రపంచీకరణ, వ్యాపార ధోరణులు మానవ సంబంధాలను ఎలా విచ్ఛిన్నం చేస్తున్నాయో తెలిపే కథల సంపుటి వీరి వ్యాపార మృగం, వాణిజ్యమే ధ్యేయంగా మనుషుల్ని తరిమే వ్యాపార మృగాల గురించిన హెచ్చరికతో పాఠకుల్ని అప్రమత్తం చేస్తారు రచయిత్రి. గత దశాబ్ద కాలంగా ఆర్థిక, సామాజిక రంగాల్లో వస్తున్న మార్పుల ప్రభావం జన జీవితాల్ని ఏవిధంగా అతలాకుతలం చేస్తున్నాయో ఈ కథలు చెబుతాయి.

సాంకేతిక రంగంలో వచ్చిన సరికొత్త పరిణామాలు, ఉత్పత్తి ప్రక్రియలో పెను మార్పులకు దారితీశాయి. ఈ టెక్నాలజీతో ఉత్పత్తి ప్రక్రియను అనుసంధానం చేయడం వల్ల మానవ శ్రమకు ప్రాధాన్యం తగ్గింది. ఫలితంగా రెక్కల కష్టం మీద ఆధారపడిన వారి జీవితాల్ని ఈ యంత్ర సంస్కృతి ఎలా దెబ్బతీస్తుందో "న్యూ ఆనంద్ హెటల్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్" కథే ఉదాహరణ.

రోడ్డు వెడల్పు పనులు మొదలవుతాయి. కొన్ని రోజులయితే మన హెటల్ దగ్గరికి వస్తారు అన్నాడు సురేష్. హెటల్‌కేమైన ముప్పు వస్తదా ? అని భయంగా అంటాడు లాలయ్య. ఈ విధంగా మొదలైన కథ రోడ్డు విస్తరణలో భాగంగా హెటల్ పోతుందా? పోతే దాని ప్రత్యామ్నాయం ఏమిటి? అనేదే ఉత్కంఠభరితం. ముప్పై ఏళ్ళక్రితం భార్యతో కలిసి పట్నం వచ్చిన లాలయ్య హెటల్లో వంటకి కుదురుతాడు. కొన్ని రోజుల తర్వాత సొంతంగా 'న్యూ ఆనంద్ హెటల్' నడిపిస్తుంటాడు. దానిపై వచ్చిన కష్టంతో కూతుళ్ళ పెళ్ళి చేస్తాడు. వయసు మీదబడి కళ్ళు కనపించకుండా పోతాయి. ఆపరేషన్ అంటే భయం. కాలంతోపాటు వచ్చిన సమస్యల్లో హెటల్ సమస్య ఒకటి లాలయ్యకి. కాని హెటల్ పనులన్నీ సురేష్ చూస్తున్నాడు. సగం హెటల్ రోడ్డు విస్తరణలో పోతుంది. తండ్రీ కొడుకులు గొడవపడుతారు. మంచి ఆహారం పెట్టి హెటల్ నడపాలని లాలయ్య, సురేష్ ససేమిరా మాట్లాడకుండా మిగిలిన స్థలంలో రెండంతస్తుల మేడ వేసి బ్యాంక్ లోన్‌తో కంప్యూటర్ సెంటర్ ప్రారంభం చేస్తాడు. హెటల్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ అయ్యింది. పిజ్జా, బర్గర్లు, చాట్‌లు అమ్ముడుపోతున్నవి. లాలయ్యకి విషయం తెలిస్తే అమితంగా దుఃఖిస్తాడు, కళ్ళు లేనిది నాకు కాదు సురేష్‌కు. నలుగురికి మంచి భోజనం పెట్టాలనే ఆలోచనే లేదు. నలుగురికి పని కల్పించకుండా పనివాళ్ళను తీసేసి ఎలక్ట్రిక్ పెన్నం, జపాన్ ఓవెన్, వాష్ డిషర్లు కొనడం బాధేసింది లాలయ్యకు. పనిలో నుండి తీసివేసిన వాళ్ళ కుటుంబాల పరిస్థితి ఏమిటి అని విలపిస్తాడు లాలయ్య. ప్రపంచీకరణ ప్రభావంతో మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారుతున్న పరిస్థితికి అద్దం పడుతోందీ కథ. మానవీయ విలువలు సున్నితంగా చిత్రించబడ్డాయి. ఆధునీకరణ, నగరీకరణలో భాగంగా, పురోభివృద్ధి పేరుతో వెలిసిన న్యూ ఆనందర్ హెటల్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ ఆవేదన తెలంగాణ పల్లెల్లోని విస్తరణలో భాగంగా ఇళ్ళు కోల్పోయిన వారి ఆక్రోశం కనిపిస్తుంది. ప్రపంచీకరణ ప్రభావం కథలో చూపిస్తూ, ప్రభావానికి లోనైన వారి జీవన వేదనకు ప్రతీకగా వుంటాడు లాలయ్య.

ఇలాంటి అంశాల్ని చెప్పే కథలు ఇంకా నిశ్శబ్ద విప్లవం, మారిన బంధాలు, వ్యాపార వియ్యం, వ్యాపార మృగం మొదలైనవి.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

ప్రపంచీకరణ నేపథ్యానికి తెలంగాణ జీవితాన్ని, సహజత్వాన్ని అనుసంధానించి వాస్తవికతను తెలియజెప్పే అంశాలు కనిపిస్తాయి. వీటిలో "ముంజలు" కథ ఒకటి. డాలర్ల వేటలో విదేశాలకు వెళ్తున్న ఎంతోమంది మన దగ్గర లభించే చల్లని కుండనీళ్ళు, పుచ్చకాయలు, కొబ్బరి బొండాలు, చిన్నప్పుడు నాయనమ్మ తినిపించిన తాటి ముంజలు ఎన్ని డాలర్లు పోసినా దొరకవు గదా! డాలర్లకు ముంజకాయలు రాలవని తెలిపే కథ ఇది. తెలంగాణ యాస వీరి కథలకు పుట్టినిల్లుగా కనిపిస్తుంది. హత్య, లోకాస్, డబుల్ మర్డర్, నిస్సహాయులు, మారిన బంధాలు మొదలగు కథలు ఈ కోవలోవే.

ఇవే కాకుండా ముస్లిం స్త్రీల వేధనాభరితమైన జీవిత వ్యథల్ని "జహంగీరుబీ" "షబానాదుఃఖం" "మున్నీబాయి" కథల్లో చిత్రించారు.

ఆత్మీయ అనుబంధాలు, మమతానురాగాలు ఇక్కడే విలసిల్లుతున్నాయా, అనిపించే అపురూప దృశ్యాలు వ్యాపారీకరణ వలన గ్రామీణ జీవితంలో నెమ్మది, నెమ్మదిగా నశిస్తున్నాయి.

మింగుతున్న పట్నం

"మింగుతున్న పట్నం" కథా సంపుటిలో 17 కథలున్నాయి. ఈ కథలన్నీ వివిధ పత్రికల్లో, సంకలన్నాల్లో ప్రచురింపబడినవే. రచయితలు కేవలం స్త్రీలకి సంబంధించిన ఇతివృత్తం మాత్రమే తీసుకుని రచనలు చేయడం మంచిది కాదని, సమాజంలో జరుగుతున్న సామాజిక, రాజకీయ పరిణామాలకు, మానవత్వ స్పందనలే తన రచనలకు ఇతివృత్తం అని తన మనుసులో మాట చెప్పుకున్నారు సుజాతారెడ్డి గారు.

సుజాతారెడ్డి గారు తెలంగాణ వాసి కావడం వలన వీరి కథలు ఎక్కువగా తెలంగాణ ప్రాంత వ్యవసాయ సమస్యను నేపథ్యంగా తీసుకున్నవి. పట్నం వీరి జీవితాలను ఎలా దోచుకుంటుందో ఈ కథలు వివరిస్తాయి.

మింగుతున్న పట్నం రకరకాల రూపాల్లో కనిపిస్తుంది. వర్షాభావం వల్ల పల్లెటూల్లోని రైతులు ఉన్నదంతా అమ్ముకుని పట్నం చేరితే వారి బ్రతుకును నగర శివార్లలో వున్న భూములను, పల్లె భాషను, మానవ విలువలను, స్త్రీల శ్రమను దోచుకోవడం ఇంకా అనేక విధాలుగా చిత్రించారు.

ఒకప్పుడు స్వయం పోషకాలుగా, ప్రేమ సంబంధాలతో వున్న ప్రశాంతమైన పాత గ్రామీణ వ్యవస్థ కూలిపోయి, దాని స్థానంలో అభివృద్ధితో కూడిన కొత్త వ్యవస్థ రాకపోవడం వంటి అంశాలను చిత్రించారు.

ఈమె కథలు చాలా వరకు సాదాసీదాగా ప్రారంభమవుతాయి. ఆ తర్వాత జీవితం లోతులను తవ్వుకుంటూ పోతాయి. ముందుకు సాగుతున్న కొలది తాను చెప్పదలచుకున్న భావం చిక్కబడుతుంది. చెప్పదలచిన దానికంటే ఎక్కువ లేకుండా, అనవసరమైన పాత్రలను కథలో ప్రవేశపెట్టకుండా కథను పూర్తిగా తన ఆధీనంలో వుంచుకుంటారు.

ఈ సంపుటిలోని కథలన్నీ చదివినపుడు మనకు సూటిగా ఒక విషయం అర్థమవుతుంది. దీనిలో ఎక్కువ కథలు తెలంగాణ కరువును నేపథ్యంగా తీసుకుని వ్యవసాయ కూలీల ఇక్కట్లు, ఆకలి, పేదరికం, నిరక్షరాస్యత మొదలగు పోగుచేసి రాసిన బ్రతుకు చిత్రాలేగాని కాలక్షేప కథలు కావు.

"సంకెళ్ళు తెగాయి" (నవల)

నారాయణ పేదవాడు. నిమ్న కులంలో పుట్టిన యువకుడు. కుల వృత్తులపై ఆధారపడడం ఇష్టం లేదితనికి. చదువుకోవాలనే తపన వుంది. కష్టపడి చదివి సమాజంలో ఉన్నత స్థానానికి చేరుకునే ఇతివృత్తం ఈ నవలలో కనిపిస్తుంది. నారాయణ పట్నంలో తనకు పరిచయమైన గొప్ప వ్యక్తుల సహాయంతోతను సముపార్జించిన విజ్ఞానం, అనుభవాలతో తరతరాల దాస్యాన్ని కులాల సంకెళ్ళను తెంచుకుని బయట పడ్డాడు. ఆ దారిలో అతడెదుర్కొన్న కష్టాలు, సమస్యలు అనేకం, చివరకు విజయం అతనిదే.

సమాజం, వ్యవస్థ మీద విజయం సాధించాలంటే వ్యక్తిలో క్రమశిక్షణ, చిత్తశుద్ధి, శ్రమ, కఠోర దీక్ష, దృఢ సంకల్పం వుండాలని లేకపోతే అరాచకం సృష్టించబడుతుందని భావిస్తాడు. క్రమశిక్షణ, పట్టుదలతో ఎలాంటి సంకెళ్ళనైనా తెంచవచ్చు అని నారాయణ అభిప్రాయం. ఈ మార్గంలో పయనించి విజయం సాధిస్తాడు.

ముదిగంటి సుజాతారెడ్డి గారి రచనల్లో స్త్రీ అస్తిత్వం చైతన్యాన్ని తెలిపే "విసుర్రాయి" కథల సంపుటి. "ఆకాశంలో విభజన రేఖల్లేవు" నవల "మలుపు తిరిగిన రథ చక్రాలు" నవలలో సరళపాత్ర.

విసుర్రాయి - కథల సంపుటి

"విసుర్రాయి" కథలను పరిశీలిస్తే వాస్తవికత, నిజాయితీని కలిగి స్పష్టంగా, సూటిగా వుంటూనే, అవసరమైనంత సంఘర్షణను కలిగి వున్నాయి.

ముదిగంటి సుజాతారెడ్డి సమాజం పట్ల మానవ సంబంధాలపట్ల, ముఖ్యంగా స్త్రీ, పురుషుల సంబంధాల పట్ల, రాజ్యం, రాజ్యహింస, సమాజంలోని ఆర్థిక అసమానతలను గూర్చి, స్పష్టమైన అవగాహన కలిగి వున్నారు. అన్ని కథల్లో స్త్రీపాత్ర ప్రధానంగా వుంటుంది. స్త్రీ జీవితం, హింస, అణిచివేత, కష్టాలు, వేధింపులు, వివక్ష దౌర్జన్యం, స్త్రీ జీవితాన్ని ఎలా దుర్భరం చేస్తున్నాయో తెలియజేస్తాయి ఈ కథలు.

"విసుర్రాయి" కథలోని స్త్రీ పాత్ర సక్కుబాయి. ఉదయం లేచినప్పటి నుండి రాత్రి పడుకునే వరకు ఇంటి

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

పనుల్లోనే నిమగ్నమవుతుంది. భర్త, పిల్లలు, అత్త వీరికి సకల సౌకర్యాలు సమకూర్చాకే ఇంత ముద్ద తిని పడుకుంటుంది. భర్త ఎప్పుడు తన బాగోగులు చూసుకోడు. ప్రేమతో ఒక్కమాట కూడా మాట్లాడడు. ఆ ఇంట్లో సక్కుబాయి "విసుర్రాయి" లాగా తిరుగుతూనే వుంటుంది. స్త్రీల జీవితాలను విసుర్రాయితో పోల్చడం చక్కని ఉపమానం.

విసుర్రాయి స్త్రీ శ్రమకు సంకేతం. సక్కుబాయి తనదైన సంతోషం గానీ, స్వేచ్ఛగానీ అనుభవించక భర్త, పిల్లలు, అత్త చుట్టూ పరిభ్రమించే విసుర్రాయి జీవితం అవుతుంది.

"రౌడీయిజం", "నేరమేమిటి" కథల్లో ప్రతిభ గల ఆడ పిల్లలు, మగవాళ్ళ అహంకారానికి, రౌడీయిజానికి ఎలా బలవుతున్నారో చిత్రించారు.

"రౌడీయిజం" కథలో ఏషియన్ గేమ్స్‌లో పాల్గొని బంగారు పతకాలు స్వంతం చేసుకోవాలని కలలుగన్న కవలలు హరిత, సరితలు. ఈ అక్కా, చెల్లెళ్ళ జీవితాలు రౌడీల భారిన పడి వారి పశు బలానికి బలవుతారు. దీనికితోడు పోలీస్ ఇన్స్‌పెక్టర్, "మీకెవరైనా బాయ్ ఫ్రెండ్స్ వున్నారా?" "మీరసలు రాత్రివేళ చీకట్లో ఎందుకు వెళ్తున్నారు" "మగవాళ్ళను ప్రొవకేట్ చేసే విధంగా డ్రస్ చేసుకున్నారా?" వంటి ప్రశ్నలు హరితను ఆమె తల్లిదండ్రులను ఇంకా బాదిస్తాయి. ఇది మన వ్యవస్థలోని పురుషుల దృష్టి కోణాన్ని తెలుపుతుంది. బాధితులైన స్త్రీలపట్ల సానుభూతితో అర్థం చేసుకోకపోగా, గుచ్చి గుచ్చి ప్రశ్నలు వేసే మన వ్యవస్థ తీరుకు ఈ కథ అద్దంపడుతుంది.

"నేరమేమిటి" కథలో సుధ ధైర్యం, ఆత్మవిశ్వాసం గల అమ్మాయి. స్కూటర్ నేర్చుకుని, కాలేజికి స్కూటర్‌పైనే వెళ్ళివస్తుంటుంది. అమ్మాయి స్కూటర్ నడపడమేమిటి అనే అహంకారంతో బస్సు డ్రైవర్ స్కూటర్‌ను ఢీకొట్టి ఆమె చావుకు కారణమవుతాడు. ఈ కథలో సుధ పురుషాహంకారానికి, పురుషాధిక్య భావజాలానికి బలవుతుంది.

"స్వేఛ్ఛ", "బందీ", "నస్త్రీస్వాతంత్ర్యమర్హతి" కథల్లో కన్నకొడుకులు, బిడ్డల నుండి స్త్రీ వ్యక్తిత్వానికి, స్వేచ్ఛకు ఎలా సంకెళ్ళు పడతాయో చిత్రించారు.

"స్వేఛ్ఛ" కథలో కన్నకొడుకే తన స్వేచ్ఛకు అడుగడుగునా ఆటంకంగా నిలుస్తాడు. సరోజ భర్త వేణు, శేఖర్‌కు రెండేళ్ళ వయసున్నప్పుడే చనిపోతాడు. శేఖర్ బాధ్యతలన్నీ సరోజ మోస్తూ గొప్పవాన్ని చేస్తుంది. భర్త చనిపోయినపుడు ఉద్యోగం నుండి రిటైర్ అయ్యాక ఆమె జీవితంలో శూన్యం ఆవరిస్తుంది. ఇలాంటి సందర్భంలో కనీసం, తన స్నేహితులతో కలిసి హాయిగా నవ్వుకునే కొన్ని సందర్భాలకు కూడా తన కొడుకు అడ్డంకి అవుతుంటాడు. పురుషుడు (కొడుకైనా) ప్రసాదించేదే స్వేచ్ఛ అనే ధోరణిలో కొడుకు ప్రవర్తిస్తాడు.

ఇలాంటి పరిస్థితుల్లో తన స్వేచ్ఛను వెదుక్కుంటూ బంధాలను పక్కన పెట్టి, వృద్ధాశ్రమంలో చేరి తన జీవితానికి తన స్వేచ్ఛను ప్రకటించుకుంటుంది. స్త్రీకి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఎవరో ప్రసాదించేవి కావు. ఎవరికి వారే స్వేచ్ఛను సాధించుకోవాలని సరోజ పాత్ర ద్వారా చెపుతారు రచయిత్రి.

భిన్న సంస్కృతుల మధ్య వున్న అంతరాలలో 'బందీ' అయిన ఒక తల్లి కథ ఇది. అన్నపూర్ణకు ఒక్కతే కూతురు. ఈమెకు పురుడు పోయాలని అమెరికా వెళ్తుంది. కానీ మాతృదేశ సంప్రదాయాలు, సంస్కృతిని మరిచి, అమెరికా పాశ్చాత్య సంస్కృతికే అలవాటు పడ్డ కూతురు ప్రవర్తనకు చాలా మానసిక వేదన చెందుతుంది. అక్కడ ఆమె అనుభవించే ఒంటరితనంతో "బందీ" అవుతుంది. ఇక్కడ పాప స్కూల్‌కు వెళ్ళే వరకు తల్లి అవసరం వుంది. కాబట్టి తల్లిని 2, 3 సం॥ల వరకు ఇండియాకి వెళ్ళవద్దంటుంది కూతురు. అది వారి అవసరం. దానికి "బందీ" అవుతుంది.

"నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి" కథలో "నువ్వు నోర్మూసుకో, నీకేం తెలుసని" ఇదే మాటలను తండ్రి, భర్త, కొడుకులు అంటూనే వుంటారు. చివరకు వృద్ధాప్యంలో తన పోషణను కొడుకులు పంచుకుంటుంటే వ్యతిరేకిస్తుంది. అపుడూ "నోర్మూసుకో" అనేదే సమాధానం. తల్లి ఆ మాటను భరించలేక పోతుంది. మౌనంగా, దృఢనిశ్చయంతో కొడుకుల నుండి వేరుగా బ్రతకడానికి బయటకు నడుస్తుంది. ఇక్కడ కూడా తన స్వేచ్ఛను సగర్వంగా ప్రకటించుకుంటుంది. బాల్యం, యౌవనం, వృద్ధాప్యంలోనూ "స్త్రీ స్వేచ్ఛార్హురాలు" కాదు అనే కట్టుబాట్లను తెంపివేస్తుంది రచయిత్రి.

"జవాబుల్లేని ప్రశ్నలు" కథలో పత్తిరైతు ఆత్మహత్యను ఇతివృత్తంగా చూపిన కథ. పంటలు సరిగా పండక, పండిన పంటకు గిట్టుబాటు ధరరాక చేసిన అప్పులు తీరక, కుటుంబ పోషణ చేయలేక, రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు మనం గత కొన్నేళ్ళుగా చూస్తున్నాం. సుజాతారెడ్డి గారు కథను స్త్రీ కోణం నుండి చూపిన విధానం ఆలోచింప చేసే విధంగా వుంది.

రైతు ఆత్మహత్య చేసుకున్నపుడు అసలు బాధితురాలు అతని భార్య. భర్త చనిపోయాక ఆ అప్పులు తీర్చడానికి, పిల్లలను పోషించడానికి వున్న పొలం సాగుచేయడానికి ఒక్క ఆడ మనిషి ఎన్ని కష్టాలు పడాల్సి వస్తుందో అని యాదమ్మ అడిగిన ప్రశ్నలకు మన సమాజం దగ్గర, వ్యవస్థ దగ్గర జవాబులు లేవు.

"కబ్జా" కథలో రాజకీయ పలుకుబడి, ఆస్తి, హోదా పెంచుకోవడం కోసం తన భార్యనే ఫణంగా పెట్టిన భర్త దుర్మార్గత్వమే ఈ కథ. ప్రత్యర్థిని దెబ్బతీయడానికి తన భార్యను

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

రేప్ చేశాడంటూ దొంగకేసు పెట్టి గెలుస్తాడు భర్త. ఈ మొత్తం వ్యవహారంలో మానసికంగా కృంగిపోయిన భార్య, భర్త నీచత్వాన్ని భరించలేక అతని ముఖంపై తుపుక్కున ఉమ్మేసి వెళ్ళిపోతుంది. ఈ విధంగా తన తిరుగుబాటును ఛీత్కారంతో ప్రకటిస్తుంది. మరొక కథ "ధర్మపత్ని"లో మహిళా రిజర్వేషన్ ద్వారా సర్పంచ్ అవుతుంది భార్య. తన భార్య అధికారాలను తన గుప్పిట్లోనే పెట్టుకోవాలనుకుంటాడు భర్త. అది గ్రహించిన భార్య "స్త్రీ" ఎన్నాళ్ళయినా ఇంతేనా ఇలా జరుగవద్దని దృఢ నిశ్చయంతో పంచాయితీ ఆఫీసుకు బయలుదేరుతుంది.

"బొమ్మలో చైతన్యం" కథలో తన భర్త మరో స్త్రీతో ఉండడం భార్య కళ్ళారా చూస్తుంది. వెంటనే విడకులు కోరడంతో ఇంతకు ముందు ఆమెలో లేని చైతన్యాన్ని తెచ్చుకుంటుంది.

"పలాయనం" కథలో భర్త కుటుంబాన్ని పట్టించుకోకుండా తాగుబోతుగా మారుతాడు. భార్యను కొడతాడు. దాచుకున్న సొమ్ము దొంగిలిస్తాడు. చివరకు కుటుంబ బాధ్యతల నుండి తప్పుకుని సన్యాసులలో కలుస్తాడు. స్త్రీ ఒక్కతే కుటుంబ భారాన్ని మోయడం, పిల్లలకు రక్షణ కల్పించడం మొదలగునవి స్త్రీలోని ఔన్నత్యాన్ని వర్ణిస్తుంది రచయిత్రి. పల్లె నుండి పట్నంలోని వ్యభిచార గృహాలకు అక్రమంగా అమ్మబడే అమాయక స్త్రీల పరిస్థితిని "బేరం" కథలో చూడవచ్చు.

"స్నేహలతాదేవి" లేఖ కథలో వరకట్న సమస్య, పెళ్ళి చూపులు మొదలగు వాటితో విసిగి, వేసారి ఒంటరిగా జీవించాడానికి నిశ్చయించుకుంటుంది. స్నేహలతాదేవి ఈ పరిస్థితులనే వివరిస్తూ తోటివారికి రాసే ఉత్తరమే ఈ కథ. ఏ స్త్రీ అయినా, నిస్సహాయ పరిస్థితుల్లో మానసిక ఒత్తిడితో ధైర్యం కోల్పోయి ప్రాణాలను తీసుకోవద్దు. పరిస్థితులకు ధైర్యంగా ఎదురు నిలవండి. మనలోని నైపుణ్యాలకు సానబెట్టి జీవితాన్ని మనకిష్టమైన రీతిగా తయారు చేసుకోవచ్చని అందరికి మనోధైర్యాన్ని ఇస్తుంది. దీనిని లేఖా కథనం ద్వారా తెలియజేస్తుంది.

సుజాతారెడ్డి తెలంగాణ ప్రాంతవాసి కావడం వలన, ఇతర ప్రాంతాల స్త్రీలు రాసిన కథలను, వీరి కథలకు ఇతివృత్త సేకరణలో మౌలికమైన తేడాను గుర్తించవచ్చు. చదువుకున్న మధ్యతరగతి పట్టణ స్త్రీల సమస్యలు వీరి కథల్లో కన్పించవు.

ఈ కథా సంపుటిలో కుటుంబంలోనూ, బయట సమాజంలోనూ స్త్రీ అణిచివేతకు మూలకారణం పితృస్వామ్య భావజాలం. దాని ప్రతినిధులైన పురుషులు వుంటారు. దీనికి భిన్నంగా "ఆకాశంలో విభజన రేఖల్లేవు" నవలలో పురుష పాత్రలన్నీ ఆదర్శవాదులుగా, మంచివాళ్ళుగా కనిపిస్తే, స్త్రీ పాత్రలన్నీ దానికి భిన్నమైన స్వభావంతో, ద్వంద్వ వైఖరులతో వుంటాయి.

ఆకాశంలో విభజన రేఖల్లేవు

తెలుగునాట 1970 దశకం తర్వాత వచ్చిన అస్తిత్వ ఉద్యమాలలో స్త్రీవాదం ప్రధానమైనది. ఈ ఉద్యమం స్త్రీ సమస్యల చిత్రణతో సాహిత్యాన్ని పరిపుష్టం చేసింది. స్త్రీ వాద కవిత్వం, నవలలు, కథలు అనేకం వచ్చాయి.

సాధారణంగా స్త్రీవాద రచనల్లో అణచివేతకు గురయ్యే స్త్రీ పాత్రలు వుంటాయి. అణచివేత స్థానంలో పురుషుడు ఉంటాడు. చాలా కథలల్లో, నవలల్లో స్త్రీ యొక్క తిరుగుబాటు ధోరణి, చైతన్య స్థాయి, చివరికి పురుష స్పర్శనే అసహించుకోవడం, పురుషుడితో సహజీవనం ఇమడక స్త్రీ తన అస్తిత్వాన్ని చంపుకోలేక నూతన ప్రయోగాలకు దారితీసింది.

ఇలాంటి వైవిధ్య పూరిత వాతావరణం ఆహ్వానించదగినది కాదంటూ సుజాతారెడ్డి గారు "ఆకాశంలో విభజన రేఖల్లేవు" అనే నవల రాశారు. ఓల్గా, జయప్రభ వంటివారు "ఆకాశంలో సగం"గా స్త్రీలను పేర్కొంటే సుజాతరెడ్డి గారు అసలు విభజన రేఖలే లేవనడం గమనార్హం.

ఒక జండర్‌లో అన్నీ మంచి గుణాలు, మరొక జండర్‌లో అన్నీ చెడు గుణాలు వుంటాయనడం పిడివాదంగా ఉంటుందే తప్ప, నిజ జీవితంలో అటువంటి విభజన వుండదని అంటారు. కాకపోతే ఆడ, మగలో అధికారం, ఆధిపత్యాలు చలాయించే తీరులో భేదం ఉండవచ్చునని అభిప్రాయపడుతారు.

ఈ నవలలో ప్రధాన పాత్ర రాగిణి. చైతన్యవంతమైన భావాలు కల స్త్రీ. స్వంత అభిప్రాయాలు కలది. ఇప్పటి వరకు స్త్రీ వాద ఉద్యమంలో లేవనెత్తిన వివిధ అంశాలకు ఈ పాత్ర ద్వారానే సంభాషణ రూపంలో సమాధానం చెప్పిస్తుంది రచయిత్రి. రాగిణి పాత్రలో సుజాతారెడ్డి గారి భావజాలం కనిపిస్తుంది.

స్త్రీ తనకు తాను చైతన్యవంతమవుతూ పురుషుడి స్వభావంతో మార్పు తీసుకువస్తేనే స్త్రీ జీవితంలో గుణాత్మకమైన, నిజమైన మార్పును చూడగలము. "మగవారందరూ అలా, ఆడవాళ్ళందరూ ఇలా" అని విభజన రేఖలు గీయడం వాస్తవికం అనిపించుకోదు అని అంటారు ఆమె.

మన దేశంలో స్త్రీవాద ఉద్యమం పాశ్చాత్య సాహిత్య ప్రభావం వల్ల వచ్చిందే కానీ, దేశీయ వేర్ల నుండి పుట్టింది కాదని, ముందుగా మన సమాజంలో స్త్రీ పురుష సంబంధాలలో చాలా మార్పులు రావాలి. ఆడ, మగ కాన్షియస్ లేకుండా మాట్లాడుకునే సమాజం రావాలి. ఆ తరువాతనే స్త్రీ విముక్తి ఉద్యమాలు వస్తే బాగుంటుందని అభిప్రాయపడుతుంది. స్త్రీ తమంతట తాము ముందుకు రావాలి. అంతేగాని, నినాదాలతో లాభం లేదని, పురుషద్వేషంతో విప్లవం అవసరం లేదని చెబుతుంది.

ఇకపోతే వివాహ కుటుంబ వ్యవస్థలు స్త్రీని అణిచివేస్తాయని, అవి 'వద్దు' అనుకుంటూ "వాటి స్థానంలో తీసుకురాబోయే వ్యవస్థ రూపం తెలియనపుడు అరాచకమే సృష్టించబడుతుంది" అని స్త్రీ, పురుషుల మధ్య ఆరోగ్యకరమైన లైంగిక జీవితం, వివాహం, కుటుంబం వల్లనే సాధ్యమని చెపుతుంది. వివాహం, కుటుంబం అనే కట్టుబాట్లలో మొగుడు కొట్టినా, అవమానించినా, సెక్స్‌కోసం ఆడది బానిసగా మగానికే కట్టుబడి ఉండక, ఇద్దరికి సరిపడక పోతే విడాకులు తీసుకునే స్వేచ్ఛ వుండాలి. అలా మళ్ళీ పెళ్ళి చేసుకోగలగాలి. దీనికి తోడు స్త్రీ ఆర్థిక స్వావలంభన సాధించాలి.

వరకట్న సమస్య, దానితో సంభవించే ఆత్మహత్యలు, చిన్న వయసులో స్త్రీలు గర్భవతులు కావటం, బాల్య వివాహాలు, ఆర్థిక స్వావలంభన వంటి సమస్యలను కూడా ఈ నవలలో ప్రస్తావించారు. వీటిని ఆర్థిక, సామాజిక, మానసిక సమస్యలుగా పరిష్కరించాలి. తల్లిదండ్రులలో మార్పు రావాలి. ఆస్తిలో సమాన భాగాలివ్వాలి అంటారు. కానీ వీటికి సంబంధించిన నిర్దిష్టమైన ఉద్యమం గురించి చెప్పకుండా ఉదారవాద సమాధానాలు చెప్పడంతో ఈ నవల ముగుస్తుంది.

డా॥ సి.మృణాళిని గారు "స్టీరియో టైపు నుండి బయటపడిన స్త్రీల నవల" అన్నట్లు 1990 దశకం తర్వాత స్త్రీని ఇతివృత్తంగా తీసుకుని వచ్చిన నవలల్లో స్త్రీవాద నవలలు, స్త్రీ చైతన్య నవలలు అనే తేడా చూపవచ్చు.

మొదటి రకం నవలల్లో స్త్రీవాద సిద్ధాంతాల అవగాహనతో దానిలోని తార్కికతను పాఠకులకు పరిచయం చేసిన నవలలు స్త్రీవాద నవలలు.

రెండోరకం ప్రత్యేకించి సిద్ధాంత పరిజ్ఞానం లేకున్నా, తేడా ఈ సిద్ధాంతంతో ఏకీభావం కుదరక అనుభవంతో జీవిత పరిశీలన ద్వారా స్త్రీ వ్యక్తిత్వాన్ని చైతన్య పూరితంగా ప్రయత్నించిన నవలలు. సుజాతారెడ్డి గారి నవల రెండో విభాగానికి చెందినది. ఈ నవలలో స్త్రీవాద సిద్ధాంతాలను సవాలు చేస్తే స్త్రీ చైతన్య వంతమవడాన్ని కాంక్షించాలనే రాజీధోరణి కొంత కన్పిస్తుంది. అందుకు సుజాతారెడ్డి గారిని స్త్రీవాద రచయిత్రి కాదంటున్నారు చాలా మంది. ఎన్నో స్త్రీవాద ధోరణులున్నా, నూతన ధోరణులు వస్తున్న నేటి సందర్భంలో తనదీ ఒక ధోరణి అంటుంది సుజాతారెడ్డి గారు.

మలుపు తిరిగిన రథ చక్రాలు

మలుపు తిరిగిన రథ చక్రాలు నవలలో కథాకాలం 1946-86 మధ్య పరిస్థితులను తీసుకున్నారు. ఈ నవలలో ప్రధాన పాత్రదారులు సరళ, రమేష్, సరళ దొర కూతురు. రమేష్ సాయుధ విప్లవోద్యమాన్ని జీవితంగా చేసుకున్న దళ నాయకుడు. బతుకమ్మ పండుగ జరుపుకుంటున్న సమయంలో ఆడవారి ఒంటిపై ఉన్న బంగారు నగలు దోపిడీ చేయాలనే పథకం వేస్తాడు దొర, అతని అనుచరులైన రజాకార్లు, పోలీస్ పట్వారీలు. ఇది తెలుసుకున్న రమేష్ తన దళంతో అక్కడికి వస్తాడు. ఇక్కడ జరిగిన ఘర్షణలో రమేష్ దళనాయకుడు గాయపడ్తాడు. సరళ, ఆడబాప కస్తూరీలు ఇతన్ని రక్షిస్తారు. రమేష్ ఎవరో అతని నేపథ్యం ఏమిటో తెలియకుండానే సరళ, రమేష్ పరిచయం జరిగిపోతుంది. రమేష్ ఎవరో తెలిసాక సరళకు అతనిపై ఇష్టం, రమేష్ పరిచయం జరిగిపోతుంది. రమేష్ ఎవరో తెలిసాక సరళకు అతనిపై ఇష్టం, ప్రేమ బలపడుతుంది. పెళ్ళి చేసుకొమ్మంటుంది. కానీ సరళ అంటే ఇష్టం ఉన్నప్పటికీ రమేష్ ప్రజా ఉద్యమానికి అంకితమైనందున పెళ్ళికి ఒప్పుకోడు.

ఆ తర్వాత రమేష్ దళం దొరను చంపేస్తుంది. గడీని ధ్వంసం చేస్తారు. ఆ ఉద్రిక్త పరిస్థితుల నుండి సరళ, కస్తూరీలను తప్పించి హైదరాబాద్‌కు పంపటం జరుగుతుంది. అక్కడ జరిగిన వివిధ పరిణామాలలో దాసు, సరళను పెళ్ళి చేసుకుంటాడు. దాసు మంచివాడు కాదు. వీరికి ఆశాలత పుడుతుంది.

పోలీస్ చర్య (1948 సెప్టెంబర్, 17) తర్వాత, హైదరాబాద్ స్టేట్ స్వాతంత్ర్యం అవడం, 1956 నవంబర్, 1న విశాలాంధ్ర ఏర్పడడం వంటి ఘటనలలో దాసులాంటి వారు ఖద్దరు టోపీ, బట్టలతో రాజకీయాల్లోకి రావడం జరుగుతుంది. సమసమాజం రావాలని కోరుకునే రమేష్‌లాంటి వారు ఉద్యమంలోనే వుంటారు. సరళ ఎన్నోసార్లు రమేష్‌ను ప్రజాస్వామ్యంలోకి వచ్చి చట్టాలతో తాననుకున్న మార్పును తీసుకు రమ్మని కోరుతుంది. కానీ అలా జరగదు.

సరళ కూతురు ఆశాలతకు పెళ్ళయి ఒక బేబికి జన్మనిస్తుంది. తరువాత అనుకోకుండా జరిగిన దుర్ఘటనలో భార్యాభర్తలు చనిపోతారు. అపుడు బేబీ బాధ్యత సరళపై పడుతుంది. మరణానికి దగ్గరైన సరళ చివర్లో రమేష్‌ను పిలిపించుకుని అచ్చం తన రూపురేఖలతో వున్న బేబీని అతని చేతుల్లో పెడుతుంది. బేబీని సంరక్షించాలనే సరళ ప్రగాఢమైన ఆకాంక్ష మేరకు తన ఉద్యమాన్ని వదిలి ప్రజాస్వామ్యంలోకి రావడమే ఈ మలుపు తిరిగిన రథచక్రాలు.

1954లో మహీధర రామ్మోహన్‌రావు గారి 'రథచక్రాలు' నవల విప్లవోద్యమం వైపు పరిగెడితే, సరిగ్గా 40 సం॥ల తర్వాత 1994లో వచ్చిన సుజాతారెడ్డి 'రథచక్రాలు' విప్లవోద్యమం నుండి ప్రజాస్వామ్యం వైపు మలుపు తిరుగుతాయి.

ఈ నవలలో రమేష్, సరళలు రెండు భిన్న దృక్పథాలకు ప్రతీకలు. రమేష్ సమసమాజ స్థాపనకు విప్లవోద్యమమే సాధనం అనుకుంటే, సరళ మాత్రం ప్రజాస్వామ్య ప్రభుత్వాల వలన దోపిడీ వ్యవస్థను రూపుమాపవచ్చునని నమ్ముతుంది.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

ఈ నవలలో సరళ పాత్ర పేరుకు తగ్గట్టే సరళంగా ఉంటుంది. దొర కూతురును అన్న అహంభావం ఇసుమంతైనా కనిపించదు. అందుకే తీవ్ర కష్టకాలంలో సైతం ఆడబాప కస్తూరి, సరళను అంటిపెట్టుకుని ఆమె బాగోగులు చూస్తుం టుంది. అప్పటికి ముక్కు, మొహం తెలియని దళనాయకుడు రమేష్ గాయపడితే రహస్యంగా వైద్యం చేయిస్తుంది. అదే దళంచే తండ్రి, అన్న చంపబడినపుడు "కొన్ని వందల ఏళ్ళుగా బానిసత్వంలో మగ్గిన ప్రజల హాహాకారాలే వీరిని బలి తీసుకున్నాయి" అని తనలోని మానవీయ, సామాజిక కోణాన్ని బయటపెడుతుంది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో నిజమైన సోషలిస్ట్ నాయకులు విప్లవ మార్గంలో పయనించడం వలన ఎన్నికలలో స్వార్థపర శక్తులు పాల్గొని వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్నాయని బాధపడు తుంది.

రమేష్ సరళ కొరకు ఉద్యమాన్ని విడిచిపెట్టక పోవడం వలన సరళ తనకు ఇష్టం లేని వ్యక్తి దానును పెళ్ళాడుతుంది. (ఇతడు గడిలోని సరళ మామకు, ఆడబాపకు కలిగిన సంతా నం) అయినా రమేష్‌ను, అతని చైతన్యాన్ని తన మది నిండా నింపుకుని ఉంటుంది.

"స్వేచ్ఛా స్వాతంత్ర్యాలున్న దేశంలో ఇంకా ఎందుకు మృత్యువు నిన్ను వెంటాడుతుండగా తిరుగుతావు అని విప్లవోద్యమం విడిచిపెట్టి ప్రజా పరిపాలనలోకి వచ్చి తాను సాధించదలచినవి చట్టాల ద్వారా సాధించలేవా?" అని ప్రశ్ని స్తుంది. ఈ మాటలన్నీ సరళలోని ప్రజాస్వామ్యం పట్ల తనకున్న విశ్వాసాన్ని, నమ్మకాన్ని చూపెడుతాయి.

చివర్లో, సరళ, రమేష్‌ల సంభాషణ ప్రజాస్వామ్య, విప్లవ వాదాల సంభాషణల్లాగా సరళ బేబీ బాధ్యతను రమేష్ చేతుల్లో పెట్టడాన్ని ప్రజాస్వామ్యాన్ని ఇచ్చినట్లుగా రమేష్ బేబీని కౌగిలించుకోవడం ప్రజాస్వామ్యానికి దగ్గరయినట్లుగా చూపిం చింది రచయిత్రి.

రమేష్ ఉద్యమం వదిలి సరళ మార్గంలోకి రావడం సరైందా, కాదా? అనే చర్చను ప్రక్కన పెడితే నవలలో మొదటి నుండి చివరి వరకు ప్రజాస్వామిక విలువలకు, ఆకాంక్షలకు, ఆచరణకు ప్రతినిధిగా నిలుస్తుంది సరళ పాత్ర.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

మహాభాగవతము - ప్రయాణ సాధనాలు

- డా॥ జి. హైమావతి

ఉపోద్ఘాతం : భాగవతములో ఎక్కువగా ఎక్కువగా దైవలీలలకు తావుంది. తక్కినవన్ని అప్రధానములే. అయినప్పటికి ఎంత పురాణమైనా సమాజం కూడా కొంత ఉంటుంది. దీనినే మహాకవి కాళిదాసు పురాణమిత్యేవ "నసాదు సర్వం నచాపి కావ్యం నవమిత్యవద్యమ్" అన్నాడు. అందువల్ల వ్యాస మహర్షి నాటికి, పోతన కాలం నాటికి దాదాపు ఒకే విధంగా సమాజం ఉండేది. వర్ణవ్యవస్థ అందులో ఒకటి వృత్తి సౌకర్యాన్ని బట్టి నాటి వర్ణవ్యవస్థ ఏర్పడింది. గీతాకారుడే చెప్పినటువంటి "గుణకర్మ విభాగశః॥ అన్నందువల్ల గునాలను బట్టి, చేసే పనులకు బట్టి కూడా ఈ వర్ణవ్యవస్థ చాలా కాలం నుండి సాగివస్తు ఉంది. ఆనాడు ఎవరి పనులు వారు చేసుకునేవారు. ఎక్కడో తప్ప అవినీతికి, చౌర్యానికి తావుండేది కాదు. నాటి వ్యవస్థ నేటికి పరోక్షంగా ఉంది. హేతువాదులు ఈ వర్ణవ్యవస్థను బట్టి నిరసిస్తారు భగవంతునికి హేతువుతో పనిలేదు.

నేటి ఆధునిక యుగంలో పర్యావరణానికి హాని కలిగించే విషవాయువుల విడుదలకు కారణం మనం ఉపయోగించే యాంత్రిక సాధనాలే. పర్యావరణ మనుగడకు కీలకం వైవిధ్యమైన జీవాలు, జీవులన్ని అంతరిస్తే పర్యావరణంలో అసమతౌల్యం ఏర్పడి ఈ పుడమి మీద మనిషికే కాదు. సమస్త ప్రాణుల మనుగడకు ముప్పు వాటిల్లవచ్చు. ఒక ప్రాణి పూర్తిగా అంతరించిన నాడు ఆహార గొలుసు విచ్ఛిన్నమై వినాశనానికి దారితీయును. ప్రకృతిలో భాగమైన ఈ జీవవైవిధ్యాన్ని మన పూర్వులు గుర్తించి మనకు ఆచరణలో సందేశాన్ని చూపించారు. ప్రాచీన సంస్కృతిలో ఎందరో దేవతలు జంతువులను తమ వాహనాలుగా చేసుకున్నారు. సృష్టిలో ప్రాణులన్నీ సమానమే అనే విషయం అవగతమౌతోంది.

భాగవతములో చెప్పుకోదగిన ప్రయాణ సాధనాలుండేవి ప్రధానంగా కాలినడకే, ఎడ్లబండ్లకు సవారి ఉండేది. పక్షులపై మానవ మాత్రులు ప్రయాణం చేసినట్లు కనపడదు. దివ్యపాత్రులకే సాధ్యం. బాగా కష్టం చేసే ప్రజలు పొలాలకు నీటికి, నడికి, అంతా కాలినడకే. అందువల్ల ఆరోగ్యంగాను, పూర్ణాయుష్కులై నాటి ప్రజలు నివసించారు. పురాణం చాటున సమాజం దాగుంటుంది. ఈ భాగవతములో నాయకుడు భగవంతుడే, కావున అతని చుట్టూ సమాజం పరిభ్రమిస్తుంది.

ప్రయాణ సాధనాలు :

కాలినడక : మహా భాగవతములో అనగా 15 శ॥నాడు నాటి ప్రయాణ సాధనాలు గమనార్హములు వీలైనంత వరకు ఆనాటి ప్రజలు ఊళ్ళకు వెళ్ళాలన్నా, వీధిలోకి వెళ్ళాలన్నా, ఎక్కడికి వెళ్ళాలన్నా కాలినడకన వెళ్ళేవారు. దీనిని మించిన వ్యాయామం లేదు. పగలంతా నడిచే వారికి వ్యాధులు రావు. పోతనామాత్యుడు, భోజనం, పానం స్నానాన్ని వర్ణిస్తూ ప్రయాణసాధనాల్ని వర్ణించడం గమనార్హం. పొలాలకు వెళ్ళాలన్నా నడక. అందుచేత నడచిన స్త్రీ, పురుషులు ఆరోగ్యంగా ఉన్నారు. ఆయుర్ధాయంగా ఉన్నారు. నేటి ప్రజలకు నడక ప్రాముఖ్యం తెలియదు. ఎక్కడికి వెళ్ళాలన్నా యాంత్రికమే. యాంత్రిక సాధనాలు ఉపయోగించేవారు ఒకానొక సమయంతో నడవాలి, దేహానికి ఇబ్బందులు కలుగుతాయి.

ఎడ్లబండ్లు : మధ్య తరగతి ప్రజలు ఊర్లకు వెళ్ళాలంటే వరుని యింటికి వధువు, వధువు ఇంటికి వరుడు వెళ్ళాలంటే కూడా ఎడ్లబండ్లు సాధనం. ఇదైనా కొంత మేలైనదే. బండ్లలో కూర్చున్న ప్రయాణికుల దేహాలు కదులుతాయి. ఎడ్లుశక్తికి ప్రతీకలు. కావున ఎడ్లబండ్లలో ఎంతమంది కూర్చున్నా సునాయాసంగా లాక్కుపోతాయి. బమ్మెర పోతన "రుక్మిణీ కళ్యాణం॥లో ఎడ్లబండ్లను చెప్పటం ఉంది. మధ్య తరగతి ప్రజలు ఎండ్లబండ్లలో వచ్చారని వర్ణన.

మహిషం : మహిషం కూడా శక్తికి ప్రతీక మధ్య తరగతి ప్రజలు బండ్లలో ప్రయాణం చేస్తే అట్టడుగు ప్రజలు మహిషములపై ప్రయాణం చేసేవారు. మొన్నమొన్నటి కూడా ఆగంతకులు మహిషముల మీద కూర్చుని భద్రంగా చేరటం ఉంది. పల్లెటూరి వారికి మహిషములను దున్నటానికి ఉపయోగించేవారు అని ధౌమ్యుని కథ ఉంది.

గుర్రపు బండ్లు : అశ్వం శక్తికి, వేగానికి, సాహసానికి ప్రతీక. అందుకే తిక్కనసోమయాజి తన యుద్ధ పంచకపుములో గుర్రపు దళములను అమోఘంగా వర్ణించారు. గుఱ్ఱాలు వేరు, బండ్లు వేరు సంపన్నులు గుఱ్ఱపు బళ్ళలో ప్రయాణం చేసేవారు తొందరగా వెళ్ళాలంటే గుర్రమే శరణ్యం. అందరూ వెళ్ళాలంటే గుర్రపు బళ్ళు శరణ్యం. మొత్తం మీద ఎక్కువ భాగం నడకే. ఎద్దులు, గుఱ్ఱాలు, మహిషములు ఇవన్నీ పోషకములు. ఆనాటి గుఱ్ఱపు బళ్ళలో పెండ్లివారు ప్రయాణం చేసేవారు. ఎడ్లబండ్లలో ప్రయాణం చేవారు గుఱ్ఱపు బండ్లకు రెండు గుఱ్ఱాలు ఉంటాయి. వాటి కళ్ళకు గంతలు కడతారు. రౌతు గుఱ్ఱాలను సమర్థ వంతంగా వేగంగా నడుపును.

రథములు : సంపన్నులు రథముల మీద ప్రయాణం చేసేవారు. రథానికి కూడా గుఱ్ఱములే కట్టబడి ఉంటాయి.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

వేగంగా లాగాల్సింది గుఱ్ఱాలే కదా ! యుద్ధ రంగానికి సైతము రథాల్లో వచ్చేవారు. కృష్ణుడు రథము మీద వేగంగా ప్రయాణం చేసినట్లు వర్ణన. అయితే గుఱ్ఱాలను మచ్చిక చేసుకోవాలి తప్ప కఠినంగా వ్యవహరించరాదు. అలా చేస్తే సకాలానికి గమ్యస్థానం చేర్చవు. మచ్చిక అనగా ప్రవాహంలో స్నానం చేయించాలి. తరువాత దాణా పెట్టాలి, నీరు ఇవ్వాలి! ఇలా ప్రయాణంలో అలసిపోతే విశ్రాంతి ఇవ్వాలి, అక్కడ కూడా తగినంత ఆహారం పెట్టాలి. ఇలా చేయకపోతే శక్తి ఉన్నా పరుగిడవు. పరుగిడినా మార్గమధ్యంలో కూలబడతాయి. మార్గమధ్యంలో కూలబడకుండా తగు చర్యలు తీసుకోవాలి. కృష్ణుడు గుఱ్ఱాలు కట్టిన రథము మీద ప్రయాణం చేశాడు. శిశుపాలుణ్ణి రథం నుండే తరిమినాడు.

ఉ. "అంకిలి సెప్పలేదు చతురంగ బలముల తోడ నెల్లి యో
పంకజ నాభా! నీవు శిశుపాల జరాసుతులన్ జయించి నా
వంకకు వచ్చి, రాక్షస వివాహమునన్ భవదీయ శౌర్యమే
ముంకువ సేసి కృష్ణ! పురుషోత్తమ చేకొని పొమ్ము వచ్చెదన్"

ఆమె అభిలషించిన విధముగానే చేశాడు. రుక్మిణిని చేపట్టి పరిణయమాడాడు. ఇదంతటికి గుఱ్ఱాలే కదా కారణం.

ఏనుగులు : ఇంద్రుని వాహనం ఐరావతం. ఇది తెల్లగా ఉంటుంది అని వర్ణన. దీనిపై కూర్చుని యుద్ధం చేస్తే విజయం తప్పదు. అట్లని మత్తతకు కూడా ప్రతీకయయే. గుఱ్ఱమంత వేగానికి ప్రతీక కాకపోయినా ఒక మోస్తరు వాహకుని కూర్చొబెట్లుకుని వేగంగ నడుస్తాయి. అంతేగాక ఏనుగు మహాశక్తికి ప్రతీకగా గుర్తింపబడింది. ముఖ్యంగా దేవాలయముల దగ్గర దైవప్రతిమను ఏనుగు పై కూర్చోబెట్టి ఊరేగించటం జరుగుతుంది! రాను రాను ఏనుగులు కనుమరుగైన కారణంగా ఆ పని. గుఱ్ఱాలు చేస్తాయి. ఇంద్రుని వంటి బలశాలికి ఏనుగు వాహనం అంటే తదితరుల సంగతి చెప్పనక్కర లేదు. సమస్త జీవకోటిలో మహాబలమైన జంతువు ఏదనగా ఏనుగు. దీని ఆహారం శాఖాహారమే! చెట్టు ఆకులు కొమ్మలు విదిలించుకుని తింటుంది. అయినప్పటికి ఎంతో బలమైనది. బమ్మెర పోతన ఏనుగులను "గజేంద్ర మోక్షలు" కథలో వర్ణించాడు. కుమార సంభవంలో ఏనుగుల వర్ణన ఉంది. అది, ఇది అననేల పురాణేతిహాసాలు మొదలుకొని ప్రబంధ, దక్షిణాంధ్ర యుగ సాహిత్యంతో ఏనుగుల ప్రస్తావన ఉంది. అందుచేత చాలా మంది ప్రయాణీకులు కూర్చుని ప్రయాణం చేయటానికి ఏనుగు యోగ్యమైనది. భద్రంగా కూర్చోవచ్చు. యుద్ధరంగాల్లో ఏనుగులు కూడా ప్రస్తావించబడ్డాయి. ఆధునిక జీవిత వేగవంతమైనది. ఆటవిక జంతువులలో అంతగా పరిచయం లేనిది. అందుకే మనకు తేలన్నా, పామన్నా భయం! గ్రద్ధ అన్నా భయం! ఏనుగు అన్నా భయం! స్థూలకాయమైన ఏనుగును చూచి భయపడి దాని చెంతకుపోలేరు. అన్ని యాంత్రిక సాధనాల మీద వీళ్ళ ప్రయాణాలుంటాయి. అందున యుద్ధ రంగంలో గెలిచినా మరొక రంగంలో శ్రేష్ఠులైనా ఏనుగుల మీద ఊరేగించేవారు. కృష్ణదేవరాయలు అల్లసాని పెద్దన గారిని మదకరీంద్రం మీద కూర్చోబెట్టుకుని ఊరేగించే వారని వర్ణన.

ఒంటెలు : ఉష్ట్రం అనగా ఒంటె. ఒంటె వేరు ఉష్ట్రశక్తి వేరు. ఉష్ట్రశక్తి ఎడారులలో సంచరిస్తుంది. ఉష్ట్రం వాహనంగా గల దైవం ఆంజనేయ స్వామి. అందుకే ఇప్పటికి పుణ్యక్షేత్రాలలో ఒంటె మీద కూర్చోబెట్టి ఊరేగించటం జరుగుతుంది. బహుళా ఒంటె కంఠం సాగిపోతుంది. ఎంత దూరమైనా ప్రయాణం చేసే వక్తి ఒంటెకు ఉంటుంది. "ఒయాసిస్సులో ఎడారి ఓడ" అని అంటారు ఓయాసిస్సులో నీరు లేకుంటే ప్రయాణంలో ప్రజలు ఒంటెను సంహరించి దాని ఉదరంలో నీరు త్రాగేవారు అందుచేత "ఎడారి ఒయాసిస్సు" అని ఒంటెకు పేరు.

పక్షులు : కొన్ని పక్షులు దేవతలకు వాహనాలు. నెమలి - కుమార స్వామికి, చిలుక-మన్మధునికి వాహనాలు. అట్లే - కృష్ణుని వాహనం - గరుత్మంతుడు ! గ్రద్ధ ఆకాశం నుంచి ప్రయాణిస్తూ కూడా నేల మీద వస్తువులు స్పష్టంగా చూడగలదు. అందుకే గ్రద్ధ చూపు నానుడి! అభ్రగపతి అని వర్ణన "గజేంద్ర మోక్షము కథలో గరుత్మంతుని అధిరోహించి గజమును కాపాడినట్లు వర్ణన. ఎద్దు, గుఱ్ఱం, ఇలాంటి వాటిని వేగమునకు ప్రతీకులుగా భావించారు. ఇంతకన్నా వేగంగా పక్షులు పరుగెడతాయి. పక్షుల్లో గరుత్మంతుడు వేగానికి నిదర్శనం. గరుడుడు, ఆంజనేయుడు వేగానికి ప్రతీకలు అని పురాణఘోష. అలాంటి వాటిలో గరుత్మంతుడు ఉండటం గమనార్హం. చెరువు చెంతకు కృష్ణుడు రావాలి. మనో వేగంతో రావాలి. ఇందుకు వాహనమేది? గరుత్మంతుడు తప్ప మరొకటి లేదు. అలా వచ్చి చెరువులోని మొసలి నుండి గజమును రక్షించాలి. అలాగే చేశాడు శ్రీకృష్ణుడు. పురాణఘోషమే తప్ప మానవులు పక్షుల మీద ప్రయాణం చేసినట్లు ఆధారాలు లేదు. "గజేంద్ర మోక్షణ" కథలో జీవుని శరణాగతి కనిపిస్తుంది. సరస్సు అనగా సంసారం లేదా గృహం అని అర్థం. ఎట్లైతే గృహాన్ని అందంగా నిర్మించుకుని బయట కళ్ళాపి చల్లిముగ్గులు వేసి పూల చెట్లను పెంచి ఆకర్షణీయంగా తయారు చేస్తాం. గహాంతరంలో వేయి వైషమ్యాలుండవచ్చు. వాటిని కప్పి పుచ్చుకోవడానికే అలంకారాలు, ఆకర్షణలు మొ॥ గజము గృహ యజమానికి ప్రతీక, మొసలి ఇల్లాలికి ప్రతీక. ఇక తామరలు, ఎర్ర కలువలు, తక్కిన పూలచెట్లు ఇవన్నీ ఆకర్షనఖి ప్రతీకలు. గజము యొక్క కాలిగిట్టను మొసలి పట్టుకుంది. వస్తువుల కోసం, బాహ్యాడంబరముల కోసం ఇల్లాలు యజమానిని వేధిస్తున్నట్లు అర్థం. ఇలాంటి సమస్యలకు పరిష్కారం శ్రీహరిని శరణు వేడడమే.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

"సిరికం జెప్పడు శంక చక్రయుగముం జేదోయి సందింపడే
పరివారంబును జీరడభ్రగ పతిం బన్నింపడా కర్ణికాం
తర ధమ్మిల్లము జక్కనొత్తడు వివాద ప్రోత్థిత శ్రీ కుచో
పరి చేలాంచలమైన పీడడు గజప్రాణావ నోత్సాహియై"

పోతనయే చెప్పినట్లు పుణ్యఫల దివ్యజ్ఞాన సంపత్తితో శ్రీహరినే ప్రార్థించాడు. శరణు వేడాడు. భగవంతుడు వెను వెంటనే గరుత్మంతుని పై వచ్చి మొసలి కంఠమును తన సుదర్శన చక్రంతో ఖండించి గజమును రక్షించినాడు. అట్లే సంసార వ్యాధికి పరమౌషధం దైవచింతనయే. ఆకు చాటున పువ్వు లేదా పిందె దాగున్నట్లు "గజేంద్ర మోక్షం" చాటున కుటుంబ జీవితం దాగుంది. ఇలా ప్రతీకాత్మకంగా కూడా పోతనామాత్యుడు సామాజికతను నిక్షప్తం చేశాడు.

హంస : హంస బ్రహ్మదేవుని వాహనం పక్షులన్నింటిలో ఉన్నతమైనది. శ్రేష్ఠమైనది. హంసను స్వచ్ఛతకు, జ్ఞానానికి చిహ్నంగా చెబుతారు. పాలను, నీటిని విడదీయ గల శక్తి ఉన్నజీవి. శివుని యధార్థ తత్వాన్ని తెలుసుకోవడానికి, విష్ణువు వరాహంగా, బ్రహ్మ దేవుడు హంసగా అవతరించినట్లు పూర్వులు వర్ణించారు. అనగా సరస్వతితో బ్రహ్మదేవుడు హంస వాహనంపై ప్రయాణం చేశాడు. వరాహం భూలోక మంతా తిరిగి శివతత్వాన్ని తెలుసు కోలేకపోయింది. వాళ్ళు ఎన్ని వేషాలు వేసినాఎన్ని అవతారాలు దాల్చినా శివతత్వం బోధపడదని వర్ణన, తరువాత బమ్మెర పోతన హంసను వర్ణించాడు. కాని బ్రహ్మదేవుడు హంసపై కూర్చుని ప్రయాణం చేసిన ఘట్టాలు అక్కడక్కడా ఉన్నాయి.

విమానం : వి అనగా ఆకాశం ! మానం అనగా తిరుగాడుట. ఆకాశమున ప్రయాణం చేసే యాంత్రిక వాహనం పేరు విమానం! త్రేతాయుగం నుంచే విమానాల తయారీ ప్రయాణాలు కనిపిస్తున్నాయి. సీతాపహరణం పుష్పక విమానం మీదనే జరిగినట్లు రామాయణం చెపుతుంది. ఇక్కడ గజేంద్ర మోక్షణ కథలో మొసలిని విషుణవు ఖండించిన తరువాత దేవతలు తమ విమానములు అధిరోహించి వచ్చి విష్ణువును ప్రశంసించారు ! అంతేగాక "రుక్మిణీ కళ్యాణం" జరిగేటపుడు విమానాల మీదుగా చూశారు. అత్యంత వేగంవిమాన ప్రయాణ విశేషం! ఆ తరువాత గరుత్మంతుడు, వాయు దేవుడు, ఆంజనేయుడు మొ॥ వారు కృష్ణుడు శిష్ట రక్షణ చేశాడని తెలియగానే దేవతలు తమ విమానాలపై వచ్చి కృష్ణుని ప్రస్తుతించేవారు. ఏ శుభకార్యమైనా జరిగితే దివి నుంచి భువికి దిగి రావడానికి విమానాల ద్వారానే సాధ్యం.

యోగ గమనములు : బమ్మెర పోతన 15 శ॥ కవి. ఆ కాలం యోగులకు పేరెన్నికగన్నది ! అనగా భగవంతుడే యోగి రూపంలో అవతరించి లోకంలో ప్రజల ఆధ్యాత్మిక అభివృద్ధికి తోడ్పడుతాడు. అపుడు ప్రజలకు భయ భక్తు లేర్పడతాయి. 15శ॥ నాటికి నరసింహయోగి అవతరించాడు. ఆయన గంధర్వపుర నివాసి కొందరు భక్తులు మాకు 'కాశి' చూపాల్సిందిగా కోరారు. తక్షణమే చూపాడు. తంతుకుడు అనే భక్తుడు నాకు శ్రీశైలం చూపమన్నాడు. తక్షణం యోగి, తంతుకుడు శ్రీశైలంలో ఉన్నారు! పాండురంగనాఇయికి అనే పుణ్య క్షేత్రాలు యోగగమనం ద్వారా చూపాడు. శారీరక మానసిక సమన్వయం పేరు యోగం. సిద్ధిని అంటే ఆత్మ సాక్షాత్కారం పొందిన ఏ మహాను భావుడైనా సరే యోగి అనబడతాడు. ఆయన నివసించేది కూడా మనావుల మధ్యలోనే ఎవరికి ఏది కావాలన్నా దాన్ని సమకూరుస్తుంటాడు. మనసెంత వేగంగా ప్రపంచంలోని సకల నగరాలను చూడగలదో యోం కూడా అంతే. అసలు మృతులును కూడా బ్రతికించాడంటే పెద్దగ పరిగణింప దగిన విశేషం కాదు. మొత్తం మీద యోగికి భక్తులకు గల అనుసంధానం, యోగం ! తద్వారా శ్రీశైలం కాదు, కాశి కాదు సమస్త ప్రపంచాన్ని యోగులు తమ యోగ మహిమ ద్వారా చూపారు.

పల్లకీలు : పదవ శతాబ్ది నాటికి పల్లకీల ప్రస్తావన ఎక్కువగా సాహిత్యంలో కనిపిస్తుంది. సంపన్నులు విమానాలు, పక్షులు, గుఱ్ఱములు, గుఱ్ఱపు బళ్ళు, ఎద్దుల బళ్ళు ఉపయోగించేవారు. ముఖ్యంగా 15 శ॥ నాడు సావిత్రి అనే మహిళ తన భర్త అయిన దత్తాత్రాయుడు మరణించగా నరసిం{క్మీ}మోగి బ్రతికించాడు. గంధర్వపురం చేరడానికి మూడు రోజులు పట్టినట్లు వర్ణన. పల్లకీని మోసేది మానవులే. ఇలా పల్లకీకి ఒక ప్రత్యేకత ఉన్నది. ఎన్నో శుభకార్యాలలో రాచకాంతల వివాహాల్లో పల్లకీలను ఉపయోగించేవారు. పల్లకీని ఆందోళికం అంటారు. శిభికం అన్నా పల్లకీయే మహాభాగవత కర్త "రుక్మిణీ కళ్యాణం"లో ఈ పల్లకి ప్రస్తావన చేశాడు. అంతేగాక పల్లకి వినియోగాన్ని కనబరచాడు.

నౌకలు : 10వ శతాబ్ది నాటికి వర్తక వ్యాపారాలు విరివిగా జరిగేవి "హర విలాసం" అనే గ్రంథాన్ని శ్రీనాథుడు అవచి తిప్పయ శెట్టికి అంకితమిస్తూ ఈ నౌకాయాన ప్రస్తావన చేశారు. అవతి తిప్పయశెట్టి వైశ్యుడు. గనుక సుగధ భాండాగారాధ్యక్షుడు సుగంధ ద్రవ్యపేటికలు తయారు చేయించి జావా, సుమత్రా దీవులకు నౌకల ద్వారా సరఫరా చేసేవాడు రామాయణంలో ఈ నౌకల ప్రస్తావన ఎక్కువగా ఉంది. భాగవతములో పోలికలు ద్వారా కనిపిస్తుంది. సీతాదేవి హనుమంతున్ని చూచినపుడు సరుకుల భారముతో మునిగి తేలుతున్న నౌకవలె దు:ఖభారంతో మునిగిదని 'రామాయణంలో వర్ణించారు. ఇలా ప్రయాణ సాధనాలు ఉన్నప్పటికీ అత్యవసరమైతేనే ఉపయోగించేవారు. పొలాలకు, ఇతర ఊళ్ళకు వెళ్ళాలంటే కాలినడకన వెళ్ళేవారు.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

ఆధార గ్రంథాలు :

1. రఘు వంశము - మహాకవి కాళిదాసు
2. సప్తగిరి మాసపత్రిక
3. చాటు పద్యమణి మంజరి - వేటూరి ప్రభాకర శాస్త్రి
4. శివానందలహరి - ఆది శంకరా చార్యులు
5. శ్రీగురు చరిత్ర - ఆచార్య ఎక్కిరాల భరద్వాజ
6. సుందర కాండం - శ్రీ మద్రామణ కల్పవృక్షము - వాల్మీకి.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

శ్రీ మద్రామాయణం - సుందరకాండ

- డాక్టర్ లెక్కల కిష్టప్ప
సహాయ ఆచార్యులు, తెలుగు మరియు తులనాత్మక సాహిత్య శాఖ, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయము, అనంతపురం.

ధర్మమునకు ప్రత్యక్షముగా నిల్చుకొనే యజుర్వేదమే రాముడు. రామ వాక్యమే, రామ నామమే సర్వ శాస్త్రముల యొక్క సారమని ఉచ్చరించి, నామమును వల్లెవేసే ఋగ్వేదమే లక్ష్మణుడు, రామనామమే నా జీవిత ఆధారమని విశ్వసించి రామ నామమును గానము చేసిన సామవేదమే భరతుడు. ఆ ముగ్గురి రామ, లక్షణ, భరతుల ఆజ్ఞలను శిరసా వహించి అంతర్, బహిర్ శక్తులను దనుమాడి శాంతము చేకూర్చే అధర్వణ వేదమే శత్రుఘ్నుడు. కనుక యజుర్వేద, ఋగ్వేద, సామవేద, అధర్వణ వేదముల స్వరూపములే ఈ రామ లక్ష్మణ భరత శతృఘ్నులు.

వేదములలో పేర్కొనబడిన సత్యములును, ధర్మములును సామాన్య జనులకు ఉపయోగపడునట్లుగా వ్యాస వాల్మీకి మహర్షులు భారత రామాయణముల ద్వారా వాటిని సులభసుందరశైలిలో అందించిరి. దీనినే "వేద:ప్రాచేత సాదాసీత్, సాక్షాద్రామయణాత్మనా" (వాల్మీకి ముని పుంగవునిచే ఆ వేదము సాక్షాత్తు రామాయణమై ఈ భువియందు వెలసినది) అను సూక్తి రూఢీపరచుచున్నది.

భారతీయులకు భారత, భాగవత, రామాయణాలు ప్రధానమైన ప్రమాణ గ్రంథాలు. పంచమవేదమని పేరు పొందిన భారతం ధర్మ ప్రధానమై ప్రభుసమ్మితముగా భావిస్తుంది. ఇతిహాసమైన భాగవతము మిత్ర సమ్మితమైన హితోపదేశము చేస్తుంది. రామాయణము ఆదికావ్యము కాబట్టి కాంతా సమ్మతంగా హితాహితాలను వ్యంగ్యరూపంగా తెలియజేస్తూ మిక్కిలి రసవంతమైన పండితులనే కాకుండ సామాన్య జనులనూ ఆకర్షిస్తూ వుంటుంది. పురాణ కాలక్షేపాల్లో రామాయణానికున్న ప్రాముఖ్యం మరి దేనికీ లేదు. దీనిలో కథకి కథా, నీతికి నీతి స్వభావ చిత్రణకు స్వభావ చిత్రణా, ఆదర్శ జీవితానికి ఆదర్శ జీవితం-అన్నిటికీ అన్నీ సమకూడి ఉన్నవి.

సంస్కృత వాఙ్మయంలో మొట్టమొదటి కావ్యం శ్రీ మద్రామాయణం. ఈనాటికీ ఈ శ్రీ మద్రామయణానికి మించిన గ్రంథం మరేదీ లేదు. ఈ గ్రంథకర్త మహర్షి వాల్మీకి. వాల్మీకి మహర్షి తరువాత ఎందరెందరో రామాయణ గ్రంథానికి స్వతంత్రానువాదాలు వ్రాశారు. వాల్మీకి చెప్పిన అంశాల్నే మరో విధంగా వ్రాసియున్నారు. అయినా వాల్మీకి కావ్యానికి లభించిన గౌరవం సంపాదించలేక పోయారు. ఈ నాటికీ సమాజంలో రామాయణమునకు రామనామానికి... ఒక ప్రత్యేక గౌరవం వున్నది.

"చక్కెరకంటే తీపి దధిసారముకంటెను రుచ్యమౌను పెంపెక్కిన తేనెకన్న అతి రచ్యము నోటను పల్కపల్కగా
మిక్కిలి కమ్మనౌ అమృతమే అనిపించునుకాన నిత్యమున్
చక్కగదాని మీరు మనసా స్మరియింపుడు రామానామ మున్!"

రామాయణం యొక్క మహత్వాన్ని గురించి సాక్షాత్తు బ్రహ్మదేవుడే ఇలా చెప్పాడు:

"యావత్ స్థాస్యంతి గిరయ: సరితశ్చ మహీతలే
తావద్ రామాయణ కథా లోకేషు ప్రచరిష్యతి."

ఈ భూమండలంపైన కొండలెంతకాలం చిలిచి యుండునో నదులెంత కాలం ప్రవహించునోఒ అంతవరకు రామాయణ కథ ఈ లోకంలో ప్రచారములో ఉండును అని ఈ శ్లోకార్థం.

రామాయణంలోని ఒక్కొక్క అక్షరాన్ని ఉచ్చరించినా మహాపాతకాలు నశిస్తాయని......

"చరితం రఘునాధస్య
శతకోటి ప్రవిస్తరమ్
ఏకైక మక్షరం ప్రోక్తం
మహాపాతక నాశనమ్" అని రామాయణ ప్రాశస్త్యాన్ని మన పూర్వులు ఎన్నడో ఉగ్గడించారు.

ఆధ్యాత్మిక తత్త్వ దృష్టితో చూస్తే సుందరకాండ మహిమ అర్థమవుతుంది. అవివేకానికి ప్రతిబింబము రావణుడు. సీత ప్రకృతి. పురుషుడు శ్రీ రాముడు. ఎడబాసి వున్న ప్రకృతి పురుషులను కలపడానికి ఆచార్యుడుగ హనుమంతుడు ఉద్యమించాడు. అవివేకానికి ఆత్మ బోధరూప జ్ఞానాన్ని ఉపదేశించడానికి సకల విద్యావిశారదుడైన ఆంజనేయుడు ప్రయత్నించాడు. ఈ విధంగా ప్రత్యక్ష పరోక్ష సచ్చిదానంద రూపజ్ఞానమును ఉపదేశించే దివ్య ఫల గ్రంథము సుందర కాండ. ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించేదీ, ఐహికాముష్మికములను అనుగ్రహించేదీ, హనుమద్విజయ ప్రతిపాదకమూ, శ్రీ రామ దివ్య సుందర రూపవర్ణనాత్మకమూ, భవతారకమూ అయినది సుందరకాండ. గాయత్రీ మంత్రమందు ముఖ్యమైన పంద్రెండవ అక్షరముతో సుందరకాండ ఆరంభం కనుక సుందరకాండ అన్ని విధాలా ఆస్తిక బుద్ధి గలవారికి ఆరాధ్యదైవమనడానికి సందేహం లేదు.

సుందరకాండ ప్రారంభములో పరితాపమపోపశమనం ప్రారంభమవుతుంది. సీతాదేవి లంకాద్వీపంలో ఉన్నదనే

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

సంగతి సంపాతివల్ల తెలుసుకున్న తరువాత అక్కడికి ఎలా వెళ్ళడమనే సమస్య ఏర్పడింది వానరులకు. రామభక్తుడైన హనుమ సాహసించి సముద్రాన్ని లంఘించుటకు ప్రయత్నించడంతో సుందరకాండ ప్రారంభమవుతుంది. ఇంతేకాదు....

"సుందరే సుందరో రామ:
సుందరే సుందరీ కథా
సుందరే సుందరీ సీతా
సుందరే సుందరం వనమ్
సుందరే సుందరం కావ్యం
సుందరే సుందర: కపి:
సుందరే సుందరం మంత్రం
సుందరే కిం నసుందరం?" అనే శ్లోకాలను బట్టి సుందరకాండలో రాముడు సుందరుడు, సీత సుందరి, అశోక వనము సుందరమైనది, వాల్మీకి రచన యిందు సుందరము, హనుమంతుడు సుందరుడు, సుందరకాండ మంత్రం సుందరమైనది. ఈ కాండంలో సుందరం కానిది ఏదీ లేదని తెలుస్తున్నది. అందువల్లనే యిది సుందరకాండ అయింది.

వాల్మీకి మహర్షి ఎంతో మనసుపడి కిష్కింద, యుద్ధ కాండల మధ్య జరిగిన కథ విశేషాలను "సుందరకాండ" అని నామకరణం చేసినాడు. వాస్తవంగా దీనికి "హనుమకాండ" అని గానీ, "అన్వేషణకాండ" అనిగానీ, "బీజకాండ" అని గానీ లేదా "సంధికాండ" అనిగానీ పేరు పెట్టవచ్చు. కానీ వాల్మీకి మహర్షి దివ్యదృష్టితో "సుందరకాండ" అని పేరు పెట్టినాడు. హనుమంతునికి సుందరుడు అనే పేరు ఉన్నది కనుక సుందరుడైన హనుమంతునికి సంబంధించిన కాండమని అంతరదృష్టితో లోతుగా ఆలోచించి ఈ పేరును పెట్టి ఉండ వచ్చును. సుందరకాండానికి అధినాయకుడు హనుమంతుడు. రెండవ పాత్ర సీతాదేవి. ప్రతినాయకుడు రావణుడు. రాముడు పాత్ర ఈ కాండంలో ప్రత్యక్షంగా కనిపించదు. అంతర్లీనంగా ఉంది.

ఎక్కడ రామనామం వినబడుతుందో, కనబడుతుందో అక్కడ హనుమంతుంటాడు. ఈ దేశం పట్ల, సంస్కృతి పట్ల మక్కువ ఉన్న రామాయణం పాఠకులందరికి మనసుల్లో ఎల్లప్పుడూ ఆ రామభక్త హనుమాన్ నెలకొని ఉంటాడు! రామాయణంలో ఏ కాండానికి ఆ కాండం, ప్రతిదీ ఇహపర సాధనమే! అత్యంత ఆనందాయకమే! అయితే అందులో సుందరకాండ మరీ మిక్కిలి సుందరమైనదని విజ్ఞులు భావించి, దానిని పారాయణం చేయడమే జీవిత లక్ష్యంగా గడిపి ఆ శ్రీరామచంద్రుని లోనే లీనం అయ్యారు! హనుమంతుడు శక్తికీ, భక్తికీ ఎత్తిన పతాక ఈ కాండం కనుక సుందరకాండం అయినదనీ చెబుతారు.

శ్రీరాముననికి పరమభక్తుడు వాయునందనుడు. నిరుపమానం అయిన బలసందకు నిధానం. మేరుపర్వత సమానమైన శోభగలవాడు. దానవులచే అడవులను తగలబెట్టే అగ్ని, జ్ఞానులల్లో శ్రేష్ఠుడు, సకల సద్గుణరాశి.

సముద్ర లంఘనం

రాముని స్మరించుకొని హనుమానుడు సంసార సాగరముపై నుండి అనగా ఆకాశమార్గము నుండి లంకకు పోవుటకై నిర్ణయించెను. హనుమానుడు ఆకాశమార్గము ద్వారా పోతుండగా మార్గమధ్యమునందు 'సరస' అను పేరుగల రాక్షసి కనుపించినది. హనుమానుడు మ్రింగివేయుటకై ఆ రాక్షసి తన నోటిని విశాలముగా చేసినది. అప్పుడు హనుమానుడు తన శరీరమును అతి చిన్నదిగ చేసి నోటి నుండి దూరి చెవి నుండి బయటకు వచ్చెను. ఈ విధంగా సాధనయందలి ఆటంకమును దాటి హనుమానుడు లంకలో ప్రవేశించెను. అయితే సీత అంత సులభముగా కానరాదు. హనుమానుడు ముందుగ సీతను చూడలేదు. రాముడిచ్చిన ఉంగరమును చూపించి సీతను గుర్తించాలనే ప్రయత్నంలో ఉండెను. అంతలోనే చైత్ర ప్రాసాదము దగ్గరలోగల అశోకవనమందు విచారంతో ఉన్న సీతను హనుమానుడు చూచెను. సీత చుట్టను రాక్షసులు కాపలా ఉండిరి. దీనముగ నున్న సీత అని హనుమానుడు గుర్తించెను. ఇంతలో అనేక మంది స్త్రీలతో ఒక మహాకాయుడు అక్కడకు రావటం చూపిన హనుమంతుడు, ఆ వ్యక్తి రావణుడని తలచి ఒక పెద్ద చెట్టు చాటు నుండి ఇతరులకు కనిపించకుండ అంతయు చూచుచుండెను. అప్పుడు రావణుడు సుందరమైన, సుఖశాంతులీయ కలిగిన సీతపై ముగ్ధుడై ఈ విధంగా పలికెను.

నేను రావణుడను రాక్షస కులస్థుడని, పరాయి స్త్రీల దగ్గరకు పోవడం, బలముతో తీసికొని రావడం ధర్మమేనని చెప్పుచుండెను. సీత ఇష్టముతో రావణుని కోరుకొని వరకు తానామెను స్పర్శించనని, సువర్ణాలంకారముతో తన శరీరమును విభూషితము గావించి తనతో విహరించుమనెను. అయితే బలాత్కారము చేయక రావణుడు, రాక్షసుడైనను సంయమముతో ఉండెను. "కామాతురాణాం, నభయం నలజ్జా". కామాతురుడైన వ్యక్తి భయపడడు, సిగ్గుపడడు. తమ తమ వృత్తులు మారుట కష్టము గనుక బౌద్ధ బ్రాహ్మణ (బ్రహ్మము నెరిగిన) వృత్తి రూప రావణుడు పరంపరాగత వైదిక వృత్తి రూప సీతను బాలాత్కారము చేయలేదు.

అప్పుడు సీత ఇట్లు జవాబిచ్చెను :

శ్లో॥ "నమాం ప్రార్థయితుం యుక్తం సుసిద్ధి మివపాపకృత్,
అకార్యం న మయాకార్యమేక పత్న్యా విగర్హితమ్॥"

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

పాపచారియైన పురుషుడు సిద్ధులను కోరుకొనలేడే. అదే విధముగా నీవు నన్ను కోరుకొనుటకు యోగ్యుడవు కావు. నేను పాతివ్రత్యమును వీడను.

రావణుడత్యంత క్షుబ్ధుడై తగిన మనోపరివర్తనమునకై సీతకు రెండు మాసముల వ్యవధినిచ్చెను. నేనిచ్చిన వ్యవధి ప్రకారం రెండు మాసములు వేచియుందును. తదుపరి నీవు నా శయ్యపై రావలసి ఉంటుంది. నన్ను స్వీకరింపనిచో నా అల్పాహార భోజనములకై నీ శరీరము ముక్కలుగావింతును. అప్పుడు సీత తీవ్రమైన ఉత్తరవు నిచ్చెను.

శ్లో॥ "శూరేణ ధనద భ్రాత్రా బలై స్సముది తేనచ,
అపోహ్య రామం కస్మాద్ధి చారచౌర్యం త్వయాకృతమ్"

నీవు శూరుడననుకొనుచున్నావు, ధనములో కుబేరుడి సోదరుడవు. నీ వద్ద సేనా బలమెక్కువ. అయినను మాయతో రాముని దూరముగ పంపించి నన్నెందుకపహరించినావు?

అప్పుడు రావణుడు క్రోధుడయ్యెను. రావణపత్ని మండోదరి ముందుకు వచ్చి మహారాజ్, మీరు నన్నునుభవించుము. ఈ కాంతిసేన, దీనమానవ స్త్రీ నెందుకు కోరుకొనుచున్నారు? మీపై ఆసక్తిలేని స్త్రీతో మీరామెను కోరుకొనుట తగదు; అని పలికి రావణునితో అచ్చట నుండి వెలిపోయను. రాక్షసులందరు వెళ్లిన తర్వాత హనుమానుడు సీతతో మాట్లాడుటకై తలంచెను.

హనుమాను- సీతాసంవాదము: హనుమానుడిట్లన్నాడు:

శ్లో॥ "మహిషీ భూమి పాలస్య రాజకన్యా2 సీ మేమతా
రావణేన జన స్థానాద్బలా దపహృతాయది"॥
"సీతాత్వా మసిభద్రం తేతన్మ మాచక్ష్వ పృచ్ఛత:
యధాహిత వవైదైన్యం రూపం చాప్యతి మానుషమ్."

బలముతో జనస్థానము నుండి రావణుడపహరించిన ఆ సీతయేనా మీరు? నాకు మీ గురించి తెలియును. సీత తన విషయమును హనుమానునికి తెలియజేసెను. రెండు మాసముల తర్వాత రావణుడు తనను సంహరించెదనని లేదా తన శీల రక్షణకై ప్రాణ త్యాగము చేయుదుననియు తెలిపెను. హనుమానుడు తన యందు సీతకు విశ్వాసము కలుగుటకై రాముడిచ్చిన ఉంగరము నిచ్చి, శీఘ్రముగనే రాముడు నిను విడిపించునని అభివచనమునిచ్చెను.

ఓ వానరోత్తమా! దుష్టుడైన రావణుడు నాకు ఒక సంవత్సర కాలము గడువు పెట్టెను. అతను విధించిన ఆ ఒక సంవత్సర కాల వ్యవధిలో పది నెలలు పూర్తి అయినవి. ఇక రెండు మాసములే మిగిలియున్నవి అని సీత పలికెను. అప్పుడు హనుమానుడు సీతతో ఇట్లు పలికెను. రావణుడు నిన్ను భయపెట్టుట, నీవు రావణుని తృణీకరించుట, రాక్షస స్త్రీలు నిన్ను బెదిరించుట, విరహ తాపమునకు తట్టుకొనలేక నీవు ప్రాణ త్యాగమునకు సిద్ధపడుట, నిరంతరము శ్రీరామునే ధ్యానించుచుండుట, నీ పాతివ్రత్య ధర్మాచరణము, శ్రీరామునకు నీ సందేశము మున్నగు విషయములను యధాతధముగా శ్రీరామునకు తెలుపుదును అని అన్నాడు. అనంతరం రాక్షసులకు తగిన గుణపాఠము చెప్పుటకై అనేక మందిని తరిమి కొట్టి, రావణుని చైత్యప్రాసాదమునకు నష్టపరచి తన సామర్థ్యమును చూపించెను. రావణుని ఐదుగురు సేనాపతులను తగిన రీతిగ ఎదుర్కొనెను. పంచప్రాణ రూపులే ఆ సేనాపతులు. రావణుడు

భీతి చెంది తన కుమారులైన ఇంద్రజిత్‌ను పంపెను. ఇంద్రజిత్ బ్రహ్మాస్త్రమును వదలి బంధించెను. బ్రహ్మాస్త్రమును గౌరవించి హనుమానుడు బందీ అయ్యెను. వారిని రావణుని ముందుకు తీసికొనిపోయిరి. ఇంద్రియములను జయించగల ఇంద్రజిత్ వంటి సాధకుడు మాత్రమే బ్రహ్మచారి అయిన హనుమానుడు రూప సాధకుని బ్రహ్మాస్త్రములో బంధించ గలడు. హనుమాను ఇచ్చట బ్రహ్మోవస్థను గౌరవించిన వాడయ్యెను. ఇంద్రియములను జయించుట ద్వారా బ్రహ్మ జ్ఞానమును ప్రాప్తించుకొనవచ్చునన్ను సత్యము నెరింగిన వాడు ఇంద్రజిత్. కొద్ది క్షణములు హనుమానుడు బందీగా యుండెను.

చైత్య ప్రాసాదమును నష్టపరచుట, సేవాధిపతులుపై యుద్ధము గురించి అడుగగా హనుమానుడిచ్చిన సమాధానం రావణుని ప్రకోపింపచేసెను. హనుమానుని సంహరించమని ఆదేశించగా, విభీషణుడు కలిగించుకొని రాజదూతను సంహిరింపకూడదని హితవు చెప్పి వారించెను. ఇది ఆర్యనీతి. అయితే వానరుని తోకను నష్టపరచవలెనని, ఆ తోకకు వస్త్రములు చుట్టి నిప్పు పెట్టమనెను.

హనుమానుడీ విధముగ పలికెను :

శ్లో॥ "న సుఖం ప్రాప్ను యాచన్య: కింపునస్త్వ ద్విధో జన:
యాంసీతే త్వభిజానాసి యేయం తిష్ఠతి తేవశే॥"
"కాళీ రాత్రేతి తాం విద్ధి సర్వల జ్కావినాశినీమ్,
తదలం కాలాపాశేన సీతా విగ్రహ రూపిణా:॥"

ఓ రావణుడా! సీతను బాలాత్కారముగ తీసికొని వచ్చిన కారణమున సీత నీ యెడల కాళరాత్రి. ఆ కారణముగ సమస్తమైన లంక వినాశము కానున్నది. ఈ సమాధానం వినిన తర్వాత హనుమానుని తోకకు రావణుడు నిప్పు పెట్టించి పంపించగా, హనుమానుడు లంక అంతయు ఎగురుతూ జ్వలించుచున్న తోకను అంతట అంటించసాగెను. లంక దహనము గావించి, దక్షిణ సాగరమునకు పోయి తన తోకను చల్లార్చి రాముని వైపు పయనమయ్యెను. తిరిగి వచ్చిన హనుమానుని చూచి వానరులందరు ఆనందించిరి.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

సీతమ్మ క్షేమ వార్త :

రాముడు హనుమంతుణ్ణే చూస్తూ ఉన్నాడు. హనుమంతుని నోటి వెంట మాట రావడం లేదు. రాగానే రాముని పాదాలకు మ్రొక్కవలసిన హనుమ మ్రొక్కలేదు! సీత ఉన్న దిక్కును సూచిస్తూ, దక్షిణానికి తిరిగి సాష్టాంగపడి నమస్కరించాడు. లేచాడు. రాముని వైపు తిరిగి రెండు చేతులూ ఎత్తి శిరస్సుపైన పెట్టుకొని నమస్కరించి నిలిచాడు. సీతమ్మ క్షేమంగా ఉన్నదని మారుతి చేష్టలను బట్టి రాముడు గ్రహించాడు. హనుమంతుడు లంకలో జరిగినదంతా పూసగ్రుచ్చినట్లు రాముల వారికి విన్నవించాడు.

రామాయణంలోని కాండములన్నింటిలోకి "సుందర కాండ" 'ఆణిముత్యం', వానర సమూహంలో ముఖ్యుడైన హనుమంతుడు ఈ కాండంలో కథానాయకుడు. ఇందులో ప్రతి అక్షరం మారుతి వ్యక్తిత్వాన్ని ప్రదర్శిస్తుంది. భక్తి తత్పరత, అకుంఠితదీక్ష, దూత పాటించవలసిన ఉచితానుచితజ్ఞత, అన్నింటినీ మించిన సాహసోపేత కార్యదక్షత, సర్వప్రాణి సమదర్శనం, దీనుల దు:ఖంలో పాలుపంచుకునే సహృదయత, నిస్వార్థపూరితమైన పరోపకార పరాయణత ఈ గుణాలన్నింటికీ మూలమైన మహా వ్యక్తిగా హనుమంతుడు సాక్షత్కరించు చున్నాడు.

రామాయణమునందలి కాండములన్నింటిలోను "సుందర కాండము" తలమానికము - భారతమునందలి 'భగవద్గీత' వలె సుందరకాండము సుప్రసిద్ధమై, నిత్యపారాయణ గ్రంథమైనది. దీనిని నిత్యము పారాయణము చేసిన వారికి సకల మనోరథములు సిద్ధించును.

❀❀❀

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

'చాదస్తపు బ్రాహ్మణుడు' - జానపద కథ - హాస్యరస చిత్రణ

- రమేష్ దొసల

పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రాచ్యభాషా విభాగం, అచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

సులక్షణమైన భారతీయ సంస్కృతికి అనాది పునాది గ్రామాలే. సుసంపన్నమైన గ్రామీణ సంస్కృతి భారత జాతికి కీర్తిపతాకంగా నిలుస్తుంది. గ్రామాలలో నివశించే ప్రజలు అంటే జానపదుల యొక్క ఆచారాలు, కట్టుబాట్లు, వారి మధ్య ఉండే ప్రేమలు, అనారాగాలు, అరమరికలు లేని జీవితం, అందరూ కలసిమెలసి ఉండటం వంటి ఎన్నో కారణాలు ప్రపంచంలో భారతదేశాన్ని ఉన్నతమైన స్థానంలో ఉంచింది. జానపదులు తమకు కలిగిన భావోద్వేగాలను పాటలరూపంలోనో, కథా రూపంలోనో ఇతర పద్ధతుల్లోనో వ్యక్తం చేస్తుంటారు. సాయం సమయాలలో జానపదులు తమ పిల్లలను దగ్గరకు తీసుకుని ఆకాశంలో చందమామను చూపిస్తూ చెప్పే కథలంటే పిల్లలే కాదు, పెద్దలైనా ఇష్టపడతారు. అందులోనూ సార్వజనీన రసమైన హాస్యరసం అంటే ఇష్టపడని పిల్లలుండరు. మిగతా రసాత్మక కథలు, సన్నివేశాలు కొందరికి నచ్చవచ్చు లేదా ఏహ్య భావనను కలిగించొచ్చు. కాని హాస్యం అందరికీ నచ్చుతుంది. అందుకే జానపదులు హాస్య రసాత్మక కథలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు.

హాస్యం, ప్రాధాన్యత :

నవ్వు సమస్తమానవాళికి ఆప్తమిత్రుడు వంటిది. ఇది ప్రపంచ భాష. దీనిని ఇంగ్లీషులో Comedy అని, Laugh అని, Humor అని పలు పదాలతో పిలుస్తారు. శాస్త్రీయం దృష్టితో పరిశీలించినప్పుడు మనిషికి నవ్వు అనేది రావడానికి మనిషి శరీరంలోని పసుపు పిత్తం (Humor), నల్లపిత్తం, రక్తము, కఫము వంటి వాటివల్ల వాటిలోని అసమతుల్యతల వల్ల హాస్యోక్తి, హాస్య ప్రవృత్తి పెరుగుతుందని విశ్వసించారు. ప్లేటో వంటి ప్రముఖుల అభిప్రాయం ప్రకారం "అధికంగా, వింతగా, హాస్యాస్పదంగా ఉన్నదానిని సరిదిద్దేవి నవ్వు"[1]. మనిషికి హాస్య ప్రవృత్తి చాలా అవసరం. హాస్యరసం ఆస్వాదించలేని వారు శారీరక, మానసిక సమస్యలను ఎదుర్కొంటున్నారని అర్థం. అందుకే జానపదులు తాము రోజంతా కష్టపడి పనిచేసినా తీరిక వేళల్లో మనస్ఫూర్తిగా నవ్వుకునేందుకు నిరంతరం చతురోక్తులను ప్రయోగించుకుంటూ సమస్యలను మరచి పోయేందుకు ప్రయత్నిస్తారు. అందుకే హాస్యరసాత్మక జానపద సాహిత్యాంశాలు అనేకం కనిపిస్తాయి. వీటిపై ఎంత మంది పరిశోధనలు చేసినా ఇంకా జనపథంలో ఎన్నో రత్నాలు వంటి కథలు, పాటలు, సామెతలు, పొడుపు కథలు మిగిలి పోతున్నాయి. "జానపద సాహిత్యం - హాస్యం" అనే నా పరిశోధనలో భాగంగా జానపదుల వ్యవహారంలో ఉన్న ఇలాంటి హాస్యరసాత్మక కథలు ఎన్నో నేను సేకరించడం జరిగింది. అందులో ఒక కథను అందులో హాస్యరస సంఘటనలు, సన్నివేశాలను విశ్లేషణాత్మకంగా వివరిస్తున్నాను.

చాదస్థపు బ్రాహ్మణుడు :

అనగనగా ఒక ఊరిలో ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. నిత్యం పంచాంగం చూస్తూ, తన జీవితంలో ఏ చిన్న సంఘటన జరిగినా, దానిలో పరిష్కారాన్ని వెదుక్కుంటూ ఉండేవాడు. అలా ఒక రోజు పంచాగంలో లెక్కలు చూసుకుంటుండగా అతని భార్య మంచినీళ్ళు ఇవ్వడానికి వచ్చింది. ఆ బ్రాహ్మణుడు నీళ్లు తాగుతున్న సమయంలో భార్య గట్టిగా తుమ్మటం వల్ల, ఆమె నోటి తుంపరలు కొన్ని బ్రాహ్మణుడి నోటిలో పడ్డాయి. ఆయన ఒక్కసారిగా ఛీదరించుకుని, ఆ దోషానికి పంచాంగంలో ఏం పరిష్కారముందో అని చూశాడు. చూడంగా చూడంగా గంగానదిలో మూడుసార్లు మునగాలి అని ఉంది. అయ్యో! పెద్ద పనే పడిందే అని అనుకుని, భార్యను నాలుగు తిట్టి, మూటాముల్లె సర్దుకుని ప్రయాణమయ్యాడు.

చాలాదూరం ప్రయాణించాక పొద్దుపోయి, చీకటి పడడంతో ఏదైనా పూటకూళ్ళ వారి ఇంటికెళ్ళి తిని, విశ్రాంతి తీసుకుందామని వెళ్ళాడు. అక్కడ ఒక పూట కుళ్ళామె అయనకు భోజనం వడ్డిస్తుంది. అంతా తిని చక్కగా బ్రేవ్‌మని తేన్చి, ఆకు ముడుస్తుంటే, ఆ స్త్రీ వచ్చి 'ఆగయ్యా ఆగు ముడవ మాకు. అసలే ఆకులు లేవు. నీ తరువాత తినాల్సిన వాళ్ళు చాలామంది వున్నారు అని అంది. ఆ మాట వినగానే బ్రాహ్మణుడికి గుండెలో రాయి పడ్డట్లయింది. ఏమ్మా అందరూ ఈ ఆకులోనే తింటున్నారా! అని అడిగాడు బ్రాహ్మణుడు. అవునండి నిన్న, ఇవాళ ఈ ఆకే అందరికీ అని సమాధానమిచ్చింది. అయ్యో! నోటి తుంపరలు పడితేనే సహించలేకపోయాను. మరి దీనికేం పరిష్కారముందోనని మళ్ళీ పంచాంగం తీసి, పరిష్కారం కోసం వెదికాడు. దానిలో ఇలాంటి సమస్యకి ఆరు సార్లు గంగలో మునగాలి అని రాసి వుందట. ఇందాక మూడు సార్లు, ఇప్పుడు ఆరుసార్లు మొత్తం తొమ్మిది సార్లు మునగాల? అని అనుకుంటూ, ఈ సారైనా జాగ్రత్తపడాలని అనుకుంటూ వెళ్ళాడు.

మరికొంత దూరం వెళ్ళంగా వెళ్ళంగా మరొక ఊరు చేరాక ఆ ఊరిలో మళ్ళీ ఆకలేసి పూటకూళ్ళ వారి ఇంటికి వెళ్ళాడు. ఎందుకైనా మంచిదని, అక్కడ స్త్రీని అరటి ఆకులు

సరిపడా ఉన్నాయో లేదో అని తన ఆకు తనే తీసుకొచ్చుకున్నాడు. చక్కగా ఆమె వడ్డించిన ఆహారపదార్థాలు అన్నీ తిన్న తరువాత తాంబూలం వేసుకుందామని, అక్కడ స్త్రీని పిలిచి వక్క ఉందా అని అడిగాడు. ఆ పూటకూళ్ళామె ఒక పోక చెక్కను తెచ్చి ఇచ్చింది. దానిని బ్రాహ్మనుడు గట్టిగా కొరకగానే ముక్కలైంది. దానిని చూసి ఆ స్త్రీ 'అబ్బా పంతులుగారు మీ పళ్ళెంత గట్టివండి.. ఇప్పటికి ఎంతో మంది దానిని కొరికారు. కాని ఎవరికీ నలగలేదు. కాని మీరు కొరకగానే నలిగింది" అనగానే బ్రాహ్మణుడు ఆశ్చర్యపోయాడు.. ఛీ! అంటే దీనిని అందరూ కొరికారా? అని అడిగాడు. అవునండి, వేరే ఇంకేమీ లేవు' అని అంది. ఛీ ముదనష్టపుదాన ఎంత పనిచేశావే! అని తిట్టుకుని, మళ్ళీ పంచాంగంలో దీనికేమైనా పరిష్కారం ఉందో? లేదోనని చూశాడు. దీనికి ఏడుసార్లు గంగానదిలో మునగాలని రాసి వుండడంతో అవీ, ఇవీ లెక్కలేసుకుని బయల్దేరాడు. ఇంకొంచెం దూరం వెళ్ళాక మళ్ళీ ఆకలి వేసి, ఈసారి పూటకూళ్ళ వాళ్ళను నమ్మరాదని తనే స్వయంపాకం చేసుకునేందుకు సరుకులు తెచ్చుకున్నాడు. వండుకోవడానికి పాత్రలు లేక దగ్గర్లో ఒక ఇల్లు ఉంటే అక్కడికి వెళ్ళి ఒక స్త్రీని పిలిచి పాత్రలు అడిగి తీసుకున్నాడు. ఆ ఇల్లాలు ఆ ఇంటికి కొత్తగా వచ్చిన కోడలు, ఈ బ్రాహ్మణుడు అన్నం వండుకుని తిని, పాత్రలు ఇచ్చే సమయానికి అక్కడ అత్త కోడలిని పిలిచి ఇక్కడ కుక్కల కోసం వాడే గిన్నెలు ఏవని? అడిగింది. ఆ విషయం తెలియగానే మళ్ళీ బ్రాహ్మణుడికి మళ్ళీ గుండె జారిపోయింది. ఛీఛీ ఎంత పనిచేశావమ్మా! అని అనుకుని దానికి దోష నివారణ చేసుకోవడానికి పంచాంగం చూశాడు. ఈ సారి 9 సార్లు మునగాలని రాసి వుండడం చూసి మొత్తం చూసుకుని గంగానది చేరాక దానిలో మునిగాడు. అన్నిసార్లు మునిగిలేచేసరికి బ్రాహ్మణుడికి ప్రాణం పోయింది.

హాస్యరసాత్మక విశ్లేషణ :

సమాజంలో ఆచారాలు, మడికట్టు సాంప్రదాయాలు పేరుతో ఉన్నతంగా జీవిస్తున్న బ్రాహ్మణులలో కొందరు వాస్తవికతకు దూరంగా కొన్ని విశ్వాసాలను మూఢంగా అమలుచేసేవారుంటారు. సదాచారం పేరుతో పూర్వీకులు కొన్ని నియమాలను మానవ జీవితానికి విధించినా కాలానుగుణంగా వాటిలో మార్పులు చేసుకోవటం, వాస్తవికతకు దగ్గరగా ఉండేలా చూసుకోవటం అనేది చాలా అవసరం. కాని కొందరు చాదస్తంగా వ్యవహరిస్తుంటారు. అలా వ్యవహరించడం వల్ల ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇలాంటి కథలు హెచ్చరిస్తుంటాయి. అదే సమయంలో తగినంత ఆనందాన్ని, హాయిని తనివితీరా అందిస్తాయి. కథలోని పాత్రలును కూడా సందర్భానికి తగిన విధంగా ఎంచుకోవటం అనేది జానపదుల ప్రత్యేకత.

ఈ కథలో హాస్యరస సంఘటనలు చాలానే కనిపిస్తాయి. తుమ్మటం, తుంపరలు పడటం వంటివి సర్వసాధారణం. ఇలాంటివి పడితే ఎవరైనా ఇబ్బంది పడటం సహజం. కాని దానిని విపరీతంగా భావించడం, పంచాంగంలో పరిష్కారం కోసం వెదకటం, చిన్న విషయానికే గంగాయాత్రకు పూనుకోవడం విపరీతంగా కనిపిస్తుంది. ఈనాటి కాలం కన్నా ఆనాడు కాశీ ప్రయాణం వ్యయ ప్రయాసలతో కూడుకున్నది. సరే బయల్దేరాడు. దేశకాల పరిస్థితులకనుగుణంగా పరిస్థితులు మారుతుంటాయి. పూటకూళ్ళ వారింఢ్లలో జరిగిన సంఘటనలు మనకు హాస్యాన్ని కలిగిస్తాయి. ఒకరి దగ్గర ఒక ఆకే అందరికీ, మరొకచోట ఆ సమస్య రాకూడదని బ్రాహ్మణుడు ముందు జాగ్రత్తతో ఆకు తెచ్చుకుంటే తాంబూలంలో వక్క దగ్గర సమస్య. అందరూ ఎంగిలి చేసిన దానిని తినాల్సి వచ్చింది. ఇవన్నీ కాదని తెలివిగా ప్రవర్తించి స్వయంపాకం చేసుకోవాలన్న ఆలోచన రావడం ఉత్తమమైనది.

కాని అక్కడ కూడా చుక్కెదురైంది. కుక్కలుకు పెట్టే పాత్రలో వండుకోవాల్సి వచ్చింది. ఇది కూడా నవ్వు తెప్పించే సంఘటనే. కానీ వీటన్నింటికీ పంచాంగంలో పరిష్కారాలను వెతుక్కుని ఖచ్చితంగా ఆచరించే ప్రయత్నం చేయడం అనేది చాదస్తానికి ప్రతీక. గంగానది పవిత్రమైనదే. కాని మూడుసార్లు మునగడం శ్రేయస్కరం. ఎన్ని సమస్యలకైనా పవిత్రత లభిస్తుందనే నమ్మకం జానపదుల్లో కనిపిస్తుంది. అలాంటప్పుడు ఒకసారి మునిగినా ఫలం లభిస్తుంది. కాని అన్నింటినీ లెక్కించుకుని, అన్నిసార్లు మునగటం వల్ల ప్రాణాలు కోల్పోవలసి వచ్చింది.

ఈ కథలో మరో విషయం గమనించాలి. జానపదులు సరిసంఖ్యలకన్నా, బేసి సంఖ్యలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు అనే విషయం స్పష్టమవుతుంది. ఇలాంటి కథలు పిల్లలకు హాస్యంతో పాటుగా నీతిని కూడా బోధిస్తాయి. దీని ప్రకారం మనిషికి ఆచారం ముఖ్యమేగాని గుడ్డిగా నమ్మడం, మూర్ఖంగా ప్రవర్తించడం చేయకూడదువంటి విషయాలు నేర్చుకోగలుగుతారు.

ఉపసంహారం :

జానపదులు ఇలా ఎన్నో కథలతో తమ పిల్లలకు, సహచరులకు ఆరోగ్యదాయకమైన కథలను, ఇతర జానపద సాహిత్యలను చెప్పుకోవడం ద్వారా తమ జీవన విధానాన్ని ఉత్తమమైన మార్గంలో సాగించేందుకు దోహదం చేస్తాయి. అందుకే జానపదుల విషయంలో రసరాజంగా హాస్యమే ఉంటుందని పండితుల అభిప్రాయం. ఇలాంటివి ఎన్నో హాస్యరసా త్మక జానపదకథలు ఇంకా జన వ్యవహారంలో అక్కడక్కడా బ్రతికే ఉన్నాయి. వాటిని మన పరిశోధనల ద్వారా గ్రంథస్తం చేసి, భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం వుంది.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

ఏనుగుల వీరాస్వామి జీవితం-పాండిత్య విశేషాలు

- కంపసాటి ఉదయలక్ష్మి
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, హైద్రాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైద్రాబాద్.

తెలుగు సాహిత్యంలో యాత్రాచరిత్ర ప్రక్రియకు ఆద్యులు ఏనుగుల వీరాస్వామి. యాత్రాచరిత్రపేరు చెప్పగానే ప్రతిఒక్కరికి మొదట స్ఫురణకువచ్చేది 'కాశీయాత్ర చరిత్ర'. ఇది పలుకోణాల్లో యాత్రాచరిత్ర లక్షణాలను సంపూర్ణంగా ప్రదర్శించే అపూర్వ గ్రంథం. ఈ గ్రంథ రచయిత ఏనుగుల వీరాస్వామి 18వ శతాబ్ది ఉత్తరార్థంలో జన్మించి, 19వ శతాబ్ది పూర్వార్ధంలో తెలుగు వారి సాంఘిక, సారస్వత రంగాలలో గొప్ప ప్రతిభ కనబర్చిన ప్రముఖులలో వీరు ఒకరు. వీరు యాత్రాచరిత్రకారుడిగా, తెలుగు రచయితగా, వివిధ భాషలలో ప్రావీణ్యంకల బహుభాషావేత్తగా, సంఘసంస్కర్తగా, విద్వాంసునిగా, ప్రజాసేవకుడిగా ప్రసిద్ధులు.

బాల్యం-ఉద్యోగ జీవితం :

ఏనుగుల వీరాస్వామి దక్షిణదేశంలో స్థిరపడ్డ తెలుగు కుటుంబానికి చెందినవాడు. వీరు తెలుగు నియోగి బ్రాహ్మణ కుటుంబంలో శ్రీవత్సవ గోత్రంలో 1780 ప్రాంతంలో జన్మించారు. వీరి నివాసస్థలం చెన్నపట్టణం. వీరు పుట్టిన కాలం గురించి సరైన ఆధారాలు లేకపోయినప్పటికీ 1835వ సంవత్సరంలో పదవీవిరమణ చేయడంతో ఆరోజుల్లో ఉద్యోగ విరమణ వయసు 55 సంవత్సరాలు అవ్వడంతో వీరి జనన కాలాన్ని 1780 ప్రాంతంగా దిగవల్లి వెంకటశివరావు నిర్ధారించారు (శివరావు, దిగవల్లి. 1941:4). వీరాస్వామి తండ్రిపేరు సామయమంత్రి. వీరాస్వామి తొమ్మిదవ ఏటనే తండ్రి చనిపోయారు. పిత్రార్జితం అంతగా లేకపోవడంతో స్వయంకృషితోనే అనేక భాషలలో మంచి పాండిత్యం సంపాదించారు.

తెలుగు, తమిళం, సంస్కృత భాషలలోనే కాకుండా తన 12వ ఏటనే ఇంగ్లీషులో ధారాళమైన ప్రజ్ఞను సంపాదించారు. దీనితో మద్రాసులో 'బోర్డ్ ఆఫ్ ట్రేడ్'లో వాలంటీరుగా ఉద్యోగం సంపాదించుకున్నారు. ఈ ఉద్యోగం నిర్వహిస్తూనే వీరాస్వామి తెలుగు, తమిళ, ఆంగ్ల భాషలలో మంచి పట్టుని సాధించారు. అందువల్లే వీరాస్వామి తన 13వ ఏటనే తిరునల్వేలి జిల్లా కలెక్టరుఆఫీసులో 'ఇంటర్‌ప్రిటర్' ఉద్యోగం సంపాదించుకో గలిగారు. వీరాస్వామి ఈ ఇంటర్ ప్రెటర్ ఉద్యోగాన్ని రెండేళ్ళు చేసిన తరువాత తన 15వ ఏట చెన్నపట్నం వచ్చి అనేక వ్యాపారసంస్థల్లో పనిచేస్తూ 'బుక్‌కీపింగ్' వంటి విద్యలలో ప్రావీణ్యం సంపాదించారు. కుంఫిణీవారి వర్తక శాఖకు సంబంధించిన 'బోర్డ్ ఆఫ్ ట్రేడ్'లో ఎకౌంటెంట్‌గా, వేర్ హౌస్‌లో హెడ్ ఎకౌంటెంట్‌గా పనిచేశారు. ఈ సమయంలోనే వీరాస్వామికి భిన్నభాషలలో ఉన్న అభినివేశాన్ని, భారతీయ శాస్త్రాలలో ఆయనకున్న పాండిత్యాన్ని మద్రాను సుప్రీంకోర్టు గుర్తించి, అప్పటి రోజుల్లో గొప్ప ఉద్యోగంగా భావింపబడే ఇంటర్‌ప్రెటర్ ఉద్యోగాన్ని 1819లో ఇచ్చింది. 1815 %--% 1829 మధ్య సదర్ అదాలత్ కోర్టులో ఇంటర్ ప్రెటరుగా వున్న వెన్నెలకంటి సుబ్బారావుగారు అన్నివిధాలా అర్హతకలిగిన వీరాస్వామిని సుప్రీంకోర్టు ఇంటర్‌పెటర్‌గా ఉద్యోగానికి సిఫార్సు చేశారు. దీంతో సుప్రీంకోర్టు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి వీరాస్వామిని 'ఇంటర్ ప్రెటర్' ఉద్యోగానికి ఎంపిక చేశారు. అతితక్కువ సమయంలోనే వీరాస్వామి సుప్రీంకోర్టులో హెడ్‌ఇంటర్ ప్రెటరుగా బాధ్యతలు స్వీకరించారు.

ఆ కాలంలో హెడ్‌ఇంటర్‌ప్రెటర్ పదవి చాలా బాధ్యతాయుతమైన పదవి. పాశ్చాత్య చట్టాలను, స్థానిక ధర్మసంప్రదాయాలను,ఆచారాలను సమన్వయ పరుస్తూ మనదేశంలో విచారణచేయడం, తీర్పులు ఇవ్వవలసి ఉండడంతో ఇంగ్లీషు జడ్జీలకు ఆ పని చాలా కష్టతరంగా ఉండేది. దానితోవారు ప్రమాణ గ్రంథాలను, వాటి వ్యాఖ్యానాలను పరిశీలన చేసిన భారతీయ పండితుల సహాయంతో తీర్పులు ఇచ్చేవారు. అటువంటి పండితులకే హెడ్ ఇంటర్ ప్రెటరుగా ఉద్యోగం ఇచ్చేవారు. గణనీయమైన శాస్త్ర పరిజ్ఞానం, భారతీయ సంప్రదాయాలగురించి సరైన అవగాహన, లౌకికజ్ఞానం కలిగి ధర్మబద్ధుడైన ఏనుగుల వీరాస్వామి ఆ పదవినలంకరించిన తెలుగువారవ్వడం మనందరి అదృష్టం.

వీరాస్వామి తన ఉద్యోగజీవితంలో నిజాయితీ పరుడుగా పేరు తెచ్చుకున్నారు. అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సర్ రాల్ఫ్ పాల్మర్ పదవీవిరమణ చేసేముందు వీరాస్వామిక Testimonial యోగ్యతా పత్రం రాసిచ్చారు. అలాగే వీరాస్వామి ఉద్యోగ విరమణ కోరుతూ అప్పటి ప్రధాన న్యాయమూర్తి 'సర్ రాబర్ట్ బక్లే కమిషన్'కు మనవిచేసుకోవడంతో ఆ జడ్జిగారు వీరాస్వామి సుగుణాలను గురించి చెప్తూ 'యీ ఉద్యోగమును యీ పురుషుడు గడిపినట్టు గడిపే శక్తిమంతులను నేను యిదివరలో చూడలేదు. యీ పురుషుడు యీ ఉద్యోగమును వదలుట ఈ కోరటుకు బహునష్టము' అని తన ఆవేదనను తెలిపారు(హరిదాసు, మచ్చా.1992:122).

వాలంటీరుఉద్యోగం మొదలు బ్రిటీషుకాలంలో అత్యున్నత న్యాయస్థానంగా భావింపబడిన సుప్రీంకోర్టులో హెడ్‌ఇంటర్‌ప్రెటర్‌వరకు అనేక ఉద్యోగాలు నిర్వహిస్తూ బ్రిటీషుదొరల మన్ననలను, అభిమానాన్ని చూరగొన్న వీరా

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

స్వామి గారు 1835వ సంవత్సరంలో పదవీ విరమణ చేశారు. పదవీవిరమణ చేసిన సంవత్సర కాలానికే 1836 అక్టోబర్ 3వ తేదీన స్వర్గస్థులయ్యారు.

వీరాస్వామి పాండిత్యం :

తన పాండిత్యంకారణంగానే ఆనాటి సమాజంలో అనేక ఉన్నతోద్యోగాలు నిర్వహిస్తూ గౌరవమన్ననలు పొందగలిగారు. చిన్ననాటినుండి అనేక కష్టాలుపడి స్వయంకృషితో ఉన్నత స్థానాలను చేరుకున్నారు. 12 సంవత్సరాల వయసులోనే తెలుగు, తమిళం, సంస్కృతం, ఆంగ్ల భాషలలో అపారమైన పాండిత్యాన్ని సంపాదించారు. వేర్‌హౌస్‌లో హెడ్‌అకౌంటెంటుగా పనిచేస్తున్న కాలంలో జ్యోతిష్య శాస్త్రం, ఖగోళ శాస్త్రం, పంచాంగ నిర్మాణం, స్మృతులు, ఉపస్మృతులు, పురాణాలు, స్థలపురాణాలు మొదలైన అంశాలలో పాండిత్యం సంపాదించారు. భారతీయ మత గ్రంథాలు, సంప్రదాయాలు, సంప్రదాయాల వెనుక దాగివున్న సిద్ధాంత గ్రంథాలు, క్రైస్తవ, మహ్మదీయ మత గ్రంథాలను ఆ కాలంలోనే అధ్యయనం చేశారు. కేవలం 15 ఏళ్ళ బాలుడు తన ఉద్యోగ బాధ్యతలను నిర్వహిస్తూ స్వయంకృషితో వివిధ అంశాలలో పాండిత్యం సంపాదించడం జరిగింది.

లార్డ్ మెకాలె కంటే ముందే భారతదేశంలో ఆంగ్లవిద్య, పాశ్చాత్యవిజ్ఞానాల ఆవశ్యకతను గుర్తించిన దూరదర్శి వీరాస్వామి. వీరాస్వామి కాలంలో విశ్వవిద్యాలయాలు లేవు సరికదా కనీసం కొద్దిపాటి కళాశాలలు కూడాలేవు. అటువంటి సమయంలోతన పలుకుబడితో 'హిందూలిటరరీ సొసైటీ'ని స్థాపించి ఆధునిక విద్యకు బాటలువేశాడు. ఎంతో ఉన్నత వ్యక్తిత్వం కలవారు కాబట్టే ఈ సంఘస్థాపనకి అప్పటి అడ్వకేట్‌జనరల్ జార్జినార్టన్, వీరాస్వామి స్నేహితుడు కోమలేశ్వరపురం శ్రీనివాసపిళ్ళగార్లు సహకరించారు. ఈ సొసైటీనే తర్వాతికాలంలో మద్రాసులో విశ్వవిద్యాలయం స్థాపించే ఆలోచనకు పునాది రాయి వేసింది. భారతదేశంలో మెకాలేకంటే ముందే ఆంగ్ల భాషాధ్యయన ప్రాధాన్యాన్ని, పాశ్చాత్య విజ్ఞానాల ప్రాముఖ్యాన్ని గుర్తించి దక్షిణ భారతదేశంలో వాటి ప్రచారాన్ని ప్రారంభించిన ఘనత వీరాస్వామికే చెందుతుంది.

సరిగా అచ్చుపుస్తకాలు కూడా లేనికాలంలో వీరాస్వామి సంపాదించిన పాండిత్యాన్ని గమనిస్తే ఆశ్చర్యం వేస్తుంది. సందరానుసారంగా తన రచనలో అతను ఉదహరించిన విషయాలు శృతి, స్మృతులపై అతని జ్ఞానాన్ని, తార్కికలక్షణాన్ని, సత్యశోధనపట్ల నిబద్ధతను తెలియచేస్తున్నాయి. వీరాస్వామికి పురాణ వ్మాయంలో విశేషమైన పాండిత్యం ఉంది. పురాణాల గురించి వీరు హేతుబద్ధంగా నిశిత పరిశీలన చేశారు.

వీరాస్వామి పాండిత్యం శాఖోపశాఖలుగా విస్తరించింది. పంచాంగ నిర్మాణంలో వీరి పాండిత్యం అపూర్వమైంది. దక్షిణ దేశ పంచాంగానికి, ఉత్తరదేశ పంచాంగానికి ఉండే బేధాలను సూక్ష్మ పరిశీలన చేశారు. 1822-23 ప్రాంతంలో జ్యోతిష్య శాస్త్ర పండితుల సభలో అధిక క్షమమాసాల చర్చనుసాగించి క్షయమాస నిర?యం (కొన్నిసంవత్సరాలలో అధిక మాసం వచ్చినట్టు కొన్ని సంవత్సరాలలో ఒక మాసం తక్కువైనపుడు ఏ మాసం తగ్గించాలన్న విషయం) చేయడంతో ఆ సభలో పండితులు వీరాస్వామికు రత్న హారాన్ని బహూకరించారు. చంద్రమాన, సౌరమానాలలో ఉండే తేడాను చెప్పడంబట్టి వారి ఖగోళ శాస్త్ర పాండిత్యం తెలుస్తుంది. 'స్మృతి చంద్రిక' వంటి పుస్తకాలను ఆంగ్లంలోకి అనువాదం చేశారు. అలానే సి.పి. బ్రౌన్ తెలుగు -ఇంగ్లీషు నిఘంటువులో ఇంద్రాణి name of the wife of india a sort of bracelet orangallu gloesary dowager a brahmin window, eanugula, 28 July 1830

(సి.పి.బ్రౌన్.1966:112)the name of the certain much cultivated in the neighbourhood of hyderabad for its fruits see description in the kasi yatra date7 september 1830 (సి.పి.బ్రౌన్.1996:596), పొలకట్టు A ploughed field. kasi yatra p.55 (సి.పి.బ్రౌన్.1996:719), సీదా (i.e dŸ<'e Üï daily bread) rise bestowed as a alms in a raw un cooked state. provision un dressed vituals; forage see kasi yatra p.119 (శివరావు, దిగవల్లి.1941:169) (సి.పి.బ్రౌన్.1996:124)అనే పదాల అర్థాలకు వీరాస్వామినే ప్రమాణంగా తీసుకున్నారు (ఆ కాలంలో బ్రౌన్ బందరు సబ్ కలెక్టరుగా పనిచేస్తున్నాడు).

వీరాస్వామి ప్రతివిషయాన్ని సూక్ష్మదృష్టితో పరిశీలిచగల్గే పరిశోధక లక్షణాలు కల్గిన వ్యక్తని అతని కాశీయాత్రని పరిశీలించిన ప్రతి ఒక్కరికీ తెలుస్తుంది. యాత్ర చేస్తున్నప్పుడు ఏ ఊరికెళితే ఆ ఊరిచరిత్ర, మనుషుల ఆచారవ్యవహారాలు, పరిపాలనా విషయాలు,వేషభాషలను క్షుణ?ంగా పరిశీలించే వారు. ఇలా ప్రతివిషయాన్ని తెలుసుకోవాలని,వాటిని వివరించాలనే జిజ్ఞాసాపరుడు. వీరాస్వామి నిరంతర అధ్యయనశీలి. కాశీయాత్ర చేసే సందరలేలో తనకు నిత్యజీవితంలో అవసరం లేని ఎన్నోవిషయాలను శ్రద్ధతో అధ్యయనం చేశారు. యాత్రా సమయంలో నూరుమందికి పైగా ఉన్న పరిజనానికి ఆయన యజమాని, నాయకుడు, సంరక్షకుడు. వారిని అన్ని విధాలా కాపాడాల్సిన బాధ్యత వీరాస్వామిపై ఉండడంతో ఆయన వైద్యశాస్త్రానికి సంబంధించిన అనేకాంశాలను కూడా నేర్చుకున్నారు. ఇంతటి మంచితనం మూర్తీభవించిన వ్యక్తి కాబట్టే వేర్‌హౌస్‌లో హెడ్‌అకౌంటెంట్ పదవిని వదిలి వెళ్ళేటప్పుడు అక్కడివారు వీరాస్వామికు తమ గుర్తుగా ఒక బంగారపు నశ్యపు డబ్బానిచ్చి ఘనమైన వీడ్కోలిచ్చారు.

వీరాస్వామి వ్యక్తిత్వం:

ఏ యాత్ర అయినా అది చేసేవారి వ్యక్తిత్వ సంస్కారాల మీద ఆధారపడి ఉంటుంది. కాశీయాత్ర చరిత్ర విశేషాంశా

లను తెలుసుకునేముందు ఆ యాత్రచేసిన వీరాస్వామి వ్యక్తిత్వం గురించి తెలుసుకోవడం అవసరం. అతి చిన్న వయసు లోనే తండ్రిని కోల్పోయి కుటుంబ పరిస్థితులు అంతంత మాత్రమే అయినా స్వయంకృషితో తన వ్యక్తిత్వాన్ని తీర్చి దిద్దుకుని ఆనాటి సమాజంలో మహోన్నత శిఖరానికి చేరాడు. వీరాస్వామి పండితుడేకాక వివేకవంతుడు, వినయశీలి, సహృదయుడు, దయామయి, దేశభక్తుడు. "ఉదాత్తమైన మనస్సు ప్రతివిషయాన్ని ధర్మబుద్ధితో విచారణ చేయాలనే తత్వం, తోటిమనుషులకు మేలు చేయాలనే తపన, భవిష్యత్తులో తన చుట్టూ ఉన్న సంఘం అభివృద్ధిలోకి రావడానికి చేతనయిన కార్యక్రమాలని చేపట్టాలనే ఉత్సాహం వీరాస్వామి జీవిత లక్ష్యాలుగా కనిపిస్తాయి" (లక్ష్మణరావు, ముక్తేవి. 1992:xxiv).

ఇంగ్లీషు దొరలవద్ద ఉద్యోగం చేస్తూ వారి అభిమానాన్ని చూరగొన్నాగాని తన మతం, సంప్రదాయం పట్ల తన భావాల్ని నిశ్చయంగా, నిర్భయంగా ప్రకటించగలిగే ధీశాలి. తన ఆత్మగౌరవాన్ని హిందూ సంఘం యొక్క గౌరవంగా భావించారు. వీరాస్వామి ఎంతటి పెద్దదొరలతోనైనా వాదించి భిన్న మతతత్వాలకు సమన్వయం కుదిర్చే ప్రయత్నం చేసేవారు. అయినా వారి అభిమానాన్ని నిల్పుకోగలిగాడు. చెన్నపట్టణంలోని పచ్చయప్ప అనే ప్రముఖవ్యక్తి దానధర్మాలకోసం ధనాన్ని కేటాయించారు. ఆయన వారసులు ఆ డబ్బులను సద్వినియోగం చేయకపోవడంతో వీరాస్వామి ఆ అధర్మాన్ని సహించలేక (సుప్రీంకోర్టు పాత అడ్వకేట్ జనరల్) కాంప్టన్ దొర, (సుప్రీంకోర్టులో అప్పటి అడ్వకేట్ జనరల్) నార్టన్ దొరల సహాయంతో ఆ ధనాన్ని దానధర్మాలకు ఉపయోగపడేలా ఒక స్కీం తయారుచేయించి ధర్మకర్తల బోర్డుని నియమించాడు. ఈ డబ్బుతోనే తర్వాత కాలంలో పచ్చయప్ప కళాశాల స్థాపించబడింది. ఈ కళాశాలలో వీరాస్వామికి సంబంధించిన చిత్రపటాలు ఇప్పటికీ లభ్యమౌతున్నాయి. ఉత్తర భారతంలో విద్యాభివృద్ధికి, జాతీయ చైతన్యానికి కృషిచేసిన రాజా రామమోహనరాయ్ లాగా దక్షిణ భారతంలో ఏనుగుల వీరాస్వామి ఎంతో కృషి చేశారు.

వీరాస్వామిపట్ల ఆంగ్లదొరలకు గాని, ఆంగ్ల ప్రభుత్వానికిగాని ఎంత గౌరవముండేదో ఆయన జీవితంలోని వివిధ సందర్భాల్ని బట్టి అర్థంచేసుకోవచ్చు. ఇంగ్లీషు దొరల అభిమానం చూరగొన్న వీరాస్వామికు యాత్రా సమయంలో వారు విశేషమైన సాయాన్ని అందించారు. వీరాస్వామి చెన్నపట్టణం నుండి యాత్ర ప్రారంభించేటప్పుడు అప్పటి పెద్ద దొరలనుండి (సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగావున్న సర్ జాన్ న్యూబోల్ట్ దొర, సర్ చార్లెస్ గ్రే దొర)'క్యారెక్టర్లు(నడవడి పత్రాలు)' (ఇతర ప్రాంతాలలో ఉండే ఇంగ్లీషు దొరల పరిశీలనకు ఇచ్చిన పరిచయ లేఖలు) తీసుకున్నారు. ఈ క్యారెక్టర్లలో దొరలు వీరాస్వామి మంచితనాన్ని గురించి, ఆయన హోదాను గురించి రాసివ్వడంతో దానివల్ల దేశమంతటా సంచారసమయంలో దొరలు, సంస్థానాధీశులు వాటిని చూసి వీరాస్వామిను విశేషంగా గౌరవించి, వారి అవసరాలను తీర్చారు.

సర్వ జనహితానికి, సర్వమత సామరస్యానికి నిలువెత్తు సాక్ష్యం వీరాస్వామి. నాస్తికులంటే దురభిప్రాయంఉన్న ఆ రోజుల్లో నాస్తికులు దూషులుకారని, నిర్గుణోపాసకులైన జ్ఞానులతో సమానులని నిర్భయంగా చెప్పేంతటి విశాలదృక్పథం గలవ్యక్తి. తన కూతురి వివాహానికి బంధువుల ఆక్షేపణలు లక్ష్య పెట్టకుండా చతుర్వరా?లవారికి భోజనాలు పెట్టించాడు. దీన్ని సహించలేని కొందరు ఈ విధంగా డబ్బును వృధాచేయడం ఎందుకు కూతురి పోషణకై ఆ సొమ్ము ఉంచితే మేలుకదా! అని సలహాలిచ్చారు. దీనికి వీరాస్వామి 'చిన్నదాని పోషణకోసం ధనాన్ని మనుష్యాధీనంగా ఉంచడానికి బదులుగా ఈశ్వరుని చేతిలో భద్రంగా ఉంచుతున్నా'నని ఇచ్చిన సమాధానం ఆయన విశాల భావదృక్పథానికి, తాత్విక చింతనకు, మంచితనానికి, నరుడే నారాయణుడు అన్ననమ్మకంకు నిదర్శనం.

భారతీయ సంప్రదాయ విలువల్ని నిలబెడుతూ, పాశ్చాత్యుల అభిమానాన్ని పొంది, దానిని ఉపయోగించుకుంటూ తన జీవితకాలంలో అనేక ప్రజాహిత కార్యక్రమాలను వీరాస్వామి చేపట్టారు. వీరాస్వామి గొప్ప ప్రజాసేవకుడు, డొక్కశుద్ధిగల పండితుడు కావంవల్ల ఆనాడు ఆయన చేసిన కాశీయాత్ర చరిత్రలో ఆయన అందించిన వివరాలు ఈనాడు చరిత్ర పునర్నిర్మాణాకి, ముందున్న సమాజాలను అర్థంచేసుకోవడానికి, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను అవగాహన చేసుకోవడానికి కూడా ప్రామాణికం అయ్యాయి. అనువాదకుడిగా, దుబాసీగా, పండితునిగా, తత్త్వవేత్తగా, దాతగా, దాయశీలిగా, భిన్న శాస్త్రాధ్యయనకారుడిగా చివరకు రచయితగా వీరాస్వామి అఖండమైన ఖ్యాతిని సంపాదించి తెలుగు వారి సాంస్కృతిక, సాహిత్య చరిత్రలోనేకాక వారి హృదయాలలో కూడా చోటు సంపాదిచుకున్నాడు.

ఆధార గ్రంథాలు :

1. ప్రతాపరెడ్డి, సురవం. 1949. ఆంధ్రులసాంఘిక చరిత్ర. హైదరాబాదు:ఆంధ్రసారస్వతా పరిషత్తు
2. లక్ష్మణరావు, ముక్తేవి. 1992. కాశీయాత్ర చరిత్ర. హైదరాబాదు:తెలుగు విశ్వవిద్యాలయం.
3. వేంకటశివరావు, దిగవల్లి. 1941. ఏనుగుల వీరాస్వామి కాశీయాత్ర చరిత్ర. న్యూఢిల్లీ: ఏసియన్ ఏడ్యుకేషనల్ సర్వీసెస్.
4. సి. పి. బ్రౌన్. 1966. బ్రౌణ్య తెలుగు-ఇంగ్లీషునిఘంటువు. హైదరాబాదు:ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి
5. హరిదాసు, మచ్చా. 1992. తెలుగులో యాత్రా చరిత్రలు. హైదరాబాదు: విశాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

తెలంగాణ శాస్త్ర కావ్య కర్తలలో ఒకరు గంగుల శాయిరెడ్డి

- డా॥ కె.వి.యన్.వి.వి.ఎస్. నారాయణమూర్తి
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, బద్రుకా కళాశాల, కాచిగూడ, హైదరాబాద్.

అతడు గంగుల సాయిరెడ్డి. పుట్టింది వరంగల్లు జిల్లాలోని జనగామ దగ్గర ఉన్న రామచంద్రగూడెం. వెంకమ్మ వెంకటరెడ్డి దంపతులకు 1890వ సంవత్సరంలో జన్మించారు. రామక్క, శివారెడ్డి ఇతనిని దత్తత తీసుకొని పెంచిన తల్లిదండ్రులయ్యారు. ఆ రోజుల్లో తెలంగాణ నిజాం ఏలుబడిలోనిది. తెలంగాణ భాష, యాస ఉర్దూ ప్రభావానికిలోనైన కాలం. కొంత అణచివేతకు గురైన రోజుల్లో ఒక చిన్న పల్లె నుండి, ఉన్నంతలో తాను చదువుకోవడమేకాక, అందరికీ చెప్పాలనే తాపత్రయంతో రాసిన గ్రంథం 'వర్షయోగము'. ఒక చక్కని జ్యోతిష శాస్త్ర గ్రంథం. సుమారొక అర్ధ శతాబ్దం కింద వెలువడిన పద్య వచన రూపంలో వచ్చినఈ గ్రంథంలో తెలంగాణ పాత్ర అవసరాలకు తగినట్లుగా అనేక ఉపయుక్తమైన విషయాలు వివరించబడ్డాయి.

తెలంగాణ ముఖ్యంగా వర్షాధార భూములతో వ్యవసాయ జీవనం అధికంగా ఉన్న నేల. వర్షం పడితే పంట లేకపోతే కరువు. వర్షాలు కురవాలి, చెరువులు నిండాలి, పంట పండాలి, కడుపునిండాలి అనే చక్రంలో బిగింపబడిన నేల. 'వర్షయోగము' అనే ఈ గ్రంథం మన ప్రాంత శాస్త్రం, మనదేశ శాస్త్రం. ఇక్కడి రైతులకు వర్ష విజ్ఞానం అత్యావశ్యకం. ఇది అందిన రైతుకవి శ్రీ గంగుల శాయిరెడ్డి.

పుట్టుక :

జనగామ దగ్గరలో ఉన్న చేర్యాలలోని మల్లారెడ్డి, శ్రీ సాయిరెడ్డికి గురువు. జన్మించింది రామచంద్రగూడెం. కన్నతల్లిదండ్రులు, దత్తత తల్లి తండ్రులు, బహుముఖాలుగా కొనసాగిన బాల్యం కష్టసుఖాలను నేర్పింది. నాటి నిజాం వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని, ఒక సంవత్సర కాలం జైలు జీవితం కూడా అనుభవించారు.

ఒకవైపు భూస్వాములు మరోవైపు ప్రభుత్వం - ఇలా రెండు వర్గాల మధ్య నలిగిపోతున్న రైతుల పక్షాన నిలిచి 'కాపుబిడ్డ' అనే పద్యకావ్యం రాశారు. జీడికల్లు ఆలయానికి ముంతెజీం (కార్యనిర్వహణాధికారి)గా 1956 నుండి 1972 వరకు పని చేస్తూ ఉండి కూడా, సమీప గ్రామంలో భువనగిరి నెల్లుట్ల, గుముడవెల్లి మొదలగుచోట్ల హాస్టళ్లు కట్టించారు. ఇంకా కొలనుకొండ, కొంపెల్లి, గాన్గుపాడు ఇలా అనేక గ్రామాలలో ఉచితంగా విద్యాబోధన చేస్తూ, నిరక్షరాస్యతను తొలగించే ప్రయత్నం చేసేవారు. ఈ సందర్భంలోనే వయోజనుల కోసం నాలుగు బాలశిక్షలు రాశారు. చిట్కా వైద్యం కూడా చేసేవారు. తెలంగాణ నేల నదుల ప్రవాహాలు ఉన్నా నాటి అధికారుల నిర్లక్ష్యాల కారణంగా వర్షాధారమైపోయింది. ఈ క్రమంలో సమాజ అవసరాన్ని గుర్తించి శాయిరెడ్డిగారు మనకందించిన గ్రంథం వర్షయోగం.

కర్త స్వయంగా కవిమాత్రమే కాకుండా కర్షకుడుకూడా అయినందువల్ల ఆయన స్వీయానుభవాలు కూడా చోటుచేసుకున్నాయి.

విత్తనంబులు వేసి నాననెదురుచూడంగ
కాపు జనులెల్లరు వర్షాలు లేక వెలవెల బోవంగ
అది నెరిగి తెల్ప వర్షము కురుయునెపుడని
వర్షయాగంబు గావించి వ్రాసె వర్షయోగంబు

"... వర్షమెప్పుడు కురియును, ఎట్లు కురియును అను విషయములెల్ల తెలిసిండవలసినవి, ఈ విషయమును గూర్చి పూర్వులు వ్రాసిన శాస్త్ర గ్రంథములు కొన్ని కలవు. దానిని జాగరూకతమై పరిశీలించి గడించిన జ్ఞానమునకు స్వానుభవమును జోగించి శ్రీ రెడ్డిగారీ గ్రంథమును రచించిరి. ఇందు వారి శాస్త్ర పాండితియు, సూక్ష్మ పరిశీలనమును జగద్ధితకాంక్షము బ్రత్యక్షరమున విదితములగుచున్నవి" అని శ్రీ దివాకర్ల వెంకటావధాని గారీ గ్రంథాన్ని ప్రస్తుతించారు.

వర్షయోగములో ఏముంది?

వర్ష విజ్ఞానం ఉంది. కార్తె స్వరూపం ఉంది. ఒకటా, రెండా! మేఘలక్షణం, గర్భఋతులక్షణం, వర్షపాత కార్తుల ఫలం, మంచుతత్త్వం, వాముతత్వం, ఆకర్షణక్షేత్రం, మెఱుపు, ఉరుము, పరివేషము, ఇంద్రధనుస్సు, ఆకస్మిక వర్షసూచనలు, మాసఫలాలు, చారఫలాలు, రాత్రి కాలనిర్ణయం... అనేకం ఉన్నాయి. కొసమెరుపుగా పంచాంగం చూసే పద్ధతిని కూడా వివరించారు శ్రీ శాయిరెడ్డిగారు.

ఇది పూర్ణంబుగ జదివియు
తదుపరి మది గుదురదేని తర్కించు సుమీ
అది యిది వదలక విని కన
కదలిక లేనట్టి పట్టు, కట్టగడపటన్

ఈ గ్రంథములో అన్నీ ఉన్నాయి. 'గ్రంథకర్త మాటలోనే : '... రెట్టమత శాస్త్రము పద్యకావ్యమేగాని అచ్చుతప్పులు కుప్పలుగానున్నవి. సస్యానందములోని పద్యములు కొన్ని శతవృద్ధుల నోట వింటినేగాని యువకులు వలనగాదు. లిఖిత జీర్ణ గ్రంథాదులు పురోహితుల పురువులకు (పురుగులు)

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భుక్తమగుచున్నవి. పుష్పబంధమను వర్షాది ప్రదర్శిని, వర్షఫణి, అర్ఘవిదారము మొదలైనవి సిద్ధాంతుల చేతులలో క్షీణించుచున్నవి.. కావున అక్కరకు వచ్చే పెక్కు విషయముల నొక్కచోట గూర్చితిని, గ్రహగతి గ్రహయుద్ధాదుల విష పరిజ్ఞానము గూర్చి వివిధ సిద్ధాంతుల ప్రాచీన పంచాంగముల పారజూచితిని, వర్ష సంబంధమైన చాటుధారలు సామెతలు సంగ్రహించితిని. మార్గశీర్షమా సమునుండి మరల కార్తిక మాసము వరకు పంద్రెండు నెలల దశధాతువుల పరిశోధంచి యేనాటికానాడు వ్రాసికొని విమర్శించి కొన్ని యేండ్లకే చిన్ని పొత్తము సిద్ధపరచితిని. మా పల్లెలో జ్యోతిశాస్త్ర పండిత సమాజము లేదు..” ఇంతకుమించి వివరణ ఇంకేం ఇవ్వగలం!

గ్రహబలంబు లేని కార్తెవర్షించదు
ప్రాణిలేని మేను పాడుకొనునె?
ఐక్యమమరదేని, యావత్తు విఫలంబు
గండిబడిన చెరువు, నిండగలదె?

కనుక, గ్రహబలం తెలవాలి, కాలం గుర్తెరగాలి, సమయం చూసుకోవాలి. అప్పుడే మనం వ్యవసాయ సంబంధిత పనులను చక్కబెట్టుకోగలుగుతాం. శాస్త్రం తెలిసినవాడు చేసేపని ఇది అంటాడు శాయిరెడ్డి.

ఉగాది పంచాంగ పఠనంలో :

ప్రతి సంవత్సరం ఉగాది రోజున రాజు, మంత్రి సేనాధిపతి.. వీళ్ళతోపాటు అర్ఘాధిపతి, మేఘాధిపతి ఎవరు? అనే విషయాలతోపోయి ఏ రకమైన పంటలు ఈ సంవత్సరం లాభసాటి? వర్షం ఎన్ని ఫలాలు పండుతుంద? కార్తె విజ్ఞాన సంబంధిత అంవఆలను మననం చేసుకోవడం నేటికీ మనం పాటిస్తున్నాం. ఏవి అనుకూలాలో తెలుసుకొని వాటిని అధికంగా పండించడం ఏవి అననుకూలాలో తెలిసికొని వాటిని విడవడంవల్ల రైతుకు ప్రయోజనం చేకూరుతుంది. ఇది ఒక సంవత్సర ప్రణాళిక. కాలం ప్రకృతిని అనుసరించి రైతు పంటలు పండించుకుంటే, బంగారు తెలంగాణ సాకారమవుతుంది. కాలానుగుణమైన చర్యలను జ్యోతిషం వివరిస్తుంది. అనుసరిస్తే మేలు కలుగుతుంది.

జానపదుల జ్యోతిర్విజ్ఞానం :

గాడిద చెవులు నిక్కబొడుచుకంటే తూర్పు వర్షం కురుస్తుంది. నిక్క బొడుచుకుని చాలాసేపుంటే పడమర వర్షం పడుతుంది. నవ్వువచ్చినా, ఇది నిజం. అందుకే చదువుకున్నవానికన్నా చాకలివాడు మేలు అనే సామెత వచ్చింది. ప్రకృతిని పరిశీలించడం, అనుగుణంగా జీవితాలను మలచుకోవడం ...తులకు సమజంగా ఉన్న కళ. చీమల దగ్గర నుండి గోవుల ...రకు, వాటి కదలికలను గమనించి ప్రకృతి చక్రాన్ని తయారు ...సుకునేవాడానాటి తెలంగాణ రైతన్న. ఇందులో ప్రధానమైంది ...ర్తె విజ్ఞానం.

కార్తె అంటే :

కార్తె అంటే సూర్యుడు ఉన్న నక్షత్రం అని అర్థం. ఇవి ఇరవై ఏడు. ప్రతి కార్తెకు ఏదో ఒకరకంగా వాతావరణంతో సంబంధం ఉంటుంది. సూర్యుడు కృత్తిక కార్తెలో ఉన్నకాలం, అత్యంత వేడిగా ఉండేది. అలాంటప్పుడు మట్టిని తవ్వడం చెయ్యకూడదు. భూమిలోంచి వేడి గాలులు వస్తాయి. అపాయం కలగొచ్చు. ఈ కాలానికి కర్తరి అనిపేరు. మట్టి, కట్టె, రాయి, వీటికి సంబంధించిన పనులు చేపడితే, వాటి జీవిత కాలం తక్కువగా ఉండి అవి పూర్తికాలం ఉపయోగానికి రావు.

అశ్వని కురిస్తే అంతానష్టం
భరణి కురిస్తే ధరణి పండుతుంది
రోహిణి ఎండలకు రోళ్ళు పగుల్తాయి
కృత్తికలో కుత్తుక (గొంతు) కూడా నిండదు
మృగశిర కురిసే ముంగారు (మూడు కాలాలు) పంట
అర్ద్రలో అడ్డెడుచల్లితే పునాసకు పుట్టెడు
అశ్లేష వర్షం అందరికీ లాభం

ఇటువంటి సామెతల విజ్ఞానం జానపదులకే సొంతం. శాస్త్రీయ విజ్ఞానం సామాన్యులు శాస్త్రవేత్తలకన్నా జానపదులకే జీవనాంతర్భాగం అనాలి. ప్రకృతి నుండి రైతును దూరం చేయలేం కదా.

ఈ కాలంలో ఈ గ్రంథం అవసరం ఎంత?

చాలా అవసరం. మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కెసిఆర్ గారు, తన రెండు కలలలో ఒకటి తెలంగాణ తేవడం, రెండు అది బంగారు తెలంగాణ కావడం అన్నారు. తెలంగాణ అయితే వచ్చింది కాని, ప్రతి ఇల్లూ ఆనందంతో కలకళలాడాలంటే సస్యలక్ష్మి మన నేలలో కొలువై ఉండాలి. తెలంగాణ నేల చెరువులపై ఆధారపడిన పంట భూములతో నిండి ఉంది. వర్షం కురిస్తేనే చెరువు నిండేది. వర్షం ఎప్పుడు కురుస్తుందో చెప్పే ఇలాంటి గ్రంథాల అవసరం ఈనాడు చాలా ఉంది అనాలి.

మిషన్ భగీరథ :

చెరువుంటేనే ఊరు. ఊరు అంటే రైతు. రైతు ఉంటే పంట. పంట పండితేనే మనకు కూడదు. ఆ చెరువులకు మళ్ళీ పూర్వ వైభవం తెచ్చే పథకం మిషన్ భగీరథ. అసలు ఏది బావి? ఏది వాపి? ఏది పుష్కరిణి? ఏది చెరువు? అన్న ప్రశ్నకు జలార్గళ శాస్త్రం ఇలా సమాధానమిస్తుంది.

ద్వార హీనో భవేత్కూపో ద్వారేణైకేన వాపికా
అనైక ద్వారాపుష్కరిణీ దీర్ఘాకారాతుదీర్ఘికా
కుల్యా విధూతతో యాశ్చ తటాకాః పరికీర్తితాః

నీరుతోడుకోవడానికి మోట లేక గిలక ఉండాలి. అది లేకపోతే, అప్పుడు ఆ నీరు ఉన్న స్థలం కూపం అనాలి.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

మోటలేక గిలకుంటే అది వాపి. అటువంటి నీరు స్వీకరించే అవకాశాలు ఎక్కువగా ఉంటే అది పుష్కరిణి. ఆ నీటి చెలకు దీర్ఘ చతురస్రాకారంలో ఉంటే దీర్ఘిక. ఇవన్నీ బావులు అందులో వివిధ రకాలు అయితే నీరు రావడానికి కొంత వైశాల్య స్థలం ఉండి, నీరు నిలవ ఉన్న తరువాత ఎక్కువైన నీరు మరోచోట నిలవకావడంకోసం 'గట్టు' ఉన్నట్లయితే అది తటాకం లేదా చెరువు అనాలి. అలా గట్టుపై నుండి ప్రవహించే నీరు మరోచోట, అక్కడ ఎక్కువైతే మరోచోట.. ఇలా గొలుసు కట్టు చెరువుల ఒకనాటి తెలంగాణ, మాగాణం పండించే నేల. మళ్లీ ఆ కాలం సాకారం కావడం కోసమే మిషన్ భగీరథ. చెరువులో నీళ్లు నిండాలి. అప్పుడే ఆ నీరు మరో చెరువు వైపు మళ్ళాలి అంటే వర్ష విజ్ఞానం ఎంత అవసరం!

వర్ష ప్రభావం పరిశీలించడం వర్ష ప్రవరణం అంటారు. రోహిణియోగం, స్వాతియోగం, ఆషాఢీయోగం - ఇలా ఎన్నిటినో ఈ గ్రంథం వివరిస్తుంది.

పరిశోధనల అవసరం :

తెలంగాణ చరిత్రను పునర్నిఖించుకుంటున్న ఈ తరుణంలో మన పూర్వుల గొప్పదనాన్ని చూచి గర్వపడడం మాత్రమే కాకుండా వారు మనకు అందించిన ఇటువ వైజ్ఞానిక శాస్త్రాల అధ్యయనం చేయాల్సి అవసరం నే ఎంతైనా ఉంది. ప్రకృతి ప్రభావాలకులోనై ఎన్నో ఆటుపోట్ల గురైన తెలంగాణ నేల నేడు పురివిప్పుకొని తన బిడ్డలు వర్షం తడుస్తూ 'వానావానా వల్లప్పా! చిటపట చినుకులు చెల్లప్పా వంటి పాటలు పాడుతూ ఆనందంతో నాట్యం చేస్తుం మురిసిపోతుంది. ఆ తల్లి ఆనందం కలకాలం ఇలా నిలవాలంటే పనికిమాలిన చదువులు కట్టిపెట్టి మనవైన శా గ్రంథాల అనుశీలనం చెయ్యాలి.

తుది మొదలు తెలియజాలని
చదువెది చదివినను ఫలము సాధ్యంబగునే
వెదబెట్టు పదును వదలిన
ముదమొదవునె కర్షకులకు, మోసముగాదె?
మన చదువులు చదువుకుందాం
మన బ్రతుకుల బతుకుదాం
వర్ష విజ్ఞానం పెంపొందించుకుందాం
ప్రకృతి ఒడిలో ఆనందంగా జీవిద్దాం.

❀❀❀

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

తెలుగు దినపత్రికలు - వివిధ శీర్షికలు

- టంగుటూరి జానకిరాములు
ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

పత్రికలు సమాజపు ప్రతిబింబాలు. సమాజంలోని ప్రతి కోణాన్ని దర్శించి ప్రపంచానికి వెల్లడి చేసే దీపికలు పత్రికలు. సమకాలీన అంశాలే కాకుండా రాజకీయాంశాలు, సామాజికాంశాలు, సాంస్కృతికాంశాలు, చారిత్రకాంశాలు, వైజ్ఞానికాంశాలతో పాటు సృజనాత్మక సాహిత్యానికి పెద్దపీట వేస్తున్నాయి. ప్రధానంగా దినపత్రికల్లో వచ్చే సంపాదకీయాలు ప్రపంచ సమాజాన్ని మనముందు నిలవెడుతాయి. ఈ సంపాద కీయ పేజిల్లో కూడా వర్తమాన అంశాలేకాక ప్రత్యేకంగా వివిధ కాలమ్స్‌ను నిర్వహిస్తున్నాయి. ఈ కాలమ్స్‌లో సమకాలీన అంశాలను తమదైన కోణంలో ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ శీర్షికల నిర్వహణ వల్ల ఆయా పత్రికలు సమాజానికి సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తున్నాయి.

ఇప్పుడు వెలవడే అన్ని దిన పత్రికలో ప్రతి సంపాదకీయం పేజిలో ప్రతిరోజు జాతీయ, అంతర్జాతీయ వర్తమాన అంశాలను సమాజానికి అందించే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ శీర్షికలను కూడా ప్రాంతీయ, జాతీయ స్థాయిలో ప్రసిద్ధులైన జర్నలిస్టులు నిర్వహిస్తున్నారు. తమకున్న ప్రాపంచిక అవగాహనను సమాజానికి అందిస్తున్నారు. ఒక్క సంపాదకీయాలే కాకుండ మహిళల కోసం ప్రత్యేకంగా నాలుగు పేజీలను కేటాయించి ప్రత్యేక శీర్షికలను నిర్వహిస్తున్నారు. ఈనాడు "వసుంధర" పేరుతో, సాక్షి "ఫ్యామిలీ" పేరుతో, ఆంధ్రజ్యోతి "నవ్య" పేరుతో, ఆంధ్రభూమి "భూమిక" పేరుతో, నమస్తే తెలంగాణ "జిందగి" పేరుతో, మన తెలంగాణ "అఖిల" పేరుతో నవ తెలంగాణ "మానవి" పేరుతో, ఆంధ్రప్రభ "లైఫ్" పేరుతో వార్త "చెలి" పేరుతో, సూర్య "కలర్స్" పేరిట విభిన్న శీర్షికలను నిర్వహిస్తు మహిళ సమాజాన్ని చైతన్యం చేస్తున్నాయి. అలాగే బాలలకోసం ఒక పేజిని కేటాయించి వారి మానసకి వికా సానికి తోడ్పడుతున్నాయి. వీటిలో చిన్న చిన్న కథలతో పాటు వైజ్ఞానికాంశాలు తెలుసుకుంటాం. సూక్తులు, పొడుపు కథలు, సామెతలు, సాహస బాలల వివరాలు, శాస్త్రవేత్తల వివరాలు వస్తున్నాయి. అలాగే క్రీడాభిమానుల కోసం క్రీడా పేజి, సినిమా ప్రేక్షకుల కోసం సినిమా పేజీ, విద్యార్థుల కోసం విద్యాపేజి, వ్యవసాయదారుల కోసం వ్యవసాయ పేజి, ఆధ్యాత్మిక విషయాల కోసం ఆధ్యాత్మిక పేజి, ఆరోగ్య విషయాల కోసం ఆరోగ్య పేజితో పాటు అన్ని దిన పత్రికల్లో ప్రతిరోజు పాఠకుల పేజి, కార్టున్స్ పేజిలు మనకు ప్రత్యేకంగా దర్శనమిస్తున్నాయి.

నమస్తే తెలంగాణలో "కట్టామిఠా" పేరుతో ఆదివారం ప్రతిక సంపాదకులు కట్టా శేఖర్ రెడ్డి జాతీయ, ప్రాంతీయ వర్తమాన అంశాలను వ్రాస్తున్నారు. మంగళవారం "తెలంగాణం" పేరుతో గటిక విజయ్‌కుమార్ ప్రాంతీయ అంశాలు వ్రాస్తున్నారు. గురువారం "అలోకన" పేరుతో టంకశాల అశోక్ ప్రాంతీయంశాలను, "జాతీయం" పేరుతో జాతీయంశాలను ప్రస్తావిస్తున్నారు. శనివారం "ముక్తసరి" పేరుతో దేవులపల్లి ప్రభాకర్ రావు నిర్వహిస్తున్నారు.

సాక్షిలో మంగళవారం "రెండోమాట" పేరిట ఎబికె ప్రసాద్ గారు జాతీయ, అంతర్జాతీయంశాలను, "బైలైన్" పేరుతో సీనియర్ జర్నలిస్టు ఎం.జె.అక్బర్ రాజకీయాంశాలను వ్రాస్తున్నారు. బుధవారం "డేట్‌లైన్" పేరిట దేవులపల్లి అమర్ సమకాలీన అంశాలను వ్రాస్తున్నారు. గురువారం "కొత్తకోణం" పేరుతో మల్లెపల్లి లక్ష్మయ్య, "జీవనకాలమ్" పేరిట గొల్లపూడి మారుతిరావు నిర్వహిస్తున్నారు. శుక్రవారం "విశ్లేషణ" పేరిట మాడభూషి శ్రీధర్, "సమకాలీనం" పేరుతో దిలిప్ రెడ్డి వ్యాసాలు రాస్తున్నారు. శనివారం "అక్షర తూణీరం" పేరిట హాస్యవ్యంగ్య రచనలను శ్రీరమణ నిర్వహిస్తే, శేఖర్ గుప్తా జాతీయ, అంతర్జాతీయంశాలను రాస్తున్నారు.

ఆంధ్రజ్యోతిలో మంగళవారం "భరత వాక్యం" పేరిట భరత్ ఝున్ ఝున్‌వాల్ నిర్వహిస్తున్నారు. బుధవారం "గల్ఫ్‌రేఖ" పేరుతో మహ్మద్ ఇర్ఫాన్ గల్ఫ్ నుంచి గల్ఫ్ సమస్యలు రాస్తున్నారు. గురువారం సందర్భం పేరిట జె.శ్రీనివాస్ జాతీయ, ప్రాతీయ వర్తమానాంశాలను రాస్తున్నారు.

నవతెలంగాణలో ఆదివారం "చిత్తాబొత్తా" పేరుతో జాతీయ, ప్రాంతీయాంశాల నిర్వహణ తెలిదేవర భానుమూర్తి, జర్నలిస్టులు "రిపోర్టర్స్ డైరీ" నిర్వహిస్తున్నారు. బుధవారం "రామయ్య మాట" పేరుతో ప్రసిద్ధ విద్యావేత్త రామయ్య నిర్వహిస్తున్నారు. ప్రతి సోమ, గురువారాల్లో "చార్వక" పేరుతో కులవ్యవస్థపూ విశ్లేషాత్మక వ్యాసాలు, "వేదిక" పేరుతో జాతీయ, ప్రాంతీయాంశాలు వస్తాయి. శనివారం "తొలిపొద్దు" పేరుతో జాతీయాంశాలు వస్తున్నాయి.

ఆంధ్రభూమిలో సోమవారం "వీరాజీయం" పేరుతో సామాజిక, రాజకీయాంశాల వేదికను విరాజీ గారు నిర్వహిస్తున్నారు. ఆదివారం "తోవ్వ ముచ్చట్లు" పేరుతో ఆచార్య జయధీర్ తిర్మల్‌రావు, "జనాంతికం" -బుద్ధ మురళి "పెన్ కౌంటర్" పేరుతో వ్యాసాలు వస్తున్నాయి. గురువారం - ఫోకస్ పేరుతో,

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

"ఢిల్లీ కబుర్లు" - మంగళవారం, శనివారం - "రచ్చబండ" పేర్లతో వస్తున్నాయి.

వార్తలో "వార్తల్లోని వ్యక్తి" పేరుతో తుర్లపాటి కుటుంబ రావు గారు సమకాలీన రాజకీయాంశాలు వ్రాస్తున్నారు. మన తెలంగాణలో మంగళవారం 'వర్తమానం' పేరుతో నివాస్ నిర్వ హిస్తారు. ఈనాడులో ఆదివారం 'పుణ్యభూమి' పేరుతో పర్వాత మూర్తి సమకాలీనాంశాలను వ్యంగ్యంతో రాస్తారు. ఈ పత్రిక లోనే ప్రతిరోజు వివిధ అంశాలపై ఆయా రంగంలో నిష్ణాతులైన వ్యక్తులతో వ్యాసాలు నిర్వహిస్తున్నారు.

తెలుగు దినపత్రికలు సాహిత్యానికి ప్రతి సోమవారం ఒక సంపాదకీయ పేజిని ప్రత్యేకంగా కేటాయించాయి. ఆంధ్ర భూమి - సాహితి, ఆంధ్రప్రభ - సాహితివాక్యం, ఆంధ్రజ్యోతి - వివిధ, నమస్తే తెలంగాణ - చెలిమె, సూర్య - అక్షరం, నవ తెలంగాణ దర్వాజ, మన తెలంగాణ - కలం, సాక్షి - సాహిత్యం వంటి కాలమ్స్ పేర నిర్వహిస్తున్నారు. ఇవి సాహిత్యానికి ఎంతో సేవ చేస్తున్నాయి. కవుల పరిచయాలు, కావ్య పరిచయాలు, కవితలు, జయంతులు, వర్ధంతులతో పాటు నూతన కవులకు ఇవి గొప్ప అవకాశాలను కల్పిస్తున్నాయి. వివిధ సాహిత్య ప్రక్రియల్లోని అంశాలను వ్యాసాల రూపంలో మనకు అందిస్తు న్నారు.

ప్రతి దిన పత్రిక సినిమా సాహిత్య ప్రియుల కోసం ప్రత్యేకంగా ఒకటి లేదా రెండు పేజీలను కేటాయిస్తున్నారు. నవతెలంగాణ - నవచిత్రం, ఈనాడు- సినిమా, మనతెలంగాణ - సినిమాపేజీ, ఆంధ్రప్రభ - షో, వార్త - సినిమా, నమస్తే తెలంగాణ - టాకీస్, ఆంధ్రజ్యోతి - చిత్రజ్యోతి, ఆంధ్రభూమి - చిత్ర, సాక్షి - సినిమా ఫ్యామిలీ పేరుతో సినిమాల సంబం ధించిన అంశాలు సమస్త అంశాలను మనకు అందిస్తున్నాయి. ఆరోగ్య విషయాలకు కూడా ప్రత్యేకంగా సేజీలను అన్ని పత్రి కలు కేటాయించాయి. అవి ఈనాడు సుఖీభవ పేరుతో ఆరోగ్య విషయాలు తెలిపితే, సాక్షి 'హస్తవాసి' పేరిట ఆరోగ్య సమా ధానాల పేజీని ప్రతిరోజు ప్రచురిస్తుంది. ఆంధ్రభూమి 'సంజీ వని' పేరుతో, ఆంధ్రజ్యోతి 'డాక్టర్' పేరుతో, నమస్తే తెలంగాణ 'సలహా' పేరుతో మనతెలంగాణ 'పల్స్' నవతెలంగాణ 'రక్ష' పేరుతో ఆరోగ్య విషయాలను అందిస్తున్నాయి.

మహిళ కోసం ప్రతి దినపత్రిక ప్రత్యేక కాలమ్స్ నిర్వ హిస్తున్నాయి. ఆంధ్రప్రభ లైఫ్ పేరుతో 4 పేజీల ప్రత్యేక అను బంధాన్ని ప్రతిరోజు ప్రచురిస్తుంది. నమస్తే తెలంగాణ బతు కమ్మ పేరుతో రెండు పేజీలను కేటాయించింది. ఆంధ్రజ్యోతి నవ్య పేరుతో 4 పేజీల అనుబంధం ప్రతిరోజు ప్రచురిస్తుంది. ఇందులో సామాజిక మహిళ వ్యాసాలు, ఆరోగ్య నియమాలు, రకరకాల వంటలు వస్తాయి. ఆంధ్రభూమిలో "భూమిక" పేరుతో 'యువ', ఫోకస్ అనే రెండు శీర్షికలను నిర్వహిస్తుంది. వాహిని పేరుతో స్త్రీ సంబంధిత సాహిత్యాంశాలు వస్తున్నాయి. సాక్షిలో 2 పేజీల్లో స్త్రీల విషయాలు వస్తున్నాయి. ఈనాడు వసుంధర పేరుతో స్త్రీ చైతన్యానికి పెద్ద పీట వేసింది. నవ తెలంగాణ 'మానస' పేరుతో నాలుగు పేజీల ప్రత్యేక అను బంధంగా వెలువరిస్తుంది. మన తెలంగాణ 'నారి' పేరుతో స్త్రీల అంశాలను ప్రతి శుక్రవారం వెలువరిస్తుంది.

ఆధ్యాత్మిక విషయాలపై ప్రతి దినపత్రిక శీర్షికలతో నిర్వహణ సాగిస్తున్నాయి. ఈనాడులో అంతర్యామి ప్రతిరోజు సాక్షిలో బుధవారం జ్యోతిర్మయం, ఆంధ్రప్రభలో 'అర్చన'లో ప్రతి సోమవారం, ప్రాచీన ఇతిహాసాలు, పురాణ పురుషుల పరిచయాలు, వివిధ పుణ్యక్షేత్రాల పరిచయాలు వస్తాయి. ఆంధ్రజ్యోతి 'నివేదన' పేరుతో ఆధ్యాత్మిక అంశాలు వస్తు న్నాయి. నమస్తే తెలంగాణలో ప్రతిరోజు 'భక్తి ప్రబోధం' పేరుతో ఆధ్యాత్మిక అంశాలను పాఠకులకు అందిస్తున్నాయి.

విద్యా వ్యవస్థకు కూడా అన్ని దినపత్రికలు ప్రత్యేక కేటాయింపు చేస్తున్నాయి. అలాగే దినపత్రిక వారంలో ఒక రోజు ప్రత్యేక సంచికను వెలువరిస్తున్నాయి. నవతెలంగాణ 'దీపిక' పేరుతో ప్రతిరోజు విద్యాంశాలను అందిస్తుంది. ఈనాడు 'చదువు' పేరిట, సాక్షి 'భవిత' పేరిట ప్రతిరోజు రెండు పేజీలను కేటాయించడమే కాక ప్రతి గురువారం 'భవిత' పేరిట ప్రత్యేక అనుబంధం పేజీలతో వెలువరిస్తుంది. ఆంధ్రజ్యోతి 8 పేజీల ప్రత్యేక అనుబంధ సోమవార సంచికను విద్యా విషయాలపై వెలువరిస్తుంది. నమస్తే తెలంగాణ ప్రతిరోజు నిపుణ పేరుతో రెండు పేజీలను వెలవరించడమే కాకుండ ప్రతి మంగళవారం ప్రత్యేక అనుబంధంగా నిపుణ పేరుతో 16 పేజీలను వెలువరిస్తుంది. అన్ని దినపత్రికలో జాబ్స్ పేరిట నోటిఫికేషన్స్ సంబంధించిన వివరాలు అందిస్తున్నాయి.

వ్యాపార విషయాలను అన్ని పత్రికలు తమ తమ శైలిలో అందిస్తున్నాయి. ఈనాడు బిజినెస్ పేరిట జాతీయ, అంతర్జాతీయ వ్యాపార అంశాలు ఇస్తుంది, ఆంధ్రప్రభ, మనతెలంగాణ, ఆంధ్రభూమి, నవతెలంగాణ, బిజినెస్ పేరుతో, ఆంధ్రజ్యోతి బిజినెస్ ప్లస్ పేరుతో, నమస్తే తెలంగాణ బి మార్కెట్ పేరుతో వ్యాపార విషయాలను మనకు అందిస్తు న్నాయి. క్రీడాంశాలను కూడా పత్రికలు ప్రధానంగా వారి చివరి పేజీలను క్రీడలకు కేటాయించాయి. మనతెలంగాణ క్రీడా పేరతో, నవతెలంగాణ ఆటలు పేరుతో, ఈనాడు ఛాంపియన్ పేరుతో, సాక్షి స్పోర్ట్స్ పేరుతో, ఆంధ్రభూమి క్రీడ పేరుతో, ఆంధ్రజ్యోతి స్పోర్ట్స్ పేరిట, నమస్తే తెలంగాణ ఖేల్ పేరిట వస్తున్నాయి.

రైతుల కోసం నమస్తే తెలంగాణలో ప్రతి శనివారం రైతుబడి పేరిట, మనతెలంగాణలో "మన వ్యవసాయం" ప్రతి మంగళవారం, నవతెలంగాణలో ప్రతి గురువారం కిసాన్

పేరుతో, ఆంధ్రజ్యోతిలో కృషి పేరుతో వ్యవసాయ పేజి వస్తుంది. నేడు దినపత్రికలు పిల్లలకోసం ప్రత్యేకంగా పేజీలు కేటాయించాయి. ఆంధ్రప్రభలో శనివారం "బాలప్రభ" పేరిట, మనతెలంగాణలో "చిన్ని" పేరిట బాలల పేజీ మిగత పత్రికలు కూడా పిల్లలు విషయాలను ఎక్కువగా ప్రచురిస్తున్నాయి.

ప్రతి పత్రిక పాఠకుల లేఖల కోసం ప్రత్యేక స్థలం కేటాయించాయి. ఆంధ్రజ్యోతి - జనవాక్యం, నమస్తే తెలంగాణ జనగళం, ఆంధ్రప్రభ - పాఠకీయం, నవతెలంగాణ - ప్రజా వాణి, ఈనాడు - లేఖలు, సాక్షి - ఇన్‌బాక్స్ పేరిట వెలు వరిస్తున్నాయి. ఆంధ్రభూమి ఆదివారం మిర్చి మసాల పేరిట లోక్య లేఖలు ప్రచురిస్తుంది.

వీటితోపాటు అన్ని దినపత్రికలు కార్టున్స్‌ను ప్రతిరోజు నిర్వహిస్తున్నాయి. లోకం తీరు పేరుతో ఆంధ్రజ్యోతి, కొక్కరోకో.. పేరుతో నవతెలంగాణ ప్రతి శనివారం నిర్వహిస్తుంది. ఈనాడులో "ఇదీ సంగతి" పేరుతో, ఆంధ్రప్రభ, ఆంధ్ర భూమితో పాటు మిగతా పత్రికలు కూడా ప్రతిరోజు కార్టూన్స్‌ను అందిస్తున్నాయి. ప్రతి దినపత్రిక రాశి ఫలాలను ప్రతిదినం అందిస్తున్నాయి. వాట్సాప్ పేరుతో నమస్తే తెలంగాణ వాట్సాప్ అంశాలు "యూటూబ్" పేరిట యూట్యూబ్ అంశాలను ప్రతి రోజు అందిస్తున్నాయి. నవతెలంగాణ పత్రిక ప్రతి మంగళవారం "జాతర" పేరిట జానపద కళారాపూలను పరిచయ పేజీని నిర్వహిస్తుంది. జరదేఖో పేరిట మన ప్రాంత విశిష్టతలపై వ్యాసాలు, టెక్‌ప్లస్ పేరిట ఎలక్ట్రానిక్ పరికరాల విషయాలను అందిస్తుంది సాక్షి దినపత్రిక. ఈ పాటలకు ట్యూన్ తెలుసా పేరిట పాఠరచయితల, సంగీత దర్శకుల వివిరాలు అంది స్తుంది. ఈవిధంగా తెలుగులో వస్తున్న అనేక దినపత్రికలు వివిధ శీర్షికలతో భిన్నమైన కాలమ్స్‌ను నిర్వహించి సమాజ హితానికి దోహదం చేస్తున్నాయి.

❀❀❀

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

జానపద కళారూపాలు - నృత్య ప్రాధాన్యత

- నక్కా శ్రీనివాసరావు
పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్, గుంటూరు.

మానవుడు సుఖదుఃఖాల వల్ల పొందిన ఆవేశం అను భూతులకులోనై వేసిన చిందులే నృత్యం. ఇదే కాలక్రమంగా అభినయ రూపంలోని నృత్యమైంది. ఆదిమ మానవుడు ఆడీ, పాడీ, నృత్యం చేసాడు. మానవునిలోని అనుకరణ శీలం జాన పద నృత్యాలలో కనబడుతుంది. ప్రకృతిలోని వివిధ ప్రాణుల లాస్యమే జానపదనృత్యానికి ఆధారం. ఆదిమ జాతుల నృత్యాలు జానపద నృత్యాలకూ, జనపద నృత్యాలు శాస్త్రీయ నృత్యాలకు పునాదులు. ఆదిమ జాతి నృత్యం కేవలం చావు, పుట్టుకలు, కర్మకాండలు, రోగనివారణ మొదలైన ధార్మిక క్రియా చరణకై చేయబడ్డాయి. అవే రానురాను ధార్మిక క్రియాచరణతో పాటు లౌకికానందానికై ఉపయోగించబడ్డాయి. అందువల్ల ఉపయోగంలేని జానపద నృత్యం మృగ్యం అని చెప్పవచ్చు. ఉపయోగంతోపాటు ఉల్లాసాన్నిచ్చే ఉత్తమ నృత్యం జానపద నృత్యం.

ఈ ఉల్లాపం ప్రదర్శకునికీ ప్రేక్షకునికి సమానమైంది. ఈ నృత్యాలలో శాస్త్రీయమైన మెలకువలు ఎక్కువగా ఉం డవు. ఇవి ఎక్కువగా సామూహికమైనది. నృత్యాన్ని అనుస రించి పాడే పాటలలోని ఇతివృత్తాలు సామాజిక స్పృహను కలిగి ఉండి, మానవునికి ధర్మాధర్మాలను, పారమార్థిక జ్ఞానాన్ని కల్గించేవిగా కనిపిస్తాయి.

ఈ నృత్యాలు స్త్రీ సంబంధాలు, పురుష సంబంధాలు, ఉభయ సందర్భాలని విభజించవచ్చు. ఇందులో కొన్ని పాట లలో, మరికొన్ని గేయరహితమై మూకాభినయాన్ని పొంది రూపొందుతాయి. కొన్ని నృత్యాలు లౌకికానందాన్ని కల్గిస్తాయి. మరికొన్ని పారమార్థిక జ్ఞానాన్ని ప్రబోధిస్తాయి. ఈ నృత్యాలలో చాలా వరకు జాతరలలో, ఉత్సవాలలో, పండగలలో, పెండ్లి పేరంటాలలో చేసేవిగా ఉన్నాయి. గాన సహితమై, సాహిత్య విలువకల్గిన క్కొన్ని నృత్యాలను ఈ వ్యాసంలో పేర్కొనడం జరుగుతుంది.

జానపద విజ్ఞానంలో అతివిస్తృతమై, సాహిత్యపుష్టి కల్గిన ముఖ్య భాగం స్త్రీల సాహిత్యం. వీరు చేసే ప్రతి పనిలో సీతా రాముళ్ళు ఇద్దరు పాలుపంచుకుంటారు. ప్రకృతిలోని దేవత లందరూ వారి చుట్టుముట్టే తిరుగుతారు. తరతరాలకు పార మార్థిక జ్ఞానాన్ని అందించిన గురువులు జానపద స్త్రీలు. వీరికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన నృత్యాలు ఇక్కడ పేర్కొనడం జరిగింది. స్త్రీలు చేసే నృత్యాలలో లాలిత్యం ఉంటుంది. పురు షులకు సంబంధించిన వాటిలో మొరటుతనం ఉంటుంది.

1. గొబ్బి నృత్యం :

ఇది అత్యంత ప్రాచీనమైన నృత్యం. ఇది బాలికలకు సంబంధించింది. పెద్దవారు ప్రేక్షకులు మాత్రమే. ఇది గుంటూరు, కృష్ణా జిల్లాలలో ఎక్కువ ప్రాచుర్యం వహించింది. తెలంగాణాలో ఈ నృత్యం తక్కువ. సంక్రాంతి రోజుల్లో బాలికలు వాకిట్లో కల్లాపి చల్లి, ముగ్గుపెట్టి, ఆవుపేడతో గొబ్బె మ్మలను చేసి ముగ్గుల మధ్య పెట్టి, పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి దాని చుట్టూ చేరి చేతులుతట్టుతూ లయబద్ధంగా తిరుగుతూ నృత్యం చేస్తూ పాడతారు.

సుబ్బి గొబ్బెమ్మా సుఖములీయవే
తామరపూవంటి తమ్ముణ్ణీయవే
మొగిలిపూవంటి మొగుణ్ణీయవే...........అని గొబ్బి

దేవతను అడుగుతారు.

ఈ నృత్యంలో మొదట గేయం అప్రధానంగా ఉండేది. తరువాత వీటిలో గేయాలు ప్రధానమైనాయి. బొడ్డెమ్మ - బత కమ్మ నృత్యం - ఈ రెండు తెలంగాణాలోని ప్రత్యేకమైన పండుగలు. ఇవి కేవలం వినోదాత్మకమైనవేకాక జానపదుల పారమార్థిక చింతనకు ప్రతీకలు. వీనిలో బొడ్డెమ్మ బాలికలది. బతకమ్మ స్త్రీలది. బాలికలు పుట్ట మన్నుతో బొడ్డెమ్మను చేసి వాకిట్లో పెట్టి, దాని చుట్టూ చేరి, చేతులు తట్టుతూ లయబద్ధ మైన కాళ్ళ కదలికలతో వలయాకారంలో తిరుగుతూ పాడు తారు. తొమ్మిదవరోజు బొడ్డెమ్మను పూజించి ఆ పాటలతో వినోదాన్ని పొంది పలహారం పంచిపెట్టి చివరకు బొడ్డెని నీళ్ళలో విడిచిపెట్టి నిద్రపుచ్చుతారు. 'నిద్రపో బొడ్డెమ్మ నిదురపో - నిద్రకూ నూరేండ్లు - నీకు నూరేండ్లు - నినుగన్న తల్లికి నిండు నూరేండ్ల'ని పాడుతారు. బతకమ్మను వివిధ రకాల పూలతో పేరుస్తారు. ఇందులో జానపదుల కళా నైపుణ్యం కనిపిస్తుంది. బొడెమ్మవలె బతుకమ్మను పూలతో పెట్టి స్త్రీలందరూ చుట్టూ చేరి చేతులు తట్టుతూ వలయాకారంగా తిరుగుచూ పాడు తారు. ఈ రెండు నృత్యాలలో పాడు పాటలు ఒక్కటే. ఈ బొడ్డెమ్మ, బతుకమ్మలు లక్ష్మీ పార్వతుల రూపాలు. ఈ పాటలు రామాయణపు పాటలు - లక్ష్మీదేవి మహిమలనే కాక జానపదులకు వారి కుటుంబంపై గల ప్రేమానురాగాలను వెల్లడిస్తాయి. ఈ పాటలలో ఉయ్యాల, వలలో, కోలు, అల్లోనే రళ్ళు, చందమామ వంటి పదాలను ఊతగా ఉపయోగిస్తారు.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

2. జట్టిజాము నృత్యం :

ఇది కోలాటం, గొబ్బి, చెమ్మచెక్క, బతుకమ్మలను పోలింది. కాని వాటిలో వలె చుట్టూ తిరగడం, లయబద్ధంగా అడుగులు వేయడం ఉండవు. ఇది వెన్నెలలో ఆరుబయట చేయు కేవలం వినోదాత్మకమైంది. జట్టిజాము అనే పదం యష్టి యామ అనే సంస్కృత పదాల నుండి ఏర్పడిందనే అభిప్రాయం ఉంది. ఇందులో పాల్గొనువారికి సంఖ్య సరి సంఖ్యలో ఉంటుంది. రెండు జట్లుగా ఏర్పడి ఒక జట్టు వలయంలోపల ఒక జట్టు తిన్నగా నిలబడి తను మాత్రం లయబద్ధంగా ఇటుప్రక్క, అటుప్రక్క (కుడి ఎడమలకు) ఊపుతూ, ఒద్దికలైలతో ఒద్దిక చెడకుండా ఒకరి చేతులతో మరొకరి చేతులు తట్టుతూ పాటలు పాడుతారు. వాటిలో ఒక జట్టు పాటలోని ఒక చరణం పాడగా మరొక జట్టు వంత పాడుతుంది. ఈ పాటల చరణాలలో చివర తుమ్మెదా, నడియాలో, వెన్నిదాయలో, వెన్నిలాయలో, వెన్నేటిన వాలలో, రామ రామా కోదండరామా వంటి పదాలుంటాయి. ఈ పాటలలో స్థానిక గాథలేకాక, పుణ్యక్షేత్రాల మహాత్మ్యాన్ని వివరించే ఇతివృత్తాలుంటాయి.

4. చెమ్మ - చెక్క :

బాలికలు వినోదం కొరకు ఆడే ఆట ఇది. ఇది ఇద్దరు లేక నలుగురు బాలికలచే ఆడబడుతుంది. వీరు ఎదురెదురు నిలిచి ముందుకు వెనుకకు క్రమపద్ధతిలో చిందులేస్తారు. వీరు చిందులేస్తూ ముందు వెనుకలకు దుముకునప్పుడు ముందుకు వచ్చినప్పుడు ఎదుటి బాలిక చేతులు తట్టుచూ వెనుకకు వెళ్ళుతూ పాటలు పాడుతారు.

'చెమ్మ చెక్క - చారడేసి మొగ్గ
అట్లు పొయ్యంగ - ఆరగించంగ
రత్నాల చెమ్మచెక్క - రంగులేయంగ
పిందిట్లో మా బావ - పెండ్లి చెయ్యంగ'

వంటి పాటలు ఈ సందర్భాలలో పాడుట కనిపిస్తుంది. వీటిలో సాంఘీక ఇతివృత్తాలే ముఖ్యమైనవి.

4. కోలాటం :

ఇది తాళ లయాన్వితమైంది. భారతదేశంలో అంతట ప్రచారంలో ఉంది. దీనిని 'కోలన్న' అని కూడా అంటారు. కోలలచే చేస్తారు కాబట్టి దీనికి కోలాటం అనే పేరు వచ్చింది. మొదట దీనిలో స్త్రీ పురుషులిరువురూ పాల్గొనేవారు. కాని ఇప్పుడు ఇది పురుషులకు ప్రత్యేకమైంది. ఒక జడ కోలాటం మాత్రం ఇప్పటికీ స్త్రీలు ఆడుతారు. ఇందులో పాల్గొనువారి సంఖ్య సరి సంఖ్యలో ఉంటుంది. 8 మందికాని, 12 మంది కాని పాల్గొంటారు. వీరందరూ వలయాకలంలో వలయం వెలుపల ఒక జట్టు, వలయం లోపల ఒక జట్టు నిలిచి కోలాటం వేస్తారు. అంతేకాక వలయం వెలుపలివారు నిలిచి వలయం లోపలివారు కూర్చుండి వంతుల చొప్పున కోలాటాన్ని ఆడుతారు. దీనిని వివిధ భంగిమలచే లయబద్ధమైన అడుగులతో చేస్తారు. ఈ నృత్యానికి సంబంధించిన పాటలలో మధుర భక్తికి సంబంధించిన కృష్ణుని చిలిపి లీలలు, రామాయణ, భారత, భాగవత ఇతివృత్తాలు ఉంటాయి. ఇది వినాయకుని ప్రార్థనతో మొదలౌతుంది. 'శివ శివ మూర్తివి గణనాథా! నీవు శివుని కుమారుడవు గణనాథా!' అనే కోలాటం పాట అధిక ప్రచారం పొంది, ఆబాల గోపాలానికి పరిచయమైనది.

5. కురువ నృత్యం :

ఇది రాసలీలను పోలిన నృత్యం. ఇందు 8 మంది కృష్ణుని వేషంలో, 8 మంది గోపికల వేషంలో వలయా కారంలో నిలబడగా మధ్యలో మరొక గోపికాకృష్ణుల జంట నిలబడి అందరూ కలిసి లయబద్ధంగా అడుగులు వేస్తూ పాటలు పాడుతూ నృత్యం చేస్తారు. దీనిలో తాళలయాన్వితమైన గతి ఉంటుంది. ఈ పాటలలోని సాహిత్యం భాగవత సంబంధితం. కృష్ణుని ఇతివృత్తాలే వీటిలో ఎక్కువగా ఉంటాయి. ఈ నృత్యం స్త్రీ పురుషులిరువురికి సంబంధించినది.

6. గరగ నృత్యం :

రాయలసీమలో కొన్ని ప్రాంతాలలో, కర్ణాటకలో కరగ పేరుతో ఒక ఉత్సవం జరుగుతుంది. దీనినే ఆంధ్ర దేశంలో మరికొన్ని ప్రాంతాలలో గరిగ అనీ, గర్ల అనీ, గరగ అనీ అంటారు. గరిక అంటే కుండ అని అర్థం. తమిళ దేశంలో ఇది కరగం అన్న పేరుతో కనిపిస్తుంది. రాయలసీమలో అక్కడక్కడ గరిగలను పూజించడం, బలులివ్వడం ఆచారంగా ఉంది. జానపదులు ఒక పచ్చి కుండను చేసి పసుపు, కుంకుమలతో రంగు రంగు బట్టలతో, వేపమండలతో అలంకరించి డప్పు వాయిస్తూ నృత్యం చేస్తూ ఇంటింటికి తిరుగుతారు. కుండ గ్రామ దేవతకు ప్రతీకగా పూజలనందుకుంటుంది. అందుకే ఈ నృత్యాన్ని చేస్తారు. దీనిలో పురుషులే పాల్గొంటారు.

7. కురుపంజి :

దీని కురుబజాతివారు చేస్తారు. కురువ, కొరవ, దొరగ, గొరవ మొదలైన పదాలు కురుబ పదానికి పర్యాయ పదాలు. అనంతపురంలో వీరిని గొరగయ్యలు అంటారు. బీరప్ప వీరి ఇలవేల్పు. కురువంజిని పోలిన నాట్యవిశేషం వీరికి తెలుసు. ఉగాది రోజుల్లో వీరు బీరప్ప విగ్రహాన్ని ఎత్తుకొని పిల్లనగ్రోవులు ఊదుతూ, నగారాలు, డోళ్ళు వాయిస్తూ, పాటలు పాడుతూ కుండలాకారానృత్యాలు చేస్తారు. ఇది పురుషులకు మాత్రమే సంబంధించిందనుటకు వీలుకానిది ఇరువురూ చేస్తారు.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

8. తప్పెటగుళ్ళు :

ఇది ఒక ప్రసిద్ధమైన వినోదాత్మక కళ అని చెప్పవచ్చు. ఈ నృత్యం ఉత్తర ఆంధ్రాలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం జిల్లాలలో ప్రచారంలో ఉంది. తప్పెటలు, గజ్జెలు వీనిలో ముఖ్య వాయిద్యాలు. పొట్టి చేతుల జుబ్బాలు, నిక్కర్లకు గజ్జెలుకట్టి వాటిని ధరించి, కాళ్ళకు కూడ గజ్జెలు ధరించి తప్పెటను గుండెకానించి కట్టుకుని లయాన్వితంగా వాయిస్తూ నృత్యం చేస్తారు. దీన్ని ప్రదర్శించేవారు యాదవులు. అందువల్ల వైష్ణవ మత సంబంధ ఇతివృత్తాలే వీరి గేయాలలో ఉంటాయి. ఈ నృత్యానికి ప్రత్యేకమైన రంగస్థలం అవసరం లేదు.

ఇది వ్యష్టిగానూ, సమిష్టిగానూ కూడా కనిపిస్తుంది. నాట్యపరమైన నృత్యాలలో పులివేషాలు, కొయ్యకాళ్ళు, గుజ్జాలాట, డప్పాట మొదలైనవి చేరుతాయి.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

సాహసవంతుడు - గాడిచెర్ల

- డా॥ కె. ప్రసాద్
గుంటూరు.

మహపురుషుల జీవితములు ఉత్తేజ పూరితములు అందుకనే దేశభక్తుల కథలు జాతి వికాసానికి దోహదకర ములు. 20వ శతాబ్ధపు ఆంధ్ర మహ పురుషులలో ప్రముఖులు. అర్ధ శతాబ్ధికి పైగా తన జీవితమును ఏక దాటిగాదేశ సేవలో గడిపిన త్యాగశీలి. గ్రంధాలయోద్యమము వయోజన విద్యల వ్యాప్తికై ఎనలేని కృషి సల్పిన విజ్ఞాన ఖని గాడిచర్ల హరి సర్వోత్తమరావు.

గాడిచర్ల హరిసర్వోత్తమరావు 1883 సెప్టెంబరు14 వ తేది కర్నూలులో జనన మొందారు. తండ్రి వెంకట్రావు,తల్లి భాగీరధీబాయి. గాడిచర్ల అక్షర భ్యాసం కంభం తాలూకా రావి పాడు గ్రామంలో జరిగింది. కొంత కాలం కర్నూలు మునిసిపల్ స్కూల్‌లో చదివాడు.చదువులో చాలా చురుకైన వాడు. సూక్ష్మ గ్రాహి, తోటి విద్యార్ధులకు, ఉపాద్యాయులకు అత్యంత ప్రేమాస్పదుడైనాడు.

పువ్వు పుట్టగానే పరిమళిస్తుదన్నట్లు క్రమం తప్పక ఏటా పరీక్షలలో ఉత్తీర్ణులయ్యారు. 7 యేండ్లలో హైస్కూల్ విద్యను పూర్తి చేయగలిగినాడు. బి.ఎ. క్లాసులో 3 భాగాలు ఒకే దఫా ఉత్తీర్ణులౌనవారిలో హరిసర్వోత్తమరావు గారు కాలేజీలో ప్రధ ములు.

పెరిగి పెద్దవాడైన తరువాత చిన్ననాటి గురువులను మాతా పితలను మరిచేవాళ్ళు కోవలో చేరలేదు. కన్న తల్లి దండ్రుల మీద చదువు చెప్పిన గురువుల మీద ఉన్న ప్రేమ గౌరవాల కారణంగా తాను వ్రాసిన గ్రంధాలను వారికి అంకిత మిచ్చారు. తన తండ్రిగారికి ''ప్రచ్ఛన్న పాండవం'' అనే నాటకమును, తల్లి భాగీరధీబాయికి '' శ్రీరామ చరిత్రము''ను అంకితమిచ్చారు.గురువు అయిన గని శేషావదానులు గారికి, ఎం.ఏ.లో థీసిస్‌గా వ్రాసిన "The Negleted Emperor Poet" అనే గ్రంధాన్ని అంకితమిచ్చాడు.

మద్రాసు కళాశాలలో చేరుటకు ఉపకార వేతనాలు ఉండేవి. ఐతే పరీక్షలలో నెగ్గిన వారికే ఈ అవకాశం లభించేది. అప్పట్లో జరిగిన పరీక్షలలో మొదటివాడుగా వచ్చినందున మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో ఉన్నత విద్యఅభ్యసించే అవ కాశం వచ్చింది. మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో 1901 నుండి 1906 సం॥ము వరకు ఆరేండ్లు క్లాసులు తప్పకుండా ఉత్తీ ర్ణులవుతూ ఎం.ఏ. పాస్ అయినారు. ఎం.ఏ.లో తెలుగు, కన్న డము తులనాత్మక భాషా తత్వ శాస్త్రము అభిమానాంశాలుగా ఉండేవి. ఆనాడు ఎం.ఏ. పట్టమును పొందిన ఆంధ్రులందరి లోను రావుగారు ద్వితీయులు. మద్రాసు రాష్ట్రానికి ముఖ్య మంత్రిగా పనిచేసిన పానుగంటి రామరాయణింగారు ప్రద ములు.

హరిసర్వోత్తమ రావు పాశ్చాత్య విద్య సంపర్కంవల్ల ఆ వ్యామోహంలో పడక జాతీయ భావప్రేరితులై సంస్కార సంపన్నులై భారతీయ పునరుజ్జీవనానికి కొమర్రాజు లక్ష్మణ రావు, కాళేశ్వరరావు గారితో కలిసి చారిత్రక శాస్త్రీయ గ్రంధ ప్రచురణలు ఏర్పాటుకు పూనుకున్నారు.

కొంతమంది పుట్టుక తోనే గొప్పవారుగా పుడతారు. కొందరు స్వయం కృషిచే గొప్ప వారవుతారు. మరికొందరు గొప్పవారసులుగా పరిస్థితులు సమకూడి ముందుకు నెడతవి. హరిసర్వోత్తమరావు గారు రెండవ కోవకు చెందినవారు. ఉన్న తాదర్శములు నిరంతరాన్వేషణ ఆయన్ని ముందుకు నడిపిం చేవి. వెనుకబడిన రాయలసీమలో ఫెర్గుసన్ కళాశాల వంటి దానిని నెలకొల్పాలని ఉత్తమ విద్య ఉచితంగానేర్పడానికి వీలౌతుందని దేశపాండే సుబ్బారావు హరిశంకర్రావు గార్లతో రావుగారు ఆలోచనలు చేశారు. కానీ రాజకీయ పరిణామాల కారణంగా ఫలప్రదం కాలేదు.

థేయర్సు రచించిన "అబ్రహం లింకన్ చరిత్ర"ను హరి సర్వోత్తమరావు గారు తెలుగులో అనువదించారు. విజ్ఞాన చంద్రికా గ్రంధ మందలి ప్రచురించిన ప్రథమ పుస్తకం "ఢిల్లీ దర్బారు" అను గ్రంధమును రచించారు. ఈ గ్రంధ మండలి ఆంధ్ర దేశములో సారస్వత రిత్యా విజ్ఞాన వ్యాప్తికి చాలా దోహదం మిచ్చింది.

మన ప్రజకు విజ్ఞానము వ్యాపింపకుండుటే మన యధో గతికి కారణము ఎల్ల అభివృద్ధికిని విజ్ఞాన వ్యాపనమే ప్రధమా ధారము. అక్షరజ్ఞత దానికి మూలసాధనం. అక్షరజ్ఞతతో కూడ విజ్ఞానము వ్యాపింపచేయుటకు ఇతర సాధనములున్నవి. పత్రి కలు, గ్రంధములు చదివి వినిపించుట ఉపన్యాసములు, మేజిక్ లాంతరు, సినిమా ప్రదర్శనములు, భజనలు, హరికథలు ఇట్టివి అనంతములు వీటినన్నిటిని ఏర్పరచి కృషి చేయునట్టి ఉద్యమము గ్రంధాలయోద్యమము అని తెలియచేశారు. ఆ ఉద్యమం నందు ఉత్సాహం కొరవడినను ఈ ఉద్యమం సాగుచుండెనా ప్రజలను అంధకారం మావరించదు. అంధ కారమున పడిపోనంత కాలము మానవుడు తల ఎత్తుకొనుటకు మార్గమున్నది. కావున జ్ఞాన యోగమునకు అంత ప్రాము ఖ్యము. అందుచేత సరస్వతీ మందిరం సదా సేవింపదగినది.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

దీనిని మరువవలదు అని తెలియచేశారు. సర్వోత్తమరావు వారు వందేమాతరం ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారుఈయన స్ఫూర్తితో రాజమహేంద్రవరం విద్యార్థులు తెలుగు దేశంలో వందేమాతరం ఉద్యమానికి మార్గదర్శకులైనారు. హరి సర్వోత్తమ రావుగారు వారి నాయుకులైనారు. 160 మంది విద్యార్థులపై జరిమానా విధించడం జరిగింది. రావుగారికి ఎక్కడా ఉద్యోగం ఇవ్వరాదని ప్రభుత్వం ఆంక్షలు విధించింది.

తదుపరి కాంగ్రేస్ మంత్రిత్వాలు స్వీకరించిన తర్వాత 1937 అక్టోబరు 25 వ తేది రద్దు చేయడం జరిగింది.

ఆంధ్ర దేశంలో ప్రప్రథమ రాజకీయఖైదీ హరిసర్వోత్తమ రావుగారు. ఆంధ్రుల త్యాగ మార్గానికే మార్గదర్శకులు. వీరిని ఆంధ్రా తిలక్ అని ఆ రోజులలో వ్యవహరించేవారు. 1914 నుండి 1938 వరకు అయ్యంకి వెంకట రమణయ్య గారు ఆంధ్ర దేశ గ్రంథాలయ కార్యదర్శిగా సేవ చేశారు. 1934 లో హరిసర్వోత్తమరావు ఈ సంఘంనకు అద్యక్షులుగా ఎన్నుకొబడినారు. ఆంధ్రప్రదేశ్‌లో వయోజన విద్యా పాఠశాలను ప్రారంభించి వయోజన విద్య ఉద్యమానికి మూల పురుషుడైనాడు.

హరిసర్వోత్తమరావు గారు ప్రసిద్ధ ప్రజాస్వామిక వాది. వాక్చభాపత్రికా స్వాతంత్రాదులు కావాలని వాంఛించే వ్యక్తి. అంతర్జాతీయ రాజకీయాలలో వీరికి మంచి ప్రవేశం ఉంది.

గ్రంథాలయ సర్వస్వంలో "లోక వార్తలహరి" అను శీర్షికను పెట్టి ప్రపంచ సంఘటనల మీద వ్యాఖ్యలు వ్రాస్తూ ఉండేవారు. 1920లో నాగపూర్‌లో జరిగిన 35 వ కాంగ్రేస్ సమావేశంలో గాంధీగారితో విభేధించి ఆయన సాహస వంతుడు గాడిచెర్ల అని మెప్పుపొందారు.

గాంధీ యుగంలో మొదటి తరగతి మేధావి విధ్యాహీనమైన దేశం, స్వతంత్ర దేశం కాలేదని మనసా వాచా నమ్మిన వ్యక్తి. అందుకే జీవితాంతం విద్యావ్యాప్తికి కృషిచేసినాడు. వీరు పాత్రికేయుడు, సంపాదకుడు, విమర్శకుడు, రచయిత, అద్యాపకుడు, విద్యావేత్త ఒక పర్యాయం శాసనమండలి సభ్యులు, గ్రంథాలయ ఉద్యమం, వయోజన విద్యసహకారోద్యమం, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం, కార్మిక , కర్షక, బడుగు వర్గాల కృషికి అహరహం కృషి చేసిన కృషీవలుడు. వీరు నిజమైన దేశ భక్తుడు పాతతరం నిర్లక్షానికి బలై కొత్త తరానికి పరిచయంలేని మహ మనిషి గాడిచెర్ల.

ఆధార గ్రంథాలు :

సర్వోత్తమ జీవితం 'మాదాల వీరభద్రరావు

❀❀❀

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

విశ్వనాథ కిన్నెరసాని పాటల విశిష్టత

- ఆచార్య గోగినేని యోగ ప్రభావతీదేవి
బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్, తెలుగు & ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

విశ్వనాథ సత్యనారాయణ ప్రకృతి పరిశీలన భావుకతకు, రసదృష్టికి తార్కాణమైన కిన్నెరసాని పాటలు ఆంధ్ర సాహిత్యంలోనే అపురూప సన్నివేశం. మధుర సృష్టి.

కిన్నెర గోదావరికి ఉపనది వంటిది. భద్రాచలం వద్ద ప్రవహించు ఒక చిన్నవాగు కిన్నెర. దానికొక మహా పతివ్రతగా, ఉద్విగ్న హృదయగా నిరూపించటం కవి కల్పనా విశేషం. అత్తా కోడళ్ళ పోరాటమింటి యందు పొడ సూపగా అత్తగారి ఆరళ్ళు ఓపలేని కిన్నెర హృదయం ప్రళయ సముద్రమైంది. ఆవేశ హృదయంతో అడవుల వెంట పరుగెత్తింది. వెంటబడి కౌగిలించుకున్న భర్త కౌగిలిలోనే కరిగి నీరై ప్రవహించింది. శోకించి శోకించి భర్త శిలయే అయినాడు. అచేతన పదార్థముల నిట్లు సుఖ దు:ఖాది భావమగ్న హృదయులయిన సచేతన పాత్రములుగా విశ్వనాథ వారు నిరూపించినారు. ఇది గొప్పభావన.

కిన్నెర పుట్టుక :

"ఓహెూ కిన్నెరసానీ!
"ఓహెూ కిన్నెరసానీ!
ఊహామాత్రము లోపల
నేల నిలువవే జవరాలా!
కరిగిపోతి నిలువెల్లను
తరలించితి నాజీవము"

ఈ పాదాలలో శ్లేష రూపమైన సౌందర్యం, వ్యంగ్య వైభవం కన్నుల విందగుచున్నది. కిన్నెర నదీమతల్లి యగుట వలన ఆమె కొంగు పట్టుకొన్న ప్రయుని చేయి తడియయినట్లు వర్ణించుట సుమధుర భావన. ఇట్లే -

"ఈవు రసాకృతి వగుటను
ఈ వైఖరి ప్రవహించితి
నేను శిలా హృదయుండను
పునుదునె ధునీ వైఖరి" - ఓహెూ!

- అనడంలో నదీ పర్వత ధర్మాలు నాయికా నాయకులందు చక్కగా వ్యజ్యమానములయినవి.

కిన్నెర నడకలు :

కిన్నెర నది యగుట వలన నదీ ప్రవాహలయాను సారముగా గేయమును రచించుట ఇచ్చటి మహా శిల్పము.

"కరిగింది కరిగింది కరిగింది కరిగింది
కరిగి కిన్నెరసాని వరదలై పారింది
తరుణి కిన్నెరసాని తరకల్లు కట్టింది
పడతి కిన్నెరసాని పరుగుల్లు పెట్టింది"

కిన్నెరసాని నడకల బెడగులీ పాట నడకలోనే కన్పించు చున్నవి.

కిన్నెరసాని నడకలను వర్ణించుటలో కవి యొక్క పరిశీలన (అబ్జర్వేషన్) కనుపట్టుచున్నది.

"కరగగా కరగగా కాంత కిన్నెరసాని
తరగ చాలుల మధ్య తళతళా మెరిసింది
నురుసు పిండుల తోడ బిరబిరా నడిచింది
ఇసుక నేలలపైన బుసబుసా పొంగింది
కదలగా కదలగా కాంత కిన్నెరసాని
పదువు కట్టిన వేళ్ల కదుపులా తోచింది
కదలు తెల్లని పూలనది వోలె కదిలింది
వదలు తెల్లని త్రాచుపడగలా విరిసింది"

ఇట్లు నది కన్పించుట దానిని చక్కగా పరిశీలించిన గాని కన్పట్టని విశేషము. నిసర్గ రమణీయము లయిన యుపమలివి.

తను వీడితే ఓర్చుకొనలేక వనరి వనరి శిలవోలె నయిన ప్రయుని గూర్చిన కిన్నెర దు:ఖము నందు కరుణ రసము కరడు గట్టినది.

"అటువంటి పతితోడి
అటువంటి కాపురం
బిటు చేసికొంటి నంచెక్కడా లేనంత
వగచెంది వగచెంది వనిత కిన్నెరసాని
వనరింది వనరింది వనిత కిన్నెరసాని
తుదకేమి చేయగా
నెదవోక అలవోక
పతి రాయిగా మారి పడియున్న గుట్టపై
అతివ తన కెరటాల హస్తాలతో చుట్టి
వెత పొంది వెత పొంది బిట్టు ఘోషించింది"

- అనుట హృదయ విదారకమైన భావము. కొండ మాత్రి పడియున్న పతిగుట్టపై వ్రాలి అతనిని కౌగిలించుచు విలపించిన తీరు దు:ఖ రసాత్మకము.

"ఓ నాథ! "ఓ నాథ! "ఓ నాథ! "ఓ నాథ!
నాకు మల్లే నీవు నది వోలె పారరా
జలముగా యిద్దరము కలిసిపోదాముర

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

కెరటాలు కెరటాలు కౌగిలిద్దామురా
"ఓ నాథ! "ఓ నాథ! "ఓ నాథ! "ఓ నాథ!
నీయందు తప్పింక నేను చెయ్యను లేర
ఆన పెట్టితివేని అడుగుదాటను లేర
ఇక జన్మలో కోపమింత పొందను లేర"

అని కలగి కలగి, నలగి నలగి, బడలి బడలి కిన్నెర పనరిన తీరు కటిక గుండెలకైనను కన్నీటి కాల్వలు గట్టింప జాలినట్టిది.

కిన్నెర నృత్యము :

"చిఱుతేనెలా అచ్చ। రల గొంతులా గజ్జి
యల మ్రోతలా కినె। రటు మొరసి యిటు మొరసి
గలగలా రవళితో - జలజలా రవళితో
మెల్లగా నూగాడెనే కెరటాల
జల్లుగా ముసురెత్తెనే"

కిన్నెర సంగీతము :

కిన్నెర గొంతులో కోకిలలు కంఠమెత్తినవి. పికిలి పిట్టలు ఈలలు వేసినవి. "అందకత్తెల జిల్లుటందెలు మ్రోసిన యట్లు" కిన్నెర ప్రవహించినది. తేనె కాలువ వలె అమృతపు సోనల వలె ఆమె సాగినది.

"ముద్దు ముద్దుగ నడచి ప్రోడ వోలికి నాడి
మురిపమ్ముగా పాడి ముగుద కిన్నెరసాని
యెడదలో, యెదురైన। బెడదలో, కష్టాల
కడలియే కలగాంచెనో - కన్నీటి
కడవలే ప్రవహించెనో"

కడలి పొంగు :

ప్రవహించి వచ్చు కిన్నెరగాంచి కడలిరాజు ఎడదలో తగని కోరిక చిగురులెత్తినది. మిసమిసని మింటికి పొంగినాడు. సళపెళా కాగి గలగలా ఊగినాడు. కిన్నెరను జూచుటకు "గగ నమ్ము కొసదాక కెరటాలు ఉబికింది." కిన్నెరిది యెఱిగి కీడు తలచి పతిని తలచి వగచి వగచి రాళ్ల పొదలు అడ్డముగా ఆగి యాగి అడవుల వెంట పరువెత్తి ఏడ్చినది.

కిన్నెర దుఃఖము :

"హాయని కిన్నెర యేడ్చెన్
తన మనోహరుఁ డు శిలయైనాడని
తానేమో యీ వాగైనానని
హాయని కిన్నెర యేడ్చెన్"
"బొట్టు బొట్టు కొక వేయి యెదలుగా
తరగ తరగ కొక వేయి నోళ్లుగా
బడలి నీరమే యేడుపు మయమై
కడలి మ్రోతలెక్కుడు భయమిడగా - హా యని"

అని యడలినట్లు వర్ణించుట మహోదాత్తమయిన కల్పన.

గోదావరీ సంగమము :

గోదావరీ జాలి గుండె గూడులు కదలి
నాదు కిన్నెర కెదురు పోయీ ఆమె
లో దిగులు తరగచే దో యీ వారించి
ఆదరముచే నామె నదిమి కౌగిట బూని
ఏది నీ మొగము నా తల్లీ
నీ దిగులు నిక మాను చెల్లీ అన్నదీ

కిన్నెర వైభవము :

"తూర్పులో తెల్లనై తోచిన దుష: కాంత
తొలి మావి లేబూత దూసెను పికే కాంత
తలలపై రతనాలు తళతళా మెరిసేటి
నల్లత్రాచులు దూకి నాట్యమాడేటట్లు
మెరిసింది కిన్నెరా ఒడ్డుల్లు ఒరిసింది కిన్నెరా"

ఇట్లెండకునెండి, వానకునిండి తుదకు తెలుగు దైవము భద్రాద్రిపై నెలకొన్న రామయ్య - "అతని దర్శనము చేసే త్రోవ కాచింది కిన్నెరా" పుణ్యాత్మ, పూతాత్మయైనది.

❀❀❀

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

యశోదమ్మ కథలు - ఒక పరిశీలన

- ఎస్.గాయత్రి
తెలుగు పండితురాలు, ZPH స్కూల్, పెద్దకొత్తపల్లి, నాగర్‌కర్నూల్.

తెలంగాణ మాండలికాన్ని, పల్లె పరిస్థితులను రంగరించి కలబోసి కథలు రాసిన సుప్రసిద్ధ కథా రచయిత్రి పాకాల యశోదారెడ్డి. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్యాపకురాలిగా ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన సరస్వతీ మూర్తి, బహుముఖ ప్రజ్ఞాశాలి యశోదమ్మ. అచ్చ తెనుగు మాండలికాన్ని, పదబంధాల్ని, సామెతల్ని అలవోకగా తన కథల్లో ఇనుమడింపజేస్తూ, పల్లె సీమల సొగసుదనాన్ని కళ్ళకు కట్టినట్లు చేసినది. తెలుగుతనాన్ని, తెలంగాణ భాష-యాసల సంగమంగా రూపొందించింది. యశోదమ్మకథ చెప్పే తీరు ఎట్లా ఉంటుందంటే పల్లెలోని పాత్రలు మన కళ్ళముందు తిరుగాడినట్లు, సన్నివేశాలు మనముందు జరుగుతున్నట్లుగా, ఆ కథ మళ్ళీ మళ్ళీ చదవాలనిపించేలాగ అనిపిస్తుంది. కొన్ని సంవత్సరాల తరువాత కూడా కథ చదివితే అదే అనుభూతి కలిగేలా ఉంటుంది. యశోదమ్మకు వాళ్ళ ఊరన్న, ఆ వాతావరణం అన్న చాలా ఇష్టం. అందుకే ఆమె కథల్లో సహజ సుందరమైన పల్లెటూరి వాతావరణాన్ని, జీవితాలను, ఆలోచనల్ని, సమస్యల్ని ఎంతో చక్కగా చిత్రించింది. యశోదమ్మ కథన పద్ధతి కడు రమణీయంగా సాగుతుంది.

యశోదారెడ్డి గారికి తెలుగు సాహిత్యంపై లోతైన అవగాహన సామాన్య ప్రజల భాషపై పట్టు, ఈమె కథల్లో మంచి, మానవత్వం, ఆర్ద్రత వేలాది తెలంగాణ భాషాపదాలు సంస్కృతి, నుడికారం, మానవ సంబంధాలు, గ్రామీణ జీవనం కలగలసి ఉన్నాయి. వీరు 150కుపైగా కథలు రాశారు.

కష్టాల కడలి నుండి ఉవ్వెత్తున ఎగిసిన కెరటం యశోదారెడ్డి. కెరటాన్ని ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ఉన్నత శిఖరాలను అధిరోహించింది. ఈమె నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి గ్రామంలో ఆగస్టు 8, 1929న జన్మించారు. తల్లిదండ్రులు వొనకల్లు సరస్వతమ్మ కాశిరెడ్డి. పుట్టిన మూడు నెలలకే తల్లి మరణించింది. తల్లి లేని యశోదమ్మను రుక్మిణమ్మ పెంచారు. పుట్టుకతోనే తల్లిని కోల్పోవడంతో నష్టజాతకురాలని బంధువులు మరియు తండ్రితో కూడా అన్పించుకొన్నది. అదే సమయంలో యశోదారెడ్డి గారికి తొమ్మిది సంవత్సరాల వయస్సులోనే తండ్రిని కోల్పోయింది.

పాలమూరులో మూడవ తరగతి వరకు చదువుకుంది. అక్కడి నుండి స్త్రీ విద్యకు ప్రోత్సాహం లేని కాలం అది. అంతేకాదు ఈ ప్రాంతం నిజాం ప్రభువుల ఆధీనంలో ఉండి విద్యకు ఆదరణ లేని కాలంలో చదువును కొనసాగించింది. "పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది" అనే నానుడిని నిజం చేస్తూ చిన్ననాటి నుండే కథలు, వ్యాసాలు రాశారు. ఈ రచనా వ్యాసాంగాన్ని కొనసాగిస్తూ... రాజా బహద్దూర్ వెంకటరామిరెడ్డి ప్రోత్సాహంతో హైదరాబాద్‌లోని మాడపాటి హనుమంతరావు పాఠశాలలో పాఠశాల విద్యను పూర్తి చేశారు.

1953లో కోఠి ఉమెన్స్ కాలేజీలో బి.ఎ. డిగ్రీ చేసి 1955లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ. తెలుగు, 1962 ఎం.ఏ. సంస్కృతం పూర్తి చేశారు. "తెలుగులో హరివంశములు" అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి 1969లో డాక్టరేట్ పట్టా పొందింది. 1976లో ఆగ్రా విశ్వవిద్యాలయం డి.లిట్ ప్రదానం చేసింది. 1955లో అధ్యాపక వృత్తిని చేపట్టి 1987లో పదవీ విరమణ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అధికార భాషా సంఘం అధ్యక్షురాలుగా 1990 నుండి 1993 దాకా తన సేవలను అందించిన తొలి మహిళ కావడం విశేషం.

అంతర్జాతీయ చిత్ర కళారంగంలో ప్రసిద్ధుడైన పాకాల తిరుమల రెడ్డిని 1947లో వివాహమాడినారు. వీరిరువురు తమ తమ రంగంలో పైపైకి ఎదగడానికి ఒకరికొకరు సహకరించుకోవడం సాహిత్య, చిత్రకళల అపూర్వ సంగమంగా గోచరించినది. నారాయణగూడ, హైదరాబాద్‌లోని తమ నివాస భవనం (సుధర్మ) వారి కళాభిరుచికే కాక సాహిత్య చర్చలకు కూడా నిలయంగా నిలిచింది. వీరిద్దరి విదేశీ పర్యటన సందర్భంగా 1976 "భారతీయ చిత్ర కళా గ్రంథం" వెలువరించింది. భర్త మరణానంతరం పి.టి.రెడ్డి స్మారక పురస్కార నిధిని ఏర్పాటు చేసి తన ఔన్నత్యాన్ని చాటుకొన్నది.

తెలంగాణ జీవన స్థితులను తన కథలలో నిక్షిప్తం చేసిన అగ్రశ్రేణి కథా రచయిత్రి పాకాల యశోదారెడ్డి. తెలంగాణ భాషా సౌందర్యాన్ని తెలపడానికి కథను శక్తివంతమైన సాధనంగా మలుచుకున్నది. "మా వూరి ముచ్చట్లు" కథా సంపుటిలో 1950-65 నాటి తెలంగాణ గ్రామీణ జీవన విధానాన్ని చిత్రించింది. "ఎచ్చమ్మ కథలు" 1965-80ల నాటి తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు. "ధర్మశాల" కథా సంపుటి 1980-99ల నాటి తెలంగాణ సమాజంలో వచ్చిన మార్పులకు దర్పణం వంటిది. యశోదారెడ్డిపై మూడు కథా సంపుటాలు తెలంగాణ భాషకు, యాసకు, సంస్కృతికి, సామాజిక జీవితానికి నిదర్శనంగా ఉండేటట్లు అక్షరబద్ధం చేసి అందించారు.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

యశోదారెడ్డి తెలంగాణ భాషను, మాండలిక భాషలోని ఆకర్షణను లోకానికి వెల్లడి చేయాలనే ఆకాంక్షతోనే కథారచన చేసింది. ఈమె అచ్చమైన తెలంగాణ భాషకు ప్రతీక. తన కాలంలో తెలంగాణ భాషలో ఇంత విరివిగా రాసిన వారు లేరు. తెలంగాణ భాషను, సంస్కృతిని, కుటుంబ సంబంధాలను, రక్త సంబంధాలను, పండుగలు, మూఢ విశ్వాసాలు కథలలో చిత్రించినది. నాగర్‌కర్నూల్ జిల్లా భాషను, సంస్కృతిని కథల రూపంలో మనకందించింది. పైన పేర్కొన్న విధంగా యశోదారెడ్డి గారు మూడు కథా సంపుటాలు వెలువరించారు.

మొదటి కథా సంపుటి "మా వూరి ముచ్చట్లు"లో పది కథలున్నాయి. 1) గంగిరేగి చెట్టు 2) నాగి 3) మేనరికం 4) పీర్ల పండుగ 5) మొమైక్యత 6) జతగాళ్ళు 7) జోగులయ్య 8) మా పంతులు 9) ఎంకన్న 10) మురారి. ఈ కథల నిండా గ్రామీణ జీవితం అలుముకొన్నది. దీనిలోని "ఎంకన్న" కథలోని వస్తువు, భావం, ఇతివృత్తం ఈ విషయాన్నే తెలుపుతుంది. ఎంకన్న, సీతక్కలు పశువులైన ఆదర్శ జీవనంలో మూగ ప్రేమలో ఉన్న శక్తిని లోకానికి చాటుతూ శాశ్వతత్వాన్ని నిలుపుకున్న గొప్ప జీవులు. పల్లెలోని లక్షలాది పశువులు ఆత్మీయానురాగాలకు ప్రతీక ఎంకన్న, సీతక్కలు. పశువులను సొంత ఇంటి మనుషుల్లాగ చూసుకునే గ్రామీణ స్త్రీలకు ప్రతీక ముత్తమ్మ. పట్టణ జీవనానికి, గ్రామీణ జీవనానికి గల తేడాను చూపుతుంది. ఎంకన్న కథ తమ చుట్టుపక్కల ఉండే మనుషులనే కాదు, పశువుల బాగోగులను గ్రామీణ ప్రజలు ఎంత జాగ్రత్తగా పట్టించుకుంటారో ఈ కథ ద్వారా రచయిత్రి తెలుపుతుంది. దయ, ప్రేమ, కరుణ, అనురాగం, మమకారం ఇవన్నీ మనుషులకే కాదు మూగజీవులకూ ఉంటాయని నిరూపిస్తుందీ కథ.

మరో కథా సంకలనం "ఎచ్చమ్మ కథలు" ఈ సంపుటిలో 20 కథలున్నాయి. అవి 1) మోనా 2) తరతరాల నాటి తెలుగు 3) ఆరొండు నావి 4) జమ్మి 5) కాలం చెప్పిన తీర్పు 6) సందెబిచ్చం తల్లీ 7) నాపైనాల చిత్రం 8) సీనయ్య 9) నిశ్చితార్థం 10) పేర్లేముండది పెద్దర్కం 11) పురైకోబుద్ధి - జీవ్వకోరుచి 12) పెద్దమత్తి 13) కోడలమ్మ ఎతలు 14) ఎదుర్కోల్లు 15) సీతమ్మ విలాయతు 16) పొమ్ము సోమందం 17) పరుపుబండ 18) బుక్కిందే - దక్కింది 19) దొరా! నన్ను అమ్ముకోకు 20) మిఠాయి రాములు మొదలగునవి కలవు. యశోదమ్మను చిన్ననాడు ఎచ్చమ్మ అని పిలిచేవారు. ఈ సంపుటిలో "కోడలమ్మ ఎతలు" రాసిపోసి వర్ణించారు. పూర్వం పల్లెటూళ్ళలో కోడండ్లు పడే కష్టాలను అణువణువునా ఈ కథలో చిత్రించారు. ఇంకా "మోనా" కథలో దేవదాసీల ఆటపాటలు దయనీయ బతుకులతో పాటు ఒక సంఘటన స్త్రీల జీవితాల్లో ఎన్ని మలుపులకు, వైపరీత్యాలకు దారి తీస్తుందో చూపించారు. గ్రామాల్లో పేదలను, రైతులను భూస్వాములు మానసికంగా, ఆర్థికంగా అణచివేసి బానిసలు చేసి వారి శ్రమను దోచుకునేవారు. పేదవారు, రైతు కుటుంబాలు తమ పిల్లలను కష్టపడి ఎలా చదివించారో "కాలం చెప్పిన తీర్పు" కథలో కనబడుతుంది. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు సంపాదించిన తీరును చూపించారు. భీమమ్మ కొడుకు డిప్యూటీ కలెక్టర్ కావడం ఈ కథలో కనిపిస్తుంది.

"ధర్మశాల" కథా సంపుటిలో 24 కథలున్నాయి. అవి 1) ధర్మశాల 2) దారా 3) నిప్పుతో చెలగాటం 4) అకాయ్ చేసిన పెళ్లి 5) రంగడి ప్రయోజకత్వం 6) ప్రమీల 7) గుళ్ళో గంటలు 8) తియ్యటి తీగలు 9) దిబ్బరొట్టె 10) రూం నెంబర్ త్రీ 11) బరిబత్తల బొమ్మ 12) సంది 13) పరిత్యక్త 14) సంకుదేముడు 15) రాజుగారి ఒకనాటి ప్రచారం 16) పేరులో ఏముంది? 17) ఎదల్లోని పొరలు 18) దేవుడున్నాడా? 19) సౌభాగ్యవతి 20) ఊరి అవతలి బావి 21) కల కల్ల కాలేదు 22) అందిన కందిరీగ 23) సీతమ్మ గారి సీమ ప్రయాణం 24) మాధవీలత. ఈ కథల్లో మధ్యతరగతి జీవన చిత్రన కనిపిస్తుంది. ఇందులో "ఊరి అవతలి బావి" కథలో "బావి పూడిక తీశారు. చుట్టూరా గచ్చు వేశారు. అది ఎప్పుడూ మూడు గిలకల చేదబావి. ఒకవైపు గిలక లేదు. కాని పెద్దగచ్చు గోలెం ఉంది. అందులో ఒక గిలక ఇంటి వారి కోసం, మిగతా రెండు ఊరు వారి కోసం. ఇక్కడ కులం, తలం ఏ పట్టింపులూ ఉండవు. ఊరి వారంత కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకు చూస్తున్నారు. ఆ నీటి కోసం అందని రుచ్యమైన భోజనాన్ని చూసి వుర్వీ లూరుచున్నట్లు. రాధాకృష్ణ శర్మ వాళ్ళ ఇంటి దిడ్డి పన్గడి తలుపు తీయించాడు. బావిపై బొక్కెన వేసిన ప్రతి మనిషీ ఒక బొక్కెడు నీళ్ళు తొట్టిలో పోయాలి. తన భార్యతో సహా. అది కట్టుబాటు. ఈ నీళ్ళు ఆవులు, లేగలు తాగడానికి ఉపకరిస్తాయి అంటూ చేసిన నిర్ణయం ఇది. ఇన్నినాళ్ళకు అగ్రహారికులు బావి తన చుట్టు గీసుకొన్న గిరిని తొలగించుకొని రాధాకృష్ణ శర్మ పాటించ దలచిన "స్వాదు ఏ కోన భుంజీత", "తాగేనైకేన అమృతత్వ మానశు" అనే ధర్మం ఆచరణలోకి వచ్చింది. ఆ విధంగా పరివర్తన రావడానికి కారణమైన "మా ఊరవతలి బాయికి జై" అంటూ ఆప్యాయతలు పంచుకున్నారు అందరు కలిసి కట్టుగా..." అంటూ ముగించారు.

ఈ కథలన్ని చాలా మేరకు తెలంగాణ గ్రామీణ, మధ్య తరగతి జీవిత చిత్రాన్ని చిత్రించినది. అంతేగాక తెలంగాణ భాష, పలుకుబడి, మాటతీరు, సంస్కృతి కనిపిస్తాయి. భాష సంస్కృతికి ఒక ఆయువు పట్టు. దీనిని గమనించి యశోదమ్మ కథలలో నిక్షిప్తం చేశారు. వీరి కథలలో వస్తువు, శిల్పం పల్లె ప్రజల జీవితాల నుండి తీసుకొన్నది.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

ఈ కథా సంపుటాలే కాక వీరికథలు కరీంనగర్ జిల్లా కథల సంపుటిలో ప్రచురించబడ్డాయి. అవి 1) కొత్తబాట 2) కోడలమ్మ ఎతలు. యశోదారెడ్డి కథ చెప్పే తీరు ఎంతో చక్కగా ఉంటుంది. పల్లెల్లో ఆత్మీయులకు, ఇరుగు పొరుగు వారికి కథ చెబుతున్నట్లుగా ఉంటుంది. యశోదారెడ్డి కథను తోటివాళ్ళకు, ఎదుటి వాళ్ళకు చెప్పే ముచ్చట్లు, కథనరీతి, తెలుగు కళారూపాల్లో ఉన్న రీతిని చక్కగా తన కథల్లోకి తీసు కొచ్చారు.

"కొత్తబాట" కథలో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత వేగంగా చోటుచేసుకున్న మార్పులు, క్రమాను సారంగా రాబోయే కొత్తమార్పులు, ఊహించని పరిణామాలు, పర్యావసానాలు, స్థానిక ఆధిపత్యశక్తుల మీద సామాన్యుడి కొత్త విజయాలను సంకేతాత్మకంగా చిత్రిస్తుందీ కథ. ఈ కథ తెలంగాణ మాండలికంలో రాయబడింది. అక్కాతమ్ముళ్లిద్దరూ బస్సు దిగి అక్కడి నుండి ఎద్దుల బండిలో వాళ్ళ ఊరి వరకు ప్రయాణం చేసిన రెండు గంటల్లో రెండు తరాలకు జరిగిన ఘర్షణ, సాధించిన విజయాలు సప్రమాణంగా ప్రదర్శించ బడ్డాయి. ఈ సంభాషణలో ఎన్నో సాంఘిక దురాచారాలు తడమబడ్డాయి. భాష తెలంగాణ మాండలికాన్ని జీర్ణించుకొని, ఆ జాతీయాన్ని, జీవనరీతిని, నుడికారాన్ని ప్రదర్శిస్తుందని చెప్పవచ్చు. యశోదారెడ్డి వ్యవసాయ పనులు, పనిముట్టు ఎన్నో చిత్రించారు. పగ్గాలు, పలుపులు, మెడదుత్తలు, కందెన, పెద్దస వారి, ఎడ్లు, పరదాలు మొదలైనవి. ఇవియేగాక బతుకమ్మ పండుగకు తల్లిగారింటికి పోవడం, పెళ్లైన వాళ్ళకు హక్కుగా ఈ కథలలో సూచించింది.

యశోదారెడ్డి కథారచయిత్రిగానే కాక తెలుగు సాహిత్య చరిత్రలో స్థిరస్థాయిలో నిలువదగిన రచనలనెన్నింటిలో పరిశోధనాత్మకంగా, విమర్శనా ప్రతిభకు నిదర్శనంగా రాశారు. అవి ఉగాదికి ఉయ్యాల, భావిక, చిరుగజ్జెలు, అమరజీవులు, తెలుగులో హరివంశములు, ఆంధ్రసాహిత్య వికాసం, ఎర్రా ప్రెగడ, పారిజాతాపహరణ పర్యాలోచనము, భాగవత సుధ, భారతంలో స్త్రీ, భారతీయ చిత్రకళ, నారదీయం, కావ్యాను శీలనం, ద్విపద వాఙ్మయము, ప్రబంధ వాఙ్మయము మొద లగునవి. వీరి సిద్ధాంత గ్రంథం "తెలుగులో హరివంశములు" సమగ్రమైన గ్రంథం. ఎర్రన, నాచన సోమనల హరివంశాలపై తులనాత్మక పరిశీలన గలదీ గ్రంథం. నేమాని భైరవకవి "ఉత్తర హరివంశం" వెలుగులోకి తేవటం, నాచన సోమన "ఉత్తర హరివంశానికి" విపుల పీఠికను రాశారు.

సంస్కృతం, ఉర్దూ, జర్మన్, కన్నడ, ఇంగ్లీష్ భాషలో యశోదమ్మకు పరిచయం ఉంది. వీరు 25 గ్రంథాలు రాశారు. దక్కన్ రేడియో ద్వారా వందకుపైగా కథలు, నాటికలు, సాహిత్య ప్రసంగాలు, కవితలు అందించారు. తెలంగాణ భాష, యాస ఆమెకు వెన్నతో పెట్టిన విద్య. నాగరికతా ముసుగులో కనుమరుగైపోతున్న మన భాషా సంపదను భద్రపరుచు కోవాలన్న తాపత్రయం ఆమెలో అడుగడుగునా కనిపించేది. పలు భాషలలో ప్రావీణ్యం పొంది, అగ్రశ్రేణి కథారచయిత్రిగా, మహావక్తగా, ఉత్తమ విమర్శకురాలిగా, పేరు పొందిన సరస్వతీ మూర్తి పాకాల యశోదమ్మ అనారోగ్యంతో తన 78వ యేట తేది : 07.10.2007న స్వర్గస్థులైనారు.

❀❀❀

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

'మహాప్రస్థానం'- గతితార్కిక భౌతిక వాదం

- డా॥ వారాది చిన్నారావు
పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఆంధ్ర యూనివర్సిటి, విశాఖపట్నం.

అభ్యుదయ కవిత్వంలో రెండు రకాల విధానాలు ఏకకాలంలో దర్శనమిస్తాయి.. పాశ్చాత్య ప్రభావం వల్ల తెలుగులోకి ప్రవేశించిన అభ్యుదయ కవిత్వం, ప్రజాకవులు ఏర్పరచిన అభ్యుదయ కవిత్వం. పాశ్చాత్య ప్రభావంతో తెలుగులోకి వచ్చిన కవిత్వాన్ని శ్రీశ్రీ, నారాయణబాబు వంటి వారు ఆహ్వానించి దానికి పట్టం కట్టారు. ఈ కాలంలో మరొక విధంగా అభ్యుదయ కవిత్వం కనబడుతుంది. అదేంటంటే, నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణా ఉద్యమ పోరాటంలో ఆవిర్భవించిన కవిత్వం. సుద్దాల హనుమంతు వంటి ప్రజాకవులు రచించి పాడిన పాటలు ఆధారంగా ఈ కవిత్వం ఉనికిని చాటుకుంది. అయితే పాశ్చాత్య ప్రభావంతో వచ్చిన అభ్యుదయ కవిత్వాన్ని మాత్రమే తెలుగులో ఆదరించడం జరిగింది. అలాగే తెలుగు కవిత్వాన్ని ప్రభావితం చేసి ఎందరో అభ్యుదయ తెలుగు కవులను సృష్టించి సాహిత్యానికి ఒక ఆధునిక మార్గాన్ని ఏర్పాటు చేసింది.

మార్క్సిస్టు దృక్పథానికి ప్రతీక అయిన అభ్యుదయ కవిత్వం ఒక సామాజిక ఉద్యమం. కార్ల్ మార్క్స్, ఫెడరిక్ ఎంగిల్స్ మొదలగు వారి రచనల స్ఫూర్తితో ఈ ఉద్యమం ఆవిర్భవించింది.'ప్రోగ్రెసివ్ అనే ఇంగ్లీషు పదానికి అనువాదంగా ఆధునిక సాహిత్యంలో 'అభ్యుదయం' అనే మాటను ఉపయోగించడం జరుగుతోంది. అంతే కాకకుండా అభ్యుదయ సాహిత్యం, అభ్యుదయ కవిత్వం వంటి మాటలను, మార్క్సిస్టు సాహిత్యం, మార్క్సిస్టు కవిత్వం అను రూఢార్థాల్లో ప్రస్తుతం ప్రయోగిస్తున్నాం. తెలుగు సాహిత్యంలో, అభ్యుదయ కవిత్వానికి చాలా ప్రాధాన్యం ఉంది. ఇది 'మార్క్సిస్టు ఉద్యమంలో భాగంగారచించిన కవిత్వం' అనే అర్థంలో మనం స్వీకరిస్తున్నాం.

'గతి తార్కిక భౌతిక వాదం' అనేది అభ్యుదయ కవిత్వంలోని మౌలిక సిద్ధాంతం. చారిత్రక భౌతిక వాదం కూడా ఇందులో భాగమే. ఆర్థికంగా బలహీనమైన, బలమైన రెండు వర్గాల మధ్య భేదం, సంఘర్షణ పెరిగి చివరకు ఈ సంఘర్షణ విప్లవాత్మక పరిణామం ద్వారా శ్రామిక వర్గ విజయానికి దారితీస్తుంది. ఇలా ఏర్పడిన శ్రామిక వర్గ నియంతృత్వ ప్రభుత్వాలు తరవాత రాజ్యాంగ వ్యవస్థతో పనిలేని కమ్యూనిష్టు సమాజం ఏర్పడుతుంది. మనకు పరిపూర్ణ సుఖాన్ని అందించడానికి ఈ సమాజం అన్ని విధాల ఉపయోగపడుతుంది. ఇది చారిత్రక భౌతిక వాదం. ఈ ప్రభావం ఎక్కువగా ఐరోపా దేశాలలో కనబడుతుంది. అయితే కార్ల్‌మార్క్స్ ఒకే తత్వంలోని పరస్పరం సంఘర్షించే రెండు అంశాల సంఘర్షణే పరిణామానికి మూల సూత్రం అనే 'గతితర్కిక' సిద్ధాంతాన్ని పదార్థంలోంచే చైతన్య ఆవిర్భవించిందన్న భౌతిక వాదాన్ని సమ్మిళితం చేసి తన సిద్ధాంతాన్ని రూపొందించాడు.

తెలుగులో అభ్యుదయ కవిత్వం తారాస్థాయికి చేరడానికి పునాదులు శ్రీశ్రీ ఆలోచనలు అని విమర్శకుల అభిప్రాయం. శ్రీశ్రీ 'మహాప్రస్థానం', 'ఆధునిక భగవద్గీత'గా చైతన్య శిల్పిగా దర్శనమిస్తుంది. మహా ప్రస్థానంలో మార్క్సిస్టు భావజాలాన్ని పరిశీలిస్తే శ్రీశ్రీ కలగన్న సమాజం, సమాజ విధానం బయటపడుతుంది.

శ్రీశ్రీమహాప్రస్థానంలో గతితార్కిక భౌతికవాదంతో పాటు దాచినా దాగని సత్యాలు, వర్గసంఘర్షణ సిద్ధాంతం, శ్రామికుల సమిష్టి చైతన్యం శ్రామిక శక్తుల దోపిడీపై నిరసన, పాళితుల తిరుగుబాట్లు ఇలా అనేక కోణాలు ఉన్నాయి.

"వరాల వర్షం కురిపించాలని
ప్రపంచ భాగ్యం వర్ధిల్లాలని
గనిలో, పనిలో, కార్ఖానాలో
పరిక్లమిస్తూ
పరిప్లవిస్తూ"

కార్లమార్క్స్ చెప్పిన గతితార్కిక భౌతికవాదమిదే. శ్రీశ్రీ మార్క్సును, అతని భావజాలాన్ని ఎక్కడా వదిలిపెట్టలేదు. శ్రామిక జీవులు - ధనిక స్వామికి దాస్యం చేస్తూ వారి చేతులోనే దోపిడీకి గురౌతున్నారని శ్రీశ్రీ తన మహాప్రస్థానంలో పేర్కొన్నాడు.

'దేశచరిత్రలు' గేయంలో గతితార్కిక భౌతిక వాదం నిలువునా బయటపడుతుంది.

"ఏ దేశ చరిత్ర చూసినా
ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణం"

'ప్రతిజ్ఞ' ఖండికలో కార్మికుల శ్రమశక్తిని దోచుకునే పెట్టుబడీదారీ వ్యవస్థ తీవ్రంగా నిరశించి శ్రామిక వర్గ చైతన్యానికి పునాదులు వేసిన మార్క్సిస్టు దృక్పథం ప్రత్యక్షమౌతుంది.

విరోధి వైరుధ్య సూత్రం ప్రకారం పెట్టుబడీదారీ వ్యవస్థ, కార్మిక వ్యవస్థల మధ్య సంఘర్షణ ఎప్పుడూ ఉం

టుంది. అయితే పెట్టుబడిదారీ వ్యవస్థలోని దోపిడీ విధానాన్ని నిర్మూలించడానికి శ్రామికులందరూ ఏకము కావాలని మార్క్స్ ప్రభోధించాడు. కానీ శ్రీశ్రీ అక్షరబద్ధం చేశాడు.

"చీనాలో రిక్షావాలా
చెక్ దేశపు గని పనిమనిషి
ఐర్లాండున ఓడ కళాసీ అణగారిన ఆర్తులందరూ
హటెన్‌టాట్, జూలూ నీగ్రో
ఖండాంతర ఆనాజాతులు
చారిత్రిక యధార్ధ తత్వం
చాటిస్తారొక గొంతుకతో"

అని విశ్వ శ్రామికుల సమిష్టి చైతన్యం చేసిన అభ్యుదయ కవిగా శ్రీశ్రీ తన భావాన్ని వ్యక్తం చేశాడు. వ్యక్తుల ఇష్టానిష్టాలకు మార్క్సిజం అవకాశం ఇవ్వదు, ఆధారపడదు. అయితే వాటి వెనకున్న శక్తులను మాత్రమే పరిశీలిస్తుంది. అలా కాని పరిశీలనలన్నీ 'కట్టుకథలని' నమ్ముతుంది. శ్రీశ్రీ ఈ విషయాన్ని తీవ్రంగా వ్యక్తపరిచాడు.

"ఇతిహాసపు చీకటికోణం
అట్టడుగున పడి కన్పించని
కథలన్నీ కావాలిపుడు
దాచేస్తే దాగని సత్యం" అని హెచ్చరించాడు.

గతితార్కిక భౌతిక వాదానికి సంబంధించిన మరొక అంశం వర్గ సంఘర్షణ. ఈ వర్గ సంఘర్షణ సిద్ధాంతాన్ని అతి స్పష్టంగా సొంతగొంతుకతో స్వర కల్పన చేశాడు శ్రీశ్రీ. మానవ జాతి చరిత్రఅంతా వర్గ సంగర్షణ ఫలితమే అన్న గతి తార్కిక భౌతికవాద సిద్ధాంత ఫలితాన్ని శ్రీశ్రీ..

"పరస్పర సంఘర్షిం చిన
శక్తులలో చరిత్ర పుట్టును"

అని సంగ్రహతనూ, సరళతనూ, గంభీరతనూ పుణికి పుచ్చుకున్న వాక్కులలో అందించాడు.

దోపిడీని ఎదిరించి కార్మికుల్లో వర్గ చైతన్యం పెల్లుబికి వారంతా సంఘటితులై పెట్టుబడిదారీ వర్గానికి విరుద్ధంగా వారి దోపిడీని ఎదురిస్తూ విప్లవాన్ని లేవదీస్తారని మార్క్స్ భావన. అందువల్లనే శ్రామిశక్తిని దోచుకుంటున్న వైనాన్ని తెలియజేశాడు.

"ఘర్మజలానికి ధర్మ జలానికి
ఖరీదు కట్టే షరాబులేడోయ్"

అని నిర్వేదం ప్రకటించాడు. ఈ నిర్వేదంలో ఆశావాదం ఉదయించింది.

శ్రీశ్రీ మహాప్రస్థానంలో శ్రామిక వర్గ చైతన్యాన్ని అద్భుతంగా ..

"నాలో కదిలే నవ్య కవిత్వం
కార్మిక లోకపు కళ్యాణానికి
శ్రామిక లోకపు సౌభాగ్యానికి"

సమర్పిస్తానని శపథం చేశాడు. అంతే కాకుండా.

"కమ్మర కొలిమి కుమ్మరి చక్రం
జాలరి పగ్గం సాలెల మగ్గం
శరీర కష్టంస్ఫురింప చేసే
గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి
సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలు

సౌందర్యమనేది ఊహా కవిత్వ విషయమో, అతీంద్రియ స్వప్నమో కదాని, సమాజపు సుశిక్షితమైన గతిలోనే సౌందర్యం ఇమిడి ఉందని ఆ గతి శ్రమ ఫలితమే కనుక శ్రమే సౌందర్యమని మార్క్సిస్టు తత్వవేత్తలు వాదించాడు.

ఈ దృక్పథాన్నే శ్రీశ్రీ -

"శ్రమైక జీవన సౌందర్యానికి
సమానమైనది లేనేలేదని" చెబుతూ

"వ్యధార్థ జీవితయథార్థ దృశ్యం' పునాదిగా జనించబోయే భావి వేధాలకు జగత్తును అందిస్తానని ప్రతిజ్ఞ చేశాడు.

పాలితులుచేసిన తిరుగుబాటును శ్రీశ్రీ మహా ప్రస్థానంలో తీవ్రంగా వ్యంగ్యంగా రచన చేశాడు.

కనక దుర్గా చండసింహం జూలుదులిపి ఆవులించింది. ఇంద్ర దేవుని మదపుటేనుగు ఘీంకరిస్తూ సవాల్ చేసింది. అంటూ సవాళ్ళను, తిరుగుబాటును విప్లవానికి, విలయానికి ప్రతీకగా ప్రత్యక్షీపరింపచేశాడు శ్రీశ్రీ

"పుడమి తల్లి నీ
పురిటి నొప్పులు
కొత్త సృష్టిని"

స్ఫురించాయని పెట్టుబడిదారీవ్యవస్థ విధ్వంసమై శిధిలమై శ్రామికవర్గం ఆవిర్భవిస్తుందన్న విషయాన్ని తెలియజేశాడు.

కవిత్వాన్ని ఒక సాధనంగా వాడుతూ శ్రీశ్రీ తన భావ వ్యక్తీకరణకు మరింత పదును పెట్టాడు. పాలక వర్గానికి, వ్యతిరేకంగా పాలితులనూ, పీడితులనూ నడిపించడానికి కవిత్వాన్ని మార్క్సిస్టులు ఒక సాధనంగా వాడుకున్నారు. అందుకే శ్రీశ్రీ కదిలేదీ కదిలించేదీ పెనునిద్దర వదిలించేది నవ కవిత అని అక్షరబద్ధం చేశాడు.

మార్కిస్టుల వాస్తవికతా వాదం కూడా గతాతార్కిక భౌతిక వాదంలోని భాగంగా దర్శనమిస్తుంది. కావ్య వస్తువులే వాస్తవికతా వాదం బోధిస్తుంది. స్వర్గం, నందనవనం మొదలైన అతీంద్రియ వస్తువులు, పూలు, సెలయేర్లు, మబ్బులు మొదలైన హృదయభరితమైన వస్తువులే కాకుండా జుగుప్సావహ

మైన అనుదాత్త వస్తువులను కూడా ఈ కోవలోకి చెందుతాయని అందుకే ..

"కళ్లంటూ ఉంటే చూసి రాస్తే
అన్నీ ఆనందాయకాలే, రసమయాలే, కవితావేశాలే"

అని విశ్వసించాడు. అంతేకాకుండా ... 'కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిల్లా హీనంగా చూడకు దేన్నీ కవితా మమే నోయ్ అన్నీ" అని ఉల్లేఖించాడు శ్రీశ్రీ.

ఇంకా 'జగన్నాథుని రథచక్రాల్లో' జగత్తులో జరుగుతున్న అన్యాయాలను అణచి వేయడానికి విప్లవ శక్తి అవతరిస్తుందని హెచ్చరించి పతితులకు, భ్రష్టులకు , బాధాసర్పదష్టులకు దుర్దినాలు తొలగిపోవా; స్వాతంత్ర్యం, సౌహార్దం, సమభావం, పునాదులుగా నూతనలోకం ఉదయిస్తుంది ఆశా సంగీతం ఆలపించాడు. 'దేశచరిత్రలు" గేయం గతితార్కిక చారిత్ర భౌతిక వాదానికి ప్రతీకగా నిలుస్తుంది.

ఈ విధంగా గతితార్కి భౌతిక వాదం మహాప్రస్థాంలో నిక్షిప్తమై అభ్యుదయ భావజాలంతో బయటకు స్ఫురిస్తుంది. ఇతర దేశాలలో ప్రారంభమై భారత దేశంపై ప్రభావం చూపిన ఈ మార్క్సిస్టు దృక్పథాన్ని శ్రీశ్రీ తన రచనా దృక్పథాన్ని, ఆలోచననూ, భావ వ్యక్తికరణను జోడించి మహాప్రస్థానం రాసి ప్రజలకు అందించి అభ్యుదయ కాంక్షను చాటాడు.

❀❀❀

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

నీరు-నేల మనిషి-వస్తుపరామర్శ

- ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ
తెలుగు అధ్యయన శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

చిత్తూరు జిల్లా, సాహిత్యంలో ఈ ప్రాంత వాసనలను, సంస్కృతిని వాతావరణాన్ని తన రచనల ద్వారా తెలియజేస్తున్న రచయితలలో ఒకరు సుంకోజి దేవేంద్రాచారి. వీరు 1974లో మదనపల్లె తాలూకాలో జన్మించారు. వృత్తిరీత్యా పత్రికారంగం లో పనిచేస్తూ ప్రవృత్తి రీత్యా సాహిత్య వ్యాసంగాన్ని కొనసాగిస్తు న్నారు. ఇప్పటి వరకు వీరు ఒక మేఘం కథ, మన మంచి ఆటలు, డెబ్బదికి పైగా కవితలను, వికృతి, వెన్నెముక, మిస్సింగ్, రెక్కాడినంత కాలం, నీరు నేల మనిషి, అను నవల లను వెలువరించారు. ఇవి చతుర, ఆంధ్రభూమి పత్రికలలో సీరియల్స్‌గా వచ్చాయి. వీరి సాహిత్య కృషికిగాను రాష్ట్ర ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ యువ పురస్కారం, బి.యస్. రాములు విశాల సాహితీ పురస్కారం, భారతీయ భాషా పరిషత్ యువ పురస్కారం, రంగినేని ఎల్లమ్మ సాహితీ పురస్కారం, మొ॥వి అందుకున్న సత్కారాలు. 2005 తానా బహుమతి పొందిన నవల వీరి 'నీరు నేల మనిషి'. ఈ నవల వస్తు శిల్పాలు గురించి, దీని ప్రత్యేకతను గురించి ఈ విధంగా తెలుసు కోవచ్చు.

వస్తువు :

పీలేరుకు సమీపంగా ఉన్న కామిరెడ్డి పల్లెలోని గొల్ల కులానికి చెందిన 'రామచంద్ర' అను రైతు జీవన చిత్రణే ఈ నవల. రామచంద్ర తన భూమిని పండించడంలో భాగంగా పది బోర్లు వేసి అప్పుల పాలవుతాడు. వానలు సకాలంలో పడకపోవడం, పండిన టమోటా పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల అప్పు మరింత పెరుగుతుంది. కనీసం తిండిగింజల కోసమని వరిమడి సాగుకు అప్పు చేసి పదకొండవ బోరును వేయడం, అందులో మూడించులు నీరు పడినా ఆ పంట చేతికి రాకమునుపే నీళ్లు అయిపోవడం, పంటకు నీళ్ళు లేక నెర్రెలు కట్టి ఎండిపోవడం, దీనిని భరించలేక పక్కపొలం రాజయ్యను నాలుగు తడులు నీళ్ళివ్వమని బ్రతిమాలినా లాభం లేకపోవడంతో దిగులు చెంది, పంట రాకపోతే అప్పులవాళ్ళకు డబ్బులు ఎలా కట్టాలో తోచక, పరువు పోతుందని బాగా ఆలోచించి, తాను చనిపోతే ప్రభుత్వం ఇచ్చే లక్షాయాభైవేల రూపాయలన్నా కుటుంబానికి దక్కుతుందనే ఉద్దేశంతో తాను ముష్టిచెక్క బెల్లం కలిపి తిని ఆత్మహత్య చేసుకోవాలనుకుంటాడు. ఈ బాధతోనే అతనికి గుండెపోటు వచ్చి చనిపోతాడు.

భర్త చనిపోయిన తర్వాత భార్య రమణమ్మ కుటుం బాన్ని మోసిన తీరు, చేతికొచ్చిన చెఱుకు పంటను అప్పులోకి చెప్పాపెట్టకుండా కొట్టుకొనిపోయిన చంద్రారెడ్డి నుండి డబ్బు లను వసూలు చేసిన తీరు ఆశ్చర్యం కలిగిస్తుంది. పరువు పరువు అనుకుంటే బ్రతకలేమని అది ఒకసారి గడపదాటాక దాని గురించి ఆలోచించాల్సిన అవసరం లేదని, అనుభవాల ద్వారా ఆమె తీసుకున్న నిర్ణయం వ్యక్తమవుతుంది. అప్పు తీర్చడం కోసం కువైట్ వెళ్ళిన కొడుకు మోసపోయాడని తెలి సినా, ఏ మాత్రం భయపడక ఇంటికి రమ్మని ఇక్కడ కూలి చేసుకొని బ్రతుకుదామని, మనకు రాని పనంటు లేదని చెప్ప డమే కాదు. రెండు జెర్సీ ఆవులతో పాలు పోసుకొని బ్రతుకుదా మని కొడుక్కు బ్రతుకు గురించి భరోసా ఇవ్వడంతో పాటు బతకాలనే ధైర్యముండాలేగాని చేసుకునే దానికి ఎన్నో పను లుండాయని చెప్పి తాను బ్రతికి చూపించడమేకాదు, కొడు కుకు కొండంత ధైర్యాన్ని చెప్పి అండగా నిలిచిన తీరే ఇందు లోని వస్తువు.

ఈ నవలలో రైతు రామచంద్ర చావు కేవలం కరువుకు సంబంధించింది మాత్రమే కాదు. పరువుకు సంబంధించినది. కరువుకు తోడు అనేక సమస్యలు అతన్ని చుట్టుముట్టాయి. తన కూతురు శారదకు 26 సం॥ దాటినా పెండ్లి చేయలేని ఆర్థిక అసమర్థత. పల్లెల్లో రైతు కుటుంబంలో 26 సం॥ వరకు కూతురికి పెండ్లి చేయకపోవడం సామాన్య విషయం కాదు. దీనికి తోడు అదే గ్రామానికి చెందిన షరీఫ్ తన కూతుర్ని వెంబడిస్తున్నాడనే విషయం ఎరిగిన వాడు. అందుకే వీలైనంత తొందరగా పెండ్లి చేద్దామన్న ఆలోచన ఒకవైపు, వేసిన ప్రతి పంట, చేతికి రాక నష్టం కల్గించడంతో ఈ తంతు వాయిదా వేయవల్సిరావడం బాధను మరింత కల్గించింది. మరొకవైపు బోరు వేసి నీళ్ళు పడితే పంట పండుతుంది, అప్పటి వరకు ఓపిక పట్టమని అప్పుల వాళ్లకు చెప్పాడు. ఈ విషయం పక్కన పెడితే తమకు తినడానికే తిండిగింజల్లేని స్థితిని జీర్ణించుకోలేక పోయాడు. అప్పటి వరకు పరువుగా బతికిన రామచంద్రకు ఒకవైపు అప్పుల వాళ్ళ ఒత్తిడి, బోర్లు ఎత్తిపోవడం, పండిన టమోటా పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం కుమార్తె పెండ్లి సమస్య ఇవన్నీ అతని మీద దాడి చేశాయి. వీటిని తట్టుకునే శక్తిలేక రామచంద్ర ఆత్మహత్య చేసుకోవాలనుకుంటాడు. ఈలోపే ఈ సమస్యలన్నీ దాడి చేసి గుండెపోటుకు బలై పోతాడు.

ఇలా బలైపోయిన కుటుంబాలు వీధినపడుతున్నాయి. అప్పులవాళ్ళు ఎవరికి తోచింది వారు, ఎవరికి దొరికిందానిని

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

వారు స్వాధీనం చేసుకొని అప్పులు చెల్లించుకుంటున్నారు. చావ లేక బ్రతుకుతున్న కుటుంబ సభ్యుల పరిస్థితి ఏమిటని ఆలో చిస్తే నిలువెల్లా తనువు కంపిస్తుంది. ఇది ఒక్క రామచంద్ర కుటుంబానిదే కాదు. ఈ దేశంలో రైతన్నల దుస్థితికి ఇది సాక్షీభూతం. దేశంలో సంవత్సరానికి 12,000 వేలమంది రైతులు ఆత్మహత్య చేసుకొంటున్నారని అంచనా. దేశానికి అన్నం పెట్టే రైతు, దేశ అభివృద్ధికి వెన్నెముక అయిన రైతు జీవన ప్రమాదంలో పడినప్పుడు అతన్ని బయటపడవేసే మార్గాన్ని అన్వేషించాల్సిన అవసరం ప్రభుత్వాలపైన ఉంది. రైతు ఆరోగ్యంగా, సుభిక్షంగా ఉంటే దేశం సైతం సుభిక్షంగా ఉన్నట్లు లెక్క. రైతు జీవితం ప్రమాదంలో పడడానికి, ఆర్థికంగా నష్టపోవడానికి గల కారణాలను ఎవరని అన్వేషిస్తే, మన రైతా? ప్రకృతా? ప్రభుత్వాలా? అన్న సందేహం కలుగుతుంది.

రైతు వ్యవసాయాన్ని ప్రతిఫలం ఆశించకుండా చేస్తు న్నాడు. వరుస కరువులతో నకిలీ విత్తనాలతో మోసపోయి అప్పులపాలై వీధినపడుతున్నాడు. డబ్బులున్నా, లేకపోయినా బోర్లు వేయడానికి పూనుకొని 20 బోర్లు వేసినా ఇంకా ఆశను చంపుకోవడం లేదు. అలా బోర్లు వేసి మోసపోవడం ఒక ఎత్త యితే మరొకవైపు నకిలీ విత్తనాల పంపిణీలో ప్రైవేటు, ప్రభుత్వ విత్తన సంస్థల మోసం మరో వైపు. ఈ అవస్థలన్నింటిని అధిగ మించి పంట పండినా దానికి కనీస గిట్టుబాటు ధర లేక పత నమైపోవడం మరొకటి. పంట నష్టపోయిన వారికి రుణమాఫీ గాని, వడ్డీలేని ఋణాలను ఇవ్వడంలోను ప్రభుత్వం కొన్ని సౌకర్యాలను కల్పించి రైతులకు వెన్నుదన్నుగా ఉండాల్సిన ప్రభుత్వాలు రైతుల విషయంలో మరీ కఠినంగాను, నిరం కుశంగాను వ్యవహరిస్తుంది. ఈ ప్రభుత్వ విధానంలో మార్పులు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సాధారణ వ్యక్తులు స్కూటర్లు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల, పనిముట్ల షాపులను పెట్టుకోవడానికి లోన్‌లు మంజూరు చేస్తున్నప్పుడు రైతుకు ఎద్దులనో, ఎరువులనో, పంట సాగుకో రుణం కోసం దరఖాస్తు పెట్టుకున్నప్పుడు వీటిని మంజూరు చేయకపోవడం అటుంచి తనఖా ఏమిపెడతావో గట్టిగా నిలదీసి రాయించు కుంటుంది. దీన్ని బట్టి చూస్తే ప్రైవేటు వ్యాపారులపైన, వ్యాపారంపైన ఉన్న నమ్మకం, రైతుల పైన, రైతు పండించే పంటలపైన ప్రభుత్వానికి, బ్యాంకులకు లేదన్న విషయం స్పష్టమవుతుంది.

ఇటువంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొని ఈసారైనా బయటపడకపోతామా అన్న నమ్మకంతో జూదంగా మారిన సేద్యాన్ని వ్యసనంగా చేస్తాండే రైతులకు ప్రభుత్వం తప్పనిసరిగా ప్రత్యేక విధివిధానాలను రూపొందించి, సరిగ్గా అమలుపరిచి వారికి తగిన దన్నును, ధైర్యాన్ని అందించి, రైతు శ్రేయస్సుకు తన సహకారాన్ని అందించాల్సిన ఆవశ్యకత, ప్రభు త్వాలపైన ఉంది.

ప్రకృతి తన సహజ ధర్మాలను కోల్పోవడానికి పరోక్ష కారణం మనిషే. ఆధునికోత్తర నాగరికతలో భాగంగా తన సుఖం కోసం, స్వార్థం కోసం విపరీత పోకడలను అనుసరిస్తూ వాతావరణాన్ని కలుషితం చేస్తూ పర్యావరణానికి నష్టం కలిగి స్తున్నాడు. దీంతో ప్రకృతి తన సహజ ధర్మాలను కోల్పోయి సకాలంలో వర్షాలు పడకపోవడం, ఒకవేళ పడినా అతివృష్టితో నష్టం కలిగించడం మనం చూస్తున్నాం. ఈ విధానం మనలో మారాలి. గురజాడ "ప్రేమనిచ్చినా ప్రేమ వచ్చును ప్రేమ నిల్పినా ప్రేమ నిల్చును" అన్నారు. మనం ప్రకృతి పట్ల ఎలా ప్రవర్తిస్తే ప్రకృతి మనకు అటువంటి ఫలితాలను అందిస్తుంది. కనుక రైతు సంక్షేమాన్ని, భావితర శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని మానవుని జీవన విధానంలో, ప్రవర్తనలోను మార్పు రావాల్సిన ఆవశ్యకతను బాధ్యతగల పౌరులందరూ గుర్తిం చాలి.

అభివృద్ధి చెందిన దేశాలలోని ప్రభుత్వాలు రైతుల పట్ల అనుసరిస్తున్న ప్రోత్సాహకాలు, మన ప్రభుత్వాలు అనుసరించక పోవడానికి కారణమేమిటి? అని మేధావులు ఆలోచించాలి. ప్రభుత్వాలకు రైతు వల్ల కలిగే ప్రయోజనం ఏమీ లేదా? ప్రభుత్వ యంత్రాలలో రైతుల పాత్ర లేదా? దేశ ఆర్థిక విధా నానికి, అభివృద్ధికి రైతు ప్రాధాన్యమేమిటనే సత్యాన్ని ప్రభు త్వాలు గుర్తించలేకపోవడానికి కారణం ఏమిటి? వీరు విప్లవం, తిరుగుబాటు చేసి ప్రభుత్వాలను కూలగొట్టే స్వార్థ జీవులుకారని నమ్మకమా? మొత్తంగా ప్రభుత్వాలు రైతుల పట్ల అనుసరిస్తున్న విధివిధానాలలో మార్పులు రావల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అర్థం చేసుకోవచ్చు.

ఈ నవల ఆధారంగా మనల్ని ఆలోచింపజేసే మరొక విషయం మానవ సంబంధాలు. ఇవి ఒకప్పుడు రక్త సంబం ధాలపైన, కుటుంబ సంబంధాలతో ముడిపడి ఉండేవి. ఇవి ఇప్పుడు పూర్తిగా ఆర్థిక సంబంధాల పైన ఆధారపడి ఉన్నా యని పుట్టింటివారి ప్రవర్తన ద్వారా స్పష్టమవుతుంది. భర్త చనిపోయిన తర్వాత పుట్టింటివారు తమ ఇంటికి తీసుకువెళ్ళి కీడు బట్టలు పెట్టి పంపాలి. ఇక్కడ భర్త చనిపోయి మూడు నెలలవుతున్నా పుట్టింటికి పిలవలేదు. కనీసం డబ్బు సాయ మన్నా మాటమాత్రంగానైనా ఇదో అనలేదు. నిజానికి ఇలా ప్రవర్తించడానికి కారణం డబ్బు లేక కాదు. బీదరికం వల్ల అంతకంటే కాదు ఒకవేళ రమ్మని పిలిస్తే తమకు ఏ ప్రమాదం సంభవిస్తుందోననే సంశయం, ఎక్కడ డబ్బులు సాయం చేయవల్సి వస్తుందో, ఎక్కడ తన కూతుర్ని మేనల్లుడికి ఇవ్వాల్సి వస్తుందో, ఎక్కడ తన సంబంధాలు బలపడతా యోనని భావించి ఏ మాత్రం వారిని దరిచేరనీయలేదు. దీని వలన మానవ సంబంధాలు సైతం ఆర్థికస్థితిగతులపైనే ఆధారపడి ఉన్నాయనే విషయం స్పష్టమవుతుంది.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

వంశీ - మా పసలపూడి కథల్లో - వంటలు

- ఎన్. నీరజ
తెలుగు అధ్యాపకురాలు, ఏ.వి. కళాశాల, హైదరాబాద్.

మనిషి తిండి చాలా ముఖ్యమైంది. అందుకే "తిండి కలిగితే కండకలదోయ్ కండకలవాడే మనిషోయ్" అన్నాడు మహకవి గురజాడ. కూటి కోసం కోటివిద్యలు అనేది మనం తరచు వింటునే ఉంటాం. తెలుగువారు భోజనప్రియులు. తెలుగు వారి వంటకాలను ఎందరో ప్రాచీనకవులు కూడా వర్ణించడం జరిగింది. శ్రీనాధుడు తన కాశీఖండంలో 60 రకాల వంటకాలను వంటకాలను వర్ణించాడు.

మనుష్యులంతా ఒక్కటే అయినా ప్రాంతాన్ని బట్టి వారి ఆహారవిహారాల్లో మార్పు కన్పిస్తుంది. మా పసలపూడి కథల్లో - గోదావరి ప్రాంతవాసుల వంటలు వంటకాల గూర్చి వంశీ చాలా కథల్లో వివరించడం జరిగింది. గోదావరికి దగ్గరున్నందు వల్ల గోదావరి జలాల్లో దొరికే చేపలు, రొయ్యలు, పీతలు, ఎండుచేపలు మొదలగునవి ఆ ప్రాంతవాసుల ఆహారంలో ప్రధాన భాగంగా కన్పిస్తాయి. ఇవే కాకుండా పూతరేకుల నుంచి ఉప్మాపెసరట్టు రొయ్యలగారెలు, రేగుపళ్ళ వడియాలు, కొబ్బరిలౌజు, పొలస పలాస చేప పులుసు మొదలైన ఎన్నో వంటకాలను మనకు రుచి చూపుతారు.

"అచ్యుతానిది అమృతహస్తం" కథలో అచ్యుతం అనే వంటవాడి గురించి వివరిస్తూ అతని వంటలు ఎంతరుచిగా ఉంటాయో అనడానికి అచ్యుతం పచ్చగడ్డితో చేసిన గరిక పచ్చడి తిని ఆ అద్భుతమైన రుచికి అందరు ఆశ్చర్యపోయారు అంటాడు. పెళ్ళి వంటల చేయడానికి అచ్చుతాన్ని తీసుకెళ్ళి అతనిలో సాదా వంటలు చేయించి. పలావు వండడంలో పేరెన్నికగన్న వెంకటపతి రాజుతో చేయించి అచ్యుతాన్ని ఓడించాలనుకుంటారు. ఆ పలావు చేయడానికి వెంకటపతిరాజు ఏ ఏ దినుసులను తీసుకున్నాడో ఇలా వర్ణిస్తాడు వంశీ. "బాదంపప్పు జీడిపలుకులు, మెరుకులు, ఉడకేసిన కోడిగుడ్లూ పెట్టి పెంచే పందెంకోళ్ళని ఓ అరడజను కొనుక్కొచ్చి చాలా శ్రద్ధతో చింత నిప్పుల మీద వండిన పలావు అందరికీ వడ్డించారు". కానీ అందరు పలావు వదిలేసి అచ్యుతం వంటల్ని పిసరంతా కూడ మిగల్చకుండ తింటారు. ఏంటా వంటల మహత్యం అని తను రుచిచూస్తాడు వెంకటపతిరాజు. అచ్యుతం వంటల ముందు తన పలావు ఎందుకు పనికిరాదు అనిపించింది. అంటూ అచ్చుతం వంటల రుచిని వర్ణిస్తాడు వంశీ.

"ప్రేమించింది ఎందుకంటే" అనే కథ చాలా ప్రత్యేకమైంది. ఈ కథలో చాలా పెద్ద సమస్యకు వంశీ వంటల ద్వారా సమాధానం చెప్పడం అనేది పాఠకులను విశేషంగా అలరిస్తుంది. ఈ కథలో పులగం రామారెడ్డిగారు పెద్దమనిషి ధనవంతుడు. తల్లిలేని తన ఏకైక కూతురు ప్రభావతిని ఎంతో గారాబంగా పెంచి పెళ్ళి చేయాలనుకుంటే ఆ అమ్మాయి బిందెలకి మాట్లేసే నాగరాజుని ప్రేమించానని అతను లేకుండా బతకలేనని చెప్తుంది. నాగరాజును చూస్తే మంచి ఒడ్డు పొడుగుతో కళగల ముఖంతో అందంగా ఉంటాడు. దీంతో రామారెడ్డి బాగా ఆలోచించి కూతురు మనసు నొప్పించకుండా ఈ సమస్య పరిష్కరించాలనుకుంటాడు. ఇద్దరిని పిలిపించి ఆరునెలల పాటు ఒకరునొకరు చూసుకోకూడదని ఈ ఆరు నెలలు నాగరాజు తన పొలంలో ఉన్న గదిలో ఉండాలని అతని అవసరాలు తనే చూస్తానని చెప్తాడు. పలావు చేయడంలో దిట్ట అయిన రాయవరం కుంటోడ్ని, కూరగాయలతో వంటలు చేయడంలో మేటి అయిన ద్రాక్షారం సత్యనారాయణ్ణీ, మిఠాయి చేయడంలో ఫెమస్ అయిన వ్యక్తిని పెట్టి ఈ ఆరు నెలలు నాగరాజు ఏది అడిగితే అది చేసి పెట్టాలంటాడు. కిళ్ళి కొట్టు గుడ్డి పట్టాభిని పిలిచి చుట్ట బీడి, సిగరెట్టూ ఏవడిగితే అది ఇవ్వాలి అంటాడు. అదే విధంగా వూళ్ళో సారా కుందయ్యనీ కల్లు అమ్మే సూరమ్మనీ బ్రాందీషాపు ఓనరును పిల్చి ఈ ఆరునెలలు నాగరాజు ఎప్పుడు ఏది అడిగితే అది పోయ్యాలి అంటాడు. ఆ ఆరునెలలు ఆ అతిథిగృహంలో నాగరాజుని రారాజుగా చూసుకుంటారు వాళ్ళు. ఆరునెలల తర్వాత కూతురు ప్రభావతిని వెళ్ళి నాగరాజుని చూసిరమ్మంటాడు.

"నేతితో చేసిన జీడిపప్పు పాకాలూ, పాలకోవా బిళ్ళలూ, బాదం హల్వాలూ తెగమెక్కడం వల్ల రాయవరం కుంటోడి మేక పలావులూ, కోడి ఇగురూ లాగించేయ్యడం వల్ల ద్రాక్షారాం సత్యాన్నారాయణ చేసే కైమా ఉండలూ, రెయ్యల వేపుళ్ళు, కిళేల పులుసులూ, బోచ్చుచేపని చక్రాలా కోసి ఉప్పుకారం నిమ్మరసం అద్ది అందించే వేపుళ్ళు ఆవురావురు మంటు లాగించెయ్యడం వల్ల రాజమండ్రి సుందరంగారి నేతి తాళింపుల్తో పప్పు పులుసులు భోంచేయ్యడం వల్ల ఇంకో పక్కనించి కల్లూ, సారా, బ్రాందీ ఏదీ సహిస్తే దాని గటగటా లాగయ్యడం వల్ల అందమైన నాగరాజు పెద్దపొట్టతో అసహ్యంగా తయారవుతాడు. అతన్ని చూసిన ప్రభావతి నేనిష్టపడింది. ఈ రుపాన్ని కాదే అసలు ఈడ్ని కాదు అని ఆ విషయమే తండ్రితో చెప్పింది. ఆరనిపొయ్యి కథలో వెంపర్తమ్మ ఉదయం నుంచి రాత్రి పడుకునేదాకా ఇంటికి ఎవ్వరు వచ్చిన వండిపెడుతూ డొక్క సీతమ్మను గుర్తుకు తెస్తుంది. అందుకే

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

ఆమె మరణించిన తర్వాత ఆమె జ్ఞాపకార్థం ఆ ఇంట్లో ఎప్పుడు వంటలు వడ్డనలు జరుగుతూనే ఉండాలని ఆ పొయ్యి ఎప్పటికి వెలుగుతూనే ఉంది అంటూ ముగిస్తాడు వంశీ.

"భద్రాచలం యాత్ర - వాల్లక్క కథ" అనే కథలో లాంచీలో వంటవాడైన బోసును అతను చేసే వంటలను వాటి రుచులను వర్ణిస్తాడు వంశీ. అమెరికాలో నుంచి వచ్చిన తెలుగువాళ్ళు లాంచీలో రాజమండ్రి నుంచి భద్రాచలం వెళ్తం టారు. ఆ లాంచీలో వంటవాడు బోసు. ఉదయం పెసరట్టూ ఉప్మా అల్లంపచ్చడీతో మొదలు పెట్టి మధ్యాహ్నం, వాళ్ళు కోరుకున్న చేపల ఇగురు, చేపల పులుసును, రొయ్యల వేపుడు, కోడి వేపుడు కైమాకూరతో వడ్డిస్తాడు. మధ్యలో మషాళా టీ ఇస్తాడు. రెండోరోజు ఉదయం వేడి వేడి ఇడ్లీలు అప్పుడే కాచిన నేతిలో ముంచి ఒక్కొక్కళ్ళ పళ్ళెంలో వేస్తా కొబ్బరికాయ పునాసి మామిడికాయ పచ్చడి, కారప్పొడి వేసేడు బోసు" మధ్యాహ్నం అరటాకు లేసి అన్నంతో పాటు "బొమ్మిడాయిల ఇగురు (ఉడికేటప్పుడు మధ్యలో పగల్నియి) పరజలు అనే పిట్టల వేపుడు పుల్లటి చారు" తో ముగిస్తాడు "ఆ రాత్రి ఆవ పెట్టిన పనసపొట్టు కూర, ఆగాకరయకూర, పప్పు పులుసూ" వడ్డిస్తాడు. మర్నాడు "పుల్లట్లు కొంచెం చింతపండు కలిపిన శనగపిండి పచ్చడితో రెడిగా ఉన్నాడు బోసు". ఈ విధంగా ఆ టూరులో ఉదయం నుంచి రాత్రి దాకా అన్నిరోజులు బోసు వండిన వంటలు అద్భుతమైన రుచులతో ఆ పర్యాటకు లకు కలకాలం గుర్తుంటాయి.

గొల్లభామ రేవు కథలో పేద దంపతులు పడాల ఎంకన్న గొల్లభామ. పగలంతా పనిచేసి అలిసిపోయి రాత్రి "నూకల అన్నం వండుకుని పుల్లటి చారు కాసుకొని కాలువలో గేలానికి దొరికిన చిన్న చిన్న జెల్లలు, ఎండిన బోదికాల్వల్లో దొరికిన బొమ్మిడాయిలు దోరగా వేపి ఉప్పుకారం చల్లుకొని తింటున్నారు అని చెబుతాడు వంశీ.

గోదావరి ప్రాంత ప్రజలకు చేపలు ప్రధాన ఆహారం. పండుగొప్ప, జెల్లా, బొమ్మిడాయిలు, ఎండుచేపలు, రొయ్య లను చాలా కథల్లో వర్ణించాడు వంశీ. చేపల్లో ప్రత్యేకమైనది. సీజన్లో మాత్రమే దొరికే చేప పులస చేప. ఆచేప రుచి ఆమోఘం. ఆ పులస చేప పులుసును గురించి వివరించే కథే "చిట్టెమ్మ కాసే చేపల పులుసు" కథలో చిట్టెమ్మ నారాయణుడు భార్యా భర్తలు. ఇటుకలు చేసే పని వీరిది. పొలస సీజన్లో మాత్రం చిట్టెమ్మ అడిగినోళ్ళందరికి పులస చేపల పులుసు కాసి ఇచ్చేది. చిట్టెమ్మ చేసే చేపల పులుసు చాల ఫేమస్. చిట్టెమ్మ చేపల పులుసులో ఏ దినుసులు వేసేదో ఈవిధంగా వర్ణిస్తాడు వంశీ. శుభ్రం చేసిన చేప ముక్కలను కోసి పక్కన పెట్టుకొని "ఉల్లిపాయ ముక్కలు, వెల్లుల్లి పాయరేకలు, అల్లం, జీలకర్ర, ధనియాలు కలిపి ముద్దకింద నూరి సీవండి గిన్నెలో వేసింది. గుప్పెడు పొడుగాటి మిరప్పళ్లని తీసుకొచ్చి రోట్లోవేసి ముతగ్గా దంచి ఇంకో గిన్నెలో వేసేక చాలా వెడల్పాటి మట్టిదాక తీసుకొని మండుతున్న చింతపులల్ల పొయ్యి మీద పెట్టి దాంట్లో నువ్వుల నూనే వేసి నూనే కాగాక ముద్ధలన్నీ వేసి కలిపి దోరగా వేయించి లేత కొబ్బరి నీళ్ళలో నానేసిన పాత చింతపండు పులుసు పోసి టమాట పళ్ళు పిసికి చిటికెన వేలు సైజులో లేత బెండ కాయ ముక్కలేసి ఆ తర్వాత చేపముక్కలేసి మూతపెట్టింది. దించేముందు వెన్నపూస ముద్ద, ఆవకాయ తేట కలిపేసి తెల్లారాక తీస్తే దాని రుచేవేరు. అలాంటి అద్భుతమైన పులుసు కోసం అరుచికోసం. సంవత్సరమంతా ఆ సీజన్ కోసం ఎదురు చూస్తూంటారట. గొడవలతో ఊరు ఒదిలిపోయిన చిట్టమ్మ ఆమె కాసే ఆ చేపల పులుసుకోసం అంతా కలిసి చిట్టెమ్మను ఊళ్ళోకి తెచ్చి. ఆ వాసన మా ఊరికే పరిమితం అవ్వాలని నిర్ణయించుకున్నారు. ఈ విధంగా పులస చేపల పులుసును అది తయారు చేసే విధానాన్ని చాల చక్కగా వర్ణించాడు రచయిత.

రోజు వండుకుని తినే వంటలతో పోల్చుకుంటే పండుగ వంటలు ప్రత్యేకమైనవి 'పొలిమేర దాటెళ్ళిపోయింది' కథలో సంక్రాంతి పండుగకు ఇంటికొచ్చిన అల్లుడికి అత్త వడ్డిస్తున్న పిండి వంటలు ఈ విధంగా వర్ణించాడు వంశీ. "గోర్మిటీలూ, బెల్లం పూతరేకులూ, పాల పూరీలు, పాకుం డలూ, రకరకాల పిండివంటలు దబ్బకాయ పులిహోర, ఆవ పెట్టిన అరటిపూవ్వుకూర, పనసపొట్టుకూర, కందిపచ్చడి" అదే విధంగా దారిలో వెళ్తున్న ఆడపిల్లలు "కొత్తబెల్లంతో చేసిన పరమాన్నం బూర్లూ ఇత్తడి గిన్నెల్లో పెట్టుకొని వాటిమీద అరి టాకు ముక్కలు కప్పుకుని వయ్యారంగా నడుచుకుంటూ వెళ్త న్నారు" అంటు వీధుల్లో పండగ సందడిని వివరించాడు రచ యిత.

వంశీ మా పసలపూడి కథల్లో ఎక్కువగా గ్రామాల్లో జరిగె సంతలను గురించి వర్ణించాడు. సంతలు వాటిలో రకరకాల దుకాణాలు పెట్టెవాళ్ళ గురించి. ప్రస్థావించాడు.

'దేవాంగుల మణి' కథలో మణి చేనేత కుటుంబంలో పుట్టింది. పుట్టింట్లో వాళ్ళు నేతపని చేయకుండా సంతల్లో తినుబండారాల దుకాణం పెట్టి సంపాదించి లాభాలు సాధించే వారు. అత్తారింటికొచ్చిన మణి అందరిని ఒప్పించి. మొదటిసారి సంతలో నులకమంచం వేసి. తినుబండారాల దుకాణం పెట్టింది. ఆమె దగ్గం ఏఏ పదార్థాలు సంతలో ఉంచిందో చెప్తూ "పెసర పొణుకులూ, మసాలాగారెలూ, నువ్వుపప్పు జీళ్ళు, సీనా ఉండలూ, మడత కాజాలు, గవ్వలు, చిలకలూ, పాలకాయాలూ" ఇలా రకరకాల వంటలను వర్ణిస్తాడు వంశీ.

ఏదైనా కొత్త వస్తువు కొన్నప్పుడు, ఏదైనా శుభకార్యానికి ముందు మొక్కుతీర్చడానికో, గ్రామదేవతకు నైవేద్యం పెట్టడం

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

అనేది ఊళ్ళలో సాధారణంగా కన్పిస్తుంది. ఈ గ్రామదేవతల గురించి చాలా కథల్లో ప్రస్తావించాడు వంశీ. బ్రహ్మణరెడ్డి గారి తమ్ముడు సుబ్బారెడ్డిగారు కథలో సత్యానందం కొత్త ట్రాక్టరు దాని వెనకాల తొట్టె కొన్నందుకు తలుపులమ్మ తల్లికి మేక పోతుని బలేసి వచ్చిన వంటమనిషితో మేక మాంసంతో పలావు వండించి ఇగురు వేపుడూ చేసి దుమ్ములతో చారుచేసి అంద రికి పెట్టాడు అని చెప్తాడు.

ఇక హోటల్లు అనేక రకాల హోటల్లు వాటిలో తయారు చేసే టీలు, కాఫీలు, టిఫిన్లు, భోజనాలు. పలావుల గురించి చాలా కథల్లో వివరించడం కన్పిస్తుంది. 'మలభార్ కాఫీ హోటలు' కథలో 'ఆదివారం పూట లేత వేటమాంసం తెప్పించి వేట పలావూ పెరుగు పచ్చడీ' చేసి ఫుల్ ప్లేటూ, సగం ప్లేటూ అని పొట్లాలు. అమ్మె కిళ్ళీరన్న పాలావు చాలా రుచిగా ఉంటుందని చెప్తాడు.

అసలు కథ కథలో మాధవరావు మీసాల రాజువి హోటల్ గురించి ఇలా చెప్తాడు. "మీసాల రాజు చిన్నపాక వేసుకుని హోటల్ పెట్టాడు. కొండోళ్ళతో అడవికోళ్ళని, గొర్రెల్నీ కొట్టిచంపి వంటలు చేసిపెట్టేవాడు. మాకు ఆ మాంసం కూరల రుచి మామూలు రుచిగాదు మా గొప్పరుచిలే" అంటాడు.

ఎర్రనూకరాజు గారి జంక్షన్ కథలో ఎర్రనూకరాజు అడవిలో పాక హోటల్ పెట్టి రుచికరంగా వంటలు చేసేది అక్కడ కొంత కాలానికి ఆమె పేరుతో ఎర్రనూకరాజుగారి జంక్షన్ అనే ఊరు ఏర్పడిందని చెప్తాడు.

ఇక హోటల్ రాజుకథ కథలో రాజు గురించి వివరిస్తూ "కోడిగుడ్డు కలిపి పెసరట్టెయ్యడంలో ఫేమస్సయిన అతన్ని కోడిగుడ్డు పెసరట్టురాజు, అనీ హోటల్‌రాజు అనీ పిలుస్తారని చెప్పాడు. అలాగే ఉల్లిపాయా అల్లం ముక్కలతో అదిరిపోయే నేతిపెసరట్లు వేసే అబ్బు హోటలు ఎక్కువ మీగడేసి స్ట్రాంగ్ టీలు చేసే గోపాల్‌రావు హోటల్ అలాగే కాకినాడలో పలావుకు ప్రసిద్ది అయిన అలంకార్ హోటల్, ఇవే కాకుండా అనేక మిఠాయి సెంటర్‌ల గురించి చాలా కథల్లో ప్రస్థావించాడు వంశీ.

'నల్లమిల్లి సుబ్బారెడ్డి కథ'లో వెంకటలక్ష్మీ "కొరికితే చాతీమీద రసం కారే తాపేశ్వరం మడతకాజాలు, రాంపురం రాజుగారి మిఠాయికిళ్ళీలూ" పట్టుకొని రిక్షాదిగింది అంటాడు.

'గాలిమేడ' కథలో అనంతలక్ష్మి కాకినాడెళ్ళి జిలాని కట్టించిన కిళ్ళీవేసుకొని సత్యం మిఠాయికొట్లో వీసడు కరకజ్జం కొనుక్కొని వచ్చిందంటాడు.

'సినిమా సూటింగోళ్లొచ్చారు' కథలో రవణ పెళ్ళి వాళ్ళకు పంపడానికి తాపేశ్వరం మడతకాజాలు, కాకినాడ కోటయ్య గొట్టంకాజాలు, పోకుండలూ, పాలకాయలు, తొక్కుడు లడ్డూలు' పురమాయించిదని చెప్పాడు.

ఇవే కాకుండా కిళ్ళీకొట్లు షోడాకొట్లు గురించి వివరిం చాడు వంశీ. 'మా పసలపూడి కథలు' పుస్తకంలో ప్రతి కథలో సాధారణంగా వంటల ప్రస్థావన కన్పిస్తుంది. కానీ, వర్ణనల్లో కూడా వంటకాలను వదలలేదు వంశీ.

'వాళ్లబంధం' కథలో కామేశం ఆదిలక్ష్మి దంపతులు, పిల్లలు అమెరికాలో ఉంటారు. అమెరికా నుంచి ఒక వ్యక్తి రాగానే "రొట్టెముక్కలో డబ్బాడు తేనెపాకం పోసినంత సంబరపడి పోయారిద్దరూ" అంటూ వాళ్ళ సంతోషాన్ని వర్ణిస్తాడు.

'దారుణంకదా' కథలో లాంచీ ఎక్కిన పుష్ప 'లేత తాటి ముంజ నములుతున్నట్లు ముకం పెట్టి టికెట్టు కొండమొదలు రేవుకండి అని సుతిమెత్తగా అడిగిందని చెప్తాడు. 'అమ్మాజీ జాతకం' కథలో అమ్మాజీ కోపం గురించి చెప్తు 'పేణంలో కుతకుతా ఉడికే బెల్లంలాగ అయిపోయింది' అంటాడు. 'మున్సబుగారు - గుర్రబండి' కథలో మున్సబు 'కొత్తబెల్లం ముక్క బుగ్గనెట్టుకున్నట్టు తియ్యతియ్యగా మాట్లాడుతాడు అంటాడు.

'మండసోమిరెడ్డి సమాధి' కథలో జబ్బు చేసిన రాజ్య లక్ష్మీ గురించి చెప్తు పెద్దాపురం సంతలో అమ్మేతట్టం చేపలాగ తయారైన రాజ్యలక్ష్మీ మంచానికి అంటుకుపోయింది. అని ఆమె పరిస్థితిని వివరిస్తాడు.

'చంటినాన్నగారి కళ్ళు మనకెలాగొస్తాయి' కథలో మల్లి కాసులు మరణంతో షాకయిన చంటినాన్న రెండు ఐసుగెడ్డల మధ్య చేపలాగ బిగుసుకు పోయాడని చెప్పాడు. ఈవిధంగా పసలపూడి కథలు, దిగువగోదావరి ప్రాంత ప్రజల ఆహార వివరాలను వంటలు, వంటకాలను సవివరంగా మనకు వివరి స్తాయి.

ఆధార గ్రంథాలు :

మా పసలపూడి కథలు - వంశీ 280-281
మా పసలపూడి కథలు - వంశీ 422
మా పసలపూడి కథలు - వంశీ 168
మా పసలపూడి కథలు - వంశీ 128-129

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

తెలంగాణ వచన కవిత్వంలో జీవన చిత్రణ

- డా॥ చవ్వా వెంకటరెడ్డి
ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

తెలంగాణ కవిత్వం ప్రాచీనకాలం నుండి తనదైన ప్రత్యేకతను చాటుకున్నది. సామాజికంగా చూసినప్పుడు దీనిలో ప్రజలను కలుపుకొనిపోయే లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి. స్వాతంత్ర్యానంతరం ఈ ప్రాంతంలో వచ్చిన అనేక సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమాలలో ప్రాధాన్యత వహించిన అనేక సాహిత్య ప్రక్రియా పార్శ్వాలలో వచన కవిత ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. అయితే పద్య కవిత్వం కూడా ఎవరికీ తీసిపోని విధంగా తనదైన బాణిలో వాణిని వినిపించింది. నాటి పోతన నుండి నేటి యువకవుల వరకు పద్య ప్రక్రియను బాగా బతికిస్తున్నవారే. అయితే ప్రాధాన్యతను అనుసరించి దేశకాలమాన పరిస్థితుల దృష్ట్యా సమాజంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా ఎక్కువగా నేడు వినిపిస్తున్నది వచన కవిత్వం.

దీనిని విద్యుత్ కవిత అని దాశరథి అభివర్ణించారు. అయితే కొన్ని ప్రత్యేక కారణాల దృష్ట్యా పద్య కవిత్వాన్ని నిరసించడం కొంతమేరకు జరిగినా వచన కవిత్వం ఆ స్థానంలో వేగవంతంగా అడుగులు వేసి ఎంతమంది చేతనో కలాన్ని పట్టించింది. ఈ సందర్భంలో దాశరథి, కాళోజి వంటి కవులు వచన కవిత్వ వికాసాన్ని ప్రోత్సహించారు. ప్రధానంగా వచన కవిత్వ ఆరంభదశలో వచన కవిత్వాన్ని రాసి ప్రసిద్ధులైనవారు ఎందరో మనకు కనిపిస్తారు. ఆయన అంతకు పూర్వం పద్య రచన చేసినవారైనా ఆయన కేవలం వచన కవిత్వం మీదనే తమ ప్రతిభను కనబరచి లబ్ధప్రతిష్ఠులైన ఘనత మనకు తెలంగాణలో కనిపిస్తుంది.

తెలంగాణలో వచన కవిత్వాన్ని సుసంపన్నం చేసిన వారిలో కాళోజి, దాశరథి, సినారె, సంపత్కుమారాచార్య, పేర్వారం జగన్నాథం, సుప్రసన్న వంటి కవులు ముందువరసలో ఉంటారు. వీరిలో సుప్రసన్న వచనంలో దీర్ఘ కావ్యం రాశారు. ఈ కవులు ప్రధానంగా వచన కవిత్వంతోపాటు ఇతర ప్రక్రియల్లో రాణించినప్పటికీ ప్రధానంగా వచన కవిత్వం ద్వారా వారు మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నారు. "తెలంగాణలో కవులు ఎప్పుడూ రూపాన్వేషణ కోసం తపించినట్లు కనపడదు" అని ఆచార్య బన్న అయిలయ్య తెలియజేసిన అంచనా సరియైనది.

ఇతర ప్రాంతాలతో పోల్చి చూసినప్పుడు తెలంగాణలో వచన కవితా ప్రక్రియ కొంత ఆలస్యంగా వెలుగు చూసింది. అంతేకాకుండా దాని అభివృద్ధి మాత్రం చాలా వేగంగా జరిగింది. వచన కవిత్వంలో ఛందస్సు లేకపోవడాన్ని తొలినాళ్ళలో కొంతమంది జీర్ణించుకోలేకపోయారు. ఏదో ఒక నియమాన్ని అంటిపెట్టుకొని ఛందోపరంగా వచన కవితను కనీసం మాత్రాచ్ఛందస్సులోనైనా రాయాలనే ప్రయత్నాన్ని తొలితరం కవులు చేసారు. అయితే తెలంగాణ ప్రాంతం సాంస్కృతిక ప్రభావం ఆధునిక కవుల విషయంలో ఛందస్సు విషయంలో కొంత వెసులుబాటును కల్పించింది. రచనలో కవిత్వం ప్రాధాన్యత వహించినట్లయితే ఛందస్సు లేకపోయినా ఆ కవిత్వం ప్రజల్లోకి వెడుతుందనే విషయాన్ని ఈ ప్రాంతం కవులు అవగతం చేసుకున్నారు. స్వాతంత్ర్యానంతరం తెలంగాణలో వచన కవితకు అత్యంత ప్రాధాన్యతనిచ్చినవాడు వచన కవితా పితామహుడు కుందుర్తి. దీని ప్రభావంతో ఆనాడు సి.నారాయణరెడ్డి నుంచి నేటి యువతరం కవులదాకా ఎన్నో వచన కావ్యాలు వెలుగు చూసాయి. మాదిరాజు రంగారావు, బాపురెడ్డి, సుప్రసన్న మొదలైనవారు వచన కవిత్వంలో మానవతను, తాత్త్వికతను తెలియజేసి వచన కవితా వికాసానికి సేవలందించారు. బోయ జంగయ్య మినీ కవిత్వాన్ని అల్పాక్షరంలో అనంతార్థంలా విస్తృతం చేసారు. దీనిలో కూడా వచనం ప్రాధాన్యతను సంతరించుకోవడం విశేషం. తెలంగాణలో చేతనావర్తన కవులుగా ప్రఖ్యాతులైనవారు వచన కవిత్వంలో గాఢతను వైవిధ్యంతో తెలియజేసారు. 70 దశకంలో తెలంగాణలో వచన కవిత్వం కొంత చీలికలకులోనై విస్తరించింది. కవితా వస్తువులుగా సామాజికాంశాలు, సమకాలీన సమాజంలో అసమానతలు, పేదరికం, బతుకుపోరాటం మొదలైన అంశాలు ప్రాధాన్యత వహించి ఉద్యమ నేపథ్యంగా వచన కవిత్వం ప్రజల్లోకి చొచ్చుకుపోయింది.

వచన కవిత్వానికి లక్షణాలను ప్రతిపాదించినవారు ఆచార్య సి.నారాయణ రెడ్డిగారు. నియమాలు లేకుండా శుద్ధ వచనాన్ని లయాత్మకం చేస్తే అది వచన గేయం అవుతుందని, వచనానికి, వచన గేయానికి మధ్య వ్యత్యాసముందని ఆయన తెలియజేసారు. వచన గేయంలో భావోద్వేగం కలిగించే అంతర్లయ ఉంటుందని, అదే వచనంలో విషయ ప్రకటనే ప్రాధాన్యతను సంతరించుకుంటుందని సినారె తెలియజేసారు. వచన గేయంలో అంత్యప్రాసలకు ప్రాధాన్యత ఉంటుందని కూడా ఆయన తెలియజేసారు. తెలంగాణలో వచన కవిత్వం తొలినాళ్ళలో అభ్యుదయ దృక్పథాన్ని ప్రకటించింది. సంప్రదాయాలు, ఆచారాలు- ఇవన్నీ మానవసంఘంపై విపరీతమైన

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భారాన్ని పెడుతున్నాయని, దానివల్ల మానవ సమాజం అయోమయానికి గురవుతుంది అని, వాటి నుండి పూర్తిగా బయటపడనక్కరలేదని, తాహతుకు తగిన విధంగా దేశ కాల మాన పరిస్థితులకు అనుగుణంగా విధానాలను ఏర్పాటు చేసుకొని అనుసరించడం అనేది అందరికీ శ్రేయస్సు కలిగించాలని సినారె వచన కవిత్వం ద్వారా ఉద్బోధించారు.

దాశరథి వచన కవిత్వాన్ని నాటి తెలంగాణలోని సామాజిక పరిస్థితులకు అనుగుణంగా తెలియజేస్తూ, ప్రతి వ్యక్తి ఒక శక్తిగా తమ ప్రతిభను చూపించి సమాజానికి మేలు చేయాలనే సందేశమిస్తూ- "నిద్రపుచ్చే వీణ నాకెందుకు? నిద్ర మేలు కొల్పే వేది కావాలి. అందుకే నా భావం రుద్రవీణ" అని స్పష్టంగా తమ అభిప్రాయాన్ని వచనంలో తెలియజేసారు. అంతేకాకుండా "ఎవరు వద్దన్నా, కాదన్నా రానున్నది ఏది నిజం? అది ఒకటే సోషలిజం...." అని సామాన్యుడు తనదైన ఆర్థిక ఆత్మగౌరవాలతో బతికే కాలం రావాలని, గొప్ప, బీద తారతమ్యాలు తొలగి పోవాలని కాంక్షించాడు దాశరథి. సమాజంలో అంతటా అభ్యుదయం నెలకొల్పాలన్న తన వాంఛకు ప్రతినిధిగా 'అగ్నిధార' కావ్యాన్ని వచన కావ్యంగా మలిచాడు.

కాళోజీ విషయానికి వస్తే తిండి ఉన్నవాడు, లేనివాడు ఇద్దరూ అవస్థకు గురవుతారని తెలియజేస్తూ తన వచన కవిత్వంలో ఈవిధంగా అంటారు-

"ఒకడు కుతికలదాకా
మెక్కెటోడు
మరొకడు మింగ మెతుకు
లేనోడు
ఇద్దరికీ గొంతు పెకలదు
ఇద్దరికీ ఊపిరాడదు
ఇద్దరి అవస్థకు
ఒకే కారణం
తినలేక".

పై భావజాలంలో కాళోజీ ఉన్నవాడికీ లేనివాడికీ మధ్య అసమానతను హృదయం ద్రవించేలా తెలియజేసారు. ఈ కవిత వారు 1974లో రచించారు. అయితే ఇదే విధానాలకు జీవం పోస్తూ డా॥ సి.నారాయణరెడ్డిగారు ఒక చలనచిత్ర గీతంలో ఈ విధంగా తెలియజేసారు-

"ఉన్నవాడికీ తింటే అరగదు
లేనివాడికి తిండే దొరకదు
పరుపులున్నా పట్టదు నిదుర
కటిక నేలపై గురకలు వినర
హెచ్చుతగ్గులు తొలగే రోజు
ఎపుడొస్తుందో ఏమో"

పై భావనలో నారాయణరెడ్డిగారు వచన గేయంలో తిండికి లేని అభాగ్యుల జీవితాన్ని దైన్యంగా చిత్రణ చేసారు. చివరలో వారి ఆకాంక్షను తెలియజేస్తూ హెచ్చుతగ్గులు తొలిగే రోజు రావాలని, అది ఎపుడొస్తుందో ఏమోననే ఒక సందిగ్ధతను కూడా ప్రదర్శించి భావాలకు వైవిధ్యాన్ని అందించడమే కాకుండా సామాన్యుడు అసామాన్యుడుగా ఎదగాలనే సందేశాన్ని కూడా పై భావంలో ప్రతిపాదించారని అనిపిస్తుంది. ఈ విధంగా పరిశీలించినపుడు పై ఇద్దరి భావజాలంలో అభ్యుదయం, మానవతాధోరణులు ప్రాధాన్యతను సంతరించుకున్నాయనే విషయం మనకు బోధపడుతుంది.

తెలంగాణ తొలితరం వచన కవుల్లో 60వ దశకంలో అభ్యుదయ కవిత్వాన్ని వచన కవిత్వం ద్వారా వ్యాప్తం చేసిన వాడు సి.వి.కృష్ణారావు. అంతేకాకుండా వీరు తెలంగాణ వచన కవుల్లో సుప్రసిద్ధులయ్యారు. వీరి 'వైతరణి' కావ్యం దళిత వర్గీయుల వేదనలను, రోదనలను అభ్యుదయ దృక్పథంతో తెలియజేసింది. వీరి అభ్యుదయ దృక్పథానికి పరాకాష్టగా మురికిపేటలను వస్తువుగా స్వీకరించి రాసిన ఈ కింది భావజాలం ఇలా ఉంది-

"ఒక్కొక్క నగరం దేహం మీద
మానని రాచపుండు
బురదలో పురుగులు మసలినట్లు"
"ఆటవిక ప్రవృత్తికి చీరగట్టి
చెట్ల జులపాలు కత్తిరించి
భూమి మీద బుల్‌డోజర్ పరుగెత్తించి
నలుమూలల ఎల్లలు నాటించి
రాజ్యం స్థాపించిన అధికార కేంద్రీకరణలో
కొందరు నిరధికారులై
జులపాలు లేని జుల్లు బిర్రజుట్లై
బుల్‌డోజర్ నడవని చోట్ల మురికి పేటలై..."

పై వచన కవిత్వంలో సి.వి.కృష్ణారావుగారు అనేక ఉపమాన ప్రయోగాలను, అర్థవంతమైన పద సముదాయంతో సమ్మిశ్రణం చేసి మురికిపేటల లోని ప్రజల జీవనం ఎంత దుర్భరంగా ఉందో కళ్ళకు కట్టినట్లు తెలియజేశారు. 'బుల్‌డోజర్ నడవని చోట్ల మురికిపేటలై' అన్న భావన భయం గుప్పిట్లో బతుకుతున్న పీడిత జనానికి సంకేతార్థంలో మురికిపేటలను వర్ణనాత్మకం చేసినట్లు కనిపిస్తుంది.

ఈ ప్రాంతంలోనే మరొక అభ్యుదయ కవిగా ప్రసిద్ధులైన సర్వదేవభట్ల నరసింహమూర్తి వచన కవిత్వంలో పరిపూర్ణతను సాధించారు. వీరి 'మానవ సంగీతం', 'మహైక' అనే వచన కావ్యాలు వీరిలోని అభ్యుదయ దృక్పథాన్ని తేటతెల్లం చేస్తాయి. ఇందుకు ఈ కింది ఉదాహరణ వీరి 'మానవ గీతం'లో మానవతావాదాన్ని దర్శింప చేస్తుంది.

"విద్యుద్దీపంలోని
విద్యుత్తులాగా వెలుగొందు
పరాధీన భావంతో
బ్రతుకకు...."

పై భావనలో వ్యక్తి స్వయంకృషితో ఎదగాలని, ఆత్మ స్థైర్యంతో తనకు తానేమిటో నిరూపించుకోవాలనే దృక్పథాన్ని తెలియజేసారు. ఇదే రీతిలో డా॥ సి.నారాయణరెడ్డి గారు ఒక చలనచిత్ర గీతంలో-

"కండబలమే నీ ఆయుధం
గుండబలమే నీ ధనం
ఎవరికీ తలవంచకు
ఎవరినీ ఆశించకు
చాలీచాలని పేద బ్రతుకుల
మినుమేడలు మిద్దెలు కట్టకు
ముడుచుకుపోయిన ఆశలతో
మిడి మిడి బతుకులు బ్రతుకకు
చీకటి రాజ్యం ఎంతోకాలం
చలాయించదని మరువకు"

-అని వ్యక్తి తనలోని ఆత్మస్థైర్యాన్ని విడిచిపెట్టకుండా మొక్కవోని ధైర్యంతో కష్టాలను ఎదుర్కోవాలనే పై వచన గేయంలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ గేయంలోనే మరొకచోట-

"జీవితమే ఒక వైకుంఠపాళి
నిజం తెలుసుకో భాయీ
ఎగరేసే నిచ్చెనలే కాదు
పడదోసే పాములు ఉంటాయి"

అన్న జీవన సత్యాన్ని కూడా భావసముచ్చయంలో తెలియజేసి వచన గేయానికి ఉత్తమత్వాన్ని అందించారు.

వచన కవిత్వం గురించి తిలక్ - "చురుకైన ఆవేశాన్ని, సాంద్రతరమైన అనుభూతుల ఒత్తిడిని, సూక్ష్మమైన భావనను తెలియజేయడానికి వచన కవిత్వమే ఆధారం" అని తన అభిప్రాయాన్ని తెలియజేసాడు.

తిలక్ భావజాలాన్ని గమనిస్తే వచన కవిత్వంలో అనుభూతి వాదం, మానవతావాదం, తాత్విక దృక్పథం- అనే అంశాలు చోటు చేసుకున్నట్లు మనకు అవగతమవుతుంది. మరో కోణంలో తెలంగాణలో వచన కవిత్వాన్ని విశ్లేషించుకున్నప్పుడు మానవ సంబంధాలు యాంత్రికతకులోనై దూరమవడం, పల్లెల్లో జనం లేని వాతావరణం చోటు చేసుకోవడమనే విషయాలకు తెలంగాణ కవులు ప్రాధాన్యత ఇచ్చినట్లు మనకు అవగతమవుతుంది. ఈ అంశాలను కూడా వారు వచన కవిత్వం ద్వారానే విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళారు. ఈ ప్రాంతంలో గ్రామసీమలు మారిపోయి వ్యవసాయం, ఉత్పాదక రంగాలు ప్రగతి విహీనంగా కనిపించడం, సాంస్కృతిక వ్యవహారాల్లో ఎవరూ ఊహించని మార్పులు చోటు చేసుకోవడం మొదలైన విషయాలను వి.ఆర్.విద్యార్థి తన 'రహదారి' కవితలో తెలియజేసాడు. ఈ కవితలోనే ఒకచోట తన ఆవేదనను తెలియజేస్తూ ఇలా అంటాడు- "తీరా చూస్తే తెల్లారేసరికి కూరగాయలు, పాలు, పెరుగు మాయమైపోయి విస్కీ బుడ్లు, రేడియో, బ్లూ ఫిల్ములు ప్రత్యక్షమవుతున్నాయ'ని తన ఆవేదనను తెలియజేసాడు. ఒకనాడు ఉన్న ఊర్లు ఈనాడు లేవని వాపోతూ-

"నేస్తం
వెనుకటిలా ఉవ్విళ్ళూరుతూ
మా ఊరికి వచ్చే ప్రయత్నం చేయకేం
నిన్ను, నన్ను అడిగే రోజులకు
కాలం చెల్లిపోయింది
వీలు చూసుకొని నేనే వస్తాలే
ఓ ఉదయం పూట
మన స్నేహపు మధుర స్మృతుల శాలువా కప్పుకొని
ఆకుపచ్చని అడవుల గుండా
రాత్రి మంచుకు తడిసిన మన
కాలిబాట మీద మట్టి వాసనలాఘ్రాణిస్తూ...."

అన్న పై వచన కవిత్వంలోని భావాలను పరిశీలిస్తే 'గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్' అనే సామెత నూటికి నూరుపాళ్ళు నిజమనిపిస్తుంది.

అట్లాగే గ్రామాల నుండి వలస పోతున్నవారిని, వారి జీవితంలో మీద పడిన ఉపద్రవాలను తెలియజేస్తూ నాళేశ్వరం శంకరం 'వలస' అనే కవితలో ఈవిధంగా తెలియజేసారు-

"మనం వలస పోతున్నామంటే అవసరంతో పోతున్నాం
ఆందోళనతో పోతున్నాం, ఆక్రందనతో పోతున్నాం
దాహం కోసం దుఃఖాన్ని అదుముకోలేని
మౌన శోకంతో తరలిపోతున్నాం"

పై వ్యక్తీకరణలో వలసకు కారణాలు బాహ్యంగా కనిపించినా అంతరంగాల్లో వలస పోయే వ్యక్తి ఏవిధంగా ఘర్షణకు గురౌతున్నాడో తెలియజేసే మానవీయ దృక్పథం పై వచన కవితలో చోటు చేసుకోవడం విశేషం.

ఇదేవిధంగా డా॥ సి.నారాయణరెడ్డి సమాజంలో పేదలు పీడితులై ఎదుర్కొనే కష్టాలను, కన్నీళ్ళను అభివ్యక్తం చేస్తూ వచన గేయంలో ఈవిధంగా తెలియజేసారు-

"ఇంతేలే నిరుపేదల బతుకులు
అవి ఏనాడు బాగుపడని అతుకులు
ఇంతేలే"

అని ఆగకుండా,

"పేదలు ప్రాణమున్న పీనుగలు
విధి చేతులలో తిరిగే గానుగలు" అని వారి దైన్య జీవితాన్ని హృదయం ద్రవించేలా తెలియజసాడు.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

ఈవిధంగా తెలంగాణలో వచన కవిత్వం ఆలస్యంగా ఉద్భవించినా ఎవరికీ అందనంత ఎత్తుల్లో చేరి వికాసవంత మైన దశకు చేరుకుంది. ప్రధానంగా ఈ వచన కవిత్వం ఈ ప్రాంతంలో సమస్యలపైనే దృష్టి సారించి వ్యక్తి జీవితాలను వారి జీవితంలోని అగాధాలను, సంఘర్షణలను వర్ణించి కొన్నిచోట్ల పరిష్కారాలను కూడా అందించింది. ఛందస్సుకు దూరంగా, నియమాలకు అతీతంగా ఈ వచన కవిత్వం మాన వుని హృదయంలోని బాధను ఆవిష్కరించడమే కాకుండా అతడికి చైతన్యాన్ని కూడా అందించి వికాసవంతమైన దశకు వ్యక్తి చేరడానికి దోహదపడింది.

తెలంగాణలో వచన కవిత్వం ఆ ప్రాంతంలోని గ్రామీణ జీవితాలను చిత్రించే విధానానికి మాత్రమే లోబడి ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్య లను అద్దంలో దర్శింప చేసినట్లుగా వచన కవిత్వం విశ్వవ్యాప్తం చేసింది. కేవలం దైన్యతకు కారణాలను చూపించడమే కాకుండా వాటి నుండి బయట పడటానికి కూడా మార్గాలను అందజేసింది. తొలినాళ్ళలో భూమి, భుక్తి, పోరాటాలు వస్తు రూపకంగా ఈ వచన కవిత్వంలో చోటు చేసుకున్నా, తరువాత కాలంలో అసమానతలు, వివక్షత- వీటిపై సంఘర్షించే నేపథ్యంలో ఉద్యమంగా విప్లవించి గ్రామీణుల ఈతిబాధలను తొలగించే ప్రయత్నానికి ఒక ఉపకరణంగా ఈ వచన కవిత్వం కొంతమేరకు దోహపడింది.

ముఖ్యంగా వృత్తి కులాలు, ఆశ్రిత కులాలు ఏవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో బ్రతుకు దుర్భరమై ఉన్న ఊరు విడిచి పట్టణాలకు వలస పోవడం జరుగుతోందో దానిని కూడా తీవ్రంగా ఖండిస్తూ వారికి జీవన మార్గం సుగమమం చేయడంలో తనవంతు బాధ్యతను వచన కవిత్వం ద్వారా ఈ ప్రాంతంలో కవులు అందించి కొంతమేరకు మార్పుకు కృషి చేసారు. ప్రధానంగా ఈ వచన కవిత్వం ఒక ప్రత్యేక శైలిలో ఎక్కడో ఒకచోట ఆగిపోకుండా తరం నుంచి తరానికి ఆ తరంలో వస్తున్న సమస్యల పరిష్కారానికి దోహద పడే అంశాలను అందించింది.

Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

జీవితపు మిఠాయి పొట్లం - మిథునం

- కూకట్ల హనుమంతరావు
పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

ద్రావిడ భాషాసాహిత్యాలలో మధ్యద్రావిడ భాషగా గుర్తింపు పొంది వెయ్యి సంవత్సరాల పైచిలుకు సాహిత్య చరిత్ర కలిగిన భాష తెలుగు భాష. అట్టి తెలుగుతల్లికి అలంకరించిన తెలుగుభాషాకిరీటంలో పొదిగిన రత్నమాణిక్యాలు సాహిత్య ప్రక్రియలు. సత్యదూరతకాని భావనలతో, నిత్య నూతనమైన వస్తువిన్యాసంతో ఏప్రక్రియకు ఆ ప్రక్రియే తనదైన ప్రభావాన్ని ఈ సమాజంపై ప్రతిబింబిస్తూ సాహిత్య ప్రయోజనాన్ని చేకూరుస్తున్నాయి. అట్టి తెలుగు సాహిత్య ప్రక్రియలలో ఎంతో గుర్తింపు పొంది, అనాది కాలంనుండి నేటిదాకా ఎందరో పోషకుల చేతుల్లో తన రూపురేఖలను మార్చుకుంటూ కుంటుపడని నడక సాగిస్తున్న ప్రక్రియ కథా ప్రక్రియ.

అటువంటి తెలుగుకథా ప్రక్రియలో చేయితిరిగిన పాక శాస్త్రజ్ఞుడు శ్రీరమణ. కథాసాహిత్యాకాశంలోని తొలకరి కథల చినుకు శ్రీరమణ. జీవితానికి హాస్యాన్ని, జీవితంలోని హాస్యాన్ని పరిచయం చేసిన గొప్పకథకులలో శ్రీరమణ ఒకరు. వీరు గుంటూరు జిల్లా ఆంధ్రా ప్యారిస్‌గా పేరుపొందిన తెనాలికి కూతవేటు దూరంలోని వేమూరు మండలం వరహాపురం గ్రామంలో జన్మించారు. ముళ్ళపూడి వెంకటరమణ శిష్యులు.

అట్టి శ్రీరమణచే శ్రీకారం చుట్టబడి బాపుచే దస్తూరి తిలకం దిద్దబడి ముద్రించబడిన కథ 'మిథునం'. 'మిథునం' అన్నపేరుతో శ్రీరమణ ఒక కథాసంపుటినికూడా వెలువరించారు. ఆ కథాసంపుటిలో మిథునం ఒక కథగా ముద్రించబడింది. మిథునంకథ ఒక్కటే కూడా శ్రీరమణ, వసుంధర, జంపాల చౌదరిగారి పరిచయ వాక్యాలతో, బాపుగారు అద్దిన స్వదస్తూరి తిలకంతో ముద్రించబడింది. మిథునం కథాసంపుటి 2002లో అరటిపువ్వు సాములోరు, తేనెలోచీమ, వరహాలబావి, ధనలక్ష్మి, షోడానాయుడు, బంగారుమురుగు, పెళ్ళి వంటి కథలతో నవోదయ పబ్లిషర్స్‌వారిచేత ప్రచురించబడింది. ఈ కథాసంపుటిలోని బంగారు మురుగు కథ స్వతంత్రం వచ్చి 50 సంవత్సరాలు అయిన కారణంగా తెలుగు అకాడమివారు ప్రచురించిన 'బంగారు కథ' అన్న సంకలనంలో ముద్రించబడింది. ఇందులోని కథలు ఏకథకు ఆకథే తమ ప్రత్యేకతను చాటుకుంటూ ప్రక్రియా విలువను పెంచడానికి దోహదపడ్డాయి.

మిథునం గురించి :

ఈ కథ 1997లో రచించబడి అదే సంవత్సరం నవంబరులో ఆంధ్రభూమి వాపత్రికలో నాలుగు వారాలపాటు అచ్చువేయబడింది. ఆ తరువాత ఈ కథకు బాపుగారి చేతిరాతతో రూపుదిద్దుకుని ప్రచారం పొందే అదృష్టం వరించింది. ఇది దాదాపు వందమందికిపైగా బాపుగారి చేతిరాతప్రతితో అందించబడింది. బాపుగారి చేతిరాతతో ఉన్న కథనే రచన పత్రిక 1998 ఫిబ్రవరిలో ప్రచురించింది. మరల 2000 ఫిబ్రవరిలో ఒక్క మిథునం కథతోనే రచన పత్రిక వెలువడింది. ఆతరువాత ఈ కథ అన్ని భారతీయ భాషల్లోకేకాక, నాలుగు విదేశీ భాషల్లోకి కూడా అనువదించబడింది. మిథునంకథను ఎం.టి.వాసుదేవన్ నాయర్ తమిళంలో ఒరు చెరు పుంజిరి అన్న పేరిట సినిమాగా తీశారు. ఈ సినిమాకు ఏషియా ఫిలిం ఫెస్టివల్‌లో అవార్డు దక్కింది. తెలుగులో కూడా ఈ కథ సినిమాగా తీయబడింది. ఆకాశవాణిలో శబ్దనాటికగా కూడా వచ్చింది. స్టేజిప్లేగా ప్రదర్శితమైంది. అనేక కథా సంకలనాలలో ఒక కథగా ప్రచురించబడింది. ఈ కథ జాతీఅవార్డును కూడా గెలుచుకుంది.

శ్రీ రమణ గురించి :

కడిమిచెట్టు పన్నెండేళ్ళకోసారి పూస్తుంది. ఇప్పుడు మా శ్రీరమణ పూసింది - ఆరుద్ర

ఒక చక్కని కలని కథగా చెప్పారు - రంగనాయకమ్మ

ఇతివృత్తాన్ని బట్టి కథ
పేజీల్ని బట్టి పెద్ద కథ
అంశాన్ని బట్టి కథానిక
సంభాషణా పరంగా నాటిక
వర్ణనాత్మకంగా కావ్యం
దాంపత్య సారానికి వ్యాకరణం
జీవన వేదానికి ఉపనిషత్తు
ఇదీ శ్రీ రమణ విరచిత మిథునం - వసుంధర

ఇంతటి పేరుప్రఖ్యాతలు సంపాదించిన ఈ కథలో ఏముంది అనుకుంటే ఏమీలేదు. బుచ్చిలక్ష్మి, అప్పాదాసు, ఒక పాలుపోసే కుర్రవాడు పాత్రలుగా, ఒక అటక, ఓ నిచ్చెన, ఓ పొయ్యి, ఓ బావి దాని గిలక వస్తువులుగా, ఒక పెరడు అందులోని జామ, తులసి, ఉసిరి, పారిజాతం, మామిడి, కొబ్బరి, పనస, నిమ్మచెట్ల వాతావరణం ఇవే ఉన్నది ఈ కథలో. వీటన్నంటి ఆధారంగా వయస్సు అన్నదానితో సంబంధంలేని మనస్సు అనే పదార్థం అడుగడుగునా జీవితాన్ని గుర్తుచేస్తూ జీవితమంటే ఇదేరా బడుద్ధాయ్ అని జీవితపాఠాల్ని నేర్పే నేర్పరి తనం ఈ కథలోని ప్రతివాక్యంలోను మనం గమనించవచ్చు. అందుకే ఇది జీవితాన్ని తీసిపోని కథ. కథను తీసిపోని జీవితం.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

మిథునం కథ :

తాత్వికత అనుకోవచ్చు, లేక కథాగమన సూచకం అనుకోవచ్చు, లేదా కథాస్వభావాన్ని తెలిపే మాటలు అనుకోవచ్చు. కథా ప్రారంభంలో "అప్పటికే పొద్దు వాటారింది. పెరట్లో ఎండేసిన పేళ్ళు ఓ మూలగా పొందికగా పేర్చి తడవకుండా తాటాకులు కప్పి మిగిలిన చితుకులు ఏరుతూ వంగి లేచి ఆయాసపడుతోంది బుచ్చిలక్ష్మి.... ఏంచేస్తావే ఇన్ని కట్టెలూ అన్నాడు దీర్ఘాలుతీస్తూ...... రేపు నువ్వు హరీ అంటే చితిపేర్చ జానికి కావద్దూ అన్నది అదేశృతిలో దీర్ఘాలుతీస్తూ" అన్న మాటలతో మొదలవుతుంది. ఈ మాటలు వయసు మీదపడిన జీవాలతో నడవబోతుందని, వారికి మిగిలున్నకాలం ఆమె ఏరుతున్న చితుకులవలె తక్కువేనని, కట్టెలాంటి శరీరం ఎండిపోయి మూలనపడే స్థితికి చేరిందని ఆమాటలలో ధ్వనిగా అర్థం చేసుకోవచ్చు. కథాంతం చేరేసరికి కథారంభం బుచ్చిలక్ష్మితోనే ఎందుకు జరిగిందో, బుచ్చిలక్ష్మి అన్నమాటను రచయిత బ్రహ్మవాక్కుగా ఎలా పలికించాడో పాఠకులకు తెలుస్తుంది. కథానిర్మాణ శిల్పాన్ని ఎత్తుగడలోనే రచయిత చూపించాడు. కథలోని పైమాటలు కుండఅంతా కలియతిరగకుండా ఉడికిన స్వభావాన్ని చెప్పిన అన్నం మెతుకుల్లాగా మెరుస్తాయి.

ఈ కథలో పేరులేని పాత్ర పాలుపోసే కుర్రవాడిది. కథను మనతో చెప్తూ కథాంతం వరకూ మనతోపాటే కథలో నడుస్తాడు. సీరియస్‌గానడిచే కథలో హాస్యానికి వీలు కల్పిస్తాడు. మనచేత కథను ఆసాంతం చదివిస్తాడు. అప్పాదాసు, బుచ్చిలక్ష్మిలకు వేలువిడిచిన వరుసలి మేనల్లుడిగా తనను తాను చెప్పుకుంటాడు ఈ కుర్రవాడు. ఇతనివయసు పదిహేనేళ్ళు. అప్పాదాసుగారి 'విభీషణాయ్' అన్న సంభోధనతో తరించిపోయిన పాత్ర ఈ పాలవాడు. తనంతవాడు కావాలని, బుచ్చిలక్ష్మిలాంటి పెళ్ళాం రావాలని అప్పాదాసు మావయ్యచే ప్రేమగా దీవించబడినవాడు. అప్పాదాసు, బుచ్చిలక్ష్మిలమధ్య జరిగే అనేక సంఘర్షణలలో ఇరుక్కుని ఎలాస్పందించాలో తెలియక 'ఒక తిక్కచూపుచూసి' పరుగెత్తేవాడు. కాని ఆ యింటి చుట్టే ప్రదక్షిణలుచేసేవాడు. పులిగుహలా కనిపించే అప్పాదాసు ఇంటికి పాలచెంబు అనే మంత్రదండంతో ప్రవేశించిన 'దీవెన్ల ఫకీరు'ఈ పాల కుర్రవాడు.

కథంతా ఒక అగ్రహారంలో ఒక వారగా ఒక కుటీరంలా, కొండపల్లి బొమ్మలా ఉన్న చిన్న ఒంటిదూలం పెంకుటింట్లో జరుగుతుంది. బ్రాహ్మణ వృద్ధదంపతులమధ్య జరిగే సన్నివేశాలే వాతావరణం. బ్రాహ్మణకుటుంబంలోని ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, పిండివంటలు, వంటలు, జీవన విధానం ఈకథలో ఎంతో చక్కగా చిత్రించబడ్డాయి. అప్పాదాసు తిండి ధ్యాస పుణ్యాన వంటలువండే విధానాన్ని అతడు వర్ణించేతీరు ఆధారంగా మనంకూడా తెలుసుకోవచ్చు. భాషకూడా పాత్రోచితమే అయిన బ్రాహ్మణమాండలికమే అయినా అక్కడక్కడా అవిధానం తొంగిచూస్తూ సహజ వ్యవహారంగానే సాగిపోతుంది. ఈ రెండుపాత్రలమధ్య జరిగే సంభాషణలు, సన్నివేశాలు పాఠకులను నవ్వించి నవ్వించి కంటతడి పెట్టిస్తాయి. ఆ కంటతడి పాఠకుడు గుండెనుకూడా తాకుతుంది. ఎంత ఆస్వాదించినా వాడని పారిజాతం శ్రీరమణ 'మిథునం'.

ఈ కథలోని వర్ణనలు కూడా పాఠకుల హృదయాలను ఆకట్టుకుంటాయి. అప్పాదాసు పెంచిన పెరటి మొక్కలను పరిచయం చేస్తూ "బావి గట్టుకి అందిపుచ్చుకున్నట్టు ఎప్పుడూ ఉరక తగిలేబొద అయిదారు అరటిచెట్లూ, అమ్మకొంగు పట్టుకుని నిలబడ్డ పిల్లల్లా వాటి పిలకలూ" ఈ వర్ణనచదివిన ఏ పాఠకుడిమనసులో వాత్సల్యామృతం తొణికిసలాడకుండా ఉంటుంది. మరోచోట రకరకాల వడియాలను, కుకుళ్ళను ఎండలో ఆరబెడుతూ అక్కడే కర్రపట్టుకుని కూచున్న అప్పాదాసుని వర్ణిస్తూ "ఆయన కళ్ళల్లో చిన్నపిల్లలు బాణాసంచా ఎండబెట్టుకున్నంత ఉత్సాహం కనిపుస్తుంది" అంటారు శ్రీరమణ. ఆ మాటలు చదివిన ఏ పాఠకుడి హృదయంలో బాల్యజీవితం దొంతరలుగా మొదలకుండా ఉంటుంది.

ఈ కథలో అడుగడుగునా కథకుడు జీవన మాధుర్యాన్ని, దాంపత్య జీవన సారాన్నినింపి శృతిమీరి పాకానపడుతున్న నేటి తరాలకు జీవన సౌందర్యాన్ని, జీవన విలువలను పరిచయం చేశాడు. ఆదర్శ దాంపత్యానికి బుచ్చిలక్ష్మి నిలువెత్తు నిదర్శనంగా మిగులుతుంది. బుచ్చిలక్ష్మి అప్పాదాసు చనిపోయిన తరువాత పాలకుర్రవాడితో "నేను ముందుపోతే పసుపుకుఖాలు మిలేవేమోగాని ఆ జీవుడు ఎంత అవస్థపడేవాడో నాకు తెలుసు, పైనున్న భగవంతుడికి తెలుసు.... దేవుడా ఈ మనిషిని తీసుకెళ్ళు - ఆనక నా సంగతి చూడు అని రోజూ దణ్ణంపెట్టుకునేదాన్ని. మొగుడి చావుకోరుకునే వెర్రిముండలుంటారా అనుకోకు వుంటారు. నాకు మీ మావయ్యంటే చచ్చేంత ఇష్టంరా. ఆయన ముచ్చట చెల్లకపోయినా, కోరిక తీరకపోయినా నాప్రాణం కొట్టుకునేది" అన్న మాటలు పాఠకులను ఎంగానో ఆలోచింపచేస్తాయి. చీటికి మాటికి గొడవలతో సంసారాలను ఆగంచేసుకుంటున్నవారికి కనువిప్పుగాకూడా పనిచేస్తాయి. ఇలా ఈకథ ఆసాంతం హాస్యం, లైక్యం, ప్రేమ, దాంపత్యం, జీవన సౌందర్యం, శ్రమ, తత్వం, సమాజం, సంప్రదాయం, ప్రకృతి వంటి అనేక అంశాలతో నిండుకుండలా తొణికిసలాడుతూ పాఠకుల్ని ఆనందింపచేస్తుంది. సాహిత్య ప్రాథమిక ప్రయోజనమైన ఆనందోపదేశాలు రెండుకాళ్ళుగా ఈ కథనడిచినట్లు పరిశీలనమీదట తెలుస్తుంది.

ఆధార గ్రంథాలు :

1. ఒకేఒక్క మిథునం - శ్రీరమణ
2. శ్రీరమణీయం ఛానెల్ 1 & 2
3. శ్రీరమణ ఇంటర్వ్యూ

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

"ఆత్మగౌరవానికి ప్రతీక రాయలసీమ నామకరణం" (18-11-1928)

- డా. అప్పిరెడ్డి హరినాథరెడ్డి

నేడు రాయలసీమగా పిలవబడుతున్న ప్రాంతం 1770 నాటికి మైసూరు నవాబు టిప్పుసుల్తాన్ ఆధీనంలో ఉండేది. మూడవ ఆంగ్లో- మైసూరు యుద్ధంలో బ్రిటీష్‌గవర్నర్ కారన్ వాలీస్, నైజాంనావాబు నిజా మాలీఖాన్, మహారాష్ట్రులు కలిసి టిప్పుసుల్తాన్‌ను ఓడించారు. ఆ సందర్భం లో నైజాంలకు కడప, గండికోట, కంభం, బళ్ళారి తదితర ప్రాంతాలు లభించాయి. నాలుగవ ఆంగ్లో-మైసూరు యుద్ధంలో లార్డ్ వెల్లస్లీ, నిజా మాలీఖాన్‌ల దాడికి టిప్పుసుల్తాన్ మరణించాడు. గుత్తి, నందిదుర్గం, కోలారు తదితర ప్రాంతాలుకూడా నిజాంకు లభించాయి. ఇప్పటి రాయల సీమ ప్రాంతమంతా 1799 నాటికి నైజాం నవాబుల రాజ్యంలో భాగమైంది.

ఫ్రెంచివారి ఆధిపత్యం అడ్డుకొనేందుకు బ్రిటీష్‌వారు మహా రాష్ట్రుల నుండి రక్షణకోసం నిజాం వీరిఇరువురి అవసరాల రీత్యా 1798 లో సైన్యసహకార ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం ఆరు బ్రిటీష్ సైనిక దళాలను నిజాం తన రాజ్యంలో ఉంచుకున్నందుకు గాను రూ.24,17,100 రూపాయలు చెల్లించేలా నిర్ణయించుకున్నారు. మహా రాష్ట్రులతో భవిష్యత్‌లో నిజాం సంధిచేసుకుంటాడేమోనన్న అనుమానంతో 12-10-1800 తేదినాడు బ్రిటీష్ వారు నిజాంతో మరోసారి కట్టుదిట్టంగా సంధి చేసుకున్నారు. ఎనిమిది సిపాయిదళాలు, రెండు అశ్వికదళాలు బ్రిటీష్‌వారు నిజాంకుఇచ్చారు. ఆ సైన్యాలకు అయ్యే ఖర్చు నిజాం నవాబు చెల్లించటం కష్టమై, మైసూరు నవాబుల నుండి తనకు లభించిన కర్నూలు, కడప, అనంతపురం, బళ్ళారి ప్రాంతాలను శాశ్వతంగా బ్రిటీష్‌వారికి ఇచ్చివేశాడు. బ్రిటీష్‌వారు తమకు లభించిన ఈ కొత్త భూభాగాన్ని "సీడెడ్ డిస్ట్రిక్ట్స్" పేరుతో కొనసాగించారు. "సీడెడ్" అంటే "వదిలి వేయబడిన, ఇచ్చివేసిన" అనే అర్థముంది. ఈ అర్థంలో కాకుండా 'దత్త మండలాలు' అనే తర్జుమాలో తెలుగులో ఈ ప్రాంతానికి పేరు వ్యవహరిచడం ఆ రోజుల్లో మొదలైంది. ఒకవేళ దత్తంగా నిజాం ఇచ్చినట్లయితే బ్రిటీష్‌వారికి ఈ ప్రాంతంపట్ల నైతిక బాధ్యత ఉండాలి. అంత బాధ్యత తీసుకొన్నట్లు చరిత్రలో ఎక్కడా మనకు కనబడదు. విడిచి వేయబడిన అని దిక్కులేని పేరుకంటే దత్తమండలం అని కాస్తోకూస్తో గౌరవంగా పిలుచుకొంటే బాటుంటుందని ఆ పేరున ఈ ప్రాంతం కొనసాగింది.

1800 నుండి 'దత్తమండలం'గా ఈ ప్రాంతం కొనసాగుతూ వచ్చింది. అంతకుపూర్వం ఈప్రాంతానికి ఏకమ్మొత్తంగా ఒకేపేరు లేక పోయినా వివిధ రాజుల కాలంలో, వివిధ ప్రాంతాలలో పెనుకొండరాజ్యం, చంద్రగిరి రాజ్యం, రేనాటి సీమ, గుత్తిసీమ, గండికోటసీమ, సగిలినాడు, పొత్తపినాడు, ములికినాడు, నోళంబవాడి, మహరాజవాడి ఇలా పలు పేర్లతో కొనసాగటం కనిపిస్తుంది.

విజయనగర రాజుల ప్రారంభకాలం నుండి 'మట్ల రాజులు' వారికి సామంతులుగా ఉండేవారు. 16వ శతాబ్దం లోని మట్ల అనంత రాజు సంస్థానంలోని నడిమింటి వెంకటపతి కవి రాసిన 'అభిషిక్త రాఘవం' అనే ప్రభందంలో మట్ల అనంతరాజును వర్ణించే సందర్భంలో "రాయల సీమ" అనే పదం ప్రయోగించటం కనిపిస్తుంది. ఆ పద్యం పూర్తి రూపంలో ఇలా ఉంది.

ఉ॥ "గాయకులశ్వరాయ బలఖానులు మట్ల అనంతరాజ కౌ
క్షీయక ధార ద్రెవ్విరని చెప్ప దరింతియ కాక వేలుపున్
రాయలసీమలోన చతురంగ బలంబు తోడ వైరముల్
పాయకయున్న వారు సరిపాళెము వైచిన యట్ల జస్త్రమున్"

ఈ పద్యం ఆధారంగా అప్పటికే రాయలసీమ అనే పదప్రయోగం దేశీ వాడకంగా ఉండేదని తెలుస్తుంది. అది ఏస్థాయిలో జన వ్యవహారంలో కొనసాగిందో మరింత అధ్యయనం చేయాల్సి ఉంది.

'రాయ' అనే పదం రాట్ నుండి రాజ్, రాయల్‌గా పరిణామం చెందింది. రాజ: అనే సంస్కృత రూపం తెలుగులో రాజు, రాయలుగా నిలిచింది. సీమ అంటే ప్రదేశం లేదా ప్రాంతమని అర్థం. రాజులు ఉన్న ప్రాంతమనే అర్థంలో 'రాయలసీమ' పదం ధ్వనిస్తోంది. క్రీ.శ.5వ శతాబ్దం నుండి 9వ శతాబ్దందాకా రేనాటి చోళులు, బాణులు, వైదుంబులు, నోళం బులు, రాయలసీమలో స్వతంత్ర రాజ్యాలుగా కొనసాగారు. క్రీ.శ. 12వ శతాబ్దం నుండి 15వ శతాబ్దం దాకా విజయనగరరాజుల పాలనకు ఈ ప్రాంతం కేంద్రమైంది. 1564 రక్కసితంగడి యుద్దానంతరం విజయనగర రాజ ప్రభావం తగ్గుముఖం పట్టే క్రమంలో సామంతులు, పాలెగాళ్ళు కూడా రాజ గౌరవం పొందే ప్రయత్నం ఇక్కడ కొనసాగింది. ఈ విధంగా అనేక మంది రాజ వంశాలు, పాలనా కేంద్రాలు ఈ ప్రాంతంలో కొనసాగిన చారిత్రక, సాంస్కృతిక నేపథ్యంలో 'రాయలసీమ'గా వ్యవహరించటం జరిగింద'ని పిస్తోంది.

ఆధునికంగా దత్తమండలం నుండి రాయలసీమగా పూర్తిగా వ్యవహారంలోకి వచ్చింది. 1928లోనే అని ఇప్పటికి లభిస్తున్న ఆధారాలు తెలియజేస్తున్నాయి.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

1913లో 'ఆంధ్రమహాసభ' ఏర్పడింది. మద్రాస్ నుండి విడివడి సొంత ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేయటం ఆ సంస్థ లక్ష్యం. కానీ దత్తమండల ప్రజలు ఆంధ్రరాష్ట్రంపట్ల అంత సానుకూలంగా లేరు. అందుకు అనేక కారణాలున్నాయి. 1926లో ఆంధ్రవిశ్వవిద్యాలయం అనంతపురంలో ఏర్పాటుకు ఆంధ్రమహాసభ, శాసన సభలలో తీర్మాణాలయ్యాయి. చివరకు ఆ విశ్వవిద్యాలయం అనంతపురం కాకుండా విజయవాడ, వాల్తేరులలో అంతిమంగా 'వాల్తేరు'కే దక్కింది. ఇది ద్తమండల ప్రజలలో తీవ్ర ఆవేదనకు గురిచేసింది. దత్తమండల నాయకులకు కూడా ఆందోళన కలిగించింది. ఆంధ్రరాష్ట్రం కంటే మద్రాస్ రాష్ట్రంలో ఉండటమే సీమప్రజలకు మేలు అనే స్థాయికి చేరింది. సరిగ్గా అదేసమయంలో అంటే 1928లో 'ఆంధ్ర మహాసభ' సభలు నంద్యాలలో జరిగాయి.

సాధారణంగా ఆంధ్రమహాసభలలో జాతీయోద్యమం, సంఘ సంస్కరణ, ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు తదితర అంశాల అజెండాగా కొనసాగు తాయి, కానీ నంద్యాల సభలో ఈ ప్రాంత సమస్యలపై చర్చించేందుకు "ప్రథమ దత్తమండల సమావేశం"కూడా ఆంధ్రమహాసభలో భాగంగా జరపాలని నంద్యాలలోని ఆహ్వాన సంఘం నిర్ణయించింది. ఈ ఆహ్వాన సంఘంలో ఖాదరాబాదు నరసింహరావు, ఆత్మకూరు సుబ్రమణ్య శేష్ఠి, కె.కేశన్న, ఒరుగంట సుబ్రమణ్యం, వనం శంకర శర్మ, టి.రామభద్రయ్య, దాద్‌ఖాన్ షిరాని బహదూరు, రాజా పెద్దసుబ్బరాయుడుశేష్ఠి, బి.నారాయణ మూర్తి తదితరులున్నారు. ఈ ఆంధ్రమహాసభలో "సర్వేపల్లి రాధాక్రిష్ణన్, ప్రకాశంపంతులు, దేశపాండ్య గంగాధరారావు, అనిబిసెంట్, దొరస్వామి అయ్యంగారు, గాడిచెర్ల హరిసర్వోత్తమవరావు, ఒ.లక్షణస్వామి, జోగయ్య పంతులు, ఎ.రంగనాథ మొదలయార్, చెరుకువాడ నరసింహం, రామదాసు పంతులు, కాళేశ్వరయ్య, కొండా వెంకటప్పయ్య, పట్టాభిసీతారామయ్య, శ్రీనివాసులు అయ్యంగారు, టి.శివశంకరపిళ్ళై,పప్పూరు రామాచార్యులు, కడప కోటిరెడ్డి తదితర హేమాహేమీలు పాల్గొన్నారు.

1928, నవంబరు 17న ఆంధ్రరాష్ట్రీయసభ, ఆంధ్ర మహాజన సభ, ఆంధ్ర సర్వపక్ష సమావేశాలు జరిగాయి. 18వ తేదీన ప్రథమ దత్త మండలసభ, గోరక్షణసభ, ఆంధ్ర సంగీత మహాసభలు జరిగాయి. 18నాటి 'ప్రథమ దత్తమండల సభకు" ఆహ్వానసంఘం అధ్యక్షులుగా కె.శరభారెడ్డి కాగా, అధ్యక్షులుగా కడపకోటిరెడ్డి వ్యవహరించారు. దత్తమండలాల ఆర్థిక స్థితి గతులు, నీటి పారుదల, పెండింగ్ ప్రాజెక్టులు, విద్యారంగం ఇలా అనేక అంశాలపై చర్చ కొనసాగింది. ఈ ప్రాంత ప్రజలు ఆత్మగౌరవము, వ్యక్తిత్వము కాపాడుకొనుటకు దాస్య చిహ్నముగా దత్తమండలము అని కాకుండా వేరే పేరు ఏదైనా ఉండాలని చర్చ జరిగింది. ఈ సందర్భంలో చిలుకూరు నారాయణరాజు గారు ఈ ప్రాంతానికి దత్తమండలంకు బదులు "రాయలసీమ" అని ఉంటే సమంజసంగా ఉంటుందని ప్రతిపాదించారు. నారాయణరావు గారు కాళింగసీమ వారు. 1927లో రాజమహేంద్రవరం కళాశాల నుండి అనంతపురం కళాశాలకు అధ్యాపకుడిగా వచ్చారు. వచ్చిన కొత్తలోనే ఈ ప్రాంతానికి దత్తమండలం అని పేరు ఉండటం న్యాయం కాదని భావించి 1928తొలి రోజుల్లోనే 'దత్త' అనే పేరున 128 పంక్తుల "మంజర ద్విపద" గేయాన్నిరాసి దత్తమండల కళాశాల మ్యాగ్‌జైన్‌లో ప్రచురించారు. ఈ గేయాలలో ఈ ప్రాంత చారిత్రక, సాంస్కృతిక, సాహిత్య ఔన్నత్యాన్ని విశదపరిచారు.

"దత్త నందుకు నన్ను దత్తనెట్లగుదు
రిత్త మాటల చేత చిత్తమ్మన కలిగె
ఇచ్చిన దెవరో పుచ్చుకున్న దెవరో
తురక బిడ్డండిచ్చె దొరబిడ్డ పట్టె
అత్త సొమ్ముగొని యల్లుండు దాన
మమర జేసునటన్న యట్టులున్నదిది"

అని తీవ్రంగా 'దత్తగేయంలో విమర్శించారు. ఈ ప్రాంత విశిష్ట తను ఆ గేయంలో విశ్లేషించి చిరవగా...

"ఇరుగు వారలు మన పొరుగు వారలును
సరి జూచి మన్నించి సఖ్యంబు నెరపి
గౌరవ బుద్ధితో గాంతురు మనల
నంతలో జూపట్టు 'నాంధ్రాభ్యుదయము"

అని పేర్కొన్నాడు. ఆంధ్రులు ఈ ప్రాంత ప్రజలకు ఆత్మీయంగా నిలిచినపుడే ఆంధ్రాభ్యు దయమని చాటాడు. సీమ ప్రజలు కూడా ఆంధ్రులతో కలిసి సాగాలని కోరుకున్నాడు. ఈగేయం 'సాధన' పత్రికలో 8-9-1928న తిరిగి ప్రచురితమైంది.

ఈవిధంగా చిలుకూరు నారాయణరావు ఈ ప్రాంతం 'దత్త' కాదని ప్రత్యామ్నాయంగా 'రాయలసీమ' అనే పదాన్ని నంద్యాల సభలలో నవంబరు 18న ప్రతిపాదించాడు. ఈ ప్రతిపాదనను ఆ సభలో అందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. రాయలసీమ పేరును విస్తృతంగా ప్రచారంలోకి తీసుకొచ్చారు. 1928 నవంబరు 24న సాధన పత్రికలో రాయలసీమ శీర్షికన వ్యాసం ప్రచురించి ఈ ప్రాంతానికి అపేరు సహసంబంధ ఆవశ్యకతను వివరించారు. పప్పూరు రామాచార్యులు సాధన పత్రిక లో ఉపశీర్షికగా "వాయిస్ ఆఫ్‌ది సీడెడ్ డిస్ట్రిక్ట్" అని ఉండేది. 1929 మార్చి 16నుండి "వాయిస్ ఆఫ్ ది రాయలసీమ"గా ఉపశీర్షికను ప్రవేశ పెట్టి ప్రాచుర్యం కల్పించాడు. గాడిచెర్ల హరి సర్వోత్తమరావు తదితరులు రాజకీయంగా రాయలసీమ పద వ్యాప్తికి కృషి చేశారు.

నంద్యాల సభలో తీర్మాణం మేరకు డిసెంబరు నెలలో 'రాయల సీమ' పేర ఒక ద్వైవార పత్రికను తీసుకురావడానికి సీమ నాయకులు ప్రయత్నాలు చేశారు. ఆ కమిటీకి కార్యదర్శి

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

రామచంద్రరావు కాగా ఏ.రంగనాధ మొదలియార్, టి.శివశం కర పిళ్ళై, గాడిచెర్ల హరిసర్వోత్తమ రావు, కడప కోటిరెడ్డి, సి.దొర స్వామి అయ్యంగారు, పాణ్యం రామచంద్రయ్యలు సభ్యులుగా కొనసాగారు.

1930 ఫిబ్రవరి12 నుండి 16 వరకు శ్రీకృష్ణదేవరాయ జయంతి ఉత్సవాలు పెనుగొండలో ఘనంగాజరిగాయి. 13వ తేదీన చిలుకూరు నారాయణ అధ్యక్షోపన్యాసము ఈసభలలోజరిగింది. ఈ ఉపన్యాసంలో "రాయలసీమఅను పేరు ఈ ప్రాంతమలకు మాత్రమే పెట్టుట రాయలసీమ బయట నున్న తెనుగువారికి కష్టముగానున్నట్లు శృతి గోచరమవు చున్నది". రాయలు మావాడు మాత్రము కాడా? మా దేశ మును పాలించలేదా? రాయలసీమ పదము మాప్రాంతము లకు ఎందుకు వర్తించదు?"అని ఒకరునన్నడిగారు. ఇట్లుడుగు వారికి సమాధానము లేక పోలేదు" అని క్రింది విధంగా కారణాలను తెలియజేశాడు.

1. రాయలసీమ అనగా ఒక్క కృష్ణదేవరాయలు పరిపాలించిన సీమ మాత్రం కాదు. సంగమ వంశస్థాపకులైన హరిహర బుక్కాదులనుండి ఆరవీటి వంశములోని తుది రాయలవరకును పరిపాలించిన సీమకే 'రాయలసీమ' అను పేరుంచుటుచితము. ఈ రాయలందరి కాలములోను ఆంధ్రదేశమంతయు విజయనగర రాయల పరిపాలనములోలేదు. కొందరు పరాక్రమవంతులయిన రాయల కాలములో మాత్రము ఆంధ్రదేశములోని ఇతర భాగములు రాయల ఏలుబడిక్రింద నుండెను. రాయల వంశము స్థిరముగా ఏలిన భాగమగుటచేత 'రాయలసీమ'అను పేరు ఈ ప్రాంతము లకు ఉచితతరముగా ఉన్నది.
2. మీది వివరించిన ప్రకారము ఈ ప్రాంతముల యందే ఆంధ్రరాజ్యము విస్తరింపజేయుటకు ప్రయత్నములు ఎక్కువగా జరుగట చేతను ఆంధ్రభాషకీ ప్రాంతముల యందే ఎక్కువ గౌరవము కలుగుట చేతను రాయలసీమ ఆంధ్రదేశమునకు మూర్ధస్థానము నలంకరించుచున్నది. "రాయ" శబ్దము శ్రేష్టవాచకముగా గ్రహించినను ఈ పేరు ఉచిత తరముగానున్నది.
3. పరమోన్నత పదవినమభవించి అపార వైభవములతో తులతూగుచుండిన యీ ప్రాంతములకు "సీడెడు డిస్ట్రిక్టు" అను అసభ్య అవాచ్చనామమొకటి కుదురుకొన్నది. ఆ మాటకు ఎవరో "దత్తమండల ములు"అని తెనుగుచేసిరి. ఆపేరు విడువకుండ వెన్నాడుచున్నది. "కాండూరి లక్ష్మీపతి" సామెతగా మనదేశమును మరిఒకడు ఒంకొకనికి ఇచ్చివేయుటయేమి?

దానిని జ్ఞాపకము చేయునట్టి "దత్త" శబ్దముతో దానిని మనము వ్యవహరించు కొనుటయేమి? ఈ "దత్త"శబ్దములో నున్న అవమానమును "దత్త" అను ఒక చిన్న ఖండకావ్యము తొలగించినది.

4. "దత్తమండలములు"అను బహువచన రూపము ఈ ప్రాంత ముల అనేకతత్వమును చాటుచు, ఈ నాటి ప్రజల బలహీనతను చాటు చున్నది. 'రాయలసీమ' అను పేరు ఈ మండలముల ఏకత్వమును ప్రకటించు చున్నది.
5. ఈ పేరు నంద్యాలలో జరిగిన ఆంధ్రమహాసభలో దేశములోని ప్రముఖులందరును కూడి ఏర్పాటు చేసినది. మొదట ఇప్పటి తెలుగు దేశమంతటికిని ఆంధ్రదేశమను పేరు లేకపోయినన్న మొట్టమొదటి ఆంధ్ర మహాజనసభలో ఆంధ్రదేశమను పేరుతో ఆంధ్రభాష వ్యవహారములో నున్న దేశమున కంతటికిని ఏకత్వము కలిగినది. నంద్యాలసభలో దానిలోని అంతర్భాగమయిన యీ సీమకు ఇక ఇక్కడి వారు విడిపించుకొనుటకు గాని, ఇతరులు తీసివేయుటకు గాని సాధ్యము కాదు. అట్లుండునిండు. అని సాధికారికంగా వివరించారు.

'రాయలేలిన రతనాల సీమ'గా గొప్ప సాంస్కృతిక వారసత్వం, ఉన్నతమైన స్థానంలో కొనసాగిన ఈ ప్రాంతం దత్త మండలం (1800) నుండి రాయలసీమ(1928)గా నామకరణం జరగడానికి 128 సంవత్సరాల కాలం పట్టింది. అంటే ఇప్పటికి 89 సంవత్సరాల క్రితం రాయలసీమ సమాజం తన ఆత్మ గౌరవాన్ని నిలుపుకునే ప్రయత్నంలో భాగంగా గొప్ప అడుగు వేసింది. అందుకే ఈ రోజును "రాయలసీమ ఆత్మగౌరవ దినోత్సవంగా" జరుపుకోవాలి.

గత తొంబై సంవత్సరాలుగా రాయలసీమ సమాజం తమ పూర్వీకుల స్ఫూర్తితో ఎంతో అభ్యుదయంగా, అభివృద్ధి పథం వైపు నడవాల్సి ఉండింది. కానీ ఆవైపుగా ఇంతవరకు సామూహికంగా సరైన ప్రయత్నం జరగలేదు. అడపాదడపా జరిగినా ఫలితం అందుకోలేదు.

తరతరాలుగా పాలకులు ప్రకృతిపై నెపంమోపి సీమ సమాజాన్ని మభ్యపెడుతూ, సీమ ప్రజలకు పావులుగా వాడి జరుగుతూవచ్చారు. రాజకీయ పార్టీలకు, వ్యక్తిగత ఆరాధనలకు, కులం కుంపట్లలోకి సీమ సమాజం నెట్టేయబడుతూ వచ్చింది. అలా నెట్టేయబడుతున్న తరుణంలోనే తమ సీమతల్లి కోసం సీమస్వరాలై కొత్తతరం ఇప్పుడిప్పుడే అడుగులు వేస్తోంది. ఆ మార్గంలోనే సీమ సాధారణ ప్రజానీకాన్ని కూడా స్వతంత్రంగా ఉద్యమించే స్థాయికి తీసుకురావాల్సి ఉంది. అందుకు సీమ సాంస్కృతి కోద్యమం, నీళ్ళ ఉద్యమమే ఆధారాలని గుర్తించి, తక్షణం మేలుకోవాల్సి ఉంది.

భావవీణ

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

-అలూరు మస్తాన్
పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

నాలుగున్నర దశాబ్దాలుగా విమర్శా రంగంలో నిర్విరామంగా కృషి చేస్తున్న ప్రసిద్ధ విమర్శకులలో రాచపాళెం చంద్రశేఖరరెడ్డి ప్రముఖులు. ఈయన ప్రాచీన సాహిత్యం మొదలుకొని నేటి ఆధునిక సాహిత్యం వరకు కావ్యం, కథ, నవల, కవిత్వం, అనువాదం, భారతీయ సాహిత్యాల తులనాత్మక అధ్యయనం మొదలైన ప్రక్రియలను స్పృశిస్తూ వివిధ కోణాల్లో, తనదైన దృక్పథంతో, విమర్శ రాస్తున్నారు. వీరి సాహిత్యకృషిని, దీనిలోనూ ఈయన చేసిన సాహిత్య విమర్శ కృషిని ఈ వ్యాసంలో పరిచయం చేయాలనుకుంటున్నాను.

ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు 1948 అక్టోబర్ 16 న చిత్తూరు జిల్లాలోని తిరుపతికి సమీపాన ఉన్న కుంట్రపాకం గ్రామంలో జన్మించారు. అధ్యాపక వృత్తిలో 38 సంవత్సరాలు కొనసాగి, ఈ కాలంలోనే అనేక విమర్శ వ్యాసాలను రచించిన గొప్ప అధ్యయనశీలి. వీరు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం. ఏ చదువుతున్న రోజుల్లో వారి గురువులు తరగతి గదిలో నిర్వహించే వారాంతపు సదస్సుల ప్రోత్సాహంతో 1972 లో "సినిమా కవిత్వం - సాహిత్య విలువలు" అనే అంశంపై తన తొలి ప్రయత్న పూర్వక వ్యాసాన్ని సమర్పించారు. ఆ తరువాత 1973 జనవరిలో పరిశోధనా రంగంలోకి ప్రవేశించి ఆచార్య తుమ్మపూడి కోటీశ్వర రావు గారి పర్యవేక్షణలో పింగళి సూరన రచించిన "ప్రభావతీ ప్రద్యుమ్నం" కావ్యం మీద తన పరిశోధనను పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందారు.

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు ఆంగ్లం, తమిళ, కన్నడ భాషలలో అనువాదాలు కూడా చేసారు. ఈ పరంపరలో మహర్షి దేవేంద్రనాథ ఠాగూర్(1988) రాసిన ఒక మోనోగ్రాఫ్ ను తెలుగులోకి అనువదించారు. అలాగే ప్రముఖ పంజాబీ కవి, విమర్శకుడు కర్తార్ సింగ్ దుగ్గల్ రచించిన కథల సంపుటిని ''పున్నమిరాత్రి'' (2005) పేరుతో తెలుగులోకి అనువదించారు. ఒక తమిళ నవలను కూడా ''రక్తనది'' (2006) అనే పేరుతో తెలుగులోకి అనువదించారు. ఇలా కాల్పనిక సాహిత్యాన్ని కొంత, విమర్శను కొంత ఇతర భాషల నుండి అనువాదం చేసిన రాచపాళెం వారు రాసిన విమర్శన గ్రంథాలలో ముఖ్యమైనవి ''తెలుగు కవిత్వం -నన్నయ్య ఒరవడి'' (1985), "గురజాడ - తొలి కొత్త తెలుగు కథలు' (1985), "ప్రాచీనాంధ్ర కవుల సాహిత్యాభిప్రాయాలు - అభిరుచులు" (1992), "కథాంశం' (2006), "చర్చ" (2010), "తులనాత్మక దాక్షిణాత్య సాహిత్య వ్యాసాలు" (2009), "మన నవలలు - మన కథానికలు" (2010), మరో చర్చ (2012), ప్రతిఫలనం (2014), "కవుల తెలంగాణం" (2016) ఇవే గాక దాదాపు ఇరవైకి పైగా విమర్శన గ్రంథాలు, నాలుగు కవిత్వ సంపుటాలు రచించారు. ఈ గ్రంథాలను బట్టి ఆయన విమర్శన ప్రాపంచిక దృక్పథాన్ని తెలుసుకోవచ్చు.

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు 1986 - 87 సంవత్సరానికి గాను ఇచ్చే ఉత్తమ వ్రాతపతి అవార్డు "ప్రాచీనాంధ్ర కవుల సాహిత్యాభిప్రాయాలు - అభిరుచులు" (1992) గ్రంథానికి లభించింది. అదే విశ్వవిద్యాలయం నుండి 2008 లో "చర్చ" అనే గ్రంథానికి గాను ఉత్తమ విమర్శ గ్రంథ పురస్కారం లభించింది. అదే విధంగా ఆయన విమర్శ రంగంలో చేసిన కృషికి గాను "మన నవలలు - మన కథానికలు" (2010), అనే విమర్శన గ్రంథానికి గాను 2014లో కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది. ఈ విధంగా సృజనాత్మక సాహిత్యాన్ని, విమర్శన దృక్పథాన్ని, మార్క్సిస్టు భావజాలాన్ని ఆసరాగా చేసుకొని రచనలు చేసారు. సాహిత్య విమర్శకునికి ఒక సామాజిక బాధ్యతను, ఆచరణను సూచించిన విమర్శకులలో రాచపాళెం చంద్రశేఖరరెడ్డి ఒకరు. విమర్శకులలోని వైవిధ్యాన్ని చెబుతూ ప్రగతిశీలవాదులు, సంప్రదాయవాదుల మధ్య భావజాల పరమైన సంఘర్షణ ఆరోగ్యకరమైనదని ఆయన గుర్తించారు. ఒక ధోరణిలో వెలువడిన సాహిత్యాన్ని స్థల, కాల బద్ధమైన భావజాల పరమైన నేపథ్యంతో విశ్లేషించ వలసిన అవసరాన్ని ఆయన తెలియజేశారు. ఏది సమీక్ష, ఏది విమర్శ అనే విషయంలో స్పష్టతను తెలియజేసి విషయ సామర్థ్యాన్ని బట్టి శక్తివంతమైన సమీక్ష, విమర్శ కంటే గొప్పదని పేర్కొన్నారు. విమర్శలో రాసి కన్నా వాసి ముఖ్యమని ఆయన తెలిపారు. ఒక సాహిత్య విమర్శకుని భావజాలంలోని మార్పుకు సామాజిక నేపథ్యం ఎటువంటి ప్రభావాన్ని చూపుతుందో ఆయన తెలియజేశారు.

మూల్యాంకనం, పునర్మూల్యాంకనం అనివార్యం :

ఒకరు రాసిన సాహిత్యాన్ని మరొకరు పరిశీలించి, తన దృష్టితో మూల్యాంకన చేసినప్పుడు, అవి కాలక్రమంలో పునర్మూల్యాంకనకు కూడా గురయ్యే అవకాశం ఉంటుంది. నూతన సిద్ధాంతాలు, నూతన పాఠకులు వచ్చినప్పుడు ఇలా తమ దృష్టికోణంతా ఆ సాహిత్యాన్ని పునర్మూల్యాంకన చేస్తుం

టారు. మరొకవైపు ఆ సృజన సాహిత్య లక్ష్యాన్ని సరిగా గుర్తించకుండా చేసే మూల్యాంకనల వల్ల కూడా పునర్మూల్యాంకన జరుగుతుంది. దీన్ని అంగీకరించడం, అంగీకరించకపోవడమేది పాఠకుల ఇష్టం. కానీ అలా పునర్మూల్యాంకన జరగడాన్ని ఆహ్వానించడం ఒక ప్రజాస్వామిక సాహితీవేత్తకు మాత్రమే సాధ్యమవుతుంది. ఆచార్య రాచపాళెం వారిలో ఈ లక్షణం కనిపిస్తుంది. ఒక వైపు ఆధునిక సాహిత్య విమర్శలో *"కవిత్వ తత్త్వ విచారము"*(1914) కొత్త బోదెలు తవ్విందని కవులు, విమర్శకులు కట్టమంచి రామలింగా రెడ్డి గారిని ప్రశంసిస్తుంటే, అదే పంథాలో పోకుండా రాచపాళెం వారు కట్టమంచి గారి అభిప్రాయాన్ని తోసిపుచ్చుతూ *"భారతమునందలి ద్రౌపదిని దృష్టియందుంచుకొని ప్రభావతిని విమర్శింపరాదు. అర్జునుని చూచిన కన్నులతో ప్రద్యుమ్నుని చూడరాదని"*('శిల్ప ప్రభావతి' పుట:143) అంటారు. కట్టమంచివారు ప్రద్యుమ్నునిలో విరహంతో రగిలిపోతున్న ప్రబంధ పురుషున్ని మాత్రమే చూడగా (క.వి పుట :79) రాచపాళెం ప్రద్యుమ్నునిలో ఒక ద్రష్ట, భావుకుడిని చూశారు. అయితే భావం విషయంలో మాత్రం కట్టమంచిని అభినందిస్తూ, భాష విషయంలో మాత్రం వీరిది నన్నయ భాషే అని నిర్మొహమాటంగా చెప్పారు. ఈ విషయంలో తాపీ ధర్మారావు గారిని సమర్థించారు.

సాహిత్య విమర్శ ప్రయాణించవలసిన మార్గాన్ని రాచపాళెం తన విమర్శ గ్రంథాల ద్వారా నిర్దేశించారు. అది ఎలాంటి నిర్దేశం అంటే ఒక సహేతుకమైన సిద్ధాంత పరమైనది. ఫలానాది తప్పు, ఫలననాది ఒప్పు అని నిక్కచ్చిగా చెప్పే లక్షణమనుకుంటున్నాను. రాచపాళెం చంద్రశేఖర రెడ్డిగారు రచించిన *'కచుడా ఆదర్శం?'* అనే వ్యాసంలో ఇదే విషయాన్ని ప్రస్తావించారు. నన్నయ భారతంలోని కచుని విద్యాభ్యాసవృత్తాంతాన్ని 2003 - 04 విద్యా సంవత్సరంలోని ఇంటర్మీడియట్ మొదటి పాఠ్యపుస్తకంలో ప్రచురించడాన్ని దుయ్యబట్టారు. ఆ పాఠ్యభాగం విద్యార్థులను చెడ్డదారిలో పయనించేట్టుగా ఉందని దీనిని పునర్మూల్యాంకన దృష్టితో పరిశీలించవలసిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఈ విషయాన్ని హేతుబద్ధంగా విమర్శిస్తూ "కచుడు ఇంటర్ విద్యార్థులకే కాక ఎవరికీ ఆదర్శ ప్రాయుడే కాడు" (పుట:61-కొన్ని కావ్యాలు కొందరు కవులు) అని పేర్కొని దీనిని పునర్మూల్యాంకనం చేయవలసిన అవసరం ఉందని భావించారు. ఇందులో వస్తుగతమైన విమర్శకు ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. *"శిల్ప ప్రభావతి"*(1980) తరువాత *"తెలుగు కవిత్వం - నన్నయ ఒరవడి"* (1987) అనే విమర్శ గ్రంథంలో శిల్పానికి సంబధించిన విశ్లేషణ మాత్రమే కనిపిస్తుంది. అయితే, ఆ తరువాత గురజాడ పై రాసిన *''గురజాడ తొలి కొత్త తెలుగు కథలు'* (1985) అనే గ్రంథాన్ని కవి జీవిత కావ్య సమన్వయ విమర్శతో విశ్లేషించారు. ఈ గ్రంథ రచనతో వీరిలో ఆధునిక సాహిత్య భావాల ప్రభావం పడిందని చెప్పవచ్చు. ఈ విధంగా ఇంతవరకు వచ్చిన ప్రాచీన సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం, నేడు వెలువడుతున్న ఆధునిక సాహిత్యాన్ని మూల్యాంకనం చేయడమే ఈయన విమర్శలోని ప్రధానాంశంగా తెలుస్తుంది.

'రాచపాళెం' సాహిత్య విమర్శ-చారిత్రక పరిణామం:

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారి విమర్శా ప్రస్థానం శిల్పగతమైన చర్చతో ప్రారంభమై అది వస్తుగతమైన చర్చగా వికాసాన్ని పొందింది. ఆయన రాసిన సాహిత్య విమర్శను దశలవారిగా పరిశీలించినట్లయితే వీరి సాహిత్య విమర్శ చారిత్రక పరిణామం అర్థమౌతుంది. ఒక వ్యక్తి సామాజిక పరిస్థితులు ఆ వ్యక్తి సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి అన్నది ఎంత సత్యమో, కాలక్రమంలో ఆ వ్యక్తి సాహిత్యం పరిణామం చెందుతుందన్న మాట కూడా అంతే సత్యం. కాబట్టి రాచపాళెం సాహిత్య విమర్శ ఒక చారిత్రక పరిణామాన్ని సంతరించుకుందని చెప్పవచ్చు. రాచపాళెం వ్యక్తిత్వం గురించి సినారె *''సంప్రదాయంలో మొలకెత్తిన రాచపాళెం వ్యక్తిత్వం పరిణామ క్రమంలో ప్రయోగ శీలాన్ని, ప్రగతి ద ృక్పథాన్ని తనలో మేలవించుకుందని"* అంటారు. ఇక్కడ వ్యక్తిత్వం అంటే కేవలవ్యక్తిత్వం అని కాదు. ప్రతి కవి, విమర్శకుల వ్యక్తిత్వాలు వారి సాహిత్యంలో ప్రతిఫలిస్తాయని ఆయన అంతరార్థం కావచ్చు. నిజానికి ఆయన సాహిత్య విమర్శ శిల్ప విశ్లేషణతో ప్రారంభమై వస్తు విశ్లేషణతో వికాసాన్ని పొంది సామాజిక దృక్పథంతో ప్రగతి శీల భావాలతో కొనసాగుతుందని చెప్పవచ్చు. మొదటి రచన నుండి నేటివరకు వచ్చిన వివిధ రచనల పరిణామాన్ని విశ్లేషించినప్పుడు మాత్రమే రాచపాళెంవారి చారిత్రక విమర్శన ద ృక్పథం స్పష్టమవుతుంది. ఒకప్పుడు కొంత శిల్పద ృష్టిని ప్రదర్శించినా, కాలక్రమంలో చారిత్రక, గతితార్కిక భౌతికవాద సాహిత్య విమర్శవైపే ఆయన పయనం కొనసాగింది. వీటిని మరింత సోదాహరణంగా వివరించాల్సిన అవసరం ఉంది. అది మరొక వ్యాసం అవుతుంది.

రాచపాళెం వారి విమర్శలోని ప్రధానాంశాలు :

ప్రస్తుత అధ్యయన ఫలితంగా నాకు అనిపిస్తున్న రాచపాళెంవారి విమర్శనాంశాల్లో కొన్నిముఖ్యాంశాలుగా కిందివాటిని గమనించాను.

1. ఈయన తన విమర్శలో నిచ్చెన మెట్ల సమాజ వ్యవస్థను కేంద్రంగా చేసుకొని, దాన్ని స్వరూపాన్ని గమనించి విమర్శ చేసారు.
2. కథలు, నవలలను విమర్శించేటప్పుడు సిద్ధాంత సమన్వయ విమర్శకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తుంది.
3. రాచపాళెం వారు విమర్శకు సంబంధించిన మౌలిక ప్రతిపాదనలు చేయడం వలన రచయితలకు, విమర్శకులకు అవి మార్గదర్శనం అవుతాయి.

4. ఈయన తన విమర్శలో అన్ని విషయాలకు సమ ప్రాధాన్యం ఇవ్వడాన్ని మనం గమనించవచ్చు. ఏదైనా ఒక గ్రంథాన్ని విమర్శన చేసేటప్పుడు అవసరమైన కొన్ని దశలను ఈయన మౌలికంగా వివరించారు. అవి రచయిత పరిచయం, గ్రంథ నేపథ్యం, విశ్లేషణ, లోపాలు, పరిష్కారాలు, సూత్రీకరణలు మొదలైన వాటిని ఆయన విమర్శలోని సోపానాలుగా చెప్పవచ్చు.

5. ప్రత్యామ్నాయ సమాజ నిర్మాణాన్ని రచయితకు సూచించడం, దాని బాధ్యతను తెలియజేయడం ఆయన విమర్శలో ప్రధానాంశం.

6. విమర్శకుడు కేవలం ఒక ప్రక్రియకో, ఒక ద ృక్పథానికో పరిమితం కాకుండా ఉండేలా తన తరువాతి విమర్శకులకు మార్గదర్శనం చేస్తూ అభ్యుదయ, దళిత, స్త్రీ, విప్లవ, మార్క్సిస్టు మొదలైన అన్ని భావజాలాల పట్ల తన దృక్పథాన్ని తెలియజేస్తూ విమర్శ రాసారు.

7. ఒక ప్రాంతంలోని రచయిత కేవలం ఆ ప్రాంతంలోని రచనలను మాత్రమే విమర్శా వస్తువుగా స్వీకరించడం వలన ఒక విమర్శకుని ఆలోచనా ధోరణి అంతగా పరిణతి చెందినట్లుగా కనిపించకపోవచ్చు. కాబట్టి ఈయన జన్మతః రాయలసీమలో జన్మించినప్పటికి ఇతర అన్ని ప్రాంతాల నుండి వెలువడిన సాహిత్యాన్ని నిబద్ధతతో విశ్లేషించారు. ఆ విధంగా వచ్చిన గ్రంథాలలో "కవుల తెలంగాణం" (2016) ముఖ్యమైనది.

8. రచయితలు వారు చెప్పగలిగే వాస్తవాలను, తాత్విక దృక్పథాన్ని, భావజాలాన్ని బయట పెట్టకపోవడాన్ని ఈయన నిరసించారు.

9. రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు తన విమర్శలో వస్తుగతమైన చర్చకు ప్రాధాన్యత ఇచ్చారు.

10. రాచపాళెం వారి సాహిత్య విమర్శ అటు మార్క్సిజం, ఇటు అంబేద్కరిజాన్ని అనుసరించి సమన్వయం చేసే విధంగా ఉంది.

11. రాచపాళెం సాహిత్య విమర్శను క్షుణ?ంగా అధ్యయనం చేసినట్లయితే ఒక చారిత్రక పరిణామాన్ని మనం గమనించవచ్చు.

12. ఆయన ప్రారంభంలో రాసిన విమర్శలో లక్షణచర్చకు ప్రాధాన్యత ఇచ్చారు. దీనికి ఉదాహరణగా ఆయన రాసిన "శిల్ప ప్రభావతీ" (1980) అనే తన సిద్ధాంత గ్రంథాన్ని చెప్పుకోవచ్చు.

13. ఆ తరువాత కొన్ని సామాజిక పరిస్థితులకు ప్రభావితుడైన ఆయన విమర్శా దృక్పథంలో కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో కె. వి. రమణారెడ్డి రాసిన "మహోదయం" అనే గ్రంథ ప్రభావంతో "గురజాడ - తొలి కొత్త తెలుగు కథలు" (1985) అనే విమర్శా గ్రంథాన్ని కవి జీవిత విమర్శ ద ృష్టితో రచించారు.

14. ఆయన వట్టికోట ఆళ్వారు స్వామి రచించిన "ప్రజల మనిషి" నవలపై వస్తు శిల్ప దృష్టితో రాసిన ఒక వ్యాసంలో వస్తుశిల్పాల సమన్వయం కనిపిస్తుంది.

15. రాచపాళెం చంద్రశేఖరరెడ్డి రాసిన సాహిత్య విమర్శను జాగ్రత్తగా పరిశీలించినట్లయితే ఒక సామాజిక పరిణతిని మనం చూడొచ్చు.

సాంప్రదాయ క్షేత్రంలో మొదలైన ఆయన సాహిత్య విమర్శా వ్యవసాయం క్రమంగా ఆధునిక సాహిత్యమనే కొత్త వంగడాలను పుణికి పుచ్చుకొని వాటి ఫలాలను పాఠకులకు అందించాలనే తపన ఆయన విమర్శలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ విధంగా రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు నాలుగున్నర దశాబ్దాలుగా తన విమర్శనా ప్రస్థానాన్ని కొనసాగిస్తూ, వివిధ దృక్పథాలను స్పృశిస్తున్నారు.

ఆధార గ్రంథాలు :

1. అనిల్ రాజంవాలె. *మార్క్సిజం అంటే ఏమిటి ?.* హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్.2007.
2. గోపి. ఎన్ (గొ. సంపా) సత్యనారాయణ ఎస్.వి (సంపా), *రాచపాళీయం (షష్ట్యబ్దిఅభినందనసంచిక):* పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం. 2008.
3. చంద్రశేఖరరెడ్డి రాచపాళెం, *కథాంశం* . హైదరాబాదు బీవిశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.2006
4. చంద్రశేఖరరెడ్డి రాచపాళెం, *గురజాడ తొలి కొత్త తెలుగు కథలు* .అనంతపురం: ఆంధ్ర భారతి శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం. 1985.
5. చంద్రశేఖరరెడ్డి రాచపాళెం, *మన నవలలు - మన కథానికలు*. విజయవాడ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. 2016.
6. భీమన్న బోయి(అను), *కుల నిర్మూలన* .హైదరాబాదు : హైదరాబాదు బుక్ ట్రస్ట్. 1969.
7. వెంకటేశ్వర రావు కొల్లు, *విమర్శకుడిగా కె.వి రమణారెడ్డి*. హైదరాబాదు : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.2004.
8. రామలింగారెడ్డి కట్టమంచి, *కవిత్వ తత్త్వ విచారము*. వాల్తేరు బీ ఆంధ్ర విశ్వకళా పరిషత్ . 1973

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

గిరిజన కళా సంప్రదాయాలు - సంగీతం - నృత్యం - మౌఖిక సాహిత్యం

- గుగులోతు ఫూల్‌సింగ్

భారతీయులు అభివృద్ధి చేసిన కళారూపాలపై శాస్త్రీయమైన అధ్యయనం చేయడానికి అంతగాఅ కృషి జరగలేదు. మనకు అందుబాటులో ఉన్న సమాచారాన్ని పరిశీలిస్తే గిరిజనుల్లో వివిధ కళారూపాలున్నట్లు, అందులో ఎంతో వైవిధ్యం ఉన్నట్లు స్పష్టమవుతుంది. హోహలయిబెన్ (1949) మాటల్లో చెప్పాలంటే "ఆదిమ ప్రజల కళల్లో సాంకేతికపరమైన అయోమయమూ ఉంటుంది. అలాగే నైపుణ్యమూ ఉంటుంది. శైశవ దశ నిరాడంబరతా ఉంటుంది. అయోమయంగా ఉండే క్లిష్టతా కన్పిస్తుంది. ప్రకృతి సహజంగానూ, వాస్తవంగానూ ఉండి, అమూర్త భావనా మిశ్రమమై ఉంటుంది". గిరిజనులు ప్రకృతి మీద ఆధారపడి జీవించేవాడు. తన జీవన పద్ధతులను, జీవితానికి సంబంధించిన వస్తువులను ప్రకృతి నుంచే గ్రహిస్తాడు. గిరిజనేతరుల్లో సామాన్యులైన వారికి గిరిజన కళల్లో ప్రత్యేకత ఏమీ గోచరించకపోవచ్చు. అవి కళాత్మకంగా కూడా కన్పించకపోవచ్చు. 'ఈ కళారూపాలను పూర్తిగా ఆస్వాదించాలంటే అవి ఏ నేపథ్యంలో, ఏ నేపథ్యం కోసం అభివృద్ధి చెందాయో గుర్తించాలి' (లియోనార్డ్ ఆడమ్ (1949). ఈ సూత్రాన్ని ముఖ్యంగా గిరిజన కళలకు అన్వయించాలి. వాటి సాంస్కృతిక నేపథ్యం భిన్నం కాబట్టి అందుకు అనుగుణమైన దృష్టితో వాటిని పరిశీలించాలి. వెరియర్ ఎల్విన్ (1973) ఇదే అభిప్రాయాన్ని మరింత సవివరంగా తెలిపారు.

ఒక దేవాలయంలోనో, మందిరంలోనో ఉంచడం కోసం ఆఫ్రికన్‌లు తయారు చేసిన తమ పూర్వీకుల బొమ్మను లేదా దేవతల బొమ్మను దాని సహజ నేపథ్యం నుంచి తొలగించి యూరప్‌లోనో, భారతదేశంలోనో అద్దాల్లో పెట్టి డ్రాయింగ్ రూమ్‌లో ఉంచితే అంతగా ప్రభావం చూపించదు. గిరిజనుల కళారూపాలను కింది విధంగా విభజించవచ్చు.

అవి...
1. బొమ్మల తయారీ కళ
2. రేఖా చిత్రకళ
3. సంగీత కళ
4. నృత్య కళ
5. మౌఖిక సాహిత్యం.

భారతదేశంలో దాదాపు అన్ని తెగల్లోనూ, పైన పేర్కొన్న కళారూనాలన్నీ ఉన్నాయి. ఆదిమ కళారూపాలు చిత్తశుద్ధితో కూడిన, నిసర్గమైన కళారూపాలని పేర్కొనాల్సి ఉంటుంది. మత భావనలు, ఆధ్యాత్మిక అలోచనల ప్రేరణ నుంచి ఈ కళారూపాలు పుట్టాయి. అహంభావ రహితంగా ఉంటాయి. అల్పజ్ఞులైన వారు ఈ కళారూపాలను అనుసరించలేరు. కొద్ది పాటి సాంకేతిక నైపుణ్యం ప్రదర్శించి కళారూపాలను సృష్టించినట్లు గిరిజనులెప్పుడూ గొప్పలు చెప్పుకోరు.

భారతీయ గిరిజన కళల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అంశం ఏమిటంటే, కళలకు మతానికి మధ్య అవినాభావ సంబంధం ఉంది. ఇందులో మతాన్ని, లౌకిక జీవితాన్ని విడదీయాలని చేసే ప్రయత్నం వృథా ప్రయాస. "ఆ విధంగా కళ, మతం ఒకదానితో ఒకటి కలసి ఏకరూపంలో కనిపిస్తాయి" (ఎన్.కే. బోస్ 1971). ఇతరులు మొదటగా భావించే కళారూపాలను తయారు చేయడానికి గిరిజన కళాకారులు ఏమాత్రం వెనుకాడరు. వారు వస్తువు తమపై చూపిన ప్రభావాన్ని అనుసరించి ఆ వస్తువును చిత్తశుద్ధితో సృష్టించడానికి ప్రయత్నిస్తారు. గిరిజన కళాకారులకు ఒక గురువంటూ లేకపోవచ్చు. ఆ కళాకారులు కళలపై ఉపన్యాసాలు వినకపోవచ్చు, కానీ వారికి తోడ్పడి కళారంగంలో ప్రవేశపెట్టేవారు లేరనుకోవడం మాత్రం పొరపాటు.

సంగీతం - నృత్యం - మౌఖిక సాహిత్యం :

గిరిజన సంగీతంలో సంగీత పరికరాలకు, గాత్ర సంగీతానికి కూడా ప్రత్యేక స్థానం ఉన్నది. అలాగే నృత్య కళలో నృత్యం, నృత్యరూపకాలు కూడా ఉన్నాయి. మౌఖిక సాహిత్యంలో జానపద కథలు, గేయాలు, పాడుపు కథలు, సామెతలు, పెద్ద సూక్తులు, పుక్కిటి పురాణాలు ఉన్నాయి.

భారతీయ గిరిజన తెగ ఉపయోగించే సంగీత వాయిధ్యాల్లో రకరకాల డోళ్లు, డప్పులకు ప్రత్యేక స్థానం ఉన్నది. అలాగే బూరలు, వేణువులు, కొమ్ము బూరలు, ఇత్తడి పళ్లాలు, కర్తాళ్లు, జాజ్‌లు చెప్పుకొదగ్గవి. మరియాలు మృదంగాలను, భిల్లులు మాదల్‌లను, నాగాలు ఖోల్‌లను, భిల్లులు డోళ్లను, నక్కరాలను తమ నృత్యాల్లో ఎక్కువగా వినియోగిస్తారు. ఇతర పండగ సమయాల్లో కూడా వీటిని వాడుతారు. వీటి తయారీలో చక్కని పనితనం కన్పిస్తుంది.

సంగీత పరికరాలపై గిరిజనుల స్వయం చిత్రించే బొమ్మలు, అలంకరణలు చాలా అకర్షణీయంగా ఆశ్చర్యం కల్గించే విధంగా ఉంటాయి. మహారాష్ట్రకు చెందిన భిల్లులు

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

ఉపయోగించే 'పుంగి' అనే సంగీ వాయిధ్యాలతోనూ, మరికొన్ని ప్రత్యేక రకమైన డోల్లతోనూ చక్కని సంగీతాన్ని విన్పించవచ్చు. రాజస్థాన్‌కు చెందిన గౌరాసియా తెగ ఉపయోగించే 'గౌర్జా' అనే సంగీత వాయిధ్యాన్ని కూడా ప్రత్యేకంగా పేర్కొనాల్సి ఉంటుంది. ప్రసిద్ధి చెందిన వారి గంగోరా ఉత్సవం కోసం ఈ సంగీత వాయిధ్యాన్ని తాత్కాలికంగా తయారు చేస్తారు. దీనిని మామూలు మట్టితో చేయడం విశేషం. ఈ సంగీత వాయి ధ్యాన్ని గవ్వలతోనూ, శంఖులతోనూ, అందంగా అలంకరించి ఈ ఉత్సవం రోజున ఊరేగిస్తారు. ఈ ఊరేగింపులో నృత్యం, సంగీతం కూడా ఉంటాయి.

భారతదేశంలోని గిరిజన తెగలు పారంపర్యంగా చెప్పు కొనే గాథల్లో వారి జీవనత్వం ఎంతో కళాత్మకంగానూ, సంగీత బద్ధంగానూ, కవిత్వ రూపంలోనూ నిక్షిప్తమైనట్లు మజుందార్ (1967) అభిప్రాయపడ్డారు.

ప్రతి తెగలోనూ అనేక కథలు, పుక్కిటి పురాణాలు ప్రచారంలో ఉన్నాయి. ఈ గాథలను ఒక్కొక్క తెగ చెప్పే తీరు పరస్పర విరుద్ధంగా ఉంటాయి. ఈగాథల్లో మానవులు, దేవుళ్ల కలిపి యథేచ్ఛగా సంచరిస్తారు. కొన్ని రకాల ఆచారాలు, కట్టుబాట్లకు అందరూ లొంగి ఉండే విధంగా చేయడానికి కొన్ని కథలు, గాథలు ప్రచారంలో ఉంటాయి.

ఫలానా విధంగా ప్రవర్తించినందుకు ఫలానా వ్యక్తి ఏవిధంగా కష్టాలకు గురయ్యాడో ఈ గాథలు వివరిస్తాయి. వృక్షాలు, జంతుజాలాలు, వాటికి మానవులకు గల అవినాభావ సంబంధాలు, మానవుడు వీటిపై ఎలా ఆధారపడి ఉండేదీ పలు గాథలు వివరిస్తాయి. గిరిజన గాథల్లో వారి ఊహలు ఎంత స్వేచ్ఛగా వర్తిసాయో చూడవచ్చు. అవి చాలా నిర్మొహ మాటంగా ఉంటాయి. ఆశ్చర్యం కల్గించడం కంటే ఆనందం కల్గించడం మీదనే ఎక్కువ దృష్టిని కేంద్రీకరిస్తాయి. ఆనందమే వాటి ప్రధాన లక్షణంగా కన్పిస్తుంది. గిరిజన గాథలు మన చిన్న కథలంత సంక్షిప్తంగానూ, నవలలంత సుదీర్ఘంగానూ ఉంటాయి. మానవులు నిత్య జీవితంలో ఎదుర్కొనే పరిస్థితు లను ఈ గాథలు వివరిస్తాయి. ఈ గాథల్లో ఉత్కంఠతకు, దెయ్యాలకూ, నాయకా, నాయికలకు తగిన స్థానం ఉంటుంది.

కవిత్వం, నాటకం, కథలు, సంగీతం సాధారణంగా గిరిజన జీవితాల్లో కలిసే ఉంటాయి. భారతీయ గిరిజన తెగల్లో అనేక కవిత్వ రూపాలు కన్పిస్తాయి. జోలపాటలు, సరదా పాటలు, భక్తి గేయాలు, శృంగార గేయాలు, వ్యంగ్య కవిత్వం, పురాణ గాథల కవిత్వం గిరిజనుల్లో కన్పిస్తుంది. గిరిజనులకు ఆయా రుతువుల్లో పాడటానికి ప్రత్యేకమైన పాటలున్నాయి. పెళ్లి పాటలు, నృత్య గీతాలు, వేటాడేటప్పుడు పాడే పాటలు, మంత్రాల్లాగ ఉండే పాటలు, మృత్యు సందర్భాల్లో ఉచ్ఛరించే ప్రత్యేక రకమైన పదాలుంటాయి. ఒంటరిగానూ, యుగళం గానూ, బృందంగానూ ఈ గేయాలు పాడటం కన్పిస్తుంది. పొడుపు కథలు, సామెతలు, సుద్దులు, సూక్తులు అన్ని తెగ ల్లోనూ కన్పిస్తున్నాయి.

భారతీయ గిరిజనుల జీవితాల్లో మార్పులు తెచ్చి వారిని అభివృద్ధి చేయడానికి ఎంత కృషి జరగాలో, గిరిజన జీవన రీతుల్లో కొన్నిటిని భద్రపర్చాల్సిన ఆవశ్యకత కూడా అంత ఉందని మజుందార్ అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా గిరిజన కళారూపాలన్నిటినీ రక్షించాల్సిన అవసరం ఎంతో ఉందని ఆయన మరీ మరీ నొక్కి చెప్పారు. వెరియర్ ఎల్విన్ (1973) కూడా దాదాపు ఇద అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. ఆధునిక కాలంలో గిరిజన కళ అధ్యయనం ఎంతో విషాదకరంగా ఉం దని ఎల్విన్ వాపోయాడు. నాగరికత పేరుతో కొత్త జీవన రీతులు గిరిజనుల్లో ప్రవేశించాయి. దీని వల్ల గిరిజన జీవితం స్తంభించిపోయింది. నిత్యయ జీవితంలో ఎదురయ్యే సవాళ్లను వివాదాలను భారతీయ గిరిజనులు తమ మతపరమైన, కళారూపమైన కార్యక్రమాల్లో మర్చిపోలేదు. ఈ విధంగా గిరిజన కళ గిరిజన ప్రజలందరికీ సంబంధించిన కళలు. కానీ పారిశ్రా మిక ప్రగతి వల్ల ఇవి తమ స్వచ్ఛతను, ప్రాభవాన్ని కోల్పోతు న్నాయి.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

ఇటీవలి బీసీ కవిత్వం-రాజ్యాధికార చైతన్యం

- డా॥. సి.హెచ్. ప్రవీణ్ కుమార్
పి.డి.ఎఫ్. స్కాలర్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

ఈ దేశ అత్యధికులైన బీసీలకు రాజ్యాధికార చైతన్యం ఇటీవల పెరుగుతూ ఉన్నది. సాహిత్యంలో ముఖ్యంగా కవిత్వంలో ఈ రాజ్యాధికార స్పృహ ఎక్కువగా కనబడుతా ఉన్నది. ఈ విషయంలో దళితులు రాజ్యాంగ రిజర్వేషన్లు కలిగి ఉండడం.., రాజ్యాధికార చైతన్యం కలిగి ఉండడం వలన వారి సాహిత్యంలో రాజ్యాధికార స్పృహ చాలా కాలం నుండే కనబడతా ఉన్నది. ఈ విషయంలో చాలా ఏండ్లుగా వెనకబడిపోయి ఉన్నప్పటికీ ఇటీవల ఈ స్పృహ క్రమంగా పెరుగుతా ఉన్నది. గత సాహిత్యాన్ని పరిశీలిస్తే బీసీల బాధలను, వ్యధలను ఏకరువు కనబడేది. ఇప్పుడూ ఈ కోణం ఉన్నప్పటికీ బహుజన చైతన్యంతోటి రాజ్యాధికార దిశగా సాగే బీసీ సాహిత్యం వెలువడుతుండడం శుభ పరిణామం. ఈ కోవలోకే చెందుతుంది వనపట్ల సుబ్బయ్య 'కుర్చీ',బి.సి రైటర్స్ వింగ్ 'సమూహం'.

కుర్చీ :

మంగలి కులానికి చెందిన కవి వనపట్ల సుబ్బయ్య రచించిన కవిత్వం 'కుర్చీ'. మంగలి కులానికి కుర్చీ ఎంత ముఖ్యమో ఈ దేశ అత్యధికులైన బహుజనులకు రాజకీయ కుర్చీ కూడా అంత ముఖ్యమనే అర్థంలో ఈ కవి తన కవిత్వ పుస్తకానికి ఏకంగా కుర్చీ అని పేరు పెట్టడం చేసి అర్థం చేసుకోవచ్చు ఈ బహుజన కవికి గల రాజ్యాధికార చైతన్యం ఎంతటిదో-విప్లవోద్యమం దాటి తెలంగాణోద్యమం దాటి బహుజన అస్తిత్వోద్యమాల వైపు నిలబడి రాజ్యాధికార దిశగా సాగుతున్న కవి వనపట్ల సుబ్బయ్య. 'రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం' అని ప్రకటించుకున్న దళిత,బహుజనులను రాజ్యాధికార దిశగా కవాతు చేయించే అక్షర సైనికుడిగా కనబడతాడు వనపట్ల తన కుర్చీ కవిత్వంలో. కుర్చీ కవిత్వంలో తెలంగాణ ఉద్యమం, సమకాలీన ఉద్యమాల మీద కవిత్వం ఎక్కువగా ఉన్నప్పటికీ అంతర్లీనంగా ప్రతీ కవితలో బహుజనతత్వం కనబడుతుంది. తెలంగాణ ఉద్యమం కూడా సబ్బండ వర్ణాల పోరాటమేనని నిక్కచ్చిగా చెబుతాడు. సబ్బండ వర్ణాలు, బహుజనులఉద్యమ ఫలితమే తెలంగాణ రాష్ట్రం కదా-అందుకే కవి బహుజన తత్వాన్ని బహుజన సంస్కృతిలో భాగంగా వినిపిస్తాడు.

'రేపటి బహుజన రాజ్యాధికారానికి
బహుజన బోనం వండే
బహుజన వీరమాతలు కావాలి
బహుజన యోధులు నడుం కట్టాలి
రేపటి గోల్కొండ కోట మీద
బహుజనులదే బోనం' అంటు తెలంగాణ బహుజన ఆత్మలోంచి పలుకుతున్నాడు. ఈ వాక్యాలు వనపట్ల రాజ్యాధికర స్పృహను అక్షరాలా పట్టిస్తాయి. రేపటి తెలంగాణ రాజ్యం బహుజనులదేనని దానికి బహుజన తల్లులు,బహుజన వీరులు నడుంకట్టాలని పిలుపునిస్తున్నాడు. సబ్బండ వర్ణాలు సాధించిన తెలంగాణను ఆ సబ్బండ వర్ణాలే ఏలాలనే ఆకాంక్షను వ్యక్తం చేస్తూ గోల్కొండ కోట మీద బహుజనులదే బోనం అంటాడు. ఇక్కడ బోనం అంటే తెలంగాణ ప్రతీక. అది జెండా . బహుజనుల రాజ్యాధికార జెండా.

వాస్తవానికి తెలంగాణ కోసం కొట్లాడింది ఎవరు? ఫలాలు అనుభవిస్తున్నది ఎవరు అనే విషయంలో కవికి ఒక చారిత్రాత్మకమైన, సామాజికమైన అవగాహన ఉంది. అందునా ఒక స్పష్టమైన పోరాట నేపథ్యం కూడా ఉంది. ఈ తెలంగాణ నేల కోసం రక్తాశ్రువులద్దిన బహుజనులదే ఎప్పటికైనా రాజ్యం - అనే ధృఢ విశ్వాసం కవిలో కనబడుతుంది. త్యాగాలు ఒకరివి - భోగాలు ఒకరివా?అనే బాధ అంతర్లీనంగా మోస్తున్న ఈ కవి బహుజన రాజ్యాధికారం కోసం జరిగే యుద్ధానికి సిద్ధం కండని మనల్ని తట్టిలేపుతున్నాడు. 'బొట్టు-బోనం-మనదే'నని రాజ్యం కూడా మనదే కావాలని దాని కోసం సమాయత్తం కావాలని బహుజనులను అలెర్ట్ చేస్తున్నాడీ కవి. ఆ దారిలోనే...

నడువు
నడవాలనుకున్నప్పుడు
ఎన్క ముంవు చూడొద్దు
తోడున్నా లేకున్నా
చెప్పులున్నా లేకున్నా
నడువాలనుకున్నప్పుడు
నమ్మకంతో నడువాల్సిందే

కాలంతో పాటు నడిస్తేనే కొత్త దారి తెలిసేది'అంటాడు. ఆ దారి రాజ్యాధికార దారి కావాలని ఆకాంక్షిస్తాడు.

కవి రాజ్యాధికార స్పృహకు తోడు తన కులస్పృహను కూడా కలిపి కవిలల్లాడు కుర్చీలో. తాను పుట్టిన మంగలి కులం ఆత్మగౌరవాన్ని సగర్వంగా ప్రకటిస్తూ ఏ కింది కులమూ

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

ప్రతిభ విషయంలో ఏ పై కులానికి తీసిపోదని కచ్చితంగా చెబుతాడు.మంగలి 'నాగరికత నేర్పిన ఆది నాగరికుడని' తేల్చిపారేస్తాడు.అయితే సేవా కులమైన మంగలి ఎంత సేవా చేసినా అది కుర్చీని సంపాదించట్లేదని వాపోతాడు.

"క్షౌరకళా సేవలు ఎంత చేసినా
అరవై ఏళ్ళ అసెంబ్లీలో స్థానం లేని నా కుర్చీ"...అంటూ రాజ్యాధికారం ఎవరి చేతుల్లో ఉందో చెప్పకనే చెబుతాడు.

రాజకీయకుర్చీ అంటే మంగలి కుర్చీ కాదు అని అవహేళన చేసిన అగ్రవర్ణ నాయకునికొ చురకలంటిస్తూ... మంగలి కుర్చీలో వర్థిల్లుతున్న సమతా ధర్మాన్ని,సమ న్యాయాన్ని చెబుతాడు.

నీది నాలుగు పడవల హైందవ కుర్చీ
నాది సమతా ధర్మం సాయుధ కుర్చీ
నీ కుర్చీకి శతాబ్దాల చీకటి నేపథ్యం
నీ కుర్చీలో నీవొక్కడివే రాజు
నా కుర్చీలో

జనమంతా రాజులే-అంటూ మంగలిషాపు ప్రజాస్వామ్యానికి ఏ విధంగా చిరునామాగా వెలుగుతో వర్థిల్లుతు న్నదో, అగ్రవర్ణ కుర్చీ అందరినీ అణిచివేస్తూ ఏ విధంగా చీకటిలో ఉందో అత్యంత సహజంగా చెబుతాడు. 'నాది బతుకు పోరాట కుర్చీ... పావురాలు వాలే కుర్చీ... నీ కుర్చీకి ఐదేళ్ళే... నా కుర్చీ అనంతం-అంటూ కులవృత్తుల్ని చేస్తూ సమాజానికి ఇరుసులా పనిచేస్తున్న కింది కులస్థుల్ని అధికారానికి దేరం పెడుతున్న అగ్రవర్ణ సంస్కృతిని తీవ్రంగా విమర్శిస్తాడు. ఇప్పుడు ఆ నిమ్న కులాలు కన్నెర్ర చేస్తున్నాయనే హెచ్చరిక జారీ చేస్తాడు.

నవాబుల పాలనలో నరకం
దొరల గడీలలో ఎట్టి బతుకులు
సీమాంధ్ర అభివృద్ధికి మా నిలువు దోపిడీ...

రాచపుండ్లను కోసి
శస్త్ర చికిత్సకు నాంది పల్కినోల్లం
ఎత్తుతున్నాం కత్తులు...

అంటూ సీమాంధ్ర సామ్రాజ్యవాదాన్ని, దొరల గడీలకేసి కత్తులు నూరుతున్నాడు తన కవితలతో-

ఇంకా ఇప్పటికీ మారని బహుజన బతుకులను చూసి చలించిపోతాడు కవి.

సన్నని తీగ మీద అమ్మాయి
సర్కస్‌లో ఆకలి పోరాటం
సంకన పిల్లనేసుకుని రెండు చేతులతో
ఈత చాపనల్లుతున్న ఆకలి
పాములను ఆడిస్తున్న
గారడీల పొట్ట తిప్పలు
ఎదమీద గంగిరెద్దు కాళ్ళు
రెప్పపాటున ప్రాణం పోయే సంచారులు'

అంటూ ఈ దేశంలో అత్యధికులైన బహుజనులు మోస్తున్న దు:ఖపు జీవితాల బరువును ఏకరువు పెడుతాడు. 'అంబేద్కర్ చూపుడే వేలు సాక్షిగా... వలసపోని ఊరులేదు, చావులేని ఇళ్ళు లేదు... కష్టాలే తప్ప, సుఖాలెరుగని మట్టి బిడ్డలపై ఆరని కుంపటి' అని తీవ్ర వ్యధను వలపోస్తాడు వనపట్ల.

అయినా ఆగక...

నడువు
కమ్మరోల్ల బావికాడ
పారుతున్న కాలువలో రెండు దోసిళ్ళ నీళ్ళు తాగు...
నడువు
నీవు అడుగు మోపినందుకే భూమి భూతల్లైంది
సిద్ధార్థుడు బుద్ధుడైంది'

అంటూ బహుజన తత్వం వినిపిస్తాడు.

ఇంకా...

పావురమెత్తు
తొడను కోసిచ్చిన శిబి చక్రవర్తి
సమతా ధర్మం కోసం
రాజ్యాన్ని త్యజించిన బుద్ధుడు
ప్రవక్తలు పుట్టిన పుణ్యభూమిలో
మతం పేరిట మానాలు దోచి
నెత్తురు చిమ్మటం రాక్షసం కన్నా హీనం'

అంటూ సమతా ధర్మం స్థాపించడానికి ఈ దేశంలో జన్మించిన ప్రవక్తల సాక్షిగా మతాల పేరిట జరుగుతున్న మారణహోమాన్ని నిరసిస్తున్నాడు.

కుర్చీ కవితా సంకలనంలో తెలంగాణవాదం, సామ్యవాదం, బహుజనవాదం, అస్తిత్వవాదం నాలుగు పాదాలుగా కుర్చీకున్న నాలుగు కాళ్ళలాగా కనబడతాయి. సాధారణంగా దళిత, బహుజన సాహిత్యకారులు దళిత బహుజన జీవితాలను చిత్రిక పడుతూ వారి స్థితిగతులను రిపోర్ట్ చేస్తుండడం చూస్తుంటాం. కాని ఈ జీవితాలు ఇలా ఉండడానికి కారణం చెప్పరు. అయితే ఈ దేశ అత్యధికులైన దళిత బహుజనుల చేతిలో ఒక మహత్తరమైన ఓటుశక్తి ఉందని ఆ శక్తిని సరైన విధంగా ఉపయోగించుకుంటే నిర్ణయాధికారంలో మనం ఉంటామని, ఆ నిర్ణయాధికారమే మన జీవితాలను సమూలంగా మారుస్తుందని... రాజ్యాధికారమే బహుజనుల అంతిమ లక్ష్యం కావాలని చెప్పడానికి దళిత బహుజన రచయితలు చెప్పగలగాలి. అలా ఆ రాజ్యాధికార దిశగా రాజకీయ స్పృహను

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

కలిగించే సాహిత్య కృషిలో ఇప్పుడిప్పుడే వేగంగా అడుగులు పడుతున్నాయి. ఆ అడుగులకి 'కుర్చీ' ఒక చక్కని ఉదాహరణ.

సమూహం :

బి.సి అస్తిత్వవాద యువ కవిత్వం. సంపాదకుడు డా.చింతం ప్రవీణ్ కుమార్. 2001లో వెంటాడే కలాలు వెలువడిన తర్వాత 15ఏండ్లకు వెలువడిన బి.సి కవిత్వం. అది కూడా నేటి కాలపు 38మంది యువకవుల, కవయిత్రుల కవిత్వం. అస్తిత్వ సాహిత్య ఉద్యమాల్లో ఇటీవల ఇదొక సంచలనం. దీనిలోనూ గత బీసీ కవిత్వపు ఛాయలున్నప్పటికీ రాజ్యాధికారమే బహుజనుల అంతిమ లక్ష్యం కావాలన్న నేటి కాలపు బీసీ యువరక్తపు ఆలోచనా విధానాన్ని చిత్రిక పట్టింది సమూహం.

ముఖ్యంగా గతకాలపు బీసీ కవిత్వానికి ఈ సమూహం కవిత్వానికి గల స్పష్టమైన తేడా ఒకటుంది. అదే భావజాలం. సాహు మహరాజ్- పూలే-అంబేద్కర్ మార్గంలో ఇందులో చాలా మంది కవిత్వం రాసారు. ఇది బీసీ యువతీ, యువకుల్లో పెరుగుతున్న బహుజన స్పృహకు అద్దం పడుతున్నది. కావలిస్తే చూడండి-

'నాయనా సాహు మహరాజ్
నీ సామాజిక సూత్రమే మా దిక్సూచి
ఇక ఊరుకునేది లేదు
శివాజీ చేతిలో కత్తి ఎత్తి కదులుతున్నాం
రాజ్యాధికారం వైపు
ఇక మోసపోయేది లేదు
ఇది పీష్వాల కాలం కాదు
బహుజనుల కాలం...అంటాడు వజ్జీరు ప్రదీప్

తన కొల్లాపూర్ సంస్థానంలో జనాభా దామాషా ప్రకారం ఎవరి జనాభా ఎంతో వారికంత వాటా ఇచ్చిన సాహూ మహరాజ్ వారసుడిగా ఈ కవి బహుజనతత్వం వినిపించాడు. రానున్నది బహుజనుల కాలమేనని... రానున్నది బహుజనుల రాజ్యమేనని దానికోసం యుద్ధానికైనా సదా సిద్ధమని తేల్చిపారేశాడు ఈ కవి. ఇది కదా బహుజన రాజకీయ చైతన్యమంటే. ఇదే చైతన్యాన్ని కొనసాగిస్తూ అడప రాజు ఇలా అంటాడు.

'జనాభాలో సగానికి పైగా ఉండడం కాదు మనం
ఎలక్షన్లప్పుడే అక్కెరకొచ్చుడు కాదు మనం అంటాడు'

ఈ దేశ అత్యధికులు తమకు అత్యంత విలువైన ఓటు శక్తి ఉన్నదని తెలుసుకోకుండా కేవలం ఎలక్షన్స్ సమయంలో చాలా మొక్కుబడిగా ఓటును వినియోగించు కుంటున్నారని, దీని వలన బహుజనజాతి తరతరాలుగా నష్టపోయిందని ఇక మేల్కోవాల్సిందేనంటాడు కవి.

ఇక చింతం నాగరాజు కవిత చూడండి...ఈ కవితలో అతని మూలవాసీతత్వం కనబడుతుంది... ఈ దేశమూలవాసుల గొంతుకకు అక్షరరూపమిచ్చాడు ఈ కవి తన కవితలో-

వినొద్దు చదవద్దు ముట్టొద్దనే వర్ణాశ్రమ ధర్మాలతో
మమ్మల్ని శూద్రులన్నారు...
ఆత్మహత్యలు ఆకలిచావులు వలసలతో
దేశమంతా దు:ఖమైనోళ్ళం
ఆ మధ్య మమ్మల్ని అణగారిన వర్గాలన్నరు
లెక్కల్లో తేలకుండా అట్టడుగునే మునిగి ఉన్నోళ్ళం
ఇప్పుడు మమ్మల్ని బీసీలంటున్నరు
ఏదేమైనా...ఎన్ని పేర్లైనా...మేం మూలవాసులం

రాజ్యాధికారం కోసం ఇప్పుడిప్పుడే మౌనాన్ని వీడి కాలు కదుపుతున్నోళ్ళం....ఈ ఒక్క కవిత చాలు నేటికాలపు బహుజన యువత తమ చరిత్ర పట్ల,తమ జీవితాల పట్ల ఎంతటి జాగరూకతో, ఎంతటి సోయితో ఉన్నారో చెప్పడానికి. ఇక్కడ బాబాసాహెబ్ మాట ఒకటి తప్పక గుర్తు చేసుకోవాలి.

చరిత్రను తెలుసుకోకుండా
చరిత్రను నిర్మించలేం-

ఇవ్వాళ ఈ కవి ఇంతలా విస్ఫోటనమై మండడానికి కారణం అతను తన చరిత్రను తాను తెలుసుకోవడమే.

కవయిత్రి జంగం హైమావతి కవిత 'పొగులగూడు'లో తమ వృత్తితో పాటు తాము కోల్పోయిన రాజ్యం ప్రస్తావన కనిపిస్తుంది.

'రాబోయే తరానికి
మా నేత బట్టలు మ్యూజియంలో చూడాల్సొస్తదేమో మరి
కోల్పోయిన బహుజన కుర్చీలాగా'

అంటూ ఒకప్పుడు ఈ రాజ్యం బహుజనులదేనన్న చారిత్రక చైతన్యాన్ని ప్రకటిస్తుంది.

కవి రాజేష్ ఖన్నా ఇంకాస్త ముందుకెళ్ళి 'ఒక యుద్ధం చెయ్యాలే'నంటున్నడు

'ఉడుతల్ని పట్టి వేటగాన్నంటే సరిపోదు
ఊరపిచ్చుకల్ని కొట్టి విలుకాన్నంటే విలువుండదు
అడవిని జయించాలనుకున్నవాడు
సింహంతో కదా పోరాడాల్సింది
సామ్రాజ్యాన్ని గెలవాలనుకున్నవాడు
చక్రవర్తిని కదా ఓడించాల్సింది
కోల్పోయిన నీ రాజ్యాన్ని తిరిగి పొందాలంటే
యుద్ధమే కదా చేయాల్సింది'...

అంటూ నిలువెత్తు చైతన్యగీతమైమండి రాజ్యాధికార కాంక్షను వ్యక్తపరుస్తాడు. ఇదే భావజాలాన్ని కొనసాగిస్తూ

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

ఇట్యాల వెంకట్ కిషన్ పూలేను తన తండ్రిగా పేర్కొంటు 'బాపు నేను నీ జీవన కొనసాగింపుని' కవితలో...

'మనదే అయిన మనది కాకుండా పోయిన మన రాజ్యంలో
నేను బతుకుతున్నానని తెలిసిన దగ్గర నుండి
మనసు మనసులో లేదు బాపూ...అంటూనే
నువ్ నూరిపోసిన సబ్బండ వర్ణాల శ్రమశక్తి
రాజ్యాధికార శక్తి కాబోయే రోజుల కోసం శ్రమిస్తున్నా బాపూ

నేనిప్పుడు పూలే అంబేద్కర్ దారిలో సాగిపోతున్నా బాపూ అంటూ పూలే - అంబేద్కర్ వారసునిగా నిలువెత్తు రాజ్యాధికార చైతన్యంతో మాట్లాడుతున్నాడు.

మొత్తంగా ఇటీవల బీసీ ఈ తరం కవులు, కవయిత్రులు భావజాలం పరంగా అత్యంత చైతన్యంగా ఉంటూ బీసీ బహుజన్ జీవితాలంటే కేవలం వ్యధలు, బాధలు, పేదరికం, ఆత్మహత్యలు, వలసలు, కోల్పోయినతనాలే కాదని ఆ కోల్పోయినతనానికి కారణం రాజ్యాధికారంలో వాటా లేకపోవడమేనని కుండబద్దలు కొడుతున్నారు. ఏదేమైనా ఈ కవులు ఇంత చైతన్యంగా ఉంటూ పూలే-అంబేద్కర్‌లు అందించిన భావజాల స్ఫూర్తిని గుండెలనిండా నింపుకుంటూ "మేమెంత మందిమో మాకంత వాటా" అని జనాభా దామాషా పద్ధతిలో అందరికీ సమన్యాయం జరగాలని దానికి అక్షర యుద్ధమే కాదు కార్యాచరణకు కూడా సిద్ధమేనని ప్రకటిస్తుండడం బీసీ బహుజనుల్లో పెరిగిన చైతన్యానికి నిదర్శనం.

ఆధార గ్రంథాలు :

1. చిక్కనవుతున్న పాట-దళిత కవిత్వం-(సం)జి.లక్ష్మినరసయ్య,త్రిపురనేని శ్రీనివాస్,కవిత్వం ప్రచురణలు - 14, విజయవాడ, జనవరి. 1995.
2. పదునెక్కిన పాట-దళిత కవిత్వం-(సం)జి.లక్ష్మినరసయ్య,దళితసాన ప్రచురణలు, విజయవాడ, జనవరి.1996
3. దళిత సాహిత్యం-తాత్విక దృక్పథం-(సం)జి.లక్ష్మినరసయ్య,దళితసాన ప్రచురణలు, విజయవాడ,1999
4. వెంటాడే కలాలు-వెనుకబడిన కులాలు-(సం)జూలూరి గౌరీశంకర్, స్పృహ సాహితీ సంస్థ, కోదాడ, మార్చి, 2001.
5. పొతం-మూలవాసి విమర్శ-జిలుకర శ్రీనివాస్,ఇండస్ ప్రచురణలు, హైదరాబాద్, మార్చి, 2012.
6. సమకాలీన సాహిత్య ధోరణులు-ననుమాస స్వామి, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగం, హైదరాబాద్.
7. దళిత వాద వివాదాలు-ఎస్వీ సత్యనారాయణ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2004.
8. సమూహం-బీసి అస్తిత్వవాద యువకవిత్వం-(సం)చింతం ప్రవీణ్ కుమార్, బి.సి రైటర్స్ వింగ్, హైదరాబాద్, డిసెంబర్, 2016.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

నీలిక - దళిత స్త్రీ వర్ణన

- పి . వాణి

పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

విశ్వసుందరులు, భారత సుందరులు కష్టమనేది తెలియకుండా ఎండ తగలకుండా నీడపట్టున పెరిగి, వ్యాయామాలు చేసి, సర్జరీలు చేసుకొని, మెరుగులు దిద్దుకుని అందంగా కనిపిస్తారు. కానీ దళిత స్త్రీలు సహజంగానే అంద గత్తెలు వీళ్ళు ఇంటిలోనూ , పంట పొలాల్లోనూ కష్టపడి పని చేసినా సహజ సుందరంగా ఉంటారు. ఆ దళిత స్త్రీ అందాన్ని గూర్చి ఎండ్లూరి సుధాకర్ నినీలిక ఎఅనే కవితలో ప్రస్తావిం చారు.

ప్రకృతి గాలి కోసం రాత్రి పూట ఆరుబయట నులక మంచం మీద పడుకున్న దళిత స్త్రీ అందాన్ని చూసిన వెన్నెల చంద్రుడు సూర్యుని చెవిలో ఆమె అందాన్ని గూర్చి రహస్యంగా చెబుతాడు. ఆ విషయం విన్న సూర్యుడు ఆమె సొగసుని చూడడానికి ఆతృతతో ఉరకలేస్తూ వస్తాడని, ఆమె అందానికి బహుమతిగా వజ్రపు ఉంగరాన్ని ఆమె తలగడ కింద దాచిపెట్టి వెళుతాడని, ప్రకృతిలోని సూర్యచంద్రులే ఆశ్చర్యపడే విధంగా గొప్ప సౌంధర్యవతిగా దళిత స్త్రీ అందాన్ని సుధాకర్ వర్ణించారు.

"ఆరుబయట నులక మంచం మీద
నీ అందాన్ని చూసిన చంద్రుడు
సూర్యుడి చెవిలో నీ సోకు కబురు
రహస్యంగా చెప్పినపుడు
వాడు నిన్ను ఉదయాన్నే చూసేందుకు ఉరకలేస్తూ
తొలి వేకువ వజ్రపుటుంగరాన్ని
నీ తలగడ కింద దాచిపెట్టిపోతాడు. "

అందాల పోటీల్లో ఒకరిని ఎంపిక చేసి ఆమెకు భారత సుందరి లేదా విశ్వసుందరి అనే బిరుదునిచ్చి తలపై ఒక కిరీటాన్ని బహుకరిస్తారు. దళిత స్త్రీ కూలిపని చేసేటప్పుడు తన నెత్తిమీద మోస్తున్న ఇనుపతట్ట ఆ విశ్వసుందరి కిరీటాన్ని కూడా వెక్కిరిస్తోందని కవి అన్నారు. ఆమె పదునెక్కిన కొడవలిగా మారి సింహంలా పంట పొలాల్లో కోతకు వెళుతుంటే ఆమె చుట్టూ ఉన్న అన్ని రంగుల ప్రకృతి అందాలన్నీ ఆమె నల్లని పాదాలకు దాసోహం అవుతున్నట్లు ఉంటాయని ఎండ్లూరి సుధాకర్ ఆమె శ్రమ సౌందర్యాన్ని వర్ణించారు.

"నా నెత్తిమీద ఇరుపగ మేళం
విశ్వసుందరి కిరీటాన్ని సైతం వెక్కిరిస్తోంది
పదునెక్కిన కొడవలివై
సివంగిలా నువ్వు కోతకు పోతూ ఉంటే
నీ చుట్టూరా ఆవరించిన ప్రకృతి వర్ణాలు
నీకు పాదాక్రాంతం అవుతున్నట్టే ఉంటాయి."

తాటిచెట్టు ఆకులతో చేసిన గొడుగు కింద దళిత స్త్రీ వర్షంలో సగం తడుస్తూ నిలబడి ఉన్నప్పుడు తడిసిన ఆమె అందాన్ని చూసిన తెల్లని మేఘాలు ఆమెను హత్తుకునేందుకు నేల మీదకి దిగివస్తాయి. ఆమె అందాన్ని చూస్తే చాలు గింజలే మొలవని బోడికంకులకు కూడా లెక్కపెట్టలేనన్ని గింజలు మొలుస్తాయని కవి వర్ణించారు.

"తాటాకు గొడుగు కింద
సగం తడుస్తూ నువ్వు నిలబడ్డప్పుడు
నిన్ను పొదుపుకునేందుకు
పొడి మబ్బులు నేలకు దిగుతాయి
నిన్ను చూస్తే చాలు
బోడి కంకులకు కూడా
వెంచని గింజలు మొలుస్తాయి."

నల్లరేగడి నేలలో వెదురు పొదలకు మిరియాల తీగలను అల్లించి పంట పండిస్తారు. నల్లని రంగులోని మిరియాలైనా అవి మెరుస్తూ ఉంటాయి. దళిత స్త్రీ నల్లని శరీరంలోని కాంతి మెరుపులు మిరియాల గుత్తుల మెరుపు వలె ఉందని సుధాకర్ వర్ణించారు.

"నీ నల్లరేగడి మేని రంగులో
వెదురు పొదలకు అల్లుకున్న
మిరియపు గుత్తుల మిసిమి దోగాడుతుంది."

దళిత స్త్రీలు తమ శ్రమను మరచిపోవడానికి పండగల్లో, జాతర్లలో తాటికల్లు తాగుతారు. జాతర రోజు రాత్రి ఆమె తాటికల్లు తాగినప్పుడు ఆ నల్లని కాటుక కళ్ళలోని ఎరుపు జీరల్లోంచి తొంగి చూస్తే ఆమె మత్తైన చూపుకు ఈ ప్రపంచమే చిత్తైపోతుందని దళిత స్త్రీ కళ్ళను గూర్చి సుధాకర్ వర్ణించారు.

"నువ్వు తాటికల్లు తాగిన జాతర రేయి
నా కాటుక కళ్ళ ఎరుపు జీరల్లోంచి తొంగిచూస్తే
ఈ ప్రపంచమే చిత్తైపోతుంది."

ఆమె కోళ్ళకు నూకలు వేయడానికి భోభోభో అని పిలుస్తుంటే ఆమె మృధు మధురమైన పిలుపు రుచికి బెసర జాతి పుంజులు ఆమె వేసిన నూకల్ని, వాటికున్న ఆకల్నీ మరచిపోయి, మైమరచిపోయి ఎర్రజుట్లతో రెక్కలు అల్లార్చుతూ వచ్చి ఆమె ముందు గౌరవంతో మోకరిల్లుతాయని కవి ఆమె మధురమైన కంఠ స్వరాన్ని గూర్చి వర్ణించారు.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

"నువ్వు భో భో భో అని పిలుస్తుంటే
నీ పిలుపు రుచికి నూకల్నీ ఆకల్నీ మరచిపోయి
బెసర పుంజులు ఎర్రజుట్లతో రెక్కలల్లార్చుతూ
నీ ముందు వినమ్రంగా మోకరిలుతాయి."

డప్పు బాగా మోగాలంటే దాన్ని లేత మంటల్లో సెగ పెడతారు. అలా సెగపెట్టిన డప్పు మీద దళిత స్త్రీ తన ముని వేళ్ళతో దరువు వేస్తూ పాటలు పాడుతూ ఉంటే ఆమె నీలికళ్ళ ఆకాశంలో చుక్కలు నాట్యం చేస్తాయని సుధాకర్ వర్ణించారు.

"సెగ పెట్టిన డప్పు బుగ్గ మీద
నా మునివేళ్ళు పాటల గొంతై పలవరిస్తుంటే
నులి వెచ్చని లేత మంటల వలయాల్లోంచి
నీ నీలికళ్ళ ఆకాశంలో చుక్కల నాట్యం చూశాను."

క్షణాల్లో ధాన్యపు పిండి తయారు చేసే యంత్రాలు లేని రోజుల్లో దళిత స్త్రీలు ఇంట్లోనే తిరగట్లో ధాన్యపు గింజలు పోసి విసిరేవాళ్ళు. కూర్చోని పని చేసేటప్పుడు శ్రమ తెలియ కుండా ఉండాలని వాళ్ళ సౌకర్యం కోసం ఒక కాలు మడుచు కొని, ఒక కాలు చాపుకుని కూర్చొని విసురుతారు. దళిత స్త్రీ ఒక కాలు ఒయ్యారంగా చాపి రాగులు తిరగట్లో పోసి విసురు తున్నప్పుడు ఆమె నాజూకైన సన్నని నల్లని నడుము మీద రాలిన ఆ తెల్లని పిండి రేణువులు ఆమె నడుముకి అలంకరించిన వెండి వడ్డాణంలా జిగేలుమని మెరుస్తున్నాయని ఆమె నాజూకైన నడుము అందాన్ని సుధాకర్ వర్ణించారు.

"ఒక కాలు ఒయ్యారంగా చాపి
తిరగట్లో నువ్వు రాగులు విసురుతుంటే
కరువు పోసిన నీ నల్లనడుము మీద రాలిన పిండి రేణు వులు
వెండి వడ్డాణంలా జిగేలు మంటాయి."

దళిత స్త్రీ నల్లని కాళ్ళకు పెట్టుకున్న తెల్లని వెండి కడి యాలు ఆమె అందాన్ని రెట్టింపు చేస్తున్నాయి. వెయ్యేళ్ళ సాహిత్య చరిత్ర గలిగిన కావ్యాల్లో వర్ణించబడిన అగ్రకుల కావ్యనాయికలందరూ, అలంకార శాస్త్రాలన్నీ ఆమె సహజమైన మట్టి మెరుపుల ముందు బలాదూరే అంటారు సుధాకర్.

"ఓ నా చండాలికా !
నీ వెండి కడియాల నల్ల కాళ్ళ ముందు
వెయ్యేళ్ళ కావ్య నాయికలు వెలవెలబోతున్నారు
అలంకార శాస్త్రాలన్నీ
నీ పాటి మట్టి మెరుపుల ముందు బాలాదూరే"

దళిత స్త్రీలు కష్టజీవులు. వాళ్ళు రాత్రి పూట పొలాలకు నీళ్ళు కట్టడానికి వెళ్ళేవారు. కాలువ నీటిలో తేలుతున్నట్లు కనిపిస్తున్న ఆకాశంలోని చంద్రుని ప్రతిబింబంపై ఆమె కాలు పెట్టినప్పుడు కలత పడిన నీటిలో నుండి కొరమీను చేపలు ఆమె కాలి వేళ్ళు అనే చంద్ర కిరణాలను ముద్దాడుతాయని ఆమె కాలి వేళ్ళను చంద్ర కిరణాలతో పోల్చారు.

"కాలువలో తేలుతున్న
చందమామ మీద నువ్వు కాలుపెట్టినప్పుడు
కలతబారిన నీటిలోంచి కొరమీనులు
నీ వేళ్ళ చంద్రకిరణాల్ని ముద్దాడుతున్నాయి."

ఎండ్లూరి సుధాకర్ తన నీలిక అనే కవితలో దళిత స్త్రీని నా నల్లద్రాక్ష పందిరి ! నా అరుంధతి నక్షత్రమా! నా నల్ల పిట్టా ! నా జాతి పుష్పమా! నా నీలమణి ! నామాతంగినీ ! నా నల్ల సుందరీ ! అని సంబోధిస్తూ నీలాలంకార సౌందర్య శాస్త్ర సింహాసనం మీద ఆమెను కావ్య గౌరవంతో అభిషేకిస్తున్నానని అన్నారు. అతని నల్లని దళిత కావ్యానికి ఆమెను నాయికగా ప్రకటిస్తున్నారని తెలిపారు .

"నా నల్ల సుందరి !
నీలాలంకార సౌందర్యశాస్త్ర సింహాసనం మీద
నిన్ను కావ్య గౌరవంతో అభిషేకిస్తున్నాను
నా నల్ల కావ్యానికి
నిన్ను నాయికగా ప్రకటిస్తున్నాను."

దళిత స్త్రీ శరీరంలోని కళ్ళను , కంఠాన్ని, నడుమును, పిక్కలను, కాళ్ళను, కాలి వేళ్ళను విభిన్న విశేషణాల తోటి సుధాకర్ వర్ణించారు. మునుపు ఏ కావ్యంలోనూ నాయికగా కనపడని దళిత స్త్రీని తన కవితలో నాయికగా ప్రకటించి ఆమెను అందాల రాశిగా ఆకాశమంత ఎత్తుకి ఎగరేశారు ఎండ్లూరి సుధాకర్.

ఆధార గ్రంథాలు :

1. నల్లద్రాక్ష పందిరి - ఎండ్లూరి సుధాకర్

❀❀❀

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

'ఇష్టదేవతా స్తుతులు - పరిణామక్రమము'

- బోలుగద్దె అనిల్ కుమార్
పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

"శ్రీకారముతో కావ్యమును ఆరంభించుట నన్నయాది కవులనుండి పరంపరంగా వచ్చుచున్న సత్సంప్రదాయము. ఈ సంప్రదాయమును చిరస్థిరమొనర్చు సంకల్పముతోడనే తెలుగు వారు (ఛందోవేత్తలు) అంతకుముందు సంస్కృతాలం కారికు లెవ్వరూ పేర్కొనని 'శ్రీ' కారమునకు గల ప్రత్యేకతను తమ లక్షణ గ్రంథములలో ప్రకటించిరి. అది కృతికర్తకు, కృతిభర్తకు కల అన్యోన్య సమాశ్రయ సౌజన్య సంపత్తికి, ఉభయ నిష్ఠమగు ఐహికాముష్మికాభివృద్ధికి పరమ సాధనమని మన ప్రాచీనుల అభిమతము. అద్వైత భావ దర్శనమునకు, ముకుర సదృశము" అని డా॥ మల్లెల గురవయ్యగారు (తమ 'ఆంధ్రప్రభోధ చంద్రోదయము - అవతారికా విశేషములు' అను తమ సిద్ధాంత గ్రంథములో) వివరించినారు.

'అ' కారమునకు హరి హర చతురాననులు, శ్రీకార మున 'హరిప్రియేశనారీ చతురాస్యకాంతలు సూచితము. కావుననే శ్రీకారము సర్వశక్తి సమీకృత చిహ్నముగా సంభావితమైనది' అనియు పేర్కొన్నారు.

ఈ పరిణామక్రమములో నన్నయగారు తెలుగు మహాభారతమును తొలి పద్యమును శ్లోకముగా కూర్చినారు. ఇది సంస్కృత భాషామర్యాదలను అనుసరించినది. తెలుగులో ఛందోవేత్తలు చెప్పిన ప్రాస, యతి నియమాలు అనుసరించ లేదు. కానీ 'మసజసతతగ' అను గణములు కూర్చబడినవి. నాలుగు పాదములచే నిర్మితమైనది. తొలుత సృష్టి స్థితి లయ కారకులగు త్రిమూర్తులను వారి పత్నులను శ్రేయస్సు కొరకై స్తుతించుట జరిగినది. ఇచట వరుసగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను కాక, విష్ణు, బ్రహ్మ, శ్రీకంధరులను పేర్కొవట మున్నది. మానవునికి తొలుత 'స్థితి' తర్వాత 'సృష్టి' కారణము, ఆపై 'లయము'ను తెలిసికోవడము జరుగును. ఆ క్రమమును అనుసరించి శ్లోకములో, 'శ్రీవాణీగిరిజా' స్మరణము జరిగినది. వీరిని త్రిమూర్తులు క్రమముగా హృదయమున, ముఖమున, శరీరమున ధరించినారు. శ్రీకారము యొక్క ఘనతను పైననే పేర్కొవటము గలదు. శక్తియుతమైనపుడే మానవుడు కార్య సాధన చేయగలడు. లక్ష్యమును చేరుకోగలడు. ఈ సందర్భాన ఆదిశంకరులవారు సౌందర్యలహరిలో చెప్పిన విషయము ఇట్లున్నది.

"శివశ్శక్త్యాయుక్తో యది భవతి శక్తః ప్రభవితుం
న చేదేవం దేవో న ఖలు కుశలః స్పందితుమపి
అతస్త్వా మారాధ్యాం హరిహర విరించాదిభిరపి
ప్రణంతుం స్తోతుం వా కథమకృతపుణ్యః ప్రభవతి
॥ (శ్లోకము -1)

శక్తితో కూడినపుడు విశ్వము సృజింప గల శివుడు, శక్తితో కూడనపుడు కనీసము కదలలేడు. త్రిమూర్తుల దారలు వారి భర్తల ఘనతకు గరిమకు కారణమైనారు. ఈ రీతిగా తొలుత ముగ్గురు మూర్తులను స్తుతించిన నన్నయగారు తర్వాత మరొక పద్యములో, (ఆదిపర్వము ఒకటవ ఆశ్వాసములో 21) త్రిమూర్తులతో పాటు ఇతర దేవతలను స్తుతించినారు. అందులో పునః హరి హర అజులను, గజానన అర్క షడాస్యమాతృసరస్వతీ గిరిసుతాదిక దేవతా తతికి నమస్కారాల నర్పించినారు. అటుపై వాల్మీకిని (ప్రచేతసపుత్రుని), అటు తర్వాత మరొక పద్యములో పరాశరాత్మజుడగు 'మహాభారత నిర్మాత' యగు వ్యాసులవారిని కొల్చినారు. ఇది ఒక ప్రణాళికా బద్ధమైన నిర్మాణము. వైష్ణవ, శైవ, సౌర, గాణపత్య, కౌమార, శాక్తేయముల ప్రస్తావన కూడా ఉన్నట్లు గ్రహింప వీలున్నది. భారతదేశములో ఇవన్నియూ కలవు. వాటి ధర్మాలననుసరించు వారున్నారు. ఇది ఒక విశేషముగా మనము గుర్తింప గలము. తర్వాతి కవులు భిన్న విభిన్న మార్గాల ననుసరించినారు. మార్పు కాలప్రవాహములో అతి సహజము. ఆ పై కావ్యావతారికలలో ముద్రవేసిన వాడు కుమారసంభవము కూర్చిన నన్నెచోడుడు. నన్నయ తెలుపని విషయములను చెప్పడము చేసినాడు. తన గురించి నన్నయ చెప్పినది కొంత మాత్రమే. అందులో తాను ముద్గల గోత్రములో జన్మించిన వాడని, అపస్తంబసూత్రుడని మాత్రమే కలదు. పరిమిత దేవతా స్తుతి కలదు. నన్నెచోడుడు శ్రీకారముతోనే కావ్యారంభము చేసినాడు. మగణముతో ప్రారంభమయిననదైనను అది శార్దూలము కాదు. మరికొందరు ప్రాచీన కవులవలె ఉత్పల మాలతో పద్యమును కూడా కాకుండా 'స్రగ్ధర' వృత్తము వాడినాడు. తనను గురించి, 'కాశ్యప గోత్రుడనియు, సూర్యవంశ క్షత్రియుడనియు, తల్లితండ్రులు శ్రీనతి, చోడబల్లి యనువారలనియు తెలుపుకొన్నాడు. తల్లి హైహయరాజ వంశమున జనించినదనియు, తండ్రి పాకనాటి పరిపాలకుడని తెలియజేయడము చూడగలము. ఇట్లు కొన్ని అంశాలను పరిశీలించినపుడు క్రమముగా కవులు తమను గురించి, ప్రభువులను గురించి, కృతిభర్తలను గురించి చెప్పడము జరిగినది. ఏ కొందరో కావ్యములను, గ్రంథములను దైవము

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (3), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

నకు అర్పించినారు. భాగవతకర్త పోతన శ్రీ కైవల్యసిద్ధికై, 'మహానందాంగనా డింభకున్' చింతించినాడు. అటు తర్వాత పలువురు కవులు పలు పోకడలు పోయినారు. రాజులను వారి ఇష్టదేవతలను స్తుతులతో కీర్తించినారు. ముద్దు పలుకుల తిమ్మన తన పారిజాతాపహరణ ప్రబంధములో తొలి పద్యముగా వేంకటపతిని స్తుతించినాడు. వాస్తవమునకు తిమ్మన గారు, శ్రీమదుమామహేశ్వర వర ప్రసాద లబ్ధ సార సారస్వతాభినందినంది సింగయామాత్య పుత్రుడు. తిమ్మన గారి కావ్య కృతిభర్త శ్రీకృష్ణదేవరాయలు, రాయలు పరమ వైష్ణవాభిమాని. ఆ రాయలు కూడా వేంకటపతిని స్తుతించినాడు.రాయల వంశమును తిమ్మనగారు స్తుతించినారు. రాయలవారి ఆస్థానములో ఉండినను, ధూర్జటి తన 'శ్రీకాళహస్తి మాహాత్మ్యమును' రాయలవారికి అంకితమివ్వక తన ఇష్టదైవము అయిన శ్రీ కాళహస్తీశునికి, వాయులింగ స్వరూపునికి అంకితమిచ్చాడు. ఆయన భవ పరాఙ్ముఖుడుగా ప్రసావింపబడినాడు. తిక్కన సోమయాజి మహాభారతమును విరాట పర్వముతో ఆరంభించినాడు. అది హరిహరనాథునికి అంకితమైనది. ఈ రీతిగా నన్నయ నుండి ఆరంభమైన దేవతా స్తుతులు కొంగ్రొత్త పోకడలను అనుసరించినవి. కొందరు దేవతలను, వారి పరివారమును స్తుతింప ప్రారంభించినారు. గణపతిని, సరస్వతిని, విఘ్నములను తొలగించుటకు, చక్కని పలుకులను ప్రసాదించవలయునని క్రమముగా స్తుతించినారు. భక్తి భావాలు వివిధ రీతులలో ప్రకటించినారు. పూర్వపు కవుల రచనలు చదివిన ఫలము, తమ బుద్ధి, భావనా బలముల, కాలానుగుణముగా వచ్చిన ఇతర మార్పుల కారణముల వలన ప్రస్తావించిన రీతులలో నూతనత్వము కనిపింపసాగింది. భాషాపరమైన చమత్కారములు మొగ్గలు తొడగినవి. అప్పకవి మహాశయుడు తన అప్ప కవీయములో దాదాపు అందరికన్నా అధికముగా స్తుతులు చేసినట్లు చెప్పవచ్చు. ఆయన తన గ్రంథములో శ్రీదేవి, భూదేవి సహిత హరి స్తుతితో ఆరంభించి వెన్నుని కౌస్తుభమును, వైజయంతిని, శ్రీవత్సమును, మురళిని, పట్టు పుట్టమగు పీతాంబరమును, పాంచజన్యమును, సుదర్శనచక్రమును, కౌమోదకిని, నందకము, శార్ఙ్గమును, పింఛమును, వేర్వేరు పద్యాలలో స్తుతించినారు. అక్కడితో ఆగక తన జన్మస్థానమయినట్టి కమలమునకు సూర్యుని ద్వారా వెయ్యి కిరణాలనిచ్చి, కమలమునకు అహితుడైన చంద్రుననికి బహు తక్కువ సంఖ్యలో కాంతి కిరణాలను, అదియు కొద్ది కొద్దిగా ఇప్పించు ఏర్పాట్లు చేసిన విరించిని, విద్యాజాలవిశారద యగు శారదను స్తుతించినాడు. కనకాద్రిని చాపముగా వంచిన నీకు హిమాద్రిసుతయగు గిరిజను కరగించుట కష్టముకాదని మేల మాడబడిన శివుని, పరిణయవేళ పార్వతి పాదములను పట్టిన పశుపతిని కందర్పుని పగతీర్చినటులున్నదని చమత్కారముతో చేసిన స్తుతి కలదు. వీరేకాక అష్ట దిక్పాలకులను, నవగ్రహలను, వెన్నుని దశావతారములను కుమారస్వామి గజాననుని స్తుతించుట చూడగలము. ఈ రీతిగా నన్నయ కావ్యములలో ఇష్టదేవతా స్తుతులారంభించిన విధాన, వినిర్మాణ ప్రక్రియల్లో పలు మార్పులు చోటు చేసుకున్నవి.

ఆధార గ్రంథాలు :

1. అవతారికల్లో ఇష్టదేవతాస్తుతి - శ్రీ దొప్పలపూడి పరిశుద్ధ శ్యామ్యూల్, సిద్ధాంత వ్యాసము - నాగార్జున యూనివర్సిటి - జనవరి 2009.
2. ఆంధ్ర కావ్యములు - అవతారికలు - సి బి పి అప్పారావు - తెలుగు యూనివర్సిటి, హైదరాబాదు - 2012.
3. కావ్యావతారికలు - ఆంధ్రదేశ చరిత్ర - డా॥ దీనావతి - హైదరాబాదు - 2008.
4. తెలుగు కావ్యావతారికలు - డా॥ నాగయ్య - మద్రాస్ - 1968.